సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18 సంచిక: 156
మంగళవారం 26-8-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసీ గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



అర్థం చేసుకోవాలి..
ప్రస్తుత ఘటనలు వైవాహిక జీవనాన్ని తరచి చూసుకొమ్మని చెబుతున్నాయి. - 13లో



తగ్గాకే కొందాంలే!
జీఎస్టీ నేపథ్యంలో నిర్ణయాలు వాయిదా వేస్తున్న వాహన కొనుగోలుదారులు. - 15లో



క్షమాపణలు చెప్పండి..
దివ్యాంగులను ఎగతాళి చేయడం తగదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఇన్‌ఫ్లుయెన్సర్లకు హితవు పలికింది.
- వివరాలు 6లో



భారం పెరిగినా భరిస్తాం కానీ..
అధిక పన్నుల భారం మోపినా భరిస్తాంగానీ దేశ స్వప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధాని మోదీ తెగేసి చెప్పారు.
- వివరాలు 6లో



గోడ దూకి పారిపోయిన ఎమ్మెల్యే
'ఉపాధ్యాయ' కుంభకోణం కేసులో ఈడీ వస్తోందనే సమాచారంతో టీఎంసీ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ గోడ దూకి పారిపోయారు.
- వివరాలు 6లో

'డ్రీమ్ 11'తో కటీఫ్!
భారత క్రికెట్ జట్టు ప్రధాన స్పాన్సర్‌షిప్ నుంచి ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ 'డ్రీమ్ 11' తప్పకుందని బీసీసీఐ ప్రకటించింది.
- వివరాలు 14లో

న్యూస్‌రీల్

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు



జస్టిస్ అలోక్ అరాధే   జస్టిస్ విపుల్

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త న్యాయమూర్తులను కొలీజియం సిఫారసు చేసింది. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనూభాయ్ పంచోలి సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారు.
- వివరాలు 2లో

చట్ట విరుద్ధం..దురదృష్టకరం



'సల్వాజుడుం' తీర్పుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు, హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు తీవ్రంగా ఖండించారు. అమిత్ షా వ్యాఖ్యలు న్యాయవ్యవస్థను దెబ్బతీసేలా ఉన్నాయంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు.
- వివరాలు 2లో

'నిషేధిత' భూవివాదాల పరిష్కారానికి కమిటీ



స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చిన వేలాది భూముల వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక కమిటీని నియమించినట్లు హైకోర్టుకు ప్రభుత్వం తెలిపింది.
- వివరాలు 12లో

డాక్టర్ రోబో సర్జన్ అవతారం



బ్లేడ్ పట్టి శస్త్రచికిత్సలు చేస్తున్న రోబోలు
భారత్‌లో ఇప్పటికే 1,50,000 సర్జరీలు పూర్తి
- వివరాలు 2లో

ఆక్స్‌ఫర్డ్‌లా ఓయూ!

విశ్వవిద్యాలయం పూర్వ వైభవానికి కృషి చేద్దాం
ఓయూ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ఇంజనీర్ల కమిటీ

- వర్సిటీకి ఏమేమి కావాలో ప్రణాళిక తయారు చేయండి
- డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభ పెట్టండి
- అక్కడికక్కడే అన్ని సమస్యల పరిష్కారానికి జీవోలు జారీ చేయిస్తా
- ఓయూ, తెలంగాణ మధ్య విడదీయలేని సంబంధం ఉందన్న సీఎం
- 15 రోజుల్లో కోదండరాంను మళ్లీ ఎమ్మెల్సీ చేస్తామని వెల్లడి
- రెండు హాస్టళ్లు ప్రారంభించిన సీఎం, మరో రెండు హాస్టళ్లకు శంకుస్థాపన



సోమవారం ఉస్మానియా సదస్సులో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): ఉస్మానియా విశ్వవిద్యాలయం పూర్వ వైభవానికి కృషి చేద్దామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ వర్సిటీల మాదిరి తీర్చిదిద్దుదామని అన్నారు. ఓయూను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ఇంజనీర్ల కమిటీని నియమించాలని అధికారులను ఆదేశించారు. ఓయూకు ఎంత ఇచ్చినా తక్కువేనంటూ, ఏమేమి కావాలో ప్రణాళికను తయారు చేయాలని సూచించారు. డిసెంబర్‌లో ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభ ఏర్పాటు చేస్తే వస్తానని, అధ్యాపక ఉద్యోగాల సమస్యతో పాటు అన్ని సమస్యల పరిష్కారానికి అక్కడే వెంటనే జీవోలు జారీ చేయిస్తానని చెప్పారు. సోమవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి ఆయన పర్యటించారు. వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ.80 కోట్ల వ్యయంతో నిర్మించిన పీజీ విద్యార్థుల దుందుభి, ఇంజనీరింగ్ విద్యార్థుల భీమా హాస్టల్ భవనాలను సీఎం ప్రారంభించారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నిధులతో నిర్మించనున్న మరో రెండు హాస్టల్ భవనాలకు, రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించే డిజిటల్ లైబ్రరీ రీడింగ్ రూంలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఠాగూర్ ఆడిటోరియంలో వీసీ ప్రొఫెసర్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో 'తెలంగాణ విద్యారంగంలో రావాల్సిన మార్పులు, ప్రభుత్వ ప్రణాళిక' అనే అంశంపై ప్రసంగించారు. ఓయూ విశిష్టతను, ఉద్యమాల చరిత్రను వివరించారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి, యాదయ్య, ఇషాంత్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి తదితర విద్యార్థులను స్మరించుకున్నారు.

ఓయూ అంటేనే తెలంగాణ

'ఓయూ అంటేనే తెలంగాణ. రెండింటి మధ్య విడదీయలేని సంబంధం ఉంది. 1935లో వందేమాతరం, 1938లో సాయుధ రైతాంగ పోరాటం, తెలంగాణ తొలి దశ, మలిదశ ఉద్యమాల్లో ఓయూ విద్యార్థుల పాత్ర కీలకం. మలి దశ తెలంగాణ ఉద్యమం విద్యార్థుల ఆత్మ బలిదానాలతోనే విజయం సాధించింది. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు, కేంద్ర మాజీ హోంమంత్రి శివరాజ్ పాటిల్, మర్రి చెన్నారెడ్డి, జార్జిరెడ్డి, జైపాల్‌రెడ్డి, గద్దర్ తదితరులను
మిగతా 2వ పేజీలో ▶



త్వరలో 'మిగ్-21'కు బైబై

అరవై రెండేళ్లుగా భారత వైమానిక దళానికి వెన్నెముకగా నిలిచిన మిగ్-21 యుద్ధ విమానాలకు భారత వైమానిక దళం బైబై చెప్పనుంది. మొదటిసారి ఇవి అడుగుపెట్టిన చండీగఢ్‌లోనే.. సెప్టెంబర్ 26న అధికారికంగా వీడ్కోలు పలకనున్నారు. సోమవారం విధి నిర్వహణలో భాగంగా చివరిసారి బికనీర్ ఎయిర్‌ఫోర్స్ బేస్ నుంచి ఇవి టేకాఫ్ తీసుకున్నాయి. ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్వయంగా మిగ్-21ను నడిపారు.

గగనసింహాలకు బైబై..! 6లో



విద్యార్థులతో ప్రయోగాలు చేయిస్తున్న పవిత్ర

16లో

నేషనల్ బెస్ట్.. పవిత్ర టీచర్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక
వినూత్నంగా పాఠ్యాంశాల బోధన.. సాంకేతికతను జోడించి ప్రయోగాలు
సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న మారం పవిత్ర




అదే గోస.. అదే వరస..

బస్తా యూరియా కోసం రైతన్న అగచాట్లు.. సిద్దిపేట జిల్లా కొండపాక పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం భారీగా క్యూ కట్టిన రైతులు

అర్ధరాత్రి నుంచే అరిగోస..

యూరియా కోసం తప్పని బారులు... రోడ్డెక్కుతున్న రైతులు
- వివరాలు 5లో

'కోటా' చిక్కుముడి విప్పేదెలా?



- స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై పార్టీ పెద్దలు, న్యాయ కోవిదులతో మంత్రుల చర్చలు
- జీవో ఇస్తే ఎదురయ్యే అడ్డంకులపై విశ్లేషణ
- గతంలో మరాఠా రిజర్వేషన్లను కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు పరిశీలన
- నేడు బిహార్‌కు సీఎం రేవంత్, మంత్రులు.. రాహుల్ యాత్రకు సంఘీభావం

సాక్షి, న్యూఢిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై చట్టపరంగా ఎదురయ్యే చిక్కుముళ్లను విప్పేందుకు మంత్రుల బృందం పార్టీ పెద్దలు, న్యాయ నిపుణులతో భేటీ అయింది. రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఆమోదించిన రెండు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లోనే ఉన్నందున దీనిని చట్టపరిధిలో పరిష్కరించే మార్గాలపై సమాలోచనలు చేసింది. ఒకవేళ జీవోలు ఇస్తే ఎదురయ్యే సవాళ్లు, దీనిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన కార్యాచరణ, కులగణన ద్వారా వచ్చిన ఎంపిరికల్ డేటాను న్యాయ వ్యవస్థల ముందుంచే అంశాలపై క్షుణ్ణంగా చర్చించింది. 50శాతానికి మించి రిజర్వేషన్లు అమలవుతున్న రాష్ట్రాలు, వాటిపై గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పులు, రాజ్యాంగ నిబంధనలన్నింటిపైనా చర్చలు జరిపింది.

రిజర్వేషన్లపై మార్గాన్వేషణ: 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశంపై ఏర్పాటైన మంత్రుల కమిటీ సభ్యులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ సోమవారం మిగతా 12వ పేజీలో ▶

ఏ ఎన్నిక ముందో?
- ముందు పంచాయతీయా లేక మండల, జిల్లా పరిషత్తా అన్న దానిపై సందిగ్ధత
- సెప్టెంబర్ చివరిలోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు
- 29న కేబినెట్ భేటీలో ఎన్నికల తేదీలపై స్పష్టత.. బీసీలకు పార్టీ పరంగా 42% కోటా పైనా నిర్ణయం?

12లో

కొన్నోళ్లే కన్నోళ్లు!

మేడిపల్లిలో పిల్లల కొనుగోలు కేసులో సుప్రీంకోర్టు ఆదేశం

- పెంచిన తల్లిదండ్రులదీ కడుపుకోతేనన్న ధర్మాసనం
- కోర్టు ధిక్కార పిటిషన్‌పై మరోసారి తేల్చిచెప్పిన సుప్రీం
- కోర్టు ఆదేశాల మేరకు దత్తత తల్లిదండ్రులకే పిల్లలను ఇచ్చేసిన యంత్రాంగం



సాక్షి, న్యూఢిల్లీ: 'కొనుగోలు చేసిన తల్లిదండ్రులకే ఆ పిల్లలను తిరిగి ఇచ్చేయండి' అంటూ సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దత్తత పేరుతో పిల్లలను తీసుకుని పెంచిన ఆ తల్లిదండ్రులది కడుపుకోతనే అని చెప్పింది. పిల్లలను కొనుగోలు చేసిన తల్లిదండ్రులకే ఇవ్వమని కొద్దిరోజుల క్రితం ఆదేశాలు జారీ చేసినా.. ఇవ్వకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఆదేశాలను పాటించకపోతే కోర్టు ధిక్కరణ ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులను హెచ్చరించింది. మంగళవారం ఉదయం 11 గంటలకల్లా పిల్లలను ఆ తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశిస్తూ.. సెప్టెంబర్ 2న వర్చువల్‌గా సంబంధిత అధికారులంతా తమ ముందు హాజరుకావాలని ఆదేశించింది.

హైకోర్టు నుంచి సుప్రీం కోర్టుకు..: తమ పిల్లల్ని తమకు ఇవ్వాలని కొనుగోలు చేసిన 9 మంది తల్లిదండ్రులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే, ఈ కేసులో కొనుగోలు చేసిన మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



డ్రైవర్ ఆవలిస్తే అలర్ట్ చేస్తుంది!



- ఆర్టీసీ బస్సుల్లో ఏఐ ఆధారిత ఆధునిక సాంకేతికత
- రోడ్డుపై ప్రమాదం పొంచి ఉన్నా, డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నా, సెల్‌ఫోన్ మాట్లాడుతున్నా హెచ్చరించే వ్యవస్థ
- త్వరలో డ్రైవర్ మానిటరింగ్ సిస్టం, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అలర్ట్ సిస్టంల ఏర్పాటు
- రియల్ టైమ్ దృశ్యాలను నేరుగా బస్‌భవన్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వీక్షించే వీలు
- ప్రయోగాత్మకంగా 200 బస్సుల్లో కెమెరాల ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదాలను నివారించే ఉద్దేశంతో తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో దేశంలో మరే రోడ్డు రవాణా సంస్థల్లో లేని సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఎదురుగా రోడ్డుపై ప్రమాదం పొంచి ఉన్నా, డ్రైవర్ అప్రమత్తంగా లేక ప్రమాదానికి కారణం అయ్యేలా ఉన్నా, చివరకు డ్రైవర్ ఆవలించినా ఈ వ్యవస్థ అప్రమత్తం చేస్తుంది. తద్వారా డ్రైవర్ ప్రమాదాన్ని తప్పించేలా చేస్తుంది. ఒకవేళ అప్రమత్తం చేసిన తర్వాత కూడా డ్రైవర్ నిర్లక్ష్యం కొనసాగుతుంటే.. ఆర్టీసీ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి ఫోన్ కాల్ ద్వారా మరోసారి అప్రమత్తం చేస్తుంది. డ్రైవర్ మానిటరింగ్ సిస్టం (డీఎంఎస్), అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అలర్ట్ సిస్టం (ఏడీఏఎస్).. అనే ఈ రెండింటితో కూడిన వ్యవస్థ
మిగతా 3వ పేజీలో ▶

జలాశయాలకు జలకళ.. చెరువులు వెలవెల..



నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో నీరు లేక వెలవెలబోతున్న ఎల్లగూడెం చెరువు

- భారీ వర్షాలతో జలాశయాల్లో 75 శాతానికి చేరిన నిల్వలు
- చెరువుల్లో మాత్రం నిల్వలు అంతంతే
- 34,701 చెరువుల్లో అలుగుపోసింది 12,701 చెరువులే
- 10,240 చెరువుల్లో 75-100%నిల్వలు
- నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో ఇంకా కరువు ఛాయలే..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జలాశయాలు జలకళ సంతరించుకోగా, చెరువులు మాత్రం వెలవెలబోతున్నాయి. రాష్ట్రంలో మొత్తం 34,701 చెరువులుండగా, 12,701 చెరువులు మాత్రమే పూర్తి స్థాయిలో నిండి అలుగుపోస్తున్నాయి. మరో 10,240 చెరువులు 75–100% వరకు నిండి జలకళను సంతరించుకున్నాయి. మిగిలిన చెరువుల్లో 5,682 చెరువులు 50–75%, 3,302 చెరువులు 25–50% నిండగా, 2,816 చెరువులు 0–25 శాతమే నిండాయి. చెరువుల్లో నిల్వలపై నీటిపారుదల శాఖ తాజాగా రూపొందించిన మిగతా 12వ పేజీలో ▶

వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- 27నాటికి అదేప్రాంతంలో అల్పపీడనం
- దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు
- వాతావరణ మార్పులతో రాష్ట్రంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

12లో

రజనీకాంత్ నటించిన రోబో సినిమాలో ఆపరేషన్ థియేటర్‌లో డెలివరీ చేస్తున్న హ్యూమనాయిడ్ రోబో సన్నివేశం ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పించింది. సినిమాల్లోనే కాదు.. వాస్తవ ప్రపంచంలోనూ రోబోలు సర్జరీలను చకచకా చేస్తున్నాయి. అన్నింటా మనం అన్నట్టు ఈ విషయంలో భారత్ సైతం తగ్గేదేలే అంటోంది. - సాక్షి, స్పెషల్ డెస్క్

వైద్య పరిశ్రమ అంచనాల ప్రకారం భారత్‌లో ఇప్పటివరకు రోబోలు సహాయకులుగా 1,50,000 కంటే ఎక్కువ శస్త్రచికిత్సలు జరిగాయి. అంతేగాక పూర్తిగా రోబోటిక్ శస్త్రచికిత్సలు సైతం విజయవంతంగా నిర్వహిస్తున్నారు మన వైద్యులు. ప్రస్తుతం మన దేశంలో 1,000 మంది సర్జన్లు ఏటా 12,000 కంటే ఎక్కువ రోబోటిక్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారంటే ఆశ్చర్యం వేయక మానదు.

డాక్టర్ రోబో.. సర్జన్ అవతారం!



విదేశీ రోగులకూ సేవలు..

ఫలితాలను అంచనావేసే ప్రిడిక్టివ్ అనలిటిక్స్, వ్యక్తులనుబట్టి చికిత్సా మార్గాల ద్వారా ఆరోగ్యాన్ని, ఆరోగ్య సంరక్షణ నిర్ణయాలను మెరుగుపర్చడం, రోగనిర్ధారణ కచ్చితత్వం ద్వారా శస్త్రచికిత్సా విధానాల సామర్థ్యాన్ని కృత్రిమ మేధ పెంచుతోందని పరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. శస్త్రచికిత్స సమయాలను ఏఐ దాదాపు 15 శాతం తగ్గించగలదని అంటున్నారు. రోబోటిక్ శస్త్రచికిత్సల కోసం వచ్చే విదేశీ రోగులకు గమ్యస్థానంగా భారత్ అవతరిస్తోంది. యూఎస్, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే వైద్య ఖర్చులు మనదగ్గర కనీసం 50 శాతం తక్కువ. అమెరికా, యూకే, నైజీరియా, కెన్యా, సౌదీ అరేబియా, ఉజ్బెకిస్తాన్, ఒమన్, అఫ్గానిస్తాన్, శ్రీలంక, ఆస్ట్రేలియా నుంచి ఎక్కువ మంది రోగులు భారత్‌కు వస్తున్నారు. భారతదేశ సర్జికల్ రోబోటిక్స్ మార్కెట్ ప్రస్తుతం రూ.7,830 కోట్లకుపైగా ఉంది. 2030–31 నాటికి దాదాపు రూ.34,800 కోట్లకు చేరుతుందని అంచనా.

సంక్లిష్ట విధానాల్లో సౌలభ్యం

గుండెకు సంబంధించినవి, క్యాన్సర్ (ఆంకాలజీ), ఆర్థోపెడిక్స్, వెన్నెముక, నరాల సంబంధమైనవి, జీర్ణాశయం, గైనకాలజీ, యూరాలజీ, జనరల్ సర్జరీ వంటి సంక్లిష్టమైన ప్రక్రియల కోసం రోబోటిక్ శస్త్రచికిత్సలను ఆసుపత్రులు నిర్వహిస్తున్నాయి. వివిధ రకాల సంక్లిష్ట విధానాలను నిర్వహించడానికి సంప్రదాయ పద్ధతులకు మించిన సౌలభ్యం, కచ్చితత్వం, నియంత్రణను రోబోటిక్స్ అందిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

బ్లేడ్ పట్టి శస్త్రచికిత్సలు చేస్తున్న రోబోలు

భారత్‌లో ఇప్పటికే 1,50,000 సర్జరీలు పూర్తి

విదేశాల నుంచీ మన దేశానికి రోగుల రాక

ఇలా చేస్తున్నారు..

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక శస్త్రచికిత్సా వ్యవస్థలలో.. భారత్‌లో ఎక్కువగా ఉపయోగిస్తున్నది 'డా వించీ సర్జరీ విధానం'. ప్రపంచ వ్యాప్తంగా ఈ విధానం ద్వారా సుమారు 8 లక్షల సర్జరీలు జరిగాయట. మనదేశంలో నిర్వహించే అత్యంత సాధారణ క్లినికల్ రోబోటిక్ సర్జికల్ వ్యవస్థలో కెమెరా ఆర్మ్, శస్త్రచికిత్సా పరికరాలతో కూడిన యాంత్రిక చేతులు (మెకానికల్ ఆర్మ్) ఉంటాయి. శస్త్రచికిత్స చేసే టేబుల్ పక్కన కంప్యూటర్ కన్సోల్‌లో కూర్చుని ఈ యాంత్రిక చేతులను సర్జన్ నియంత్రిస్తారు. త్రీడీ వ్యూలో పెద్దగా, అధిక స్పష్టతతో శస్త్రచికిత్స చేపట్టే భాగాన్ని ఈ కన్సోల్ చూపుతుంది.

మెరుగైన ఫలితాలు..

అత్యవసరం కాని శస్త్రచికిత్సలకు రోబోటిక్స్ విభిన్న ప్రయోజనాలను అందించగలవని వైద్యులు అంటున్నారు. గాయం చుట్టుపక్కల కణజాలాలకు నష్టం తగ్గించేలా శస్త్రచికిత్సను కచ్చితంగా నిర్వహించడం ఇందులోని ప్రత్యేకత. రోబోటిక్స్‌తో మరో ప్రయోజనం ఏమిటంటే మరింత నియంత్రణ, స్పష్టంగా చూసే వీలు ఉండడంతో సంక్లిష్ట, వీలుకాని భాగాలనూ చేరుకోవచ్చు. అధిక సామర్థ్యం, శస్త్రచికిత్స తదనంతరం ఖర్చులు తగ్గడం, ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉండటం, ఔషధ మోతాదు తగ్గడం తదితర ప్రయోజనాలు ఉండడంతో ఈ ప్రక్రియ దేశంలో క్రమంగా ప్రాచుర్యం పొందుతోంది.

ఖరీదైన వ్యవహారమే

రోబోటిక్ సర్జరీలకు డిమాండ్ పెరుగుతున్నప్పటికీ.. ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి చేయాల్సిన ముందస్తు పెట్టుబడి ఆసుపత్రులకు ఆందోళన కలిగిస్తోంది. రోబోటిక్ సర్జరీలలో చార్జీలు కేసును బట్టి.. ప్రధానంగా శస్త్రచికిత్స రకాన్ని బట్టి మారతాయి. డా వించీ రోబోటిక్ సర్జరీకి అవసరమైన యంత్ర పరికరాల విలువ సుమారు రూ.14 కోట్ల నుంచి గరిష్ఠంగా 20 కోట్ల వరకు ఉంటుందట. వార్షిక నిర్వహణ వ్యయాలు రూ.87 లక్షల నుంచి రూ.1.3 కోట్ల వరకు ఉంటాయని మార్కెట్ వర్గాలు అంటున్నాయి. ఖరీదైన వ్యవహారం కాబట్టి చిన్న ఆసుపత్రులు, గ్రామీణ ప్రాంతాల్లో వీటి వినియోగం ప్రశ్నార్థకమేనని చెబుతున్నాయి. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ ఇంటర్నేషనల్, మెరిల్ లైఫ్ సైన్సెస్, రిలయన్స్ ప్రమోట్ చేస్తున్న యాడ్‌వర్బ్ టెక్నాలజీస్, మెడ్‌ట్రానిక్ వంటి కంపెనీలు ఈ అడ్డంకిని తొలగించడానికి భారీ అడుగులు వేస్తున్నాయి. అయితే రోబోటిక్ సర్జరీలపట్ల ప్రజల్లో అవగాహన పరిమితంగా ఉండడం, సమగ్ర బీమా కవరేజ్ లేకపోవడం వల్ల రోగులకు అధిక భారం పడుతోంది. సుమారు 70 శాతం తక్కువ ఖర్చుతో సంప్రదాయ పద్ధతుల్లో శస్త్ర చికిత్సలకు వీలుండడం ఈ రంగం వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయన్నది నిపుణుల మాట. ఇన్ని అడ్డంకులు ఉన్నప్పటికీ రోబోటిక్ సర్జరీలు పెరుగుతుండడం గమనార్హం.



రెండో స్థానంలో దక్షిణాది..

దేశంలో సర్జికల్ రోబోల వినియోగంలో ఉత్తర భారతదేశంలోని ఆసుపత్రుల వాటా 35 శాతంగా ఉందని నివేదికలు చెబుతున్నాయి. ప్రధానంగా ఢిల్లీ-ఎన్సీఆర్ ఈ విషయంలో ముందుంది. ఆ తర్వాతి స్థానంలో 30 శాతం వాటాతో దక్షిణ భారతం నిలిచింది.

క్లుప్తంగా...

కాంగ్రెస్‌కు రాముడిని ఎగతాళి చేయడం అలవాటైంది

- బీజేపీకి రాముడంటే ప్రాణం, విశ్వాసం
- ఎక్స్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్



సాక్షి, న్యూఢిల్లీ: శ్రీరామచంద్రుడిని ఎగతాళి చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు. అయితే బీజేపీకి రాముడంటే ప్రాణం, విశ్వాసమని స్పష్టం చేశారు. రాముడు, రామమందిరం విషయంలో కాంగ్రెస్ తీరును సోమవారం ఆయన ఎక్స్‌లో దుయ్యబట్టారు. 'నో రామ్, నో రామయణ'అని సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన పార్టీ కాంగ్రెస్సే. రామ సేతు కేసులో శ్రీరామ చంద్రుడిని కోర్టుకు లాగింది కాంగ్రెస్సే. దశాబ్దాల పాటు రామ మందిరం తలుపులు మూసి వేసింది ఆ పార్టీయే. హిందువులను హింసాత్మకులు అని అన్నది కాంగ్రెస్ పార్టీయే. రామ మందిర ప్రాణ ప్రతిష్ఠకి కూడా హాజరు కావడానికి నిరాకరించింది కాంగ్రెస్సే. ఇప్పుడు అదే కాంగ్రెస్, బీజేపీని రాముని పేరు చెబుతున్నారని ఎగతాళి చేస్తోంది. రాం రాజకీయాల కోసం కాదు. ఈ దేశపు గుండె చప్పుడు'అని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 15లోగా ఉద్యోగుల సమాచారం సమర్పించాలి

- ప్రభుత్వ శాఖలకు రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల కేటగిరీలు, వర్గాల వారీగా సమాచారాన్ని సెప్టెంబర్ 15లోగా బీసీ కమిషన్‌కు సమర్పించాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులను ఆదేశించారు. సోమవారం బేగంపేటలోని హరిత ప్లాజాలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్యదర్శులు, శాఖాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ శాఖల వారీగా పనిచేస్తున్న ప్రభుత్వ సిబ్బంది సమాచారాన్ని నిర్దేశించిన ఫార్మాట్ ఆధారంగా సమర్పించాలన్నారు. బీసీ కమిషన్‌కు సమర్పించిన వివరాల ఆధారంగా బీసీల సామాజిక, విద్య, ఆర్థిక అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలిస్తుందని తెలిపారు. ఏటా మార్చి 31 నాటికి ఆయా శాఖల వారీగా బీసీ కమిషన్‌కు ఉద్యోగుల సమాచారాన్ని తెలపాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన ఉన్నతాధికారుల వట్ల నిరంజన్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఆక్స్‌ఫర్డ్‌లా ఓయూ!

▶ మొదటి పేజీ తరువాయి

అందించిన ఘనత ఓయూది. చదువుతో పాటు తెలంగాణ ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు విద్యార్థులు ఎదిరించి పోరాడారు. యువతే దేశ సంపద. 21 ఏళ్లకు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అవుతున్నారు. యువకులు రాజకీయాల్లోకి ప్రవేశించి ఎమ్మెల్యేలు కావాలి..' అని సీఎం ఆకాంక్షించారు.

నేనూ మీలో ఒకడినే..

ఓయూలో 60 ఏళ్లకు పైబడిన పాత భవనాలు ఉన్నాయని, కొత్త భవనాల నిర్మాణం, 2,500 మందికి సరిపడ కన్వెన్షన్ హాల్, ఇతర అవసరాలకు నిధులు మంజురు చేయాలని వీసీ కుమార్ చేసిన విజ్ఞప్తిపై స్పందిస్తూ..ఇంజనీర్ల కమిటీ ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆదేశించారు. 'ప్రజలకు పంచేందుకు భూములు లేవు.. ఇచ్చేందుకు డబ్బులు లేవు. నాణ్యమైన విద్యను మాత్రమే ఇవ్వగలం. ఈ సంవత్సరం విద్యకు రూ.40 వేల కోట్లు వెచ్చించనున్నాం. విద్యార్థులు బాగా చదువుకోవాలి. ఓయూలోనే చదివిన దయాకర్ ఎమ్మెల్సీ అయ్యాడు, బాలలక్ష్మీ, చారకొండ వెంకటేష్ ప్రభుత్వంలో భాగస్వాములయ్యారు. నేనూ మీలో ఒకడినే. తెలంగాణలోనే పుట్టా..ఇక్కడే పెరిగా. ఇక్కడే చదువుకున్నా. జెడ్పీటీసీ సభ్యుడు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ అయ్యా. మీరు చేస్తేనే సీఎం కూడా అయ్యా. మంత్రులు, ఎమ్మెల్యేలు మీకు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు. అపోహలకు, అబద్ధాల సంఘాలను నమ్మి మోసపోకండి. డిసెంబర్‌లో ఒక పోలీసు కూడా లేకుండా ఆర్ట్స్ కాలేజీ ఎదుట సభను ఏర్పాటు చేయండి. నా రాకను అడ్డుకునేవారు అడిగే అన్ని ప్రశ్నలకు జవాబు చెబుతా..' అని రేవంత్ పేర్కొన్నారు.

కేసీఆర్, కేటీఆర్‌లకు అభివృద్ధి కన్పించడం లేదు..

'పొలిటికల్ జేఏసీ చైర్మన్‌గా తెలంగాణ కోసం పోరాడిన ప్రొ.కోదండరాం ఎమ్మెల్సీ పదవిని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లి రద్దు చేయించి పైశాచిక ఆనందం పొందారు. ఆయన్ను 15 రోజుల్లో తిరిగి ఎమ్మెల్సీని చేస్తాం. హెచ్‌సీయూ భూముల్లో ఏఐ టెక్నాలజీతో ఏనుగులు, సింహాలు పెట్టారు. తెలంగాణలో సింహాలు, ఏనుగులు లేవు.. మానవ మృగాలే ఉన్నాయి. తెలంగాణను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దినా కేసీఆర్, కేటీఆర్‌కు కనిపించడం లేదు. నాపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ అంతానికి ఈగల్ ఫోర్సును, అక్రమ కట్టడాల నిర్మూలనకు హైడ్రాను ఏర్పాటు చేస్తే బీఆర్ఎస్ నాయకులు వ్యతిరేకిస్తున్నారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ఓయూ భూములను ప్లాట్లు చేసి అమ్ముకుంటారు..' అని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు.



సీఎం రేవంత్‌తో ఓయూ వీసీ కుమార్. చిత్రంలో వేం, సామేల్, వీరేశం, కోదండరాం, అడ్లూరి, ఖాసిం, వెంకట్ తదితరులు

సీఎం రీసెర్చ్ ఫెలోషిప్‌లు ప్రారంభం

ఓయూలో 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రవేశపెట్టిన సీఎం రీసెర్చ్ ఫెలోషిప్‌ను, విదేశాలలో పరిశోధనలకు వెళ్లే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఫెలోషిప్‌ను సీఎం ప్రారంభించారు. విద్యార్థుల పరిశోధనలకు.. సింగరేణి కాలరీస్, ఓయూ, ప్రభుత్వం, హెచ్ఎండీఏ ఆర్థిక సహకారంతో ఈ ఫెలోషిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు. నెలకు రూ.5 వేల చొప్పున చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కాలేజీ విద్య కమిషనర్ శ్రీదేవసేన, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ కోదండరాం, టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్, తదితర నేతలతో పాటు పలువురు ఓయూ అధికారులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌కు ఆహ్వానపత్రం అందజేస్తున్న దానం, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు

బాలాపూర్, ఖైరతాబాద్ గణేశోత్సవాలకు సీఎంకు ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో సోమవారం బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి, ఖైరతాబాద్ గణేశ్ అడ్‌హాక్ కమిటీలు వేర్వేరుగా కలిసి గణేశ్ నవరాత్రి వేడుకలకు ఆహ్వానించాయి. ఎమ్మెల్యే దానం నాగేందర్ నేతృత్వంలో ఖైరతాబాద్ అడ్‌హాక్ కమిటీ సీఎంను కలిసి శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి–2025 నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించింది. బాలాపూర్ కమిటీ తరపున సీఎంను కలిసిన వారిలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, ఉత్సవ సమితి చైర్మన్ నిరంజన్ రెడ్డి ఉన్నారు.

అదే కోటా... అదే తీర్మానం?

- మళ్లీ గవర్నర్ కోటాలోనే కోదండరాంకు ఎమ్మెల్సీ హోదా
- ఈ నెల 29న కేబినెట్ భేటీలోనా లేక సెప్టెంబర్ 17 తర్వాతి కేబినెట్‌లోనా?
- ఓయూ వేదికగా సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో కోదండరాంకు ఎమ్మెల్సీ పదవిపై చర్చ

సాక్షి, హైదరాబాద్: 'మరో 15 రోజుల్లో కోదండరాంను ఎమ్మెల్సీని చేస్తా. ఎవరు ఆపుతారో చూస్తా'అంటూ ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. కోదండరాంతోపాటు కాంగ్రెస్ నేత ఆమేర్ అలీఖాన్‌ల శాసనమండలి సభ్యత్వాలను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో సీఎం చెప్పినట్లు మళ్లీ కోదండరాంను ఎలా ఎమ్మెల్సీ చేస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. అయితే మళ్లీ గవర్నర్ కోటాలో, రాష్ట్ర మంత్రివర్గ తీర్మానంతోనే ఆయన్ను మరోసారి ఎమ్మెల్సీ చేయాలని సీఎం నిర్ణయం తీసుకున్నారని.. అందుకే ఆయనకు పదవిపై ఘంటాపథంగా మాట్లాడారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

సుప్రీం ఏమంటుందో?

గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాం, ఆమేర్ అలీఖాన్‌లను అనర్హులుగా ప్రకటిస్తూ ఈ నెల 13న సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. దీంతో వారు పదవులను కోల్పోవాల్సి వచ్చింది. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ సోమవారం ఓయూలో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుడికి తాము పదవి ఇస్తే పెద్దపెద్ద లాయర్లను పెట్టి కుట్రలు చేసి దింపేయాలని ప్రయత్నాలు చేశారని చెప్పారు. మళ్లీ ఆయన్ను ఎమ్మెల్సీని చేస్తానని ప్రకటించారు. దీనివెనుక గట్టి నిర్ణయమే ఉందని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి. కోదండరాంను మళ్లీ ఎమ్మెల్సీగా పంపేందుకు పార్టీ అధిష్టానం కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, గవర్నర్ కోటాలో మళ్లీ కేబినెట్ ఆయన పేరును సిఫారసు చేస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే సుప్రీంకోర్టు వచ్చే నెల 17న ఈ కేసుపై తదుపరి విచారణ చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 29న జరిగే కేబినెట్‌లో తీర్మానం చేస్తారా లేక సెప్టెంబర్ 17న సుప్రీం ఏం చెబుతుందో పరిశీలించి ఆ తర్వాత జరిగే కేబినెట్‌లో ఆమోదిస్తారా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందంటున్నాయి. గవర్నర్ కోటాలో మళ్లీ నామినేట్ చేసేందుకు ఆ ఇద్దరూ ప్రాతినిధ్యం వహించిన స్థానాలను మండలి వర్గాలు ఖాళీగా చూపిన తర్వాత ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ కూడా ఇవ్వాల్సి ఉంటుందని.. నోటిఫికేషన్ వచ్చాకే కేబినెట్ తీర్మానం చేస్తుందని.. అప్పటికి కేసు పెండింగ్‌లో ఉన్నా కోదండరాం పేరును మళ్లీ సిఫార్సు చేసేందుకు సుప్రీంకోర్టే వెసులుబాటు ఇచ్చినందున ఇబ్బందులేవీ ఉండవని కాంగ్రెస్ వర్గాలంటున్నాయి. అయితే కోదండరాంను ఒక్కరినే మళ్లీ గవర్నర్ కోటాలో నామినేట్ చేస్తారా లేక ఆమేర్‌అలీఖాన్ పేరునూ జతచేస్తారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

విఠల్‌భాయ్ పటేల్ మాకు ఆదర్శం

- ఆయన వారసత్వాన్ని కొనసాగించాలి..
- ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్



సాక్షి, న్యూఢిల్లీ: తొలి భారతీయ సెంట్రల్ అసెంబ్లీ స్పీకర్ విఠల్‌భాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకుని తెలంగాణ శాసనసభ పనిచేస్తోందని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. అధికార పక్షంతో పాటు.. ప్రతిపక్ష పార్టీలకు చెందిన సభ్యులు కూడా స్వేచ్ఛగా మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రాల శాసన సభాపతులుగా విఠల్‌భాయ్ పటేల్ ఘనమైన వారసత్వాన్ని, విలువలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ అసెంబ్లీలో నిర్వహిస్తున్న 'ఆలిండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్'లో రెండో రోజు సోమవారం గడ్డం ప్రసాద్ మాట్లాడారు.'భారతదేశ లెజిస్లేటివ్ చరిత్రలో విఠల్‌భాయ్ పటేల్ పేరు సువర్ణాక్షరాలతో లిఖించదగినది. 1925లో భారతదేశ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికైన ప్రథమ భారతీయుడు ఆయన. గుజరాత్‌లోని నడియాడ్‌లో 1873లో జన్మించిన విఠల్‌భాయ్ పటేల్ బ్రిటిష్ వలస పాలనలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నికవడం మామూలు విషయం కాదు. ఆయన ధైర్యంగా తీసుకున్న నిర్ణయాలు, సెంట్రల్ అసెంబ్లీని సమర్థవంతంగా నడిపించినతీరు నాటి నుంచి నేటి వరకు అసెంబ్లీ స్పీకర్లకు మార్గదర్శకంగా ఉంది. సభను నడపడంలో ఆయన నిక్కచ్చిగా వ్యవహరించేవారు'అని గడ్డం ప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు పాల్గొన్నారు.

చట్ట విరుద్ధం..దురదృష్టకరం

- సుప్రీం తీర్పులపై అమిత్ షా వ్యాఖ్యలు సహేతుకం కాదు
- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టి కామెంట్ చేస్తారా?
- సుప్రీం, హైకోర్టు మాజీ న్యాయమూర్తుల ఖండన
- సల్వా జుడుం తీర్పు నక్సలిజానికి మద్దతుగా లేదని స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: సల్వా జుడుం కేసులో సుప్రీం తీర్పు విషయంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు, హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు తీవ్రంగా ఖండించారు. నక్సలైట్లకు మద్దతుదారుడైన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి తమ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసుకుందంటూ అమిత్ షా ఇటీవల చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. అత్యున్నత పదవిలో ఉన్న అమిత్ షా వ్యాఖ్యలు దేశ న్యాయవ్యవస్థను, స్వతంత్రతను దెబ్బతీసేలా ఉన్నాయంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ముందుగా చదివి కామెంట్ చేస్తే బాగుంటుందంటూ హితవు పలికారు. రాజ్యాంగ బద్ధమైన పదవి కోసం పోటీ పడుతున్న వ్యక్తి గురించి ఇలా మాట్లాడటం సరైన విధానం కాదని విమర్శించారు. ఈ మేరకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఏకే పట్నాయక్, అభయ్ ఓకా, గోపాలగౌడ, విక్రమ్‌జిత్ సేన్, కురియన్ జోసెఫ్, మదన్ లోకూర్, జె.చలమేశ్వర్, హైకోర్టుల మాజీ ప్రధాన న్యాయమూర్తులు గోవింద్ మాథుర్, ఎస్.మురళీధర్, సంజిబ్ బెనర్జీ, అలాగే పలు హైకోర్టుల మాజీ న్యాయమూర్తులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్వయంగా సంతకం చేసిన ఆ ప్రకటనను వారు మీడియాకు అందజేశారు.

వ్యక్తిగత దూషణలకు తావుండ కూడదు

'జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేరు పెట్టి అమిత్‌షా ఆరోపణలు చేయడం చట్ట విరుద్ధం. సల్వా జుడుం తీర్పుపై ఆయన బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. సల్వా జుడుం రద్దు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వక్రీకరించి మాట్లాడటం సరికాదు. సుప్రీంకోర్టు తీర్పులో నక్సలిజాన్ని గానీ, దాని భావజాలాన్ని గానీ సమర్థించినట్లు ఎక్కడా లేదు. ఎన్డీయే కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి తరపు ప్రచారం చేసే క్రమంలో అమిత్‌షా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదు. ఉప రాష్ట్రపతి ఎన్నికలు గౌరవప్రదంగా, భావజాల కేంద్రీకృతంగా జరగాల్సినవి. ఈ ఎన్నికలు వ్యక్తుల మధ్య జరగవు. ఆయన చేసిన వ్యాఖ్యలు సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తులపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. ఇకనైనా ఉప రాష్ట్రపతి ఎన్నికను గౌరవప్రదంగా భావించాలి. వ్యక్తిగత దూషణలు, పేరుపెట్టి అవమానించడం వంటి అసభ్య రాజకీయాలకు చోటు ఉండకూడదు..'అంటూ మాజీ న్యాయమూర్తుల బృందం అమిత్‌షాకు హితవు పలికింది.

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు

కొలీజియం సిఫార్సు.. పూర్తిస్థాయికి చేరనున్న జడ్జీల సంఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టుకు కొత్త న్యాయమూర్తులను నియమించే ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపుల్ మనూభాయ్ పంచోలిలను సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాల్సిందిగా సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. సోమవారం జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సిఫార్సులకు కేంద్రం ఆమోదం తెలిపితే, సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య మళ్లీ పూర్తిస్థాయికి చేరుకుంటుంది. ప్రస్తుతం సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 32 కాగా, ఈ ఇద్దరి నియామకంతో మంజూరైన 34 న్యాయమూర్తుల సంఖ్య పూర్తవుతుంది.

పదోన్నతి పొందిన న్యాయమూర్తులు వీరే:

1) **జస్టిస్ అలోక్ అరాధే** జననం: ఏప్రిల్ 13, 1964, మాతృ హైకోర్టు: మధ్యప్రదేశ్ హైకోర్టు, పదవీ ప్రస్థానం: 2009లో మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2011లో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం జమ్మూకశ్మీర్, కర్ణాటక హైకోర్టుల్లోనూ సేవలందించారు. 2023 జులైలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి, 2025 జనవరిలో బొంబాయి హైకోర్టుకు బదిలీ అయ్యారు.

2) **జస్టిస్ విపుల్ మనూభాయ్ పంచోలి:** జననం: మే 28, 1968, మాతృ హైకోర్టు: గుజరాత్ హైకోర్టు, పదవీ ప్రస్థానం: 2014లో గుజరాత్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా, 2016లో శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఇటీవల పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పుడే గనుక ఆయన పదోన్నతి పొందితే, 2031 అక్టోబరులో భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టే అవకాశముందని న్యాయవర్గాల్లో చర్చ జరుగుతోంది.

నల్లగొండ మెడికల్ కాలేజీని దత్తత తీసుకుంటా

- ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి
- నల్లగొండ జీజీహెచ్‌లో లాప్రోస్కోపిక్ యూనిట్ నెలకొల్పడం సంతోషకరం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

నల్లగొండ టౌన్: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు నల్లగొండ మెడికల్ కళాశాలను దత్తత తీసుకుంటామని ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. మెడికోలకు ఇంటర్న్‌షిప్ సదుపాయం కల్పించడంతో పాటు పరిశోధనలో భాగస్వామ్యం చేస్తామని ఆయన పేర్కొన్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.కోటి 50 లక్షలకు పైగా నిధులతో ఆధునిక టెక్నాలజీతో నెలకొల్పిన లాప్రోస్కోపిక్ యూనిట్‌ను మంత్రి కోమటిరెడ్డితో కలిసి డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం నల్లగొండ మెడికల్ కళాశాలలో మెడికోలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తనకు అమెరికాలో నెలకు రూ.కోటి వేతనం ఇస్తామని చెప్పినా, తన తండ్రి కోరిక మేరకు హైదరాబాద్‌లో డాక్టర్ వై.ఎస్ రాజశేఖరరెడ్డి ప్రోత్సాహంతో అప్పట్లో ఏఐజీ ఆసుపత్రిని నెలకొల్పామన్నారు. లాప్రోస్కోపిక్ యూనిట్ ప్రారంభోత్సవానికి నాగేశ్వర్‌రెడ్డి రావడం సంతోషకరమని మంత్రి కోమటిరెడ్డి అన్నారు.

ప్రభాకర్‌రావు విచారణ పూర్తి చేయండి

- ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో నాలుగు వారాలు గడువు ఇచ్చిన సుప్రీంకోర్టు
- ఆయన విచారణకు సహకరించట్లేదన్న సొలిసిటర్ జనరల్
- విచారణకు తప్పనిసరిగా సహకరించాలన్న ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ ఐపీఎస్ అధికారి టి.ప్రభాకర్‌రావు విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలంటూ గడువు విధించింది. ఈ కేసులో ప్రభాకర్ రావు బెయిల్ పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం మరోసారి విచారించింది. ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ 'ప్రభాకర్‌రావు విచారణకు సహకరించడం లేదు. పలు ఎలక్ట్రానిక్ పరికరాలు దాచిపెట్టడమే కాకుండా ఫార్మాట్ చేసి ధ్వంసం చేశారు. ఆయన వద్ద ఉన్న ప్రభుత్వ ల్యాప్‌టాప్ ఇప్పటికీ ఇవ్వలేదు. పరికరాలు ఫార్మాట్ కావడంతో డేటా తిరిగి రాబట్టడం అసాధ్యం. దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. నిందితుడు సహకరించకపోతే దర్యాప్తు నిలిచిపోతుంది'అని వాదించారు. ప్రభుత్వం ఇచ్చిన ల్యాప్‌టాప్ కూడా అదే స్థితిలో ఉందని, దానిలో కూడా ఎలాంటి డేటా లేకుండా చేశారని చెప్పారు. దర్యాప్తునకు సంబంధించిన స్టేటస్ రిపోర్ట్‌ను కోర్టు ముందు దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రభాకర్‌రావు తరపు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదిస్తూ, 'సుప్రీంకోర్టు ఆదేశాలతో అమెరికా నుంచి వచ్చిన ప్రభాకర్‌రావు ఇప్పటివరకు పదిసార్లు విచారణకు హాజరయ్యారు. అన్ని విచారణలు వీడియో రికార్డింగ్‌తోనే జరిగాయి. సహకరించడం లేదని చెప్పడం తప్పు'అని చెప్పారు.

ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, 'ప్రభుత్వం మారిన తర్వాత ఇవన్నీ బయటకు వచ్చాయి కదా? దర్యాప్తు అంతం లేని విధంగా సాగకూడదు. కానీ, నిందితుడు తప్పనిసరిగా విచారణలో భాగస్వామ్యం కావాలి. విచారణలో పూర్తిస్థాయి సహకరించాలి'అని ఆదేశించింది. కేసు విచారణను ధర్మాసనం వాయిదా వేసేందుకు సిద్ధమవగా తమకు కాస్త సమయమిస్తే వ్యక్తిగతంగా వచ్చి అన్ని అంశాలు వివరిస్తానని సిద్ధార్థ్ లూథ్రా చెప్పారు. ఈ అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. దీంతో కేసు విచారణను రెండు వారాల పాటు వాయిదా వేయాలని ప్రభుత్వం కోరగా.. విచారణ పూర్తి చేసేందుకు నాలుగు వారాల సమయం ఇస్తున్నట్లు ధర్మాసనం చెప్పింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 22కు వాయిదా వేసింది.

క్లుప్తంగా...

దమ్ముంటే తెలంగాణలో దొంగఓట్ల లెక్కలు తేల్చాలి

పీసీసీ చీఫ్‌కు బీజేపీ ఎంపీ డీకే అరుణ సవాల్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వానికి, పార్టీకి దమ్ముంటే తెలంగాణలో దొంగ ఓట్ల లెక్కలు తేల్చాలని పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ సవాల్ విసిరారు. అప్పుడు దొంగలెవరో...దోషులెవరో తేలిపోతుందన్నారు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి కాబట్టి ఆలోగా బోగస్ ఓట్ల గుట్టు విప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం అరుణ మీడియాతో మాట్లాడుతూ, మహేశ్‌కుమార్‌కు మతి భ్రమించి మాట్లాడుతున్నారని, ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ మనుగడ కోసం దొంగ ఓట్ల రాగం అందుకుందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షిల మధ్య మహేశ్‌కుమార్ నలిగిపోతున్నందునే ఏం మాట్లాడుతున్నాడో ఆయనకు తెలియడం లేదని ఎద్దేవాచేశారు. 'జాతీయ పార్టీగా ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ నేతలు మతి భ్రమించి బీజేపీపై అవాకులు చవాకులు పేలుతున్నారు. మాట్లాడితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంటున్నారు కదా. మహేశ్.. ముందు మీ పార్టీలో నువ్వు సీఎం పదవి తెచ్చుకో' అని అరుణ సవాల్ విసిరారు.

కూతురు ఎంపీ పదవి కోసమే కడియం పార్టీ మారారు

మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల్లో ముందు వరుసలో ఉన్న కడియం శ్రీహరి ఏ పార్టీలో ఉన్నాడో చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య విమర్శించారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరానని చెబుతున్న కడియం 15 ఏళ్లు మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్సీగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో కలిసి సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తన కూతురును ఎంపీగా చేసుకునేందుకు పార్టీ మారిన కడియం రాజకీయ సమాధి కట్టుకున్నాడని విమర్శించారు. కడియం శ్రీహరికి నైతిక విలువలు ఉంటే వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు డిమాండ్ చేశారు. ఇతరులకు పదవులు వస్తే కడియం శ్రీహరి ఓర్వలేనితనం బయట పెట్టుకుంటాడని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు.

ఓయూకి వెళ్లినా కాళేశ్వరం గురించేనా?: దాసోజు



సాక్షి, హైదరాబాద్: ఓయూలో సీఎం రేవంత్‌రెడ్డి సొల్లు పురాణం మాట్లాడారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓయూకి వెళ్లి కూడా రేవంత్ కాళేశ్వరం గురించి మాట్లాడుతున్నారని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని రేవంత్‌రెడ్డికి భయం మొదలైందన్నారు. ఉస్మానియా భూములను బీఆర్‌ఎస్ ప్లాట్లు చేసుకుని అమ్ముకుంటుందన్న రేవంత్‌రెడ్డి...గచ్చిబౌలి భూములను ప్లాట్లుచేసి అమ్ముకున్నది ఎవరో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం కుర్చీని గౌరవించాలని అంటున్న రేవంత్‌రెడ్డి.. మంత్రి పదవిని, వైస్ చాన్స్‌లర్ పదవిని ఎందుకు గౌరవించడం లేదని దాసోజు ప్రశ్నించారు.

రేవంత్ కుట్రల వెనుక మోదీ, చంద్రబాబు

- వారి ఆదేశాలతోనే గోదావరి జలాలు దిగువకు పంపాలని చూస్తున్నారు
- రేపోమాపో మోదీతో కలిసిపోయేలా రేవంత్ వ్యవహారం కనిపిస్తోంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- గులాబీ పార్టీలో చేరిన ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ నేతలు



తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, జీవన్‌రెడ్డి, రాజయ్య తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకే గోదావరి నీళ్లను దిగువకు పంపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నాడని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపించారు. బనకచర్ల నుంచి తమిళనాడుకు గోదావరి జలాలు తరలించే కుట్ర వెనుక మోదీ, చంద్రబాబు ఉన్నారని పేర్కొన్నారు. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా రేవంత్ పగబట్టినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ నాయకులు ఆలూరు విజయభారతితో పాటు పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

బీఆర్‌ఎస్ నిర్మించిన భవనాలకు రిబ్బన్ కట్ చేస్తున్నారు..

'జాతీయ స్థాయిలో విమర్శలు చేసుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ.. తెలంగాణకు ద్రోహం చేయడంలో మాత్రం కలిసి పనిచేస్తున్నాయి. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ నడుమ ఉన్న అంతర్గత ఒప్పందాలతో తెలంగాణ భవిష్యత్తులో ప్రమాదంలో పడుతోంది. ముఖ్యమంత్రి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన భవనాలకు రిబ్బన్ కట్ చేస్తున్నాడు. ఉస్మానియా యూనివర్సిటీలో కూడా కేసీఆర్ పునాది వేసిన భవనాలనే రేవంత్ ప్రారంభించాడు..'అని కేటీఆర్ విమర్శించారు.

కాంగ్రెస్ వల్లే యూరియా సంక్షోభం

'రాష్ట్రంలో ఓ వైపు యూరియా కొరతతో రైతాంగం అల్లాడుతుంటే సీఎం మాత్రం సినిమా వాళ్లతో సమావేశాలు పెట్టుకుంటున్నాడు. ఆపరేషన్ సిందూర్ మూలంగా చైనా నుంచి యూరియా రాలేదంటూ బీజేపీ రేవంత్‌పై ఈగ వాలకుండా కాపాడుతోంది. మోదీ, రేవంత్ ఇద్దరూ ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో విఫలమయ్యారు. రేపో మాపో మోదీతో కలిసిపోయేలా రేవంత్ వ్యవహారం కనిపిస్తోంది. బడా మోదీ, చోటా మోదీ అనుబంధంతో రాహుల్ గాంధీకి ఎదురుదెబ్బ ఖాయం..'అని బీఆర్‌ఎస్ నేత అన్నారు.

స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

'20 నెలల కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలి. ఈ ఎన్నికల్లో బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయాలి. పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కసరత్తు చేయాలి..'అని కేటీఆర్ పిలుపునిచ్చారు. సోమవారం బాన్సువాడ నియోజకవర్గ నేతలతో సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడారు. సొంత ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి వెంట కేడర్ ఎవరూ లేరని పార్టీ నేతలు ఈ సందర్భంగా కేటీఆర్‌కు వివరించారు. కాగా నియోజకవర్గంలో తాజా రాజకీయ పరిస్థితులపై నేతలతో ఆయన చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం పార్టీ నేతలు, కేడర్ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం చెల్లించాలి

ఇందిరాపార్కు వద్ద జరిగిన ఆశా వర్కర్ల ధర్నాలో హరీశ్‌రావు

కవాడిగూడ: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆశావర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, స్థానిక సంస్థల ఎన్నికలలోపు ఆశావర్కర్లతో చర్చించి వారి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీకి ఆశా వర్కర్లు తగిన గుణపాఠం చెబుతారని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. సోమవారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశ) సంఘం ఆధ్వర్యంలో ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు వివిధ జిల్లాల నుంచి ఆశావర్కర్లు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం..పైసలు లేవని దాటవేస్తుందన్నారు. ఆశావర్కర్లకు ఇచ్చిన హామీల అమలుకు బడ్జెట్ లేదని చెప్పడం మహిళలను మోసం చేయడమేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంవత్సరంలోపే రెండులక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు మొహం పెట్టుకొని ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లారన్నారు. నిరుద్యోగులకు కనీసం పదివేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా మోసం చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముక్కునేలకు రాసి నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కార్యకర్తల త్యాగాలతోనే గద్దెనెక్కాం

- వారిని జారవిడుచుకునే ప్రసక్తే లేదు... బండి సంజయ్ వల్లే బీసీ బిల్లు పెండింగ్
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ నేతల సమావేశంలో టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్. చిత్రంలో మీనాక్షి నటరాజన్, కొండా సురేఖ, బలరాం నాయక్ తదితరులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/సాక్షి, వరంగల్: కార్యకర్తల త్యాగాల ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, వారిని జారవిడుచుకునే ప్రసక్తే లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం జనహిత పాదయాత్ర ముగింపు అనంతరం గంగాధరలో ఉమ్మడి కాంగ్రెస్ జిల్లా నేతల ముఖ్య సమావేశంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, రాజ్‌ఠాకూర్, విప్ ఆది శ్రీనివాస్, మాజీమంత్రి జీవన్‌రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. మహేశ్‌గౌడ్ ఏమన్నారంటే.. 'పాతకాంగ్రెస్ వారి వల్లే అధికారంలోకి వచ్చాం. వారికి అన్యాయం జరగనీయం'అని మహేశ్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీల అమలును క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు పాదయాత్ర చేస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ చెప్పారు.

కాంగ్రెస్‌కు ప్రతిపక్షమే లేదు

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ప్రతిపక్షమే లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ అన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి వరంగల్ జిల్లావర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామం నుంచి వర్ధన్నపేట టౌన్ అంబేడ్కర్ సెంటర్ వరకు సోమవారం రాత్రి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అంతకుముందు మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ ఎక్కడకు వెళ్లిన తెలంగాణ మోడల్ గురించే మాట్లాడుతున్నారని చెప్పారు. యాత్రలో మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, రాంచందర్ నాయక్, మురళీ నాయక్, గండ్ర సత్యనారాయణరావు, యశస్వినిరెడ్డి, నాయకులు కొండా మురళి, జంగా రాఘవరెడ్డి పాల్గొన్నారు. కాగా, పాదయాత్ర తరువాత కార్నర్ సమావేశంలో ఓ రైతు యూరియా కొరత ప్రశ్నించగా అక్కడే ఉన్న కాంగ్రెస్ శ్రేణులు అతనిపైకి వెళ్లారు. ఓ కార్యకర్త అతనిపై చేయి చేసుకోవడం కనిపించింది.

జనహిత పాదయాత్ర షెడ్యూల్‌లో మార్పు

- ఈనెల 28న నకిరేకల్‌లో, 29న అచ్చంపేట నియోజకవర్గాల్లో యాత్ర

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్ర షెడ్యూల్‌లో మార్పులు చేస్తున్నట్టు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. షెడ్యూల్ ప్రకారం ఈనెల 26న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నిర్వహించాల్సిన సభను ఈనెల 30వ తేదీకి వాయిదా వేయడంతో పాటు ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పాదయాత్రను కొనసాగించనున్నట్టు సోమవారం ఆ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. ఈ షెడ్యూల్ ప్రకారం 26, 27 తేదీల్లో పాదయాత్రకు విరామం ఇవ్వనున్నారు. బిహార్‌లో రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోర్ యాత్రకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఈనెల 26న హాజరు కానుండడం, 27న వినాయక చవితి ఉండడంతో ఆ రెండు రోజుల తర్వాత ఈనెల 28న మళ్లీ పాదయాత్ర ప్రారంభం కానుంది. ఈనెల 28న నల్లగొండ జిల్లా నకిరేకల్, 29న అచ్చంపేటల్లో జనహిత పాదయాత్ర కొనసాగనుంది. అనంతరం ఈనెల 30వ తేదీన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన ఓట్ చోర్ ఉద్యమంలో భాగంగా ఏఐసీసీ పిలుపు మేరకు గద్దీ చోడ్ సభను ఈనెల 30న జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నిర్వహించనున్నట్టు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

ఓట్ చోరీ కాదు.. రాహుల్ బ్రెయిన్ చోరీ

యూరియా కొరత కాంగ్రెస్ సృష్టిస్తున్నదే: ఎన్.రాంచందర్‌రావు



సుభాష్‌నగర్ (నిజామాబాద్ అర్బన్): దేశంలో ఓట్ చోరీ అయ్యిందని రాహుల్‌గాంధీ దుష్ప్రచారం చేస్తున్నారని, ఓట్ చోరీ కాదని.. ఆయన బ్రెయిన్ చోరీ అయ్యిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో 8 మంది కాంగ్రెస్ ఎంపీలు గెలిచారని, బీజేపీకి ఒకసారి, కాంగ్రెస్‌కు మరోసారి ఎన్నికలు జరగలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ గ్రహించాలని హితవు పలికారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా బూత్‌స్థాయి సభ్యుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి రాంచందర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అబద్ధాలకు కాంగ్రెస్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని, యూరియా కొరత రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తున్నదేనని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఒక్కటేనని, కేసుల నుంచి తప్పించుకోడానికే ఒక్కటయ్యారని విమర్శించారు. ఇద్దరూ ఒక్కటి కాకుంటే ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసులను సీబీఐకి అప్పగించాలని రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. ఓడిపోతామనే భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించడం లేదన్నారు. బండి సంజయ్‌ని దేశ్‌ముఖ్ అని, మోదీ కన్వర్టెడ్ బీసీ అని కాంగ్రెస్ నాయకులు అంటున్నారని, ప్రజలు, నాయకులు కాంగ్రెస్ నుంచి కన్వర్ట్ అయ్యే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు.

రాష్ట్ర కమిటీలో అధిక ప్రాధాన్యం ఇవ్వాలి: ఎంపీ అర్వింద్

నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పార్టీకి సీట్లు, ఓట్లిచ్చామని, రాష్ట్ర కమిటీలో ఈ పార్లమెంట్ స్థానం నుంచి నాయకులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ రాష్ట్ర అధ్యక్షుడిని కోరారు. ఓట్ల చోరీ గురించి టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ మొదట ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ప్రశ్నించాలని, 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ రాష్ట్రంలో 18 లక్షల ఓట్లు మాయం చేసిందనే ఆరోపణలు వచ్చాయన్నారు. అప్పుడు ఉత్తమ్ ఎందుకు ప్రశ్నించలేదని, బీఆర్‌ఎస్‌తో కుమ్మక్కయ్యారా అని ప్రశ్నించారు.

డ్రైవర్ ఆవలించినా అలర్ట్ చేస్తుంది!

▶ మొదటి పేజీ తరువాయి

కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పని చేస్తుంది. ప్రయోగాత్మకంగా తొలుత 200 బస్సుల్లో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఫలితాలను విశ్లేషించిన తర్వాత అన్ని దూరప్రాంత సర్వీసుల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం టెండర్లు పిలవగా 4 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. వాటిల్లో రెండింటిని తిరస్కరించిన ఆర్టీసీ.. మిగతా రెండింటి సాంకేతిక పనితీరును పరిశీలిస్తోంది. ఇప్పటికే ఒక్కో సంస్థ రెండు చొప్పున బస్సుల్లో ఈ పరిజ్ఞానాన్ని ఏర్పాటు చేసి ట్రయల్ ప్రారంభించాయి. వీటిల్లో మెరుగైన సాంకేతికతను అందించే సంస్థతో ఆర్టీసీ ఒప్పందం చేసుకోనుంది. ఆ వెంటనే 200 బస్సుల్లో ఈ వ్యవస్థ ఏర్పాటు కానుంది.

ఎప్పటికప్పుడు బీప్ శబ్దాలతో..

ఎంపిక చేసిన బస్సుల్లో ముందువైపు రెండు ప్రత్యేక సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఇందులో ఒకటి డ్రైవర్‌ను, మరోటి రోడ్డును పరిశీలిస్తుంటాయి. అయితే ఒకదానితో మరొకటి అనుసంధానమై ఉంటాయి. రోడ్డును పరిశీలించే కెమెరా ఏడీఏఎస్‌తో అనుసంధానమై ఉంటుంది. రోడ్డుపై ఉన్నట్టుండి వ్యక్తులు, వాహనాలు అడ్డుగా వచ్చినప్పుడు వెంటనే డ్యాష్‌బోర్డుపై ఉండే సిస్టం నుంచి బీప్ శబ్దం వెలువడుతుంది. డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది. డ్రైవర్ వేగంతో ప్రమేయం లేకుండా రోడ్డు లేన్‌ను నిర్లక్ష్యంగా మార్చినా, వరుసగా ఆవలిస్తున్నా, నిద్రమత్తులో ఉన్నా, తరచూ రెప్ప వాలుస్తున్నా కూడా బీప్ అలర్టులు వస్తాయి. బస్సు నడుపుతూ ఇతరులతో ముచ్చటిస్తున్నా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్నా, ఇయర్ ఫోన్లు పెట్టుకుని మాట్లాడుతున్నా కూడా అలర్ట్ చేస్తుంది. ఇక డీఎంఎస్‌తో అనుసంధానమై ఉండే రెండో కెమెరా డ్రైవర్‌ను పరిశీలిస్తుంటుంది. ఈ కెమెరా ద్వారా డ్రైవర్ బస్సు నడుపుతున్న తీరును రియల్ టైమ్‌లో చూసే వీలు అధికారులు, సిబ్బందికి కలుగుతుంది. ఇది బస్‌భవన్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమై ఉంటుంది. డ్రైవర్ నిర్లక్ష్యం కొనసాగుతుంటే, కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బందిని ఈ వ్యవస్థ అప్రమత్తం చేస్తుంది. ఆ వెంటనే సిబ్బంది డ్రైవర్‌కు ఫోన్ చేసి అప్రమత్తం చేస్తారు.

అధికారి సెల్‌ఫోన్‌తోనూ అనుసంధానం

డీఎంఎస్ పంపే రియల్ టైమ్ ఫీడ్‌ను నేరుగా సంబంధిత అధికారి సెల్‌ఫోన్‌తో కూడా అనుసంధానిస్తారు. తద్వారా ఆ అధికారి డ్రైవర్ బస్సును నడుపుతున్న తీరును పరిశీలించొచ్చు. అవసరమైతే ఆయనే నేరుగా డ్రైవర్‌కు ఫోన్‌చేసి అప్రమత్తం చేయొచ్చు.

పరిహార భారం నుంచి విముక్తి!

బస్సులకు సంబంధించిన రోడ్డు ప్రమాదాల్లో కొన్ని డ్రైవర్ తప్పిదం వల్ల జరుగుతుంటే, మరికొన్ని ఇతర వాహన డ్రైవర్ల తప్పిదాలతో జరుగుతున్నాయి. అలాంటప్పుడు మృతులు, బాధితుల కుటుంబాలకు ఆర్టీసీ భారీ ఎత్తున పరిహారం అందిస్తోంది. సాలీనా రూ.80 కోట్ల వరకు చెల్లిస్తోంది. ఇది ఆర్టీసీకి పెద్ద భారంగా మారింది. అయితే చాలా సందర్భాల్లో ఆర్టీసీ డ్రైవర్ తప్పు లేనప్పటికీ, ఆర్టీసీ పరిహారం చెల్లిస్తోంది. ప్రమాదాలకు సంబంధించి సరైన సాక్ష్యాధారాలు లేకపోవటంతో ఇది జరుగుతోంది. ఇప్పుడు అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అలర్ట్ సిస్టం వల్ల ప్రమాదానికి కారణాలు స్పష్టంగా తెలుస్తాయి. ప్రమాదాలు నివారిస్తే సంస్థ పురోగతికి, కొత్త బస్సుల కొనుగోలుకు ఆ నిధులను వినియోగించేందుకు వీలుంటుంది.

వర్షాకాలంలో డెంగీ సాధారణమే

భువనగిరి ఎంపీ చామల



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే డెంగీ జ్వరాలు వస్తున్నట్టు బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు మాట్లాడటం సరైంది కాదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వర్షాకాలంలో డెంగీ జ్వరాలు సాధారణంగానే వస్తాయని, హరీశ్‌రావు ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు డెంగీ కారణంగా మరణాలు నమోదయ్యాయని గుర్తు చేశారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు చనగాని దయాకర్, బొజ్జా సంధ్యారెడ్డి, చరణ్‌కౌశిక్ యాదవ్, అధికార ప్రతినిధి శ్రీకాంత్ యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ, హరీశ్‌రావు మంత్రిగా ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ హయాంలో అసలు డెంగీ జ్వరాలే రానట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్‌ను కేసీఆర్ కనిపెట్టినట్టు ఆయన కుమారుడు కేటీఆర్ మాట్లాడుతున్నారని, హైదరాబాద్‌ను కేసీఆర్ కుటుంబం వాడుకుని ఆర్థికంగా ఎదిగిందే తప్ప నగరానికి చేసిందేమీ లేదన్నారు. పది మంది ఎమ్మెల్యేలు లేని బీజేపీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో సగం స్థానాలు ఎలా వస్తాయో ఆ పార్టీ నేతలకే తెలియాలని చామల అన్నారు.







జీవితం ఒక అవకాశం. దాని నుండి ప్రయోజనం పొందండి;
జీవితం అందమైనది. దానిని ఆస్వాదించండి;
జీవితం ఒక కల. దానిని నిజం చేసుకోండి.
– మదర్ థెరిస్సా

సాక్షి
మంగళవారం, 26 ఆగస్టు 2025

ఈ మారణహోమం ఆగేదెలా?

'భార్యాభర్తలన్నాక ఇదంతా మామూలే కదా...' అన్నాడు గ్రేటర్ నోయిడాలో భార్యను హత్యచేసిన తర్వాత విపిన్ భాటీ అనే యువకుడు. బహుశా హైదరాబాద్‌లోని మేడిపల్లిలో గర్భిణిగా ఉన్న భార్యను గొంతు కోసి చంపి, మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా కోసి మూసీ నదిలో పడేసిన మహేందర్‌రెడ్డిని అడిగినా... భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో రెండేళ్లపాటు భార్యను మానసికంగా, శారీరకంగా హింసించి తిండి కూడా పెట్టకుండా మాడ్చి ఆమె మరణానికి కారణమైన నరేశ్‌బాబును అడిగినా... పెళ్లయిన మూడు నెలలకే భార్యను ఊపిరాడకుండా చేసి చంపేసిన వరంగల్ జిల్లాలోని గణేశ్‌ను అడిగినా... మహబూబ్‌నగర్ జిల్లాలో భార్యను హత్య చేసి పెట్రోల్ పోసి దహనం చేసిన శ్రీశైలంను అడిగినా ఇదే చెబుతాడు. కేవలం రెండు మూడు రోజుల వ్యవధిలో వేర్వేరు చోట్ల జరిగిన ఈ ఘటనలు సమస్య తీవ్రతను చాటుతున్నాయి. అదనపు కట్నం కోసమో, అనుమానంతోనో, తమకన్నా అధికంగా సంపాదిస్తున్నదనో భార్యల్ని హింసించడం, హతమార్చటం సర్వసాధారణంగా మారింది. అందుకే 'భార్యాభర్తలన్నాక ఇదంతా మామూలేగా...' అనగలిగాడు విపిన్. ఈ ఉదంతాలన్నిటిలో మధ్యవర్తులు రాజీ చేశారని, అంతా బాగానే ఉందనుకున్నామని, ఇంతలోనే ఘోరం జరిగి పోయిందంటూ తల్లితండ్రులు బావురుమనటం చూస్తాం. ఒకపక్క ఐపీసీ సెక్షన్ 498–ఏ దుర్వినియోగానికి గురవుతున్నదంటూ పదేళ్ల క్రితం మొదలైన అలజడి పర్యవసానంగా 2014లో అర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు కొన్ని మార్గదర్శకాలు జారీచేసింది. అటు తర్వాత అరెస్టులు తగ్గిపోయాయనీ, ఇది బాధిత మహిళలకు మరింత సమస్యాత్మకంగా మారిందనీ మహిళా సంఘాలూ, హక్కుల సంఘాలూ అభ్యంతరాలు చెప్పినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు 498–ఏ భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లో సెక్షన్ 85గా వచ్చిచేరింది.

జాతీయ క్రైమ్ రికార్డుల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికల్లో ప్రస్తావించే వరకట్నం వేధింపు కేసుల సంఖ్య, వాటిల్లో నిందితులు నిర్దోషులుగా విడుదలవుతున్న వైనం చూపి రాజీకి వీలున్న నేరం (కాంపౌండబుల్ అఫెన్స్)గా మార్చాలని గతంలో ప్రయత్నాలు జరిగినా మహిళా ఉద్యమాలతో కేంద్రం వెనక్కి తగ్గింది. సమాజంలోనైనా, కుటుంబాల్లోనైనా మహిళలపై ఇలాంటప్పుడు నలుమూలల నుంచీ వచ్చే ఒత్తిళ్లు ఏ విధంగా ఉంటాయో అందరికీ తెలుసు. భర్త పూర్తిగా మారిపోయాడనీ, ఇకపై జాగ్రత్తగా మసలుకుంటాడనీ ఒత్తిళ్లు తెస్తే సులభంగా కరిగిపోయే భార్యలు కోకొల్లలు. భర్తపై కేసు పెట్టిందని చిన్నచూపు చూసే సమాజం, ఎలాగోలా కాపురాన్ని నిలబెట్టుకోవాలని అయినవారు బతిమాలటం, చంటిపిల్లలతో కోర్టుల చుట్టూ తిరగకతప్పని స్థితి, ఒంటరి మహిళగా బతకటం కష్టమన్న భయాందోళనలూ స్త్రీలు రాజీపడక తప్పనిస్థితిని కల్పిస్తున్నాయి. విచారణ పూర్తవుతున్న దశలో మాట మార్చటంవల్ల కేసులు వీగిపోతున్నాయి. దారుణమేమంటే... కన్నకూతురిని హతమార్చాడన్న కోపం కూడా లేకుండా కొన్నిసార్లు తల్లితండ్రులు రాజీ పడుతున్నారు. డబ్బుల వల్లనో, బెదిరింపుల వల్లనో వెనక్కి తగ్గుతున్నారు.

దేశంలో సామాజిక కట్టుబాట్లూ, సంప్రదాయాలూ మహిళల్ని కట్టిపడేసినంతగా మగవాళ్లను పట్టించుకోవటం లేదు. పర్యవసానంగానే ఈ హింసాత్మక ఘటనలు పదే పదే జరుగుతున్నాయి. జరుగుతున్న హింసతో పోలిస్తే పోలీస్ స్టేషన్లకూ, కోర్టులకూ వెళ్లే ఉదంతాల సంఖ్య అత్యల్పం. కులం పేరిట, మతం పేరిట 'పెద్దలు' రంగంలోకి దిగి భర్తను మందలించినట్టుగా, అతడు మారాడన్నట్టుగా చూపించి ఇకపై సమస్యలు రావని హామీ ఇస్తున్నారు. ఇప్పుడు కన్నుమూసిన యువతుల్లో అనేకులు ఆ నరకకూపాల్లోకి మళ్లీ ప్రవేశించి ప్రాణాలు కోల్పోయినవారే. ఇలాంటివి జరిగినప్పుడు గతంలో రాజీకి ప్రయత్నించిన 'పెద్దల్ని' కూడా బాధ్యులుగా చేరిస్తే తప్ప ఈ మారణ హోమం ఆగదు. దౌర్జన్యం చేయటం, హింసించటం చట్టం దృష్టిలో నేరం. ఆ నేరాన్ని పోలీసుల వరకూ పోనీయకుండా చేసి, నోళ్లు మూయించి రాజీకి ప్రయత్నిస్తున్న వారు కూడా నేరంలో భాగస్వాములే అని గుర్తించాలి. అసలు 2022 తర్వాత ఎన్‌సీఆర్‌బీ నివేదికలు కేంద్రం వెలువరించటం లేదు. కనీసం పోలీసుల వరకూ వస్తున్న కేసుల గణాంకాలైనా తెలియకపోతే సమాజాన్ని పీడిస్తున్న సమస్యపై కఠిన చట్టాలతోపాటు ఇతరత్రా ఏం చేయాలో ఆలోచించటం ఎలా సాధ్యం? విపిన్ లాంటివాళ్లు భార్యల్ని హింసించడం మామూలే అన్న ధోరణికి పోవటాన్ని చూసైనా తీరు మార్చుకోవాలి. మౌనంగా ఉండిపోయి మనమంతా పరోక్షంగా ఆ నేరాల్లో భాగస్వాములమవుతున్నామని గుర్తుంచుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.తదియ ప.12.36 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** హస్త తె.5.45 వరకు(తెల్లవారితే బుధవారం), తదుపరి చిత్త, **వర్జ్యం:** ప.12.54 నుండి 2.38 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.18 నుండి 9.08 వరకు, తదుపరి రా.10.55 నుండి 11.41 వరకు, **అమృత ఘడియలు:** రా.11.20 నుండి 12.58 వరకు.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం : 6.17
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

మాట



బహుశా, ఒక్క రోజులో పరిస్థితులు మారవచ్చనేది నిజమే కావచ్చు. కొన్ని గంటలు, లేదా కొన్ని నిమిషాలు మొత్తం జీవిత కాలాన్ని ప్రభావితం చేస్తాయి. అజాగ్రత్తగా మాట్లాడే కొన్ని మాటలు కూడా!

– అరుంధతీ రాయ్, రచయిత్రి

జమ



ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండే వ్యక్తులు సాధారణమైన రోజుల్లో కూడా శక్తి మేరకు పని చేస్తుంటారు. అందుకే వారు అసాధారణంగా ఉంటారు. పని వల్ల శక్తి ఖర్చవదు. జమ అవుతుంది.

– ట్వింకిల్ ఖన్నా, నటి-కాలమిస్ట్

ఉపకారం



జీవితం కొన్నిసార్లు నువ్వేం చెయ్యాలనుకుంటున్నావో అది చెయ్యనివ్వదు. నువ్వేం చేయవలసి ఉందో దానిని చేయిస్తుంది. జీవితం మనకు చేసే ఉపకారం అది.

– చేతన్ భగత్, మోటివేషనల్ రైటర్

నిజం



ప్రేమ కంటే, డబ్బు కంటే, కీర్తి కంటే, 'నిజం' నాకు ప్రియమైనది. నా కస్టమర్, నా టీమ్, నా వ్యాపార భాగస్వామి, నా భార్య ఎల్లప్పుడూ నాకు నిజమే చెప్పాలని కోరుకుంటాను.

– లిప్-బు టాన్, 'ఇంటెల్' సీఈవో

ఆ పాలస్తీనా...



నేను కూడా స్వేచ్ఛా పాలస్తీనాను నమ్ముతాను – కాకపోతే నది నుంచి సముద్రం వరకు కాదు, 1967 నాటి సరిహద్దుల లోపల, ఇజ్రాయెల్‌తో పక్కపక్కన కలిసి జీవిస్తూ.

– ఇహాబ్ హసన్, పాలస్తీనా యాక్టివిస్ట్

సాధ్యమని నిరూపిస్తా!



నా లక్ష్యం ఏమిటంటే, ఎటువంటి శిలాజ ఇంధనాలనూ మండించకుండా, కార్బన్ డయాక్సైడ్ విడుదల కాకుండా ఆకాశంలోకి ఎగరడం సాధ్యం అవుతుందని రేపటి యువతరానికి చూపించటం. రేపటి ప్రపంచం ఇంతకంటే మెరుగ్గా ఉంటుందని నేటి తరానికి నిరూపించటం.

– రాఫెల్ డోమ్యాన్, స్విస్ పైలట్

బుద్ధిజీవులకైనా బలమైన సవాల్

విశ్వ గురు



చరిత్రకారుడు, 'సేపియన్స్' పుస్తక రచయిత **యువల్ నోవా హరారీ** 'వాల్ స్ట్రీట్ జర్నల్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్'లో జరిపిన సంభాషణ సంక్షిప్త పాఠం.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ని నా రచనల్లో ఏలీన్ ఇంటెలిజెన్స్‌గా కూడా ప్రస్తావిస్తూ ఉంటాను. బుద్ధిజీవులైన మానవ జాతిని మానవ పరిణామ శాస్త్ర పరిభాషలో హోమో సేపియన్స్‌గా పిలుస్తారు. నాకెందుకో ఒక కొత్త జాతి వృద్ధి చెంది ఈ హోమో సేపియన్స్ స్థానాన్ని భర్తీ చేస్తుందని అనిపిస్తోంది. ఈ భూగోళంపై మొదటిసారిగా మనకు నిజమైన పోటీ ఎదురవుతోంది. ఇప్పటికి కొన్ని వేలాది ఏళ్ళుగా మనమే అత్యంత తెలివైన జాతిగా ఉంటూ వస్తున్నాం. ఆఫ్రికాలో ఓ మూలన ప్రాధాన్యం లేని కోతులుగా పడి ఉన్న మనం ఈ తెలివితేటల కారణంగానే, ఈ భూగోళానికి తిరుగులేని పాలకులుగా మారగలిగాం. కానీ, ఇపుడు మనం సృష్టిస్తున్నది సమీప భవిష్యత్తులో మనకు పోటీగా పరిణమించవచ్చు.

పిల్లల్ని పెంచడం లాంటిదే!

ఏఐ గురించి ముఖ్యంగా తెలుసుకోవాల్సిన సంగతి ఒకటుంది. అది ఒక సాధనం కాదు, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగిన ఏజెంట్. అది కొత్త ఐడియాలను కనిపెట్టగలదు. నేర్చుకోగలదు. తనకుతాను మారగలదు. మనం ఇంతకు ముందు కనుగొన్న ముద్రణాలయం, అణు బాంబు లాంటివి మనల్ని శక్తిమంతులను చేసిన సాధనాలు. వాటికి మన అవసరం ఉంది. ప్రెస్ స్వయంగా పుస్తకాలు రాయలేదు. ఏ పుస్తకాలను ప్రచురించాలో నిర్ణయించలేదు. అణు బాంబు తనకన్నా శక్తిమంతమైన మరో బాంబును కనుగొనలేదు. తానెక్కడ పేలాలో దానికంతట అదే నిర్ణయించుకోలేదు. కానీ, ఏఐ ఆయుధం దాడికి లక్ష్యాన్ని ఎంచుకోగలదు. తదుపరి తరం ఆయుధాలను దానికంతట అదే డిజైన్ చేయగలదు.

> ఆఫ్రికాలో ఓ మూలన ప్రాధాన్యం లేని కోతులుగా పడి ఉన్న మనం మన తెలివితేటల కారణంగానే, ఈ భూగోళానికి తిరుగులేని పాలకులుగా మారగలిగాం. కానీ మొదటిసారిగా మనకు నిజమైన పోటీ ఎదురవుతోంది.

నా తాజా పుస్తకం 'నెక్సస్'లో ఏఐని చిన్న పిల్లాడిలా అభివర్ణించాను. మనం ఏది నేర్పుతామో వాడు అదే నేర్చుకుంటాడు. కనుక, మనందరం ముఖ్యంగా, వివిధ దేశాల స్థితిగతులను ప్రభావితం చేస్తున్న నాయకులు చాలా బాధ్యతతో వ్యవహరించాలి. మనం అబద్ధాలాడుతూ, వంచన చేస్తూ, ఏఐ మాత్రం దయగలదిగా ఉండాలంటే కుదరదు. ఒక నిర్దిష్టమైన రీతిలో ఈ ఏఐని మనం డిజైన్ చేయగలమా? ఏఐకి నీతి నియమాలు బోధించగలమా? వాటిలోకి కొన్ని లక్ష్యాలను చొప్పించగలిగిన విధంగా కోడింగ్ చేయగలమా? అనే అంశాలపై పరిశోధన, ప్రయత్నాలు సాగుతున్నాయి. అపుడు మనం సురక్షితంగా ఉంటాం కదా అని భావిస్తున్నారు. కానీ, ఈ దృక్పథంలో రెండు ప్రధాన సమస్యలు ఇమిడి ఉన్నాయి. ఒకటి– అసలు ఏఐ అంటేనే నేర్చుకోగలదు, దానికంతట అది మారగలదు. కనుక మనం ఏఐని డిజైన్ చేస్తే, నిర్వచనాన్ని అనుసరించి, మనం ఊహించలేని అన్ని రకాల పనులనూ అది చేసేస్తుంది. రెండు– ఇది ఇంకా పెద్ద సమస్య. మనం ఏఐని పిల్లాడిలానే భావించి విద్యాబుద్ధులు నేర్పించాం అనుకుందాం. సత్ప్రవర్తనతో తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా పాటుపడ్డారు. వారి చదువు సంధ్యలపై మీరు ఎంత వెచ్చించారన్నది లెక్కలోకి రాదు. చివరకు, వారు చేసే పని మిమ్మల్ని ఆశ్చర్యపరచనూవచ్చు లేదా భయపెట్టనూవచ్చు.

ఇంకో విషయం కూడా ఉంది. ఇది పిల్లల్ని పెంచేవారందరికీ అనుభవంలో ఉన్న విషయమే. మనం పిల్లలకి ఏం చెబుతామన్న దానికన్నా ఏం చేస్తున్నామన్నది ముఖ్యం. మనం పిల్లలకి అబద్ధాలాడవద్దని చెప్పేసి, మనం మాత్రం ఇతరులతో అబద్ధాలు చెబుతూంటే, వారు చూసి మనల్నే అనుకరిస్తారు. మన ఆదేశాల్ని పాటించరు. అబద్ధాలాడకూడదనే నీతిని ఏఐలలో చొప్పించే ప్రాజెక్టును చేపట్టామనుకుందాం. కానీ, వాటికి ప్రపంచంతో యాక్సెస్ ఉంది. మానవులు ఎలా ప్రవర్తిస్తున్నారో అవి గమనిస్తాయి. అదే నడతను మన పట్లా ప్రదర్శిస్తాయి.

అన్నింటిలోనూ... అన్ని చోట్లా...

వ్యాపారాలలో ఏఐ ప్రాధాన్యం ప్రస్తుతానికి పెద్ద లెక్కలోకి రానిదిగానే కనిపించవచ్చు. ఇప్పటికి 36 నెలల తర్వాత కూడా పరిస్థితి ఇలానే ఉంటుందా అంటే... అది టైమ్ స్కేల్‌పై ఆధారపడి ఉంటుందని చెప్పాలి. ఉదాహరణకు, ఇది లండన్‌లో 1835 సంవత్సరం అనుకుందాం. మాంచెస్టర్– లివర్‌పూల్ మధ్య మొదటి రైలు మొదలై అప్పటికి ఐదేళ్లయింది. లండన్‌లో 1835లో చర్చకు కూర్చున్నవాళ్లకు 'రైల్వేలు ప్రపంచాన్ని మార్చేస్తాయి, పారిశ్రామిక విప్లవం వచ్చేస్తుంది' అంటే నాన్సెన్స్ అని కొట్టిపడేస్తారు. కానీ, ఇపుడు రైల్వేలు మొదలై చాలా ఏళ్ళు అయింది. పారిశ్రామిక విప్లవం, రైల్వేలు ప్రతీదాన్నీ మార్చేశాయని మనకు ఇపుడు తెలుసు. కానీ, మార్పు వచ్చేందుకు ఐదేళ్ళకన్నా ఎక్కువే పట్టింది.

అలాగే, ఇప్పటికి తెలిసిన రంగాలు, అంతగా తెలియని రంగాలన్నింటిలో కూడా ఏఐతో మార్పులు రావచ్చు. ముఖ్యంగా ఫైనాన్స్ రంగం ప్రధానమైన మార్పులను చూడవచ్చు. ఆర్థిక వ్యవస్థను ఏఐ చాలా వేగంగా హస్తగతం చేసుకోబోతోంది. ఆర్థికం పూర్తిగా సమాచార ప్రభావిత రంగం. డ్రైవర్ సీట్లో మనిషి లేకుండా నడిచే కార్లు లక్షల్లో మనకు అప్పుడే రోడ్డు మీద కనబడకపోవచ్చు. ఎందుకంటే, రోడ్డుమీద గుంతలుంటాయి, మనుషులు నడుస్తూంటారు, కంగాళీగా ఉంటుంది కనుక ఏఐతో నడిచే వాహనాలు రాకపోకలు సాగించడానికి సమయం పడుతుంది. కానీ, ఆర్థికంలో సమాచారమే ప్రధానం. వస్తుంది, వెళుతుంది. దానిపై పట్టు సాధించడం ఏఐకి చాలా తేలిక.

ఆయుధ పోటీ లాంటి స్థితి

ఏఐ కొందరి ఉద్యోగాలకు ఎసరు పెడుతుంది అంటున్నారు. దీనిపై చాలా మందిలో ఆందోళన ఉంది. మరి ఒక సమాజంగా బతికి బట్టకట్టడమే కాదు, వృద్ధిలోకి రావాలంటే ఏం చేయాలి? అనే ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతుంది. ఏఐకి అపారమైన సానుకూల సామర్థ్యమూ ఉంది. ప్రమాదకరమైన సామర్థ్యమూ ఉంది. ఒకే టెక్నాలజీ పూర్తిగా భిన్నమైన సమాజాలను సృష్టించడాన్ని మనం 20వ శతాబ్దంలో గమనించాం. అందుకే కమ్యూనిస్టు నిరంకుశ ప్రభుత్వాలతోపాటు, ఉదారవాద ప్రజాస్వామిక వ్యవస్థలూ ఏర్పడ్డాయి.

> అబద్ధాలాడకూడదనే నీతిని ఏఐలలో చొప్పించే ప్రాజెక్టును చేపట్టామనుకుందాం. కానీ, వాటికి ప్రపంచంతో యాక్సెస్ ఉంది. మానవులు ఎలా ప్రవర్తిస్తున్నారో అవి గమనిస్తాయి. అదే నడతను మన పట్లా ప్రదర్శిస్తాయి.

ఏఐతోనూ అంతే! దాన్ని అనేక విధాలుగా ఉపయోగించుకునేందుకు మనకు అవకాశం ఉంది. కాకపోతే, మనం మొదటిసారిగా పనిముట్లతో కాకుండా ఏజెంట్లతో వ్యవహరిస్తున్నామనే సంగతిని గుర్తు పెట్టుకోవాలి. కానీ, ఇప్పటికీ ఏఐ చాలా వరకు మన చెప్పుచేతల్లోనే ఉంది. మనం ఆ టెక్నాలజీని ఎలా అభివృద్ధి చేస్తాం? అంతకన్నా ముఖ్యంగా మనం దాన్ని ఎక్కడెక్కడ నియోగించబోతున్నాం? అన్నది ప్రశ్న. ఎంచుకునేందుకు మనకు చాలా అవకాశాలున్నాయి.

ప్రధాన సమస్య ఏమిటంటే, ఏఐ విప్లవంలో ప్రస్తుతం అగ్రభాగాన ఉన్న కంపెనీలు, దేశాలు ఆయుధాల సమీకరణ లాంటి పోటీ స్థితిలో చిక్కుకున్నాయి. ఈ విషయంలో మందగతిన సాగడమే మంచిదని వాటికి తెలిసినా, సురక్షణపై మరింత వ్యయం అవసరమనే గ్రహింపు ఉన్నా, ఆ శక్తిమంతమైన పరిణామం పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలనే ఆలోచన ఉన్నా, మనం బ్రేకులు వేసినంత మాత్రాన ఇతరులు వేయకపోవచ్చనే భయం వారిని నిరంతరం వెన్నాడుతోంది. ఎక్కడ ఎదుటివారు ప్రపంచంపై ఆధిపత్యం సంపాదిచ్చేస్తారేమోననే ఆదుర్దా వారిని నిలువనీయడం లేదు. ◆

పేదవాడి గుండె చప్పుడు!



సురవరం సుధాకర్ రెడ్డి
(1942- 2025)

ఆయన భారతదేశ రాజకీయాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో జరుగుతున్న పరిణామాలను అవలీలగా అర్థం చేసుకొని ప్రజలకు వివరించే బహుముఖ ప్రజ్ఞాశాలి. నిరంతరం కార్మిక, కర్షక, పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ఆలోచన చేసే మేధావి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో కీలకంగా వ్యవహరించిన గొప్ప నాయకుడు. ఆయనే కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి. 1942 మార్చి 25న జన్మించిన ఆయన ఈ 2025 ఆగస్ట్ 22న తుదిశ్వాస విడిచారు.

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మానవపాడు మండలం కంచుపాడు ఆయన స్వగ్రామం. సురవరం ప్రతాపరెడ్డి గారికి సుధాకర్ రెడ్డి తండ్రి వెంకట్రామారెడ్డి స్వయానా తమ్ముడు. కర్నూలులో చదువుకునే రోజుల్లో 19 ఏళ్లకే ఏఐఎస్ఎఫ్ కర్నూల్ పట్టణ కార్యదర్శిగా, 1960లో కర్నూలు జిల్లా కార్యదర్శిగా పని చేశారు సుధాకర్ రెడ్డి. 1967లో హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లా కోర్సులో చేరారు. యూనివర్సిటీ ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారు. 1963లో ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికై అనంతరం రెండు పర్యాయాలు జాతీయ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

లా పూర్తి చేసిన తర్వాత ఢిల్లీలో సీనియర్ న్యాయవాది వద్ద చేరి ప్రాక్టీస్ చేస్తున్న క్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ నాయకత్వం సీపీఐలో పూర్తి కాలం పని చేయడానికి అవకాశం ఇచ్చింది. దీంతో భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, కేంద్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా ఎదిగి 2012లో సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అయితే 2019లో అనారోగ్య కారణాల వల్ల పార్టీ పదవుల నుండి తప్పుకొన్నారు.

1980, 1984ల్లో మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం నుండి పోటీచేశారు. 1994లో ఆనాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్ రెడ్డిపై కర్నూలు జిల్లా డోన్ నియోజకవర్గం నుండి పోటీ చేశారు. 1998, 2004ల్లో లోక్ సభకు నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గం నుండి ఎన్నికయ్యారు. భారతదేశ అత్యున్నత పార్లమెంటరీ కమిటీలకు ప్రాతినిధ్యం వహించారు. అనేకమంది పేదలకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు నిర్మించి ఇవ్వడం కోసం కేంద్ర ప్రభుత్వంతో కీలకంగా వ్యవహరించారు. ఏఐఎస్ఎఫ్ ఉద్యమ సమయంలో పరిచయమైన డా॥ బీవీ విజయలక్ష్మిని 1974లో ఆదర్శ వివాహం చేసుకున్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగు పెట్టిన నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేస్తున్న క్రమంలో రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్న సుధాకర్ రెడ్డి నాకు సైద్ధాంతిక అవగాహన కల్పించడంలో అందరి కంటే ముందున్నారు. 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆనాటి ఇందుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సిటింగ్ స్థానాన్ని సైతం నాకు ఇప్పించి నేను శాసనసభ్యునిగా గెలుపొందడం కోసం కృషి చేశారు. శాసనసభలో సీపీఐ పక్ష నాయకునిగా పనిచేస్తున్న క్రమంలో ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చి ప్రోత్సహించారు. నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా తుది శ్వాస విడిచే వరకు పని చేశారు. వారు విడిచిన సైద్ధాంతిక లక్ష్యాలను పుణికి పుచ్చుకొని ముందుకు పోవడమే ఆయనకు అసలైన నివాళి.

– చాడ వెంకటరెడ్డి
సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు

మట్టి చేతుల క్యూ!



అతను అదనపు భూమినో
అర్థ సామ్రాజ్యాన్నో అడగడం లేదు
పొలం తరఫున పంట కోసం
ఎరువును అడుగుతున్నాడు
అరువుకు కాదు ఖరీదుకే!

ఇంట్లోనో పొలం దగ్గరో ఉండి
అతను హుకుం జారీ చేయడం లేదు
క్యూలో నిల్చుని మట్టి చేతులు మోడ్చి
మరీ అడుగుతున్నాడు

పోలింగ్ బూత్ క్యూలనైతే మీరు
ప్రేమతో పట్టించుకుంటారు కదా!
పొలం వచ్చి క్యూలో నిల్చుంటే
అసలు పట్టనట్లుంటే ఎట్లా?
ఇది అన్న మూలమన్న సంగతి
మరిస్తే ఎట్లా?

తెలుసుకోండి:
అతను ఎరువు కోసం
క్యూలో నిల్చున్నాడంటే
దేశం అన్నం కోసం
క్యూలో నిల్చున్నట్లే!

– దర్భశయనం శ్రీనివాసాచార్య
94404 19039

డేటా పాయింట్

విద్యుత్ వినియోగంలో ఖతార్ సూపర్

ప్రపంచ దేశాల్లో తలసరి విద్యుత్ వినియోగం అధికంగా ఉన్న దేశం అమెరికానో, చైనానో అనుకుంటే పొరపాటు. ఈ జాబితాలో ఖతార్ అగ్రస్థానంలో నిలిచింది. అక్కడ ఒక వ్యక్తి సగటున 2023–24లో... 215 మెగావాట్ అవర్ల (ఎమ్‌డబ్ల్యూహెచ్) విద్యుత్ వినియోగించారు. ఈ జాబితాలో భారత్ 118వ స్థానంలో నిలిచింది.

దేశం	తలసరి ఎమ్‌డబ్ల్యూహెచ్
ఖతార్	215
సింగపూర్	181
బహ్రెయిన్	165
ఐస్‌ల్యాండ్	160
యూఏఈ	138
బ్రూనై	118
కువైట్	106
ట్రినిడాడ్ అండ్ టొబాగో	106
నార్వే	99
కెనడా	98

ఆధారం: యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్

జ్యోతిర్మయం

ధర్మం వైపే...

దేవుడు ఎప్పుడూ ధర్మం పక్షానే ఉంటాడు. ధర్మాత్ములు కష్టాలు అనుభవిస్తున్నా సంతోషంగానే ఉంటారు. ఇందుకు మంచి ఉదాహరణ పాండవుల ఉదంతం. కురుక్షేత్ర యుద్ధానంతరం అంపశయ్యపై ఉన్న కురుపితామహుని చూడటానికి ఒకరోజు ధర్మరాజుతో సహా అతని సోదరులు వెళ్లారు. వారిని చూడటంతోనే క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్న భీష్ముడు 'మీ లక్ష్యం నెరవేరింది కదూ' అని అడిగాడు. దానికి ధర్మరాజు, 'తాతా! మేము ధర్మపథంలోనే కదా ఉన్నాం! మా వాటా మాకివ్వడానికి నిరాకరించి దుర్యోధనుడు ఎందుకు ఇబ్బందిపెట్టాడు? ధర్మం కోసం మేము పడిన కష్టాలూ, బాధలూ మీకు తెలియనివా? అన్ని కష్టాలు పడటానికి మేము చేసిన తప్పేమిటి? తప్పులు చేసిన దుర్యోధనుడు చివరి వరకు సంతోషంగానే ఉన్నాడు కదా' అని అడిగాడు. అందుకు భీష్ముడు నవ్వుతూ జవాబిచ్చాడు:

'మీరు జీవితంలో పడరాని కష్టాలు పడ్డారు. నేను కాదనడం లేదు. కానీ ఇన్ని కష్టాలు వచ్చినప్పటికీ మీరు ప్రశాంతతను కోల్పోలేదు. ధర్మ మార్గంలోనే నడిచారు. కష్టాల్లోనూ మీరు సంతోషంగానే ఉన్నారు. కానీ దుర్యోధనుడు ఏ కష్టాన్నీ అనుభవించలేదు. అయితే అతను ప్రశాంతంగా ఉండగలిగేడా? లేదే! ఎప్పుడు చూసినా మీ గురించే ఆలోచిస్తుండేవాడు. దుర్యోధనుడి వల్ల మీకు కష్టాలు ఎదురైనప్పుడల్లా మీకు కృష్ణపరమాత్మ అండగా నిలిచాడు. మీరు మంచి ఆలోచనలతో ఉండటం వల్లే మీ వైపు చివరి వరకు పరమాత్మ ఉన్నాడు. కానీ దుర్యోధనుడి వైపు క్షణం కూడా లేడు. మంచివారిని భగవంతుడు ప్రేమించడం అంటే వారి సామర్థ్యాలను వెల్లడించడమే' అన్నాడు భీష్ముడు.

నిజమేగా! భగవంతుడు మనకు కష్టాన్నిస్తున్నప్పటికీ అతను మనల్ని విడిచిపెట్టడనే నమ్మకం ఉంటే చాలు. మనసులో ఏ సందేహమూ రాదు. కష్టమిచ్చిన భగవంతుడికి వాటి నుంచి మనల్ని కాపాడటమూ తెలుసనే సంగతి మనసులో ఉంటే చాలు. బాధలను అధిగమించవచ్చు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

కట్టుకున్నోడు, కన్న కొడుకు ఇంటి నుంచి వెళ్లగొట్టారు

- ఆదుకోండి సారూ అంటూ అంధురాలి వేడుకోలు



తనకు ఆశ్రయం కల్పించాలని వేడుకుంటున్న అంధురాలు నర్సమ్మ

మెదక్ కలెక్టరేట్: 'రెండు కళ్లు కానరావు.. కట్టుకున్న భర్త, కన్న కొడుకు ఇద్దరు కలిసి ఇంటి నుంచి వెళ్లగొట్టారు. దిక్కులేక రోడ్డుపై పడుకుంటున్నా.. ఆశ్రయం కల్పించండి సారూ...'అంటూ మెదక్ జిల్లా కొడిపల్లికి చెందిన అంధురాలు నర్సమ్మ ప్రజావాణిలో కలెక్టర్‌ను వేడుకుంది. తమకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, భర్త రాజయ్య, కొడుకు యేవన్ ఉన్నట్లు చెప్పింది. బాధితురాలిని వివరాలు అడిగినప్పటికీ సరైన సమాధానం చెప్పకపోవడంతో మెదక్‌లోని అభాగ్యుల కేంద్రంలో చేర్చాలని సంబంధిత అధికారికి కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు.

మధ్యాహ్న భోజనం తిని 22 మంది విద్యార్థులకు అస్వస్థత



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బిచ్కుంద (జుక్కల్): కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం శెట్లూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 26 మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయగా అందులో 22 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ అయి వాంతులు చేసుకున్నారు. దీంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెంటనే వారిని బిచ్కుంద ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి మందులిచ్చారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. బియ్యంలో నల్ల పురుగులు వస్తున్నాయని, మిల్‌మేకర్ ఉడక లేదని, రంగుమారి కలుషితమైన తాగునీరు వస్తున్నాయని ఆస్పత్రిని సందర్శించిన సబ్ కలెక్టర్ కిరణ్మయికి విద్యార్థులు వివరించారు.

వీధికుక్క బీభత్సం

- ఇరవై మందికి గాయాలు

వెల్దుర్తి (తూప్రాన్): వీధికుక్క దాడి చేయడంతో ఇరవై మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని మాసాయిపేటలో సోమవారం రాత్రి వీధికుక్కలు బీభత్సం సృష్టించాయి. ఆదివారం గ్రామంలో సంత కావడంతో మార్కెట్ ముగించుకొని ఇళ్లకు వెళ్తున్న వారు, ఇంటి ఆరుబయట ఉన్నవారిపై గంటన్నర వ్యవధిలో సుమారు 20 మందిపై ఓ వీధి కుక్క విచక్షణారహితంగా దాడి చేసింది. అనిల్‌కుమార్, సురేశ్, శేఖర్, చంద్రయ్య, నితిన్, బాబు, సాయిలు, యాదిరెడ్డి, అవంతిక, లక్ష్మి, అనూష, సత్యనారాయణ, షబానా, మన్సూర్, దీక్షిత్, వెంకటేశ్ తదితరులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను తూప్రాన్ ఆస్పత్రికి తరలించగా వీరిలో నలుగురికి గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మెదక్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

దొంగ పోలీసు!

- బావమరిదితో కలిసి రైళ్లలో చోరీలు చేస్తున్న కానిస్టేబుల్



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ అంజలి

ఖమ్మంక్రైం: బావమరిదితో కలిసి రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న రాచకొండ కమిషనరేట్ కానిస్టేబుల్‌ను ఖమ్మం జీఆర్పీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వివరాలను జీఆర్పీ సీఐ అంజలి సోమవారం వెల్లడించా రు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన యరమడి రవీందర్ రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తుండగా కొంతకాలం క్రితం సికింద్రాబాద్‌లోని జీఆర్పీ విభాగానికి కేటాయించారు. రైళ్లలో ఎస్కార్ట్ విధులకు వెళ్తూ ఆదమరిచి నిద్రించే ప్రయాణికుల నుంచి తన బావమరిది మేకల నాగసాయితో కలిసి సామగ్రి దొంగిలించేవాడు. ఏదో స్టేషన్‌లో రైలు ఆగినప్పుడు బావమరిది ద్వారా ఆ సామగ్రి పంపించేవాడు. ఆయన ప్రవర్తనపై ఫిర్యాదులు రావడంతో తిరిగి రాచకొండ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అయినా బావమరిదితో కలిసి చోరీలు కొనసాగించాడు. ఈనెల 23న సికింద్రాబాద్ నుంచి గూడూరు వెళ్లే సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఓ మహిళ నుంచి ఇద్దరూ కలిసి ఐ ఫోన్‌ను దొంగిలించారు. కాసేపటికి ఆమె వీరిపై అనుమానం వ్యక్తం చేయగా ప్రయాణికులంతా కలిసి డోర్నకల్ రైల్వే పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ సురేశ్ విచారించగా రవీందర్, నాగసాయి చోరీ చేసినట్టు తేలడంతో వారి నుంచి ఫోన్‌ను రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు.



మహబూబాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎదుట పేర్ల నమోదు కోసం మండుటెండలో క్యూలైన్లలో నిలబడిన రైతులు



సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఉదయం నుంచే బారులు తీరిన రైతులు



మెదక్ జిల్లా చేగుంట రైతుసేవా కేంద్రం వద్ద భారీ క్యూ



దుబ్బాక పీఏసీఎస్ ఎదుట అర్ధరాత్రి నుంచే రైతుల పడిగాపులు



సిద్దిపేట జిల్లా కొండపాకలోని పీఏసీఎస్ కార్యాలయంలో అధికారులను నిర్బంధించిన రైతులు

అర్ధరాత్రి నుంచే అరిగోస

యూరియా కోసం తప్పని బారులు...రోడ్డెక్కుతున్న రైతులు

దుబ్బాకటౌన్/నిడమనూరు/మిర్యాలగూడ/కోటపల్లి చిలప్‌చెడ్ /శివ్వంపేట/చేగుంట/మహబూబాబాద్: యూరియా కోసం అర్ధరాత్రి నుంచే రైతులు అరిగోస పడుతున్నారు. ఒక్క బస్తా అయినా దొరక్కపోదా అంటూ జాగారం చేస్తున్నారు. కొన్నిచోట్ల యూరియా లేదని చెప్పడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. మరికొన్ని చోట్ల బారులు తీరుతున్నారు.

- సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా లారీ వస్తుందని తెలియగానే ఆదివారం అర్ధరాత్రి నుంచే రైతులు క్యూ కట్టారు. అక్కడే నిద్రించారు. గంటలకొద్దీ నిరీక్షిస్తే ఒక్క యూరియా బస్తా దక్కిందని రైతులు వాపోయారు. కొండపాకలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట కూడా యూరియా కోసం రైతులు భారీగా క్యూ కట్టారు.
- నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు. రెండు గంటలకు పైగా జడ్చర్ల–కోదాడ జాతీయర హదారిపై రాస్తారోకో చేశారు. సోమవారం రెండు లారీల యూరియా వస్తుందని వ్యవసాయాధికారులు, సహకార శాఖ ఉద్యోగులు శనివారం రైతులకు చెప్పారు. అయితే సోమవారం యూరియా రాకపోవడంతో రైతులు ఆగ్రహంతో ధర్నాకు దిగారు. మిర్యాలగూడ మండలం అన్నారం గ్రామంలో యూరియా కోసం రైతులు తెల్లవారుజామున 3గంటలకే పీఏసీఎస్‌కు వచ్చి ఆధార్‌కార్డులు, చెప్పులు లైన్‌లో ఉంచి పడిగాపులు కాశారు.ఒక ఆధార్‌కార్డుకు రెండు బస్తాల యూరియా ఇస్తామని అధికారులు చెప్పినా, అందరికీ అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పార్‌పల్లి గ్రామంలో యూరియా పంపిణీ చేస్తున్నారనే విషయం తెలుసుకున్న రైతులు వందల సంఖ్యలో తరలివచ్చారు. ఫెర్టిలైజర్ దుకాణానికి 400 బస్తాలురాగా 900మంది రైతులు బారులు తీరడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. అంతమందిలో యూరియా పంపిణీ కష్టంగా మారింది. యూరియా అందని వారు నిరాశతో వెనుదిరిగారు.
- మెదక్ జిల్లాలోని చిలప్‌చెడ్, చేగుంట, శివ్వంపేట మండలాల్లో రైతులు యూరియా కోసం రైతుసేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్ద బారులు తీరారు. కొన్నిచోట్ల టోకెన్ల కోసం తోపులాట జరిగింది.
- మహబూబాబాద్ జిల్లా గార్ల సొసైటీ కార్యాలయంలోయూరియా కోసం రైతులు గంటల తరబడి బారులుతీరారు.నర్సింహులపేట పీఏసీఎస్ కార్యాలయం ఎదుట యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచూశారు. మహబూబాబాద్‌లోని పీఏసీఎస్ ఎదుట యూరియా బస్తాల కోసం వచ్చిన రైతులు క్యూలైన్లలో నిలబడి పేర్లు నమోదు చేయించుకున్నారు.
- సిద్దిపేట జిల్లా కొండపాకలోని పీఏసీఎస్‌కు యూరియా కోసం రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అయితే అందరికీ యూరియా దొరకలేదు. దీంతో ఆగ్రహించిన కొందరు రైతులు అధికారులను పీఏసీఎస్ కార్యాలయంలో నిర్బంధించారు. పోలీసులు రైతులకు నచ్చజెప్పగా, అధికారులను విడుదల చేశారు.

రేబిస్ సోకిందేమోనని వివాహిత ఆత్మహత్య

- మూడున్నరేళ్ల కుమార్తె అనుమానాస్పద స్థితిలో మృతి
- 2 నెలల క్రితం డ్రైఫ్రూట్స్‌ను ఆరబెట్టగా వీధికుక్కలు ఎంగిలి చేశాయన్న భర్త
- అయినా వాటినే వంటలో వాడామని.. ఆ తర్వాత భార్యకు చర్మ సమస్యలు వచ్చినట్లు వెల్లడి
- టీకాలు తీసుకున్నా మనోవేదనకు గురై ఉరేసుకున్న గృహిణి



యశోద



అక్షర

మహబూబ్‌నగర్ క్రైం: రేబిస్ సోకిందనే అనుమానంతో ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా ఆమె మూడున్నరేళ్ల కుమార్తె అనుమానాస్పద రీతిలో మృతిచెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై విజయ్‌భాస్కర్ కథనం ప్రకారం మహబూబ్‌నగర్ పట్టణంలోని కొత్తగంజ్ ఏరియాలో నివసించే యశోద (36) సోమవారం ఉదయం ఇంట్లోని బెడ్రూంలో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా ఆమె కుమార్తె అక్షర (3) మంచంపై విగతజీవిగా కనిపించింది.

వీధికుక్కలు డ్రైఫ్రూట్స్ తినడంతో..

వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని కమాలాద్దీన్‌పూర్‌కు చెందిన నరేశ్‌కు.. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్‌కు చెందిన యశోదతో 2014లో పెళ్లయింది. వారికి అనురాగ్, అక్షర (3) సంతానం. నరేశ్ కొత్తూరు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. ఈ ఏడాది జూన్‌లో వారు మహబూబ్‌నగర్‌లోని కొత్తగంజ్‌లో అద్దెకు ఉంటున్న ఇంటి ఆవరణలో పల్లీలు, డ్రైఫ్రూట్స్ ఎండలో ఆరబెట్టినప్పుడు వీధికుక్కలు వచ్చి వాటిని తినడం, ఈ క్రమంలో లాలాజలం మిగతా డ్రైఫ్రూట్స్‌కు అంటినప్పటికీ వాటినే వంటలో వాడినట్లు భర్త నరేశ్ చెబుతున్నాడు. అప్పటి నుంచి ఇంట్లో అనారోగ్య సమస్యలు మొదలవడంతో భార్య మనోవేదనకు గురైందని పేర్కొన్నాడు. వారం తర్వాత యశోదకు చర్మ సమస్యలు రావడంతో మరింతగా బెంబేలెత్తినట్లు చెప్పాడు. అయితే తాము రేబిస్ టీకాలు తీసుకోవడంతోపాటు ఇతర నాటు మందులు కూడా వాడామన్నాడు.

ఇంట్లో ఎవరూ లేని వేళ..

యశోద తండ్రి పాండురంగాం గురువారం ఉదయం శ్రీశైలం వెళ్తున్నానని కూతురికి చెప్పి వెళ్లగా.. భర్త డ్యూటీకి వెళ్లాడు. ఆ కాసేపటికే మానసిక ఒత్తిడి తట్టుకోలేక యశోద ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బాబుకు నాటువైద్యం చేయించాలని, భర్త కూడా మందులు వాడుతూ జాగ్రత్తగా ఉండాలని మరణానికి ముందు ఇంటి గోడలు, అద్దాలపై యశోద రాసినట్లుగా ఉన్న రాతలు కనిపించాయి. ఉదయం 10 గంటల వేళ భర్త ఇంటికి ఫోన్ చేయగా కుమారుడు లిఫ్ట్ చేసి తల్లి బెడ్రూం నుంచి బయటకు రావట్లేదని చెప్పాడు. దీంతో పక్కింటి మహిళకు ఫోన్ చేసి విషయం చెప్పగా ఆమె ఇంటికి వచ్చి చూసింది. అప్పటికే తల్లీబిడ్డ మృతిచెందారు. ఈ ఘటనపై యశోద తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పాప ఎలా మరణించిందో ఫోరెన్సిక్ నివేదిక వచ్చాక నిర్ధారణ అవుతుందని ఎస్సై తెలిపారు.

చంపేందుకు వచ్చి.. హతమయ్యారు

- కళ్లలో కారం చల్లి ఇద్దరిని హతమార్చిన ఓ కుటుంబం
- మృతుల్లో ఒకరిపై 14 కేసులు
- నిజామాబాద్ జిల్లా ధర్మోరలో ఘటన
- పోలీసులకు లొంగిపోయిన నిందితులు



ఆకాశ్



ప్రసాద్

మాక్లూర్: తమను చంపేందుకు కత్తులు, తల్వార్లతో వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఓ కుటుంబానికి చెందిన వారు ఎదురుదాడిలో హతమార్చారు. నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం ధర్మోర గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని గౌతంనగర్ కాలనీకి చెందిన జీలకర్ర ప్రసాద్ (35) అనే వ్యక్తి ధర్మోరలో నివాసముండే ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. తరచూ ఆమె ఇంటికి వచ్చి వెళ్తుండేవాడు. కాగా, ఆ మహిళ ఇంటి ఎదుట ఉండే గంధం నడ్పి గంగారాం కుమారులైన పెద్దసాయిలు, చిన్నసాయిలుతో జీలకర్ర ప్రసాద్‌కు ఒక విషయంలో ఘర్షణ జరిగింది. దీంతో ఇద్దరిపై కక్ష పెంచుకున్న ప్రసాద్ ఆదివారం సాయంత్రం వారితో మళ్లీ గొడవ పడ్డాడు. తర్వాత అర్ధరాత్రి కత్తులు, తల్వార్లతో గౌతంనగర్‌కు చెందిన ఆకాశ్(27) అనే యువకుడితో కలిసి ధర్మోరకు వచ్చాడు. ఈ క్రమంలో నడ్పి గంగారాం ఇంటికి వచ్చి తలుపులను తెరిచేందుకు తల్వార్లు, రాడ్లతో బలంగా కొట్టారు. ఇది గమనించిన పెద్ద సాయిలు, చిన్నసాయిలు, వారి తండ్రి గంగారాం, కోడలు నాగమణి కారంపొడిని చేతిలో సిద్ధంగా పట్టుకొని తల్లి గంధం గంగవ్వతో తలుపు తెరిపించారు. మరుక్షణమే జీలకర్ర ప్రసాద్, ఆకాశ్‌లు ఇంట్లో ఉన్న వారిపై దాడికి దిగారు. దీనిని ముందే ఊహించి సిద్ధంగా ఉన్న సాయిలు సోదరులు, ఇతర కుటుంబ సభ్యులు కారంపొడిని ప్రసాద్, ఆకాశ్ కళ్లలో చల్లి వారి చేతుల్లో ఉన్న కత్తులు, తల్వార్లను లాక్కొని ఎదురుదాడి చేశారు. ఈ దాడిలో జీలకర్ర ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందగా, ఆకాశ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, తమ ప్రాణాలను కాపాడుకోవడానికే ప్రసాద్, ఆకాశ్‌లను హతమార్చినట్లు చెప్పి నిందితులు పోలీసులకు లొంగిపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

జీలకర్ర ప్రసాద్‌పై 14 కేసులు

హతుడు జీలకర్ర ప్రసాద్‌పై వివిధ పోలీస్ స్టేషన్లలో 14 కేసులు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. దొంగతనాలు, గంజాయి రవాణా, బెదిరింపులకు పాల్పడడం లాంటి అసాంఘిక కార్యకలాపాల్లో ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు.

చివరి చూపునకూ నోచుకోకపోతిమి బిడ్డా..

- స్వగ్రామంలో స్వాతి అంత్యక్రియలు
- రాత్రి 10.30 గంటలకు స్వగ్రామం చేరుకున్న మృతదేహం
- శరీరభాగాల మూట విప్పకుండానే చితికి నిప్పంటించిన తండ్రి



ప్రతాప సింగారం మూసీ కాలువలో గాలిస్తున్న డీఆర్ఎఫ్ సిబ్బంది

అనంతగిరి/మేడిపల్లి: భర్త చేతిలో కిరాతకంగా హత్యకు గురైన ఐదు నెలల గర్భిణి స్వాతి అంత్యక్రియలను సోమవారం రాత్రి స్వగ్రామంలో నిర్వహించారు. రాత్రి 10:30 గంటలకు అంబులెన్స్‌లో హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చేరుకున్న స్వాతి మృతదేహాన్ని (శరీరభాగాల మూట) నేరుగా గ్రామంలోని శ్మశానవాటికకు తరలించారు. ఆ మూటను విప్పకుండా అలాగే చితిపై పెట్టి నిప్పంటించారు. తండ్రి రాములు కూతురుకు తలకొరివి పెట్టారు. చివరి చూపునకు కూడా నోచుకోలేకపోతిమి బిడ్డా.. అంటూ కుటుంబ సభ్యులు చేసిన రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి. భారీ పోలీసు బందోబస్తు మధ్య స్వాతి అంత్యక్రియల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా నిందితుడు మహేందర్‌రెడ్డి తరపు వారెవరూ శ్మశానవాటిక వద్దకు రాలేదు.

నిందితుడి ఇంటి వద్ద మృతురాలి బంధువుల ఆందోళన

వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన మహేందర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన స్వాతిని కులాంతర ప్రేమ వివాహం చేసుకుని, అనుమానంతో హత్య చేసిన విషయం తెలిసిందే. దీంతో నిందితుడి తల్లిదండ్రులు ఆదివారమే ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. కాగా, స్వాతి అంత్యక్రియలను మహేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆమె బంధువులు నిందితుడి ఇంటి ఎదుట టెంట్ వేసుకుని ఆందోళన చేపట్టారు. అయితే ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భయాందోళనలో ఉన్న నిందితుడి తల్లిదండ్రులు గ్రామానికి వచ్చేందుకు భయపడటంతో గ్రామ పెద్దలు కల్పించుకుని స్వాతి తల్లిదండ్రులను శాంతింపజేసి.. అంత్యక్రియలు నిర్వహించేలా ఒప్పించారు.

స్వాతి శరీర భాగాలకోసం కొనసాగుతున్న గాలింపు

మరో పక్క బోడుప్పల్ ఈస్ట్ బాలాజీహిల్స్ కాలనీలో జరిగిన స్వాతి హత్యకేసులో శరీర భాగాల కోసం ప్రతాపసింగారం మూసీకాలువలో రెండో రోజు సోమవారం కూడా డీఆర్ఎఫ్ బృందాలు బోట్లతో గాలింపు కొనసాగించాయి. సుమారు 10 కిలోమీటర్ల మేర వెతికినా మృతురాలి శరీర భాగాలు దొరకలేదని మేడిపల్లి పోలీసులు తెలిపారు.

8 గంటలు.. 4 ఆస్పత్రులు..

- అప్పుల బాధతో పురుగు మందు తాగిన రైతు
- పడకలు ఖాళీ లేవనే నెపంతో తిప్పి పంపిన ప్రభుత్వ ఆస్పత్రులు
- చివరికి గాంధీలో చికిత్స పొందుతూ మృతి
- సమయానికి వైద్యం అందక ప్రాణం పోయిందని బంధువుల ఆరోపణ



రవినాయక్

జడ్చర్ల: అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగిన ఓ రైతుకు సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయాడు. పడకలు ఖాళీగా లేవనే నెపంతో వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల సిబ్బంది బాధితుడికి వైద్యం చేయకుండా ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేశారు. దీంతో ఎనిమిది గంటల పాటు 150 కిలోమీటర్ల మేర నాలుగు ఆస్పత్రులకు తిరిగినా ప్రాణాలు దక్కలేదు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. ఈర్లపల్లి తండాకు చెందిన ఇస్లావత్ రవినాయక్ (40)కు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కాగా.. గతేడాది దాదాపు రూ.4 లక్షల మేర అప్పు చేసి రెండు బోర్లు వేయడంతో పాటు పత్తి పంట సాగుచేశాడు. సరైన దిగుబడి రాకపోవడంతో అప్పులు తీర్చే మార్గం కనిపించలేదు. దీంతో మనస్తాపం చెందిన రవినాయక్ సోమవారం ఉదయం 9 గంటల సమయంలో తన పొలంలో పురుగు మందు తాగాడు. ఇది గమనించిన చుట్టుపక్కల రైతులు, కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను జడ్చర్ల ప్రభుత్వ ఆస్పతికి తీసుకెళ్లారు. అయితే పరిస్థితి విషమంగా ఉందని, జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లమని వైద్యులు సూచించారు. దీంతో ఉదయం 11 గంటల సమయంలో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. బెడ్లు ఖాళీగా లేవని, ప్రైవేట్ ఆస్పత్రి లేదా.. హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు సూచించారు. దీంతో వారు అక్కడి నుంచి మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో నిమ్స్‌కు చేరుకున్నారు. దాదాపు రెండు గంటల పాటు ఆలస్యం చేసి, అక్కడ కూడా పడకలు ఖాళీగా లేవని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని నిమ్స్ వైద్యులు సూచించారు. చేసేది లేక వారు గాంధీ ఆస్పత్రికి తరలించగా, సాయంత్రం 5 గంటల సమయంలో వైద్య చికిత్స ప్రారంభించారు. పరిస్థితి విషమించడంతో రవినాయక్ సాయంత్రం 5.30 గంటల సమయంలో మృతిచెందాడు. పడకలు ఖాళీగా లేవనే సాకుతో వైద్యం చేయకుండా ఆలస్యం చేశారని, అందుకే ప్రాణం పోయిందని మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు మృతుడి సోదరుడు వెంకటేశ్ తెలిపారు.

కేంద్రం నుంచి యూరియా వచ్చేదాకా పోరు

- విదేశాల నుంచి యూరియా తెప్పించడంలో మోదీ సర్కారు విఫలం
- 9.8 లక్షల మెట్రిక్ టన్నులకుగాను ఈ నెల వరకు కేంద్రం ఇచ్చింది 5.72 ఎల్ఎంటీనే
- రైతులకు బహిరంగ లేఖలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: కేంద్రం నుంచి యూరియా వచ్చేంత వరకు పోరాటం సాగిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తేల్చిచెప్పారు. విదేశాల నుంచి రావాల్సిన 3.96 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాకుగాను కేవలం 2.10 ఎంఎల్‌టీనే వచ్చిందని.. విదేశీ యూరియాను తెప్పించడంలో మోదీ సర్కారు విఫలమైందని ఆరోపించారు. దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియాను కూడా కేంద్రం సరిగ్గా ఇవ్వలేదని దుయ్యబట్టారు. అందుకే రైతులు యూరియా కోసం బారులు తీరాల్సిన పరిస్థితి ఉత్పన్నమైందన్నారు. అయినప్పటికీ విపక్ష బీజేపీ, బీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి కోసం కుటిల యత్నాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆయన సోమవారం రాష్ట్ర రైతాంగానికి బహిరంగ లేఖ రా శారు. రాష్ట్రంలోనే రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ ఉన్నప్పటికీ.. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి అతితక్కువ కేటాయింపులు జరిపిందని ఆక్షేపించారు. ఆర్ఎఫ్‌సీఎల్‌లో 78 రోజులపాటు ఉత్పత్తి జరగక 62 వేల టన్నుల మేర కోత పెట్టారన్నారు. రాష్ట్రానికి కేంద్రం ఈ ఖరీఫ్ సీజన్‌కు 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తే ఈ నెల వరకు 8.30 లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉండగా 5.72 ఎల్ఎంటీ యూరియానే సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. మరో 2.58 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

అవన్నీ విపక్షాల ప్రేరేపిత ఆందోళనలే : దేశానికి అవసరమైన యూరియాలో ఒక్క చైనా నుంచే 7 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి అవుతుందని తుమ్మల పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని కొరత తెలంగాణలోనే ఎలా ఉంటుందని ప్రశ్నిస్తున్న బీజేపీ నేతలు.. ఆ పార్టీపాలిత మధ్యప్రదేశ్, యూపీ లాంటి రాష్ట్రాల్లోనూ యూరియా కొరత ఉందనే విషయం దాస్తున్నారని అన్నారు. రైతుల ముసుగులో బీఆర్ఎస్ ప్రేరేపిత ఆందోళనలు జరుగుతున్నాయని తుమ్మల ఆరోపించారు. సొసైటీ కార్యాలయాల వద్ద చెప్పులు క్యూలలో పెట్టించడం, పుట్టినరోజు వేడుకల పేరుతో యూరియా బస్తాలను బహుమతిగా ఇచ్చినట్లు చూపడం.. సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేయడం ద్వారా ప్రభుత్వాన్ని బద్నాం చేసే దిగజారుడు రాజకీయాలకు బీఆర్ఎస్ పాల్పడుతోందని దుయ్యబట్టారు.

గగనసింహాలకు బై బై!

ఆరుదశాబ్దాలు అద్వితీయ సేవలు అందించిన మిగ్‌-21 యుద్ధవిమానాలు

- చివరిసారిగా దిగ్గజ లోహవిహంగాలతో వైమానిక విన్యాసాలు చేసిన ఫైటర్‌జెట్‌ పైలట్లు
- వచ్చే నెలలో మిగ్‌ సేవలకు గౌరవప్రదంగా పరిసమాప్తి పలకనున్న వాయుసేన

బికనీర్‌: దశాబ్దాలపాటు భారత గగనతలాన్ని శత్రుదుర్భేద్యంగా మార్చి కంటికి రెప్పలా కాపాడిన మిగ్‌-21 రకం యుద్ధవిమానాలు ఇక శాశ్వత విశ్రాంతి తీసుకునే సమయం ఆసన్నమైంది. ఈ నేపథ్యంలో చివరిసారిగా వీటిని ఫైటర్‌జెట్‌ పైలట్లు తమ విధి నిర్వహణ కోసం వినియోగించుకున్నారు. సోమవారం రాజస్తాన్‌లోని బికనీర్‌లో ఉన్న నాల్‌ ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్‌ గగనతలంపై వైమానిక విన్యాసాలు పూర్తిచేశారు. వీటికి వీడ్కోలు సూచికగా ఇప్పటికే ఎయిర్‌ చీఫ్‌ మార్షల్‌ అమర్‌ప్రీత్‌ సింగ్‌ ఒక్కరే మిగ్‌-21ను నడిపి అలా గగనవీధిలో చక్కర్లు కొట్టివచ్చారు. ఏకంగా 62 సంవత్సరాలపాటు సేవలందించిన దిగ్గజ వాయుసేన విమానాలకు గౌరవప్రదంగా వీడ్కోలు పలికేందుకు భారత వాయుసేన సిద్ధమైంది. 23వ పాంథర్‌ స్క్వాడ్రన్‌ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొని తమ విధుల నుంచి రిటైర్‌కానుంది. సెప్టెంబర్‌ 26న చండీగఢ్‌లో భావోద్వేగ వీడ్కోలు కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో మిగ్‌-21 యుద్ధవిమానాల ప్రస్థానంలోని కొన్ని ముఖ్య ఘట్టాలపై ఓసారి విహంగవీక్షణం చేద్దాం..

1960 దశకంలో భారత్‌కు ఆగమనం..

1963లో తొలిసారిగా రష్యా నుంచి భారత్‌ వీటిని కొనుగోలుచేసింది. తొలినాళ్లలో యుద్ధాల్లో విజయాలకు బాటలువేస్తూ మిగ్‌-21 విమానాలు తమకు ఏవీ సాటిలేవని నిరూపించుకున్నాయి. దాదాపు 870కిపైగా మిగ్‌ విమానాలు వాయుసేనలో వివిధ దశల్లో తమ అమూల్యమైన సేవలు అందించాయి. భారత వాయుసేనలో చేరిన తొలి సూపర్‌సోనిక్‌ ఫైటర్‌జెట్‌లుగా మిగ్‌-21ను చెప్పొచ్చు. గాల్లో చురుగ్గా కదలడం, అత్యధిక వేగాన్ని అందుకోవడం దీని ప్రత్యేకత. మిగ్‌-21 యుద్ధ విమానాలు అనేక ఆపరేషన్లలో కీలక పాత్ర పోషించాయి. 1965, 1971 యుద్ధాల్లో భారత చిరస్మరణీయ విజయాల వెనుక మిగ్‌ విమానాల కీలకపాత్ర ఉంది.

అసమాన రికార్డ్‌

మిగ్‌-21 రకం విమానాలు భారత్‌లోనేకాదు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో కీలక వైమానిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నాయి. విశ్వవ్యాప్తంగా అత్యధికంగా ఉత్పత్తయిన యుద్ధవిమానాల్లో ఒకటిగానూ ఇది రికార్డ్‌ సృష్టించింది. ఇప్పటిదాకా 60కిపైగా దేశాల్లో ఏకంగా 11,000 మిగ్‌లను తయారుచేశారు. ఇది సెకన్‌కు 250 మీటర్‌ల వేగంతో నిట్టనిలువుగా కూడా ప్రయాణించి శత్రు దేశాలను భయభ్రాంతులకు గురి చేయగలదు.

గవర్నర్‌ భవనంపై భీకర దాడి

1971లో బంగ్లాదేశ్‌ విముక్తి పోరాటంలో పాకిస్తాన్‌ సేనలపై భారత్‌ మిగ్‌-21 యుద్ధవిమానాలు విరుచుకుపడిన తీరు ఎవరూ మర్చిపోరు. ముఖ్యంగా ఆనాడు డిసెంబర్‌ 13వ తేదీన ఢాకాలోని గవర్నర్‌ అధికార భవనంపై మిగ్‌-21 బాంబులతో దాడిచేసింది. దెబ్బకు జడుసుకున్న గవర్నర్‌ మరుసటి రోజే పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత రోజే 93,000 మంది పాక్‌ సైనికులు భారత సైన్యం ఎదుట లొంగిపోయారు. 1999లోనూ కార్గిల్‌ యుద్ధంలో మిగ్‌లు సత్తా చాటాయి. ఆపరేషన్‌ సఫేద్‌సాగర్‌లో భాగంగా ఆనాడు పాకిస్తానీ అట్లాంటిక్‌ విమానాన్ని మిగ్‌ ఒక్క దెబ్బతో నేలమట్టంచేసింది. అత్యంత శక్తివంతమైన ఎఫ్‌-16ను సైతం నేలకూల్చి 2019 ఏడాదిలో మిగ్‌ పత్రికల పతాక శీర్షికలకెక్కింది. మిగ్‌-21 పాతబడినాసరే అందులోని కొన్ని సాంకేతికతలు అత్యంత అధునాతనమైనవి. కంటికి కనిపించని సుదూర లక్ష్యాలపైనా దాడి చేసేలా రాడార్‌, తదితర సాంకేతికతలు దీని సొంతం.


రాజస్తాన్‌లోని బికనేర్‌ ఎయిర్‌ ఫోర్స్‌ స్టేషన్‌లో ల్యాండవుతున్న మిగ్‌-21


మిగ్‌ను స్వయంగా నడుపుతున్న ఎయిర్‌ చీఫ్‌ మార్షల్‌ అమర్‌ప్రీత్‌ సింగ్‌

ఎగిరే శవపేటికలుగా అపకీర్తి

తొలినాళ్లలో విజయ చిహ్నాలు గా చెలరేగిపోయిన ఈ విమానాలు కాలం గడిచేకొద్దీ పాతబడిపోయి ప్రాణాంతకంగా తయారయ్యాయి. కాలం చెల్లిన మిగ్‌లను ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారనే విమర్శలూ ఎక్కువయ్యాయి. సుఖోయ్‌, రఫేల్‌, తేజస్‌ వంటి యుద్ధ విమానాల రాకతో వీటి అవసరం సైతం తగ్గిపోయిందని వైమానిక రంగ నిపుణులు అభిప్రాయపడు తున్నారు. భారత వాయుసేన ఆధ్వర్యంలోని 872 మిగ్‌ విమానాల్లో 482 పలు ప్రమాదాల్లో నేలకూలాయని పుష్కరకాలం క్రితం నాటి రక్షణమంత్రి ఏకే ఆంటోని పార్లమెంట్‌లో చెప్పారు. భారత వాయుసే నలో అత్యధికంగా కూలిపో యిన యుద్ధవిమానాలుగా ఇవి అపకీర్తిని మూటగట్టుకున్నాయి. 1963లో తొలిసారిగా ఎక్కడైతే భారత వాయుసేనలోకి వీటిని తీసుకుని జాతికి అంకితం చేశారో అదే వైమానిక స్థావరంలో వీటికి తుది వీడ్కోలు పలకనున్నారు.

పాడ్‌కాస్ట్‌లు/ షోల్లో క్షమాపణలు చెప్పండి

- సోషల్‌ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు సుప్రీం ఆదేశం
- వాణిజ్య, నిషిద్ధ ప్రసంగాలకు ప్రాథమిక హక్కులు వర్తించవని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: వాణిజ్య, నిషేధిత ప్రసంగాలు ప్రాథమిక హక్కుల కిందికి రావని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'ఇండియాస్‌ గాట్‌ టాలెంట్‌'హోస్ట్‌ సమయ్‌ రైనా సహా ఐదుగురు సోషల్‌ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు తమ పాడ్‌కాస్ట్‌లు, షోల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆదేశించింది. దివ్యాంగులు, అరుదైన జన్యు సంబంధ రుగ్మతలతో బాధపడేవారిని ఎగతాళి చేయడం తగదని జస్టిస్‌ సూర్య కాంత్‌, జస్టిస్‌ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం వారికి హితవు పలికింది.నేరం కంటే పశ్చాత్తాపం స్థాయి ఎక్కువగా కనిపించాలని సూచించింది. తదుపరి విచారణ సమయంలో ఇన్‌ఫ్లుయెన్సర్లకు జరిమానా విధించే అంశం పరిశీలిస్తామని ధర్మాసనం పేర్కొంది. 'ఇది ధిక్కారాన్ని ప్రక్షాళన చేయడం వంటిదే'అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎంత జరిమానా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారో కోర్టుకు తెలియజేయాలని ఇన్‌ఫ్లుయెన్సర్లను కోరింది. వారు చెల్లించే మొత్తాన్ని వెన్నెముక కండరాల క్షీణత (ఎస్‌ఎంఏ) వంటి అరుదైన జన్యుపరమైన రుగ్మతలతో బాధపడుతున్న వారి చికిత్సకు ఉపయోగించుకోవచ్చంది. అంధులు, ఎస్‌ఎంఏ వంటి బాధితులను ఉద్దేశిస్తూ సమయ్‌ రైనా సహా ఐదుగురు హేళనగా మాట్లాడినట్లు ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. వీరిలో సోనాలీ థక్కర్‌ అలియాస్‌ సోనాలీ ఆదిత్య మినహా మిగతా నలుగురూ కోర్టులో హాజరయ్యారు. వివిధ వర్గాల వారిని ఉద్దేశించి కామెడీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. సోషల్‌ మీడియాలో వచ్చే కంటెంట్‌ను నియంత్రించేందుకు సంబంధిత అన్ని వర్గాలతో సంప్రదించి తగు నిబంధనలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన అటార్నీ జనరల్‌ వెంకటరమణికి ధర్మాసనం తెలిపింది.

భారం పెరిగినా భరిస్తాం కానీ...

స్వప్రయోజనాలను పణంగా పెట్టం

అమెరికా 50% టారిఫ్‌లపై మోదీ స్పష్టీకరణ ● 'ఆర్థిక' సమస్యకు పరిష్కారం కనుగొంటామని హామీ

అహ్మదాబాద్‌: అధిక పన్నుల భారం మోపినా భరిస్తాంగానీ దేశ స్వప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధాని మోదీ తెగేసి చెప్పారు. భారతీయ ఉత్పత్తులపై ఆగస్ట్‌ 27వ తేదీ నుంచి అమెరికా మోపిన 50 శాతం దిగుమతి టారిఫ్‌ భారంగా మారనున్న నేపథ్యంలో ప్రధాని స్పందించారు. సోమవారం సొంతరాష్ట్రంలో పర్యటన ఆరంభించినప్రధాని మోదీ రూ.5,477 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు. తొలుత రెండు కిలోమీటర్ల మేర రోడ్‌షో నిర్వహించారు. తర్వాత అహ్మదాబాద్‌లోని నికోల్‌ ప్రాంతంలో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రసంగించారు. '' రైతులు, పశుపోషకులు, చిన్నతరహా పరిశ్రమల ప్రయోజనాలే భారత్‌కు ముఖ్యం. అదనపు టారిఫ్‌ల పేరిట మాపై పెనుభారం మోపినా భరిస్తాం. అంతేగానీ స్వప్రయోజనాలను పణంగా పెట్టబోం'' అని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ పేరును నేరుగా ప్రస్తావించనప్పటికీ భారత్‌పై విదేశీ ప్రభావాన్ని మోదీ ప్రధానంగా గుర్తు చేశారు. '' ప్రపంచ దేశాల్లో నేడు రాజకీయాలు పూర్తిగా ఆర్థిక ప్రయోజనాల చుట్టూతా తిరుగుతున్నాయి. అయినా సరే నేను మహాత్మా గాంధీజీ చూపిన స్వదేశీ వస్తువులకు పట్టం కట్టాలనే బాటలోనే పయనిస్తున్నా. అందుకే చిన్నపరిశ్రమలు, కర్షకులు, పశుపోష కులకు నేనొక్కటే చెప్పదల్చు కున్నా. మీ ప్రయోజ నాలే నాకు సర్వోన్నతం. మీ ప్రయోజనాల విష యంలో మా ప్రభుత్వం ఏమాత్రం పట్టు సడలించదు. మాపై ఎంతటి ఒత్తిడి పడినా సరే మేం భరిస్తాం. మీ ప్రయో జనాలకు భంగం కల్గకుండా చూసుకుంటాం'' అని మోదీ అన్నారు.



చక్రధారి, చరఖాధారి బాటలో..

''దుష్టశిక్షణ, శిష్టరక్షణ, శక్తిసామర్థ్యాలకు, పరిరక్షణకు మారుపేరైన సుదర్శన చక్రధారి అయిన మోహన్‌ కృష్ణ భగవానుడు, చరఖాధారి అయిన మోహన్‌ మహాత్మా గాంధీ చూపిన అడుగుజాడల్లో భారత్‌ పయనిస్తోంది. నూలు వడికే రాట్నం చక్రంతో గాంధీజీ స్వాతంత్రోద్యమాన్ని ఉరకలెత్తించారు. పహల్గాంలో ఉగ్ర ముష్కరుల పాశవిక దాడికి దీటుగా బదులిస్తూ భారత సైనికుల తెగువ, ధైర్య సాహసాలకు దర్పణమే ఆపరేషన్‌ సిందూర్‌'' అని మోదీ అన్నారు.

కాంగ్రెస్‌పై విమర్శల జడి

''60 నుంచి 65 ఏళ్లపాటు భారత్‌ను పాలించిన కాంగ్రెస్‌ కూడా 'దిగుమతి స్కామ్‌'లకు పాల్పడి భారత్‌ను పరాయి దేశాలపై సరుకుల కోసం ఆధారపడేలా మార్చేసింది. పరాధీనంగా మార్చేసి బాపూజీ కీలక ఉపదేశమైన స్వదేశీ మంత్రాన్ని కాంగ్రెస్‌ మంటగల్పింది. గాంధీజీ పేరు చెప్పుకుని తిరిగే కాంగ్రెస్‌ పెద్దలు ఆయన సూచించిన స్వచ్ఛత, స్వదేశీ పదాలను గాలికొదిలేశారు'' అని మోదీ విమర్శించారు.

టారిఫ్‌ల మోత వేళ నేడు కీలక భేటీ

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌పై దండయాత్రకు దిగిన రష్యాను ఏమాత్రం నిలువరించట్లేదని ఆరోపిస్తూ భారత్‌పై పన్నుల మోత మోగించిన ట్రంప్‌ సర్కార్‌ విధించిన ఆగస్ట్‌ 27 గడువు ముగుస్తుండటంతో ప్రధానమంత్రి కార్యాలయం నేడు కీలక సమీక్ష సమావేశం నిర్వహించనుంది. ప్రధానమంత్రి ప్రధానకార్యదర్శి సారథ్యంలో ఈ సమీక్ష సమావేశం జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. భారత్‌పై అమెరికా ప్రభుత్వం తాజాగా విధించిన 50 శాతం దిగుమతి టారిఫ్‌ ఆగస్ట్‌ 27వ తేదీ నుంచి అమల్లోకిరానుంది. ఈ నేపథ్యంలో ఆయా ఎగుమతి సంస్థల లాభాల్లో కోత పడడం, ఆక్వారంగం, లెదర్‌, వజ్రాభరణాల ఉత్పత్తుల ఎగుమతిపై టారిఫ్‌ ప్రతికూల ప్రభావం వంటి కీలక అంశాలపై ఆయా రంగాల ప్రతినిధులు, సంస్థలతో ప్రధాని కార్యాలయం సమాలోచనలు జరపనుందని తెలుస్తోంది. ఇప్పటికే అమెరికాకు తమ ఉత్పత్తులను ఎగుమతిచేసే సంస్థలతో, ఎగుమతి రంగ నిపుణులతో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సంప్రదింపులు మొదలెట్టింది. అమల్లోకి వచ్చిన 25 శాతం టారిఫ్‌ కారణంగా తమ లాభాలు పూర్తిగా తగ్గిపోయాయని, నష్టభయాలను ఎదుర్కొంటున్నామని పలువురు కేంద్ర మంత్రిత్వశాఖ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలుస్తోంది. 50 శాతం టారిఫ్‌ అమల్లోకి రావడంతో తక్షణం ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనే వర్గాలను ఆదుకోవాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని సమాచారం. ఎగుమతిదారులు మాత్రం అత్యయిక రుణపరపతి పథకం ద్వారా మూలధనాన్ని అందించాలని, తద్వారా తమను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపినట్లు తెలుస్తోంది. అయితే రంగాలవారీగా ఆదుకుంటేనే దీర్ఘకాలిక ప్రయోజనాలు దక్కుతాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.

గాజా ఆస్పత్రిపై క్షిపణి దాడి

ఐదుగురు జర్నలిస్టులు సహా 20 మంది మృతి

మృతుల్లో అసోసియేటెడ్‌ ప్రెస్‌ జర్నలిస్ట్‌ మరియం దగ్గా

దెయిర్‌ అల్‌-బలాహ్‌: గాజా దక్షిణ ప్రాంతం ఖాన్‌యూనిస్‌లోని నాస్సెర్‌ ఆస్పత్రిపై ఇజ్రాయెల్‌ ఆర్మీ సోమవారం భీకర దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో అసోసియేటెడ్‌ ప్రెస్‌(ఏపీ)తరఫున ఫ్రీలాన్సర్‌గా పనిచేసే మరియం దగ్గా(33) సహా ఐదుగురు జర్నలిస్టులతోపాటు కనీసం 20 మంది చనిపోయారు. పెద్ద సంఖ్యలో ఆస్పత్రి సిబ్బంది, పౌరులుక్షతగాత్రులుగా మిగిలారు. గాజాలోని హమాస్‌ లక్ష్యంగా ఇజ్రాయెల్‌ దాడులు మొదలైనప్పటి నుంచి మరియం యూకే పత్రిక ఇండిపెండెంట్‌ అరబిక్‌ వెర్షన్‌ అయిన ఇండిపెండెంట్‌ అరబిక్‌ వంటి వార్తా సంస్థల తరఫున కూడా పనిచేశారు. ఆమె ప్రధానంగా నాస్సెర్‌ ఆస్పత్రి కేంద్రంగా విధులు కొనసాగిస్తున్నారు. ఆమె మరణంపై ఏపీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మరియం ఇటీవలే నాస్సెర్‌ ఆస్పత్రిలో పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులను కాపాడేందుకు వైద్యులు చేస్తున్న కృషిపై కథనం వెలువరించారు. యుద్ధం ప్రారంభం కాకమునుపే తన 12 ఏళ్ల కుమారుడిని గాజా నుంచి వేరే ప్రాంతానికి పంపించారు. నాస్సెర్‌ ఆస్పత్రిపై జరిగిన దాడిలో మహ్మద్‌ సలాం అనే జర్నలిస్ట్‌ కూడా చనిపోయారని అల్‌జజీరా ధ్రువీకరించింది. దాడిలో తమ కాంట్రాక్ట్‌ కెమెరామన్‌ హుస్సం అల్‌-మస్రి మృతిచెందగా కాంట్రాక్ట్‌ ఫొటోగ్రాఫర్‌ హతెమ్‌ ఖలీద్‌ గాయపడ్డారని రాయిటర్స్‌ వెల్లడించింది. ప్రాణాలు కోల్పోయిన మరో జర్నలిస్ట్‌ మోత్‌ అబూ తహా కూడా ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. 22 నెలలుగా గాజాపై ఇజ్రాయెల్‌ సాగిస్తున్న దాడుల్లో 192 మంది జర్నలిస్టులు చనిపోగా, రష్యా-ఉక్రెయిన్‌ యుద్ధంలో 18 మంది జర్నలిస్టులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికాకు చెందిన కమిటీ టూ ప్రొటెక్ట్‌ జర్నలిస్ట్‌(సీపీజే)తెలిపింది. గాజా స్ట్రిప్‌లో హమాస్‌తో జరుగుతున్న పోరుపై అంతర్జాతీయ మీడియా కవరేజీని ఇజ్రాయెల్‌ నిషేధించింది. దీంతో, ప్రముఖ వార్తాసంస్థలన్నీ గాజా లోని పాలస్తీనా జర్నలిస్టులు, ప్రత్యక్ష సాక్షుల కథనాల ఆధారంగానే అక్కడి పరిణామాలను బయటి ప్రపంచానికి తెలియజేస్తున్నాయి. తాజా ఘటనను పాలస్తీనా జర్నలిస్టుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఇది అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించింది. జర్నలిస్టులే లక్ష్యంగా ఇజ్రాయెల్‌ ఆర్మీ ఈ దాడికి తెగబడిందని అల్‌జ జీరా మండిపడింది. జెనీవా ఒప్పందానికి తూట్లు పొడుస్తోందని ఆరోపించింది. ఇలాంటి దృశ్యాలు గాజాలో ప్రతిరోజూ కనిపించేవేనని ఐరాస ప్రతి నిధి ఫ్రాన్సెస్కా అల్బనీస్‌ ఆవేదన వ్యక్తం చేశారు.


మరియం దగ్గా(ఫైల్‌)
(ఇన్‌సెట్‌)రక్తంతో తడిచిన ఆమె కెమెరా

సోమవారం జరిగిందిదే..

నాస్సెర్‌ ఆస్పత్రి భవన సముదాయంలోని నాలుగో అంతస్తుపై ముందుగా ఇజ్రాయెల్‌ ఆర్మీ క్షిపణిని ప్రయోగించింది. భవనం తీవ్రంగా దెబ్బతినడం ఒక్కసారిగా జనం హాహాకారాలు చేయడంతో ఎమర్జెన్సీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, మీడియా సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆ వెంటనే అక్కడే మరోసారి ఇజ్రాయెల్‌ మరో క్షిపణిని ప్రయోగించింది. ఆస్పత్రి బాల్కనీలో జర్నలిస్టులుండే ప్రాంతంపైనే సరిగ్గా ఈ దాడి జరిగిందని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. ఘటనలో తమ పౌర సహాయకుడొకరు చనిపోయారని గాజా సివిల్‌ డిఫెన్స్‌ ఆర్గనైజేషన్‌ ప్రకటించింది. ఘటనపై సాధ్యమైనంత త్వరగా దర్యాప్తు చేపడతామని ఇజ్రాయెల్‌ ఆర్మీ తెలిపింది. ఏ లక్ష్యంతో ఆస్పత్రిపై దాడి జరిగిందన్నది మాత్రం వెల్లడించలేదు. రెండు వారాల క్రితం గాజా నగరంపై జరిగిన ఇజ్రాయెల్‌ ఆర్మీ దాడిలో అల్‌జజీరాకు చెందిన అన్వాస్‌ అల్‌ షరీఫ్‌ సహా పలువురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. హమాస్‌ రాకెట్‌ విభాగానికి అల్‌ షరీఫే నాయకుడని ఇజ్రాయెల్‌ ఆరోపించింది.

ప్రధాని మోదీ డిగ్రీపై సీఐసీ ఉత్తర్వులు కొట్టివేత

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బ్యాచిలర్‌ డిగ్రీ వివరాలను వెల్లడించాలంటూ సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్‌(సీఐసీ) ఇచ్చిన ఉత్తర్వులను ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. ఆ వివరాలు వ్యక్తిగతమని, ఇందులో ఎలాంటి ప్రజోపయోగం లేదని పేర్కొంది. సీఐసీ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్‌ చేస్తూ ఢిల్లీ యూనివర్సిటీ వేసిన పిటిషన్‌పై ఫిబ్రవరి 27వ తేదీన వాదనలు ముగించిన జస్టిస్‌ సచిన్‌ దత్తా సోమవారం తీర్పు వెలువరించారు. ప్రజా ప్రయోజనం, ప్రజలకు ఆసక్తి అనే రెండు అంశాల మధ్య చాలా వ్యత్యాసముందని ఆయన వ్యాఖ్యానించారు. ఏదైనా ప్రభుత్వ పదవి లేదా అధికారిక బాధ్యతలను నిర్వర్తించడానికి విద్యార్హతలు అవసరమని చట్టాలు చెప్పడం లేదన్నారు. కోరిన సమాచారం ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తికి సంబంధించినదే అయినప్పటికీ వ్యక్తిగత గోప్యత హక్కును తోసిపుచ్చలేమని తీర్పులో పేర్కొన్నారు.

సమాచార హక్కు చట్టం ప్రభుత్వ పనితీరు పారదర్శకంగా చేయాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిందే తప్ప సంచలనాల కోసం వాడుకోరాదని వ్యాఖ్యానించారు. పొందిన మార్కులు, గ్రేడ్లు, ఆన్సర్‌ షీట్లు తదితరాలు వ్యక్తిగత సమాచారం కిందికి వస్తాయని, ఆర్‌టీఐ చట్టంలోని సెక్షన్‌ 8(1) ప్రకారం వీటికి రక్షణ ఉంటుందని ఆ తీర్పులో వివరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్‌ జనరల్‌ తుషార్‌ మెహతా.. ప్రధాని మోదీ 1978లో పొందిన డిగ్రీకి సంబంధించిన రికార్డులను న్యాయస్థానానికి చూపేందుకు ఢిల్లీ యూనివర్సిటీకి ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. 1978లో ప్రధాని మోదీతోపాటు బీఏ పరీక్ష పాసైన వారందరి వివరాలను అందించాలంటూ నీరజ్‌ అనే వ్యక్తి చేసుకున్న దరఖాస్తుపై 2016 డిసెంబర్‌ 21వ తేదీన సీఐసీ అనుమతి మంజూరు చేశారు. దీనిపై ఢిల్లీ యూనివర్సిటీ వేసిన పిటిష న్‌పై 2017 జనవరి 23న ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది.

బందీల విడుదలే..

యుద్ధానికి ముగింపు!

వ్యూహం మార్చిన ఇజ్రాయెల్‌ ప్రధాని నెతన్యాహూ

జెరూసలేం: గాజాలో కాల్పుల విరమణకు ఖతార్‌, ఈజిప్టు మధ్యవర్తిత్వంలో వచ్చిన ప్రతిపాదనకు హమాస్‌ అంగీకారం తెలిపినా ఇజ్రాయెల్‌ ప్రధానమంత్రి బెంజమిన్‌ నెతన్యాహూ ఇప్పటి వరకు స్పందించలేదు. అయితే, ఆయన తాజాగా తన వ్యూహాన్ని మార్చుకున్నట్లు కనిపిస్తోంది. హమాస్‌ చెరలో ఉన్న బందీలందరి విడుదలతోపాటు యుద్ధానికి ముగింపు పలికేలా హమాస్‌తో తక్షణమే చర్చలు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినట్లు గురువారం ప్రకటించారు. దీనిపై మధ్యవర్తులు, బందీల కుటుంబాలతోపాటు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. హమాస్‌ ఓటమే లక్ష్యంగా గాజా నగరాన్ని మొత్తం మిలటరీతో నింపేసి, చర్చల్లో పాల్గొనాలన్న ద్విముఖ వ్యూహాన్ని ఆయన పక్కనబెట్టినట్లుగా విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, సగం మంది బందీలను విడుదల చేయడం, బదులుగా తాత్కాలిక కాల్పుల విరమణను ప్రకటించాలంటూ వచ్చిన ప్రతిపాదన విషయాన్ని ఆయన ప్రస్తావించలేదు. అదే సమయంలో, గాజా నగరాన్ని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా మరిన్ని బలగాలను తరలించాలన్న తాజా ప్రణాళికలనూ ఆయన తోసిపుచ్చలేదు. బందీల విడుదలకు బదులుగా హమాస్‌ వెసులుబాట్లు కోరుతుండటమే గాజా నగరంలో సైన్యాన్ని దించేందుకు ప్రేరేపించిందని ఇజ్రాయెల్‌ అధికార వర్గాలు అంటున్నాయి. బందీల విడుదల షరతుకు అంగీకరించేలా హమాస్‌పై ఒత్తిడి తేవడమే దీని వెనుక వ్యూహమని చెబుతున్నాయి.

పేలుడు పదార్థాన్ని నోట్లో కుక్కి ప్రియురాల్ని చంపేశాడు



మైసూరు: కర్నాటకలోని మైసూరు జిల్లాలో దారుణం వెలుగు చూసింది. సుమారు 20 ఏళ్లున్న ఓ వివాహితను ఆమె ప్రియుడు పేలుడు పదార్థాన్ని ఆమె నోట్లో కుక్కి పేల్చేశాడు. మహిళ మృతదేహం బెడ్‌పై పడి ఉండగా, ఆమె ముఖం దిగువ భాగం ఛిద్రమైనట్లుగా కనిపిస్తున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. అక్కడి ఫ్లోరంతా రక్తం ధారలుగా కనిపిస్తోంది. ఆమెను హున్సూర్‌ తాలుకా గెరసనహళ్లికి చెందిన రక్షితగా గుర్తించారు. భేరియా గ్రామంలోని ఓ లాడ్జిలో రక్షిత విగతజీవిగా కనిపించింది. ఆ లాడ్జి గదికి ప్రియుడు సిద్ధరాజుతో కలిసి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కేరళకు చెందిన రోజువారీ కూలీతో ఈమెకు వివాహమైంది. అయితే, రక్షిత తన బంధువైన సిద్ధరాజుతో అక్రమ సంబంధం కొనసాగిస్తోంది. లాడ్జిలో ఉండగా వీరిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ సమయంలోనే సిద్ధరాజు తన వద్ద ఉన్న పేలుడు రసాయనాన్ని ఆమె నోట్లో కుక్కి జిలెటిన్‌ స్టిక్స్‌తో పేల్చాడు. ఇలాంటి జిలెటిన్‌ స్టిక్స్‌ను క్వారీల్లో బండలను పేల్చేందుకు వాడుతుంటారని పోలీసులు తెలిపారు. సెల్‌ ఫోన్‌ పేలడంతోనే ఆమె చనిపోయిందంటూ అక్కడికి వచ్చిన వారితో సిద్ధరాజు కట్టుకథ చెప్పాడు. పారిపోయేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సాలిగ్రామ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఫిజీ అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ

ఏడు ఒప్పందాలపై సంతకాలు

న్యూఢిల్లీ: భారత్‌, ఫిజీలు సోమవారం రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని, శాంతియుత, సమ్మిళిత ఇండో-పసిఫిక్‌ కోసం పని చేయాలని నిర్ణయించుకున్నాయి. భారత పర్యటనలో ఉన్న ఫిజీ అధ్యక్షుడు సిటివెని రబుకా సోమవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తృతం చేసుకోవాలని అంగీకారానికి వచ్చారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన ఇరువురు నేతలు ఉగ్రవాదం ఏరూపంలో ఉన్నా సహించరాదని తీర్మానించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల అధికారులు వైద్యం, నైపుణ్యాభివృద్ధి, వాణిజ్యం వంటి తదితర రంగాల్లో సహకారానికి సంబంధించి ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

గోడ దూకి పారిపోయిన ఎమ్మెల్యే

- వెంటబడి మరీ పట్టుకున్న ఈడీ, సీఆర్‌పీఎఫ్‌ అధికారులు
- పశ్చిమబెంగాల్‌లో ఉపాధ్యాయుల నియామక స్కామ్‌లో కొనసాగిన ఈడీ సోదాలు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో ఉపాధ్యాయులు, సిబ్బంది నియామకాల కుంభకోణం కేసులో తృణమూల్‌ కాంగ్రెస్‌ ఎమ్మెల్యే జిబన్‌ కృష్ణ సాహాను ఈడీ అధికారులు అనూహ్యరీతిలో అరెస్ట్‌చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ అధికారులు తన ఇంట్లో, తనకు సంబంధించిన స్థలాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారన్న సమాచారంతో అప్పటికప్పుడు ఎమ్మెల్యే తన ఇంటి మొదటి అంతస్తు నుంచి కిందకు దూకి, తర్వాత ఎత్తయిన గోడ ఎక్కి బయటకు ఎలాగోలా దూకి పారిపోయారు. రెప్పపాటులో ఈ విషయం కనిపెట్టిన ఈడీ అధికారులు, సీఆర్‌పీఎఫ్‌ బలగాలు వెంటనే ఆయన వెంటబడిమరీ సమీప పొలంలో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆలోపే ఎమ్మెల్యే తన స్మార్ట్‌ఫోన్‌లను సమీపంలోని బురదకుంటలో పడేశారు. అయినాసరే పోలీసులు వాటిని వెలికితీసి స్వాధీనంచేసుకున్నారు. మొబైల్‌లో కీలక సమాచారం ఉందని భావిస్తున్నారు. బురదకొట్టుకుపోయిన ఎమ్మెల్యేను పొలం గట్టు వెంట పోలీసులు అరెస్ట్‌చేసి తీసుకొస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ముర్షీదాబాద్‌ జిల్లా కేంద్రంలో సోమవారం ఈ నాటకీయ పరిణామం జరిగింది. అరెస్ట్‌ తర్వాత సాహాను ఈడీ అధికారులు మనీలాండరింగ్‌ నిరోధక చట్ట ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ఆగస్ట్‌ 30వ తేదీదాకా ఈడీ రిమాండ్‌కు తరలిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులిచ్చింది. ఎమ్మెల్యే సాహా సంబంధ స్థలాలతోపాట రఘునాథ్‌గంజ్‌లోని సాహా కుటుంబసభ్యులు, బంధువులు, అనుచరుల నివాసాల్లోనూ ఈడీ సోదాలుచేసి కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనంచేసుకుంది. ఇదే టీచర్లు, స్టాఫ్‌ నియామక కేసులో 2023 ఏప్రిల్‌లో సాహాను సీబీఐ అధికారులు అరెస్ట్‌చేశారు. ఇటీవల ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే ఇదే కేసు విచారణలో భాగంగా ఆయనను ప్రశ్నించగా ఏమాత్రం సహకరించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో అరెస్ట్‌చేయాల్సి వచ్చిందని న్యాయస్థానంలో హాజరుపర్చిన సందర్భంగా ఈడీ వాదించింది. పశ్చిమబెంగాల్‌లో ప్రైమరీ టీచర్లతోపాటు 9, 10వ తరగతులు బోధించే అసిస్టెంట్‌ టీచర్లు, గ్రూప్‌-సి, డి సిబ్బంది నియామకాల్లో భారీ అవకతవకలు జరిగాయని సీబీఐ తొలుత కేసు నమోదుచేసింది. ఇందులోని వివరాలతో తర్వాత ఈడీ ఎఫ్‌ఐఆర్‌ నమోదుచేసి దర్యాప్తును మనీలాండరింగ్‌ కోణంలో విస్తృతస్థాయిలో దర్యాప్తుచేసింది. ఈ కుంభకోణంలో కీలకసూత్రధారిగా భావిస్తున్న నాటి విద్యాశాఖ మంత్రి పార్థ ఛటర్జీ, ఆయన సహాయకురాలు అర్పితా ముఖర్జీ, మాజీ టీఎంసీ ఎమ్మెల్యే మాణిక్‌ భట్టాచార్యలను కేంద్ర దర్యాప్తు సంస్థలు ఇప్పటికే అరెస్ట్‌చేశాయి.


ఎమ్మెల్యే సాహాను కోర్టుకు తీసుకొస్తున్న అధికారులు

వాక్‌స్వాతంత్ర్యంతో సభా గౌరవాన్ని తగ్గించరాదు

న్యూఢిల్లీ: శాసనసభల్లో వాక్‌ స్వాతంత్ర్యం, హక్కులు సభా గౌరవాన్ని దెబ్బతీసే స్వేచ్ఛగా భావించరాదని లోక్‌సభ స్పీకర్‌ ఓం బిర్లా పేర్కొన్నారు. సోమవారం ఆయన అఖిల భారత స్పీకర్ల సదస్సు ముగింపు సమావేశంలో ప్రసంగించారు. శాసనసభల గౌరవం క్రమేపీ తగ్గుతుండటంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని చట్టసభల సభ్యులు, రాజకీయ పార్టీలు సహా అందరూ ఆలోచించాలని ఓం బిర్లా కోరారు. సభల నిర్వహణలో చట్టసభల అధ్యక్షులు వివాదరహిత, స్వతంత్ర, న్యాయమైన వైఖరిని కలిగి ఉండాల్సిన అవసరముందన్నారు. చట్టసభల్లో ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం సహా ఏదైనా మాట్లాడే స్వేచ్ఛను రాజ్యాంగ నిర్మాతలు మనకు కల్పించారని, దీనివెనుక ఉన్న ఉద్దేశం దెబ్బతింటుండటం అందరికీ ఆందోళన కలిగిస్తోందని ఓం బిర్లా వ్యాఖ్యానించారు.



వచ్చే నెలలో 'అమృత్ భారత్'

తెలంగాణ వైపు తొలిసారిగా అమృత్‌భారత్ రైలు పరుగులు పెట్టనుంది. సెప్టెంబర్‌లో పట్టాలెక్కనుంది. ఉత్తరాది ప్రయాణం నిమిత్తం అందుబాటులోకి రానుంది.

-10లో



సీనియర్ సిటి'జెమ్స్'

కొందరు నగరవాసులు వయసును లెక్కచేయకుండా అన్నింటా మేము సైతం అన్నట్లు నేటి యువతకు చాలెంజ్ విసురుతున్నారు.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం

నగరంలో మంగళవారం పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో కాసింత ఉక్కపోతగా ఉంటుంది. గరిష్టంగా 31, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.



సోమవారం రాత్రి ఖైరతాబాద్ మహా గణపతి చెంత భక్తుల సెల్ఫీలు

నేత్రోనిలనంతో మహాశక్తి గణపతికి ప్రాణ ప్రతిష్ఠ



శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి విగ్రహానికి సోమవారం ఉదయం 10.30 గంటలకు కంటి పాపను అమర్చి ప్రాణ ప్రతిష్ఠ చేశారు శిల్పి చిన్నస్వామి రాజేంద్రన్. విగ్రహాన్ని పూర్తిగా మట్టితోనే చేశామని, ఈసారి మహాగణపతిని దర్శించుకునే భక్తులకు అన్ని విఘ్నాలు తొలగిపోవడంతో పాటు విశ్వశాంతి నెలకొనేందుకే విశ్వశాంతి మహా గణపతిగా నామకరణం చేసినట్లు విఠల్ శర్మ సిద్ధాంతి తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతికి సోమవారం సాయంత్రం ఆగమన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూలు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేకంగా మరాఠా బ్యాండ్ ప్రదర్శన ఆకట్టుకున్నాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు, తలపాగాలు ధరించి బ్యాండ్ వాయిస్తూ మహాగణపతి ఆగమనానికి స్వాగతం పలికారు. స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

- ఖైరతాబాద్



బ్యాండ్ మేళాలతో ఆగమన ఆనందం

ధరలు గణం



ఈసారి 20 శాతానికిపైగా పెరిగిన వినాయక విగ్రహాల రేట్లు

సాక్షి, సిటీబ్యూరో

భక్తకోటి ఇష్టదైవం బొజ్జ గణపయ్య వేడుకల కోసం నగరం సిద్ధమవుతోంది. మండపాల అలంకరణ, విగ్రహాల కొనుగోళ్లు, పూజా సామగ్రి విక్రయాలతో సందడి నెలకొంది. ఈసారి గణనాథుడి విగ్రహాల ధరలకు రెక్కలొచ్చాయి. గత ఏడాది కంటే 20 శాతానికి పైగా ధరలు పెరిగినప్పటికీ అమ్మకాలు జోరుగానే సాగుతున్నాయి. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మండపాల నిర్వాహకులు, కాలనీలు, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాలు పెద్ద ఎత్తున విగ్రహాలను కొనుగోలు చేస్తున్నాయి. దీంతో ధూల్‌పేట్, నాగోల్, ఎల్బీనగర్, ఉప్పల్, కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు, మియాపూర్ తదితర ప్రాంతాల్లో విగ్రహాల అమ్మకాలు ఊపందుకున్నాయి. 20 ఫీట్ల ఎత్తు ఉన్న విగ్రహాలు గత సంవత్సరం రూ.85 వేల వరకు విక్రయించగా, ఈసారి రూ.లక్ష దాటింది. ఎక్కువ మంది కొనుగోలు చేసే 12 ఫీట్లు, 16 ఫీట్ల విగ్రహాల ధరలు కూడా బాగా పెరిగాయి. గత సంవత్సరం రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు లభించిన విగ్రహాల ధరలు ఇప్పుడు రూ.70 వేల నుంచి రూ.80 వేలు దాటాయి. విగ్రహాలకు అదనపు అలంకరణలు, హంగూ ఆర్భాటాలకు అనుగుణంగా ధరలను పెంచారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఇతర ముడిపదార్థాలు, రవాణా తదితర ఖర్చులు భారీగా పెరగడంతో విగ్రహాల ధరలను కొంత మేరకు పెంచాల్సి వచ్చినట్లు ధూల్‌పేట్‌కు చెందిన బబ్లూసింగ్ తెలిపారు. ధూల్‌పేట్‌లోనే తయారు చేసిన 12 జ్యోతిర్లింగాల మహాకాళ వినాయక విగ్రహాన్ని రూ.2 లక్షల వరకు విక్రయించారు.

దారులన్నీ ధూల్‌పేట్ వైపే..

తెలంగాణలోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లోనూ ధూల్‌పేట వినాయక విగ్రహాలకు ఎంతో ఆదరణ ఉంది. దీంతో అనేక ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడకు వచ్చి నచ్చిన విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. 5 ఫీట్ల నుంచి 30 ఫీట్ల భారీ విగ్రహాల వరకు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. మరోవైపు 12 ఇంచులు, 6 ఇంచుల విగ్రహాలు కూడా విక్రయిస్తున్నట్లు రాకేష్ సింగ్ తెలిపారు. 20 నుంచి 30 అడుగుల వరకు ఉన్న విగ్రహాలు, వాటి ఆకృతులు, డిజైన్‌లు, వినియోగించిన రంగులు, ఫైబర్, తదితరాల ఆధారంగా రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు ధరలు ఉన్నాయి. ధూల్‌పేట్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో వైవిధ్యభరితమైన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినాయక విగ్రహాలతో పాటు దుర్గామాత ఉత్సవాలకు అనుగుణంగా విగ్రహాలను తయారు చేసే ధూల్‌పేట దక్షిణాది రాష్ట్రాలకే ప్రధాన మార్కెట్‌గా ఉంది. కానీ కొంతకాలంగా ఇతర రాష్ట్రాల నుంచి కూడా విగ్రహాలను హైదరాబాద్‌కు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో పోటీ బాగా పెరిగిందని ధూల్‌పేటకు చెందిన రాజేశ్వరి తెలిపారు.

మండపాలు, నిర్వహణ ఖర్చులూ అధికమే

- 20 అడుగుల విగ్రహం రూ.లక్షకుపైగానే
- అయినా జోరు తగ్గని విక్రయాలు
- ధూల్‌పేట్, నాగోలు, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో సందడి



నిర్వహణ కూడా భారీగానే..

అపార్ట్‌మెంట్‌లు, కాలనీ అసోసియేషన్‌లు, యువజన సంఘాలు, భక్తసమాజాలు నవరాత్రి ఉత్సవాలకు సన్నద్ధమవుతున్నాయి. బుధవారం నుంచి ప్రారంభం కానున్న గణనాథుడి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గ్రేటర్‌లో సుమారు 4 వేలకు పైగా రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు ఉన్నట్లు అంచనా. ఖైరతాబాద్, బాలాపూర్ సహా ప్రధాన మండపాలకు ఏ మాత్రం తీసిపోని విధంగా అపార్ట్‌మెంట్‌లు, బహుళ అంతస్తుల భవనాలు భారీ మండపాలను ఏర్పాటు చేస్తున్నాయి. విగ్రహాలతో పాటు ఏర్పాట్లు, నిర్వహణ ఖర్చులు సైతం భారీగానే పెరుగుతున్నాయని నిజాంపేట్‌కు చెందిన ఓ అపార్ట్‌మెంట్ కార్యదర్శి తెలిపారు.

ధరల పెంపు స్వల్పమే



పెరిగిన ముడిసరుకుల ధరలు, రవాణా ఖర్చుల వల్ల విగ్రహాల ధరలను స్వల్పంగా పెంచాల్సి వచ్చింది. గిరాకీ ఉన్నా లేకపోయినా ప్రతి సంవత్సరం విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తూనే ఉన్నాం. ఒకసారి లాభాలు బాగా రావచ్చు. ఒకసారి రాకపోవచ్చు. కానీ వ్యాపారాన్ని వదులుకోలేం కదా.

- గణేశ్‌సింగ్, ధూల్‌పేట్

21 మంది పండితులు... 11 రోజుల పూజలు!

- కల్నల్ ఆరోగ్యం కోసం చేయాలంటూ ఫోన్
- పురానాపూల్ వాసికి ఈ-కేటుగాళ్ల ఎర
- రూ.5.99 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: 'హలో మేము సికింద్రాబాద్‌లోని మిలిటరీ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నాం. మా కల్నల్ ఆరోగ్యం కోసం 21 మంది పండితులు 11 రోజుల పాటు పూజలు చేయాలి. అడ్వాన్స్ పంపిస్తాం తీసుకోండి' అంటూ పురానాపూల్ వాసికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ.5.99 లక్షలు కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పురానాపూల్‌లో నివసిస్తున్న ఓ పండితుడి (52) వివరాలు, ఫోన్ నెంబర్‌ను సైబర్ నేరగాళ్లు ఇంటర్‌నెట్ ద్వారా సంగ్రహించారు. గత నెల 23న ఆయనకు ఫోన్ చేసి సికింద్రాబాద్ మిలటరీ కార్యాలయంలో కెప్టెన్‌గా పని చేస్తున్న అమన్ కుమార్ అంటూ పరిచయం చేసుకున్నారు. తమ కల్నల్ ఆరోగ్యం కోసం 21 పండితులతో 11 రోజులు పూజలు చేయాల్సి ఉందని చెప్పాడు. దీనికి బాధితుడు అంగీకరించడంతో రూ.3 లక్షలు అడ్వాన్స్ ఇస్తానంటూ చెప్పిన కేటుగాడు వీడియో కాల్‌లోకి రమ్మన్నాడు. మరో ఫోన్ నెంబర్ నుంచి బాధితుడికి వీడియో కాల్ చేసి.. అడ్వాన్స్ పంపామంటూ గూగుల్ పే, ఫోన్ పే యాప్స్ తెరవమని చెప్పారు. తొలుత రూ.10 పంపి నగదు అందుకున్నట్లు ఖరారు చేయించారు. ఆపై ఆయన క్రెడిట్ కార్డ్ వివరాలు పిన్ తదితరాలు ఎంటర్ చేయమంటూ వాటిని సంగ్రహించారు. వీటిని వినియోగించి బాధితుడి ఖాతా నుంచి ఐదు లావాదేవీల్లో రూ.5,99,997.46 కాజేశారు. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 ద్వారా ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

డ్యాష్ బోర్డుపై.. నల్లా బిల్లు

నెలకు రూ.5 వేలకు పైగా చెల్లించే కనెక్షన్లపై ఫోకస్

రూ. 1000 నుంచి రూ.5వేలకుపైగా బిల్లులు చెల్లించే క్యాన్ నెంబర్లు

నెల	క్యాన్ నెంబర్లు	రావాల్సిన బిల్లులు (రూ.కోట్లలో)	చెల్లించిన క్యాన్‌నెంబరు	మొత్తం (రూ.కోట్లలో)
మే	95,446	90.81	55,276	77.95
జూన్	95,446	91.70	55,039	78.30
జూలై	95,446	91.20	55,080	78.19

నల్లా నీటి చార్జీల రాబడి ఇలా.. (రూ.కోట్లలో)

మే	92.66
జూన్	100.34
జూలై	100.03


సాక్షి, సిటీబ్యూరో: నగర వాసులకు అందించే ప్రతి సేవలో ఆధునిక సాంకేతిక సమాచార వ్యవస్థను ప్రయోగిస్తూ వస్తున్న జలమండలి.. తాజాగా వినియోగదారులకు సరఫరా చేసే తాగునీటి బిల్లులకు కూడా వర్తింపజేసి ఆదాయాన్ని పెంపొందించుకునే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. వినియోగదారు నెలవారీ నల్లా బిల్లుల రీడింగ్, బిల్లు, జనరేట్, జారీ, చెల్లింపు వరకు ఆన్‌లైన్‌తో అనుసంధానం చేసి ప్రత్యేక డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షిస్తోంది. మొదటి దశలో నెలకు రూ.5 వేలకు పైగా బిల్లులు చెల్లించే క్యాన్ నెంబర్లను గుర్తించింది. ప్రతినెలా 1 నుంచి 10 వరకు నెలవారీ బిల్లును కనెక్షన్‌దారు చేతికి అందించే విధంగా చర్యలు చేపడుతోంది. ఆ తర్వాత నెలాఖరులోగా బిల్లులు వసూళ్లయ్యే విధంగా సర్కిల్ వారీగా లక్ష్యాలను నిర్దేశించారు.


వీటిపైనే ఎక్కువ దృష్టి

జలమండలి పరిధిలో సుమారు 14,19,695 నల్లా కనెక్షన్లు (క్యాన్ నెంబర్లు) ఉండగా.. ఇందులో రూ.5 వేలకుపైగా వాటర్ చార్జీలు చెల్లించే 71,388 క్యాన్ నెంబర్లపైనే జలమండలి దృష్టి సారించింది. అందులో వాణిజ్య కనెక్షన్లు 53,637, వాణిజ్య బల్క్ కనెక్షన్లు 77 వరకు ఉన్నాయి. మిగితావి వివిధ కేటగిరీల కనెక్షన్లు. ఈ కనెక్షన్ల నుంచే నెలవారీగా దాదాపు రూ.89.90 కోట్ల ఆదాయం లభిస్తోంది. మిగతా క్యాన్ నెంబర్ల నుంచి రూ.40 కోట్లకుపైగా రాబడి వస్తోంది. వివిధ ఏజెన్సీలకు సంబంధించిన సుమారు 678 మీటర్ రీడర్లు వాటర్ రీడింగ్ తీసి నల్లా బిల్లు జనరేట్ చేస్తున్నారు. మొత్తం కనెక్షన్లలో సుమారు 5.5 లక్షల క్యాన్ నెంబర్లకు మాత్రమే మీటర్లు ఉన్నాయి. మిగతా క్యాన్‌నెంబర్లకు మీటర్లు లేక పోవడంతో ఒక స్లాబ్ ప్రకారం బిల్లు జనరేట్ అవుతోంది.

బకాయిలు 1,405 కోట్లకుపైగానే

జలమండలికి దాదాపు రూ.1,405.21 కోట్ల బకాయిలు వసూలు ఉంది. అందులో పెండింగ్ బకాయిలు రూ.1,314.45 కోట్లు ఉన్నట్లు జలమండలి అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం జూలై నెలకు సంబంధించి నల్లా చార్జీల ద్వారా మొత్తం 147.21 కోట్ల రాబడి రావాల్సి ఉంది. గుర్తించిన 71,388 క్యాన్ నెంబర్లలో ఇప్పటివరకు 71,143 క్యాన్ నెంబర్లకు మాత్రమే బిల్లు జారీ అయింది. అందులో 42,064 క్యాన్ నెంబర్లు బిల్లులు చెల్లించగా, 28,885 క్యాన్ నెంబర్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది.





డ్యాష్ బోర్డును పర్యవేక్షిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

జూబ్లీహిల్స్‌లో కొత్తగా 79 పోలింగ్ కేంద్రాలు

ఉప ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు

- అభ్యంతరాలకు నేడు చివరి రోజు
- జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కర్ణన్

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ సూచన మేరకు పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్‌పై అభ్యంతరాలు ఈ నెల 26వ తేదీ లోగా సమర్పించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జాతీయ, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రక్రియలో భాగంగా పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఉన్న 329 పోలింగ్ స్టేషన్ల స్థానంలో 408 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించామని తెలిపారు. గతంలో 132 లొకేషన్లలో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం 139 లొకేషన్లలో ప్రతిపాదించామని వివరించారు. అదనంగా 79 కొత్త పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించామన్నారు. ఈ రేషనలైజేషన్ నివేదికను ఈ నెల 28వ తేదీ లోగా ఎన్నికల కమిషన్‌కు పంపించాల్సి ఉన్నందున, అభ్యంతరాలను 26వ తేదీలోగా తప్పనిసరిగా సమర్పించాలని కోరారు.

అందుబాటులో బూత్ లెవెల్ ఏజెంట్లు

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 329 పోలింగ్ స్టేషన్లకు బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) అందుబాటులో ఉన్నారని తెలిపారు. బూత్‌లెవెల్ ఏజెంట్ల పేర్ల జాబితా ఇంకా ఇవ్వని పార్టీలు వెంటనే జాబితా అందజేయాలని సూచించారు. కొత్తగా ఏర్పాటు కానున్న 79 పోలింగ్ స్టేషన్లకు త్వరలోనే బీఎల్ఓలను నియమిస్తామని చెప్పారు.

క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్

జనవరి 6 నుంచి ఆగస్టు 15 వరకు మొత్తం 19,237 ఓటర్ల నమోదు దరఖాస్తులు అందగా, అందులో 3,767 తిరస్కరణకు గురయ్యాయని, ఇంకా 16 పెండింగ్‌లో ఉన్నాయని కర్ణన్ వివరించారు. ఫారం 6 ద్వారా వచ్చిన 5,426 దరఖాస్తుల్లో 1,478 తిరస్కరించినట్లు, ఫారం 7 ద్వారా వచ్చిన 3,453 దరఖాస్తుల్లో 1,010 తిరస్కరించారని, 12 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఫారం 8 ద్వారా వచ్చిన 10,358 దరఖాస్తుల్లో 1,279 తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎన్నికల అదనపు కమిషనర్ మంగతాయారు, జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్, ఈఆర్ఓ రజనీకాంత్ రెడ్డి, తహసీల్దార్లు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం..

రూ. 30 లక్షల ఆస్తినష్టం..



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

కుషాయిగూడ: ఓ స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటన కుషాయిగూడ పరిధిలోని సాయికృష్ణనగర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జమ్మిగడ్డకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తి కొంత కాలంగా ఖాళీ స్థలాన్ని లీజుకు తీసుకుని స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి స్క్రాప్ గోదాంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీనిపై సమాచారం అందడంతో కుషాయిగూడ పోలీసులు, ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఆరు గంటల పాటు శ్రమించి సోమవారం తెల్లవారుజామున మంటలను అదుపులోకి తెచ్చారు. పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. ప్రాథమిక సమాచారం మేరకు రూ.30 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లొదిలి నిర్మాణాలు

ప్రజావాణిలో హైడ్రాకు 48 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో కొందరు కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు, చట్టాలను ఉల్లంఘిస్తున్నారు, నిబంధనలను పట్టించుకోకుండా నిర్మాణాలు చేస్తున్నారని పలువురు ప్రజావాణి ద్వారా హైడ్రాకు ఫిర్యాదు చేశారు. కోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చినా గచ్చిబౌలిలో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు పలు నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ యజమానులు ఫిర్యాదు చేశారు. మొత్తమ్మీద సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్వహించిన ప్రజావాణికి 48 ఫిర్యాదులు వచ్చాయి.

- కాప్రా జవహర్‌నగర్ సరిహద్దుల్లో లే ఔట్ వేసిన యజమాని 33 అడుగుల రోడ్డును ఆక్రమించారని స్థానికులు ఫిర్యాదు చేశారు. గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 178లో ఉన్న ప్రభుత్వ భూమి, చిన్న పెద్ద చెరువు పరిధిలో భూ ఆక్రమణలు జరుగుతున్నాయని ట్రిక్స్ స్కైవుడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. 2023 డిసెంబర్ 17న హమీద్ అనే వ్యక్తి ప్రభుత్వం నిర్మించిన ప్రహరీని కూల్చేసి, చెట్లను నరికి చదును చేసి ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- నాగారం మునిసిపాలిటీ పరిధిలో ఉన్న అన్నారాయన్ చెరువు ఆక్రమణలకు గురి అవుతోందని పరిరక్షణ సమితి హైడ్రా దృష్టికి తెచ్చింది. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో రెండు ప్లాట్ల మధ్య 100 గజాల వరకూ ప్రభుత్వ స్థలం ఉండగా ఇరువైపుల వారు దానిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇందులో ఒకరు కబ్జా చేసింది రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఇంకొకరు ఎలాంటి దరఖాస్తు చేసుకోకుండా 70 గజాలకు కబ్జా చేసేస్తున్నారని ఆరోపించారు.
- షేక్‌పేటలోని సక్కుబాయి నగర్ లే ఔట్ మొత్తం 25 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో మొత్తం 249 ప్లాట్లు ఉన్నాయి. లేఔట్‌లో 16,158 గజాలను ప్రజావసరాల కోసం కేటాయించారు. 2022లో లేఔట్‌ను రివైజ్ చేస్తూ ఇష్టానుసారం పార్కులు, రహదారులు కబ్జా చేసి, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను ప్లాట్లుగా మార్చేశారంటూ సక్కుబాయి నగర్ నివాసితులు ఫిర్యాదు చేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను 16 వేల గజాల నుంచి 13,282 గజాలకు తగ్గించేశారని ఆరోపించారు.
- బేగంపేట భగవంత్‌పురంలోని విమానాశ్రయం నుంచి వస్తున్న వరద కాలువను ఓ వ్యక్తి ఆక్రమించి మట్టి నింపుతున్నారని, దీంతో తమ నివాసాలు వర్షం వస్తే నీట మునుగుతున్నాయని అక్కడి నివాసితులు ఫిర్యాదు చేశారు.



ప్రజావాణిలో హైడ్రా కమిషనర్ రంగనాథ్

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు ఛాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





SAKSHI SPELL Bee

సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

SAKSHI MATH BEE

సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250. మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు. 040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

'డాట్' పేరుతో స్పాట్!

ప్రెస్టేజ్ క్రెడిట్ కార్డు పేరుతో బాధితుడికి కాల్

- సిమ్ వెరిఫికేషన్ కోసం ఫోన్ పంపిన వైనం
- అందులో వెరిఫికేషన్ యాప్ ఉందంటూ టోకరా
- బ్యాంకు ఖాతా నుంచి రూ.77 లక్షలు స్వాహా
- రాజధానిలో నమోదైన కొత్త తరహా మోసం



సాక్షి, సిటీబ్యూరో: కంటిని కనిపించకుండా... ఒక్కోసారి కనీసం 'వినిపించకుండా'... కేవలం ఫోన్ కాల్స్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఎర వేసి బాధితుల నుంచి అందినకాడికి దండుకునే సైబర్ నేరగాళ్లు నానాటికీ ముదిరిపోతున్నారు. రిమోట్ యాక్సెస్ యాప్స్, ఏపీకే ఫైల్స్‌తో కూడిన లింకులు పంపడం కొన్నాళ్లుగా జరుగుతూనే ఉంది. తాజాగా ఆయా యాప్స్ నుంచి ఫోన్లనే కొరియర్ చేస్తూ నిలువునా దోచేస్తున్నారు. ఇలాంటి నేరం బారినపడి రూ.77 లక్షలు కోల్పోయిన బాధితుడు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

ఇప్పటి వరకు సాగింది ఇలా...

తాము టార్గెట్ చేసిన వారి బ్యాంకు ఖాతాలను, క్రెడిట్ కార్డుల్లోని మొత్తాలను కాజేయడం ఏళ్లుగా సాగుతున్న సైబర్ నేరమే. కొన్ని సందర్భాల్లో నేరగాళ్లు బాధితుల ప్రమేయం లేకుండానే ఫిక్స్‌డ్ డిపాజిట్లను సైతం క్యాన్సిల్ చేసి ఆ మొత్తాన్నీ కాజేసిన ఉదంతాలూ ఉన్నాయి. ఇలాంటి నేరాలు చేయడానికి సైబర్ నేరగాళ్లకు బాధితుల బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు వచ్చే ఈ-మెయిల్ ఐడీలు, పాస్‌వర్డ్స్ తదితరాలు అవసరం. దీనికోసం గతంలో ఫోన్ కాల్స్ చేసి కేవైసీ అప్‌డేట్, క్రెడిట్ లిమిట్ పెంచుకోవడం సహా వివిధ కారణాలు చెప్పే వారు. బాధితుల నుంచి వారి బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు తీసుకుని ముంచేవాళ్లు. ఆపై ఎనీ డెస్క్ వంటి రిమోట్ యాక్సెస్ యాప్స్ ఇన్‌స్టాల్ చేయించి, ఏపీకే ఫైల్స్ ఉన్న లింకుల్ని పంపి క్లిక్ చేయించి ఆయా ఫోన్లను తమ ఆధీనంలోకి తీసుకునే వాళ్లు.

ఇప్పుడు ఏకంగా ఫోనే పంపించి...

ఈ తరహా నేరాల పట్ల ప్రజల్లో కొంత వరకు అవగాహన వచ్చింది. దీంతో సైబర్ నేరగాళ్లు తాము టార్గెట్ చేసిన వారిలో కనీసం 5 శాతం మంది నుంచి నగదు కాజేయలేకపోతున్నారు. ఫలితంగా ఇటీవల కాలంలో తమ పంథా పూర్తిగా మార్చేశారు. డార్క్ వెబ్ సహా వివిధ మార్గాల ద్వారా సేకరించిన ఫోన్ నెంబర్ల ఆధారంగా టార్గెట్లను ఎంచుకుంటున్నారు. వారికి ఫోన్లు చేస్తున్న సైబర్ నేరగాళ్లు ప్రివిలైజ్, ప్రెస్టేజ్ క్రెడిట్ కార్డుల ఆఫర్ ఉందని, వీటి లిమిట్ రూ.25 లక్షలకు పైనే ఉంటుందంటూ చెబుతున్నారు. వాటిని తీసుకోవడానికి ఆసక్తి చూపిన వారి నుంచి చిరునామాలు సేకరిస్తున్నారు. ఈ కార్డు జారీ కోసం సిమ్ వెరిఫికేషన్ తప్పనిసరి... దీనికోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికాం (డాట్) యాప్ ఉన్న సెల్‌ఫోన్ పంపుతున్నామని, బ్యాంకు ఖాతాలో లింకైన సిమ్‌ను అందులో వేసి, నెట్ బ్యాంకింగ్ యాక్టివేట్ చేసుకుని, తాము చెప్పిన నెంబర్‌కు కాల్ ఫార్వర్డింగ్ చేయాలని సూచించారు.

బాధితుడు నిజమేనని నమ్మడంతో...

ఇది నిజమే అని నమ్మిన బాధితుడు ఫోన్ పంపమని చెప్పాడు. అది అందుకున్న బాధితుడు నేరగాళ్లు చెప్పినట్లే చేశారు. అందులో సైబర్ నేరగాళ్లు ముందే రిమోట్ యాక్సస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి ఉంచారు. దీంతో బాధితుడి బ్యాంకు ఖాతాకు సంబంధించిన ఇంటర్‌నెట్ బ్యాంకింగ్ వివరాలు వారికి చేరిపోవడంతో పాటు ఇతడికి రావాల్సిన ఓటీపీలు వారికి వెళ్లడం మొదలైంది. దీన్ని తమకు అనుకూలంగా మార్చుకున్న నేరగాళ్లు అతడి బ్యాంకు ఖాతాలో ఉన్న మొత్తం నుంచి రూ.77 లక్షలు స్వాహా చేశారు. ఎట్టకేలకు మేల్కొన్న బాధితుడి దీనిపై సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. తక్షణం స్పందించిన అధికారులు సైబర్ నేరగాళ్ల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.8 లక్షలు ఫ్రీజ్ చేయగలిగారు. సెల్‌ఫోన్ పంపడానికి నేరగాళ్లు పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఓ చిరునామాను ఫ్రమ్ అడ్రస్‌గా రాశారు. దీని ఆధారంగా ఆ ప్రాంతం వారే ఈ స్కామ్ చేసినట్లు అనుమానిస్తూ ఆ కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

పాన్ బ్రోకర్‌పై కేసు నమోదు



నిందితుడు మాణిక్‌చౌదరి..

ఫిలింనగర్: తాకట్టు పెట్టిన బంగారు నగలతో పాటు వడ్డీకి తీసుకున్న డబ్బులతో పరారైన పాన్‌బ్రోకర్‌పై ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. ఫిలింనగర్, గౌతంనగర్ బస్తీలో రాజస్థాన్‌కు చెందిన మాణిక్‌చౌదరి అనే పాన్ బ్రోకర్ నగల దుకాణం నిర్వహిస్తున్నాడు. స్థానికులు చాలామంది అతడి వద్ద ఆభరణాలు తాకట్టు పెట్టి అప్పు తీసుకున్నారు. ఇటీవల షాపు ఎత్తేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బసవతారకనగర్ బస్తీకి చెందిన జనార్దన్‌రెడ్డి అనే వ్యక్తి ఐదు తులాల బంగారం తాకట్టు పెట్టి అప్పు తీసుకుని ఆగస్టు 4న రూ.2.55 లక్షలు చెల్లించాడు. ఈ నెల 18న బంగారం తిరిగి ఇస్తానని చెప్పిన మాణిక్ చౌదరి బోర్డు తిప్పేయడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అపోలో ఆస్పత్రి బాలాజీ టెంపుల్‌లో పూజారిగా పనిచేస్తున్న ఆరుట్ల వెంకటరమణ రూ.18 లక్షలు తీసుకుని మోసం చేశాడు. ఫిలింనగర్ పోలీసులు నిందితుడు మాణిచౌదరిపై కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. ఫిలింనగర్‌లో పలువురిని నమ్మించి రూ. లక్షలు వసూలు చేయడమే కాకుండా పలువురు రాజకీయ నాయకుల వద్ద కూడా డబ్బులు తీసుకుని మోసం చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. సుమారు రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఫిలింనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాల ని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సమస్యలు తెలపడానికి వచ్చిన వారి నుంచి అదన పు కలెక్టర్లు చంద్రారెడ్డి, శ్రీనివాస్, డీఆర్ ఓ సంగీత ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ..శాఖల వారీగా స్వీకరించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ వారం మొత్తం 74 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 38, ఇతర శాఖలకు సంబంధించి 36 వచ్చాయన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం వద్దు

వారికి సర్టిఫికెట్లు ఇవ్వండి

- 28న వ్యక్తిగతంగా హాజరు కావాలి
- గౌతమి డిగ్రీ కాలేజీ, సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కాలేజీలకు హెచ్‌ఆర్‌సీ నోటీసులు

సిటీ కోర్టులు : విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం తగదని, వారికి ఒరిజినల్ సర్టిఫికెట్లను వెంటనే అందజేయాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సంబంధిత కళాశాలల యాజమాన్యాలను ఆదేశించింది. వివరాల్లోకి వెళితే...కళాశాల యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని గౌతమి డిగ్రీ కాలేజీకి చెందిన ఒకరు, సుల్తాన్-ఉల్-ఉలూమ్ ఫార్మసీ కాలేజీకి చెందిన 17 విద్యార్థులు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఐడీపీఎల్, బాలానగర్‌లోని గౌతమి డిగ్రీ కళాశాల నుంచి ఓ విద్యార్థి 2022-25 బీబీఏ పూర్తి చేశాడు. పీజీ చేసేందుకు ఈనెల 28న టీజీఐ-సెట్ కౌన్సెలింగ్ ఉందని, అందుకు దరఖాస్తు చేసుకున్నానని, బీబీఏ పూర్తి చేసిన ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని కళాశాల యాజమాన్యాన్ని కోరాడు. లేని పక్షంలో ఎంబీఏలో చేరేందుకు అవకాశం కోల్పోతానని తెలిపాడు. అయితే ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నందున ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఇవ్వలేమని కళాశాల యాజమాన్యం చెప్పడంతో అతను హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించాడు.

సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కాలేజీకి నోటీసులు..

తమ సర్టిఫికెట్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కాలేజీకి చెందిన 17 మంది విద్యార్థులు హెచ్‌ఆర్‌సీని ఆశ్రయించారు. ఇప్పటికే హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు ఉన్నా.. యాజమాన్యం పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని వారు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ రెండు పిటిషన్లపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ సోమవారం విచారణ చేపట్టింది. విద్య ప్రాథమిక హక్కు అని... విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కు అయిన విద్యను హక్కును ఉల్లంఘించడమే అని కమిషన్ అభిప్రాయపడింది. గౌతమి డిగ్రీ కాలేజీ విద్యార్థికి వెంటనే సర్టిఫికెట్లు అందజేయాలని, ప్రభుత్వ స్కాలర్‌షిప్ (రీయింబర్స్‌మెంట్) పెండింగ్‌లో ఉందనే సాకుతో అతడికి అన్యాయం చేయకుండా సర్టిఫికెట్స్ అందజేయాలని కాలేజీ ప్రిన్సిపాల్‌ను ఆదేశించింది. కళాశాల ఛైర్మ, ప్రిన్సిపాల్ ఈనెల 28న కమిషన్ ముందు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి కూడా కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా సుల్తాన్-ఉల్-ఉలూమ్ ఫార్మసీ కాలేజీకి గతంలోనే విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయాలని ఆదేశించినా యాజమాన్యం నిరాకరించడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. వచ్చే విచారణలోపు కళాశాల యాజమాన్యం నేరుగా కమిషన్ ముందు కళాశాల ఛైర్మన్, ప్రిన్సిపాల్ హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేస్తూ విచారణను ఈనెల 28కు వాయిదా వేస్తున్నట్లు పేర్కొంది.

ఆంక్షలు...అరెస్టులు..

- ఉద్రిక్తతల మధ్య సీఎం ఓయూ పర్యటన
- విద్యార్థి సంఘాల నేతల అసంతృప్తి
- పసుపు నీళ్లతో ఠాగూర్ ఆడిటోరియం శుద్ధి చేస్తూ నిరసన

ఉస్మానియా యూనివర్సిటీ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓయూ పర్యటన పోలీసుల ఆంక్షలు..విద్యార్థుల అరెస్టుల మధ్య కొనసాగింది. సోమవారం వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఓయూకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి విద్యార్థి నాయకుల హెచ్చరికల నేపథ్యంలో వర్సిటీ క్యాంపస్‌ను పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నారు. బందోబస్తు పేరుతో మీడియాతో పాటు సందర్శకులపై కూడా ఆంక్షలు విధించారు. సభ స్థలికి కిలోమీటర్ దూరంగా వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. సభకు వచ్చేవారిని, విద్యార్థులను పలుమార్లు తనిఖీ చేశారు. దుందుభి కొత్త హాస్టల్ ప్రారంభం, ఇతర అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మీడియాను అనుమతించలేదు. ఆటోరియంలోకి వాటర్ బాటిల్స్‌ను కూడా అనుమతించలేదు. విద్యార్థుల డబ్బులతో నిర్మించిన హాస్టల్ భవనాలను సీఎం రేవంత్ రెడ్డితో ప్రారంభించి రాజకీయం చేశారని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి చటారి దశరథ్ ఆరోపించారు. గత నెల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓయూకు వచ్చినా ఒక్క రూపాయి కూడా ఇవ్వడలేదన్నారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు డా.నాగేశ్వర్ రావు మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలపై ప్రభుత్వం జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం పర్యటన రాజకీయమే తప్ప ఓయూకు ఒరిగిందేమిలేదని ఏబీవీపీ నాయకులు రాజు అన్నారు. ఓయూ సమస్యలు సీఎం రేవంత్ రెడ్డికి తెలియని వికావని,.కానీ రాసి ఇవ్వండి డిసెంబరులో పరిష్కరిస్తానని చెప్పడం హాస్యాస్పదమని విద్యార్థి నేత నీరడి సునీల్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఇచ్చిన మాటపై నిలబడే దమ్ము ఉందా అని బీసీ విద్యార్థి సంఘం నాయకులు స్వామిగౌడ్ ప్రశ్నించారు. ఓయూ అధికారుల మాయమాటలు నమ్మి మోసపోకుండా విద్యార్థి నాయకులతో చర్చి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇదిలా ఉండగా సీఎం రేవంత్ రెడ్డి రాకను నిరసిస్తూ బీఆర్‌ఎస్‌వీ విద్యార్థి నాయకులు ఠాగూర్ ఆడిటోరియాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేసి నిరసన తెలిపారు.



ఠాగూర్ ఆడిటోరియాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేస్తున్న విద్యార్థి నేతలు



ఇనుప కంచెతో క్యాంపస్ రోడ్లను మూసివేసిన పోలీసులు

కావూరి హిల్స్ మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

సాక్షి,సిటీబ్యూరో: దుర్గం చెరువు సమీపంలోని కావూరి హిల్స్ మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. వర్షం కురిసినప్పుడు సీవరేజీ ఓవర్ ఫ్లోపై ఫిర్యాదులు వెల్లువెత్తుండటంతో సోమవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఇతర శాఖ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో సమస్యను పరిశీలించారు. శాశ్వత పరిష్కారంపై జలమండలి, ఇతర శాఖల అధికారులతో చర్చించారు. వరుస వర్షాల కారణంగా చెరువులోని నీటి మట్టం పూర్తి ట్యాంక్ లెవల్‌కు చేరుకోవడంతో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య ఏర్పడుతున్నట్లు అధికారులు ఎండీకి వివరించారు. దీంతో ఆయన డ్రైనేజీ ఓవర్‌ఫ్లోను పరిశీలించి వెంటనే సీవరేజ్ లైన్ లను డీ-సిల్టింగ్ చేసి మురుగుకు అడ్డకట్టు వేయాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన విధంగా శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, మరోవైపు సమస్య పరిష్కారానికి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సమీపంలోని భవన సముదాయల నుంచి వచ్చే సీవరేజ్‌ను దుర్గం చెరువు ఎస్టీపీ ఐఎండీ వద్ద అనుసంధానం చేయడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. వరద నీటి కాల్వలో మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని, దుర్గం చెరువు అవుట్ లెట్ వద్ద ఉన్న స్లూయిస్ వాల్వ్‌లను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

దుర్గం చెరువు ఎస్టీపీ పరిశీలన...

దుర్గం చెరువు 7 ఎంఎల్డీల సామర్థ్యం గల మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఎండీ అశోక్ రెడ్డి సందర్శించి, మురుగు నీరు శుద్ధి ప్రక్రియను పరిశీలించారు. ఎస్టీపీల్లో ఇన్ లెట్, అవుట్ లెట్ , ఎస్టీపీ పర్యవేక్షణ ఆన్ లైన్ లో పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన స్కాడా రూమ్‌ను పరిశీలించి స్కాడా పనితీరు, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని ఎస్టీపీల పనితీరు, వస్తున్న ఇన్‌ఫ్లో, శుద్ధి చేసిన నీటి నాణ్యత వివరాలు ఎప్పటికప్పుడు తెలిసేలా ప్రధాన కార్యాలయంలో డాష్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి సీజీఎంలు పద్మజ, నారాయణ, జీఎంతో పాటు జలమండలి, జీహెచ్‌ఎంసీ లేక్ డివిజన్ అధికారులు పాల్గొన్నారు.



కావూరిహిల్స్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

వైద్యాధికారుల చుట్టూ ఉచ్చు..?

- సృష్టి కేసులో సిట్ విచారణ
- ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో వైద్యారోగ్య శాఖ అధికారుల చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసును లోతుగా పరిశీలిస్తే శాఖాపరంగా పెద్ద తలకాయలే బయటపడతాయంటూ కార్యాలయ సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికే గాంధీ ఆసుపత్రిలో పనిచేసే ఓ వైద్యుడితో పాటు పలువురిని అరెస్టు చేసిన పోలీసులు తెరవెనుక ఎవరెవరు సహకరించారనే అంశంపై ఆరా తీస్తున్నారు. అనధికారికంగా ఐదేళ్ల పాటు ఆసుపత్రిని నడిపించినా తనిఖీ చేయాల్సిన మెడికల్ ఆఫీసర్లు గుర్తించలేకపోయారా? ఇంకా ఏదైనా కారణాలతో చూసీచూడనట్లు వ్యవహరించారా? దీని వెనుక పెద్దల హస్తం ఉందా..? ఉంటే వారెవరు.. తదితర అంశాలపై సిట్ అధికారులు దృష్టి సారించారు. అనుమతులు లేని ఆసుపత్రులకు శాఖాపరంగా సహకరిస్తున్న అధికారులపైనా ఆరా తీస్తున్నారు. సోమవారం హైదారాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో సిట్ అధికారులు విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల నుంచి పలు అంశాలపై వివరణ తీసుకున్నారు. ఆ సమయంలో ఆసుపత్రులపై ఏటా తనిఖీలు చేపట్టాల్సిన డెమో సెక్షన్, మెడికల్ ఆఫీసర్లు ఎవరెవరు పనిచేశారంటూ ఆరా తీసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాల శాఖల్లో 227 మందికి సంబంధించిన రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విశ్లేషించి, సదరు వ్యక్తులను విచారిస్తే మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. సృష్టి ఆసుపత్రిని సీజ్ చేసిన తర్వాత వేరొకరి లెటర్‌పాడ్ వినియోగించడంలో అంతర్యం ఏంటి? వైద్యారోగ్య శాఖలో పైసలకు కక్కుర్తిపడి శాఖాపరమైన సమాచారాన్ని చేరవేసే ఇంటి దొంగల వివరాలను తెలుసుకుంటున్నారు. పేదలకు గాలం వేసి పిల్లల అమ్మకాలకు పాల్పడుతున్న వ్యవస్థ ఎప్పటి నుంచి నడుస్తోంది. ఇందులో ఎవరెవరు ఉన్నారు. ఆ చైన్ సిస్టంపైనా సిట్ అధికారులు దృష్టి సారిస్తున్నారు. సృష్టిపై కేసు నమోదైన నాటి నుంచి వచ్చిన వివిధ కథనాలను పరిగణనలోకి తీసుకుని వాటిపై ఆరా తీస్తున్నారు. సృష్టి ఆసుపత్రి యాజమాన్యం 2021లో ఆసుపత్రిని పునరుద్ధరించడానికి అనుమతులు ఇవ్వాలంటూ మెడికల్ కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకోగా మెడికల్ కౌన్సిల్ తిరస్కరించింది. అయినా అనధికారికంగా ఏళ్ల తరబడి ఆసుపత్రి, ఇంత పెద్ద వ్యవస్థను నడిపించడం ఎలా సాధ్యమైందనే విషయం అంతుచిక్కడం లేదు. ప్రాథమిక విచారణ అనంతరం ఈ కేసును సిట్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. దీంతో రంగంలో దిగిన సిట్ అధికారులు అన్ని కోణాల్లోనూ విచారణ చేపడుతున్నారు.

కొండాపూర్‌లో రేవ్ పార్టీ


సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో నిర్వహణ

- భారీగా మాదకద్రవ్యాల పట్టివేత
- ఆరుగురి అరెస్ట్
- పరారీలో మరో ఇద్దరు


గచ్చిబౌలి: కొండాపూర్‌లోని ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న రేవ్ పార్టీని ఈగల్ టీం, గచ్చిబౌలి పోలీసులు భగ్నం చేసి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి కొకైన్, ఎక్స్‌టసీ పిల్స్, ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ డాక్టర్ వినీత్ వివరాలు వెల్లడించారు. కొండాపూర్‌లోని రాజేశ్వరీ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో రేవ్ పార్టీ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆదివారం రాత్రి ఈగల్ తెలంగాణ, గచ్చిబౌలి పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఎదిరేశ్వరం గ్రామానికి చెందిన తేజ, జొన్నాడ గ్రామానికి చెందిన విక్రమ్, నార్సింగికి చెందిన మన్నె నీలిమ, బెంగళూరుకు చెందిన చందన్, కొండాపూర్‌కు చెందిన వైన్‌షాప్ నిర్వాహకుడు పురుషోత్తం రెడ్డి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ భార్గవ్‌లను అరెస్ట్ చేశారు. బెంగళూరుకు చెందిన మరో నిందితుడు రాహుల్, రాజమండ్రికి చెందిన డిప్యూటీ తహసీల్దార్ మణిదీప్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి 20 గ్రాముల కొకైన్, 20 గ్రాముల ఎక్స్‌టసీ పిల్స్, 3 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. వారు నైజీరియాకు చెందిన మైక్ నుంచి చందన్ డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి రేవ్ పార్టీ నిర్వహించినట్లు గుర్తించారు.

రేవ్ పార్టీలు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

రాజమండ్రికి చెందిన తేజ, నీలిమ వ్యాపారంలో నష్టపోవడంతో హైదరాబాద్‌కు మకాం మార్చారు. 2023లో రాజమండ్రికి చెందిన డిప్యూటీ తహసీల్దార్ మణిదీప్ గోవాలో రేవ్ పార్టీ నిర్వహించి తేజ, నీలిమను అక్కడికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా వారికి బెంగళూరుకు చెందిన రాహుల్ పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత కూడా మణిదీప్ పలుమార్లు రాజమండ్రిలోని తన ఫామ్‌హౌస్‌లోనే రేవ్ నిర్వహించినట్లు వెలుగులోకి వచ్చినందున అతడిని నిందితుడిగా చేర్చుతున్నామని, త్వరలో అరెస్ట్ చేస్తామని డీసీపీ తెలిపారు. తాజాగా రాహుల్ మైక్ ద్వారా డ్రగ్ కొనుగోలు చేసి చందన్ ద్వారా నగరానికి సరఫరా చేశాడన్నారు. గ్లూటథైన్ అనే ఇంజక్షన్ బాక్సులలో కొకైన్ ఇతర డ్రగ్స్ పెట్టి హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిపారు. మరో నిందితుడు విక్రమ్‌కు మల్నాడు రెస్టారెంట్‌కు చెందిన సూర్య, బెంగళూరుకు చెందిన రాహుల్‌తో స్నేహం ఉందని, 2024 జనవరి 1 న ఢిల్లీలో నైజీరియన్ మైక్ నుంచి కొకైన్ తీసుకొని నగరానికి తిరిగి వస్తుండగా ఇదలవాయి టోల్ ప్లాజా వద్ద డిచ్‌పల్లి పోలీసులు విక్రమ్, చిప్టీని అరెస్ట్ చేయగా రాహుల్ పరారయ్యాడన్నారు. ఆ తర్వాత కూడా అతను పలు మార్లు రేవ్ పార్టీల్లో పాల్గొంటూ డ్రగ్స్‌ను వినియోగిస్తున్నట్లు గుర్తించామని డీసీపీ వెల్లడించారు. సర్వీస్ అపార్ట్‌మెంట్లలో డ్రగ్స్ దందాపై సమాచారం ఇవ్వాలని లేని పక్షంలో నిర్వాహకులను నిందితులుగా చేర్చుతామని డీసీపీ హెచ్చరించారు.



వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ వినీత్



పోలీసుల అదుపులో నిందితులు

'క్రైస్తవులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

హిమాయత్‌నగర్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ క్రైస్తవులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అలాగే ఒక ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని వాయిస్ ఆఫ్ క్రిస్టియన్ యూనిటీ డిమాండ్ చేసింది. హిమాయత్‌నగర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో యూనిటీ ఫౌండర్ డా.రాధా మ్యాథ్యూస్, ప్రతినిధులు డా.సాధు సత్యనాథ్, బిషప్ సింగం విల్సన్, డా.డానియేల్, సుధీర్ మాట్లాడారు. పాస్టర్లకు ఇస్తామన్న గౌరవ వేతనం రూ.5 వేలు చెల్లించడం లేదని, డబుల్ బెడ్రూంలు, హెల్త్ కార్డ్ తదితర హామీలు విస్మరించిందన్నారు. ఈ విషయమై త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేస్తామన్నారు. యూనిటీ ప్రతినిధులు బిషప్ ఆనంద్, డా.అబ్రహాం, రేవరెండ్ ఏసైయ్య, సిస్టర్ స్వరూప, నిర్మలా తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికపై ఎంఐఎం సమీక్ష



రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎంఐఎం నాయకులు శ్రీరాంనగర్‌లో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులు ముస్తాక్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి అన్వర్ సాదిత్ హాజరయ్యారు. పార్టీ ఓటు బ్యాంకు, బలోపేతం, అభ్యర్థి ఎంపికపై చర్చించారు. సీనియర్ నాయకులు, సులేమాన్, డాక్టర్ మనీర్, లతీఫ్, ఆసిఫ్, ఇలాలా, బస్తీల నాయకులు పాల్గొన్నారు.

అగర్వాల్ సమాజ్ బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న అనిరుధ్ గుప్తా

హిమాయత్‌నగర్ : అగర్వాల్ సమాజ్ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తున్నామని అగర్వాల్ సమాజ్ తెలంగాణ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా తెలిపారు. అగర్వాల్ సమాజ్ తెలంగాణ సభ్యత్వ నమోదు ప్రచారం, వెబ్‌సైట్, యాప్ శిక్షణకు సంబంధించి 5 జోన్ల సమన్వయకర్తలు, వివిధ శాఖల ఆఫీస్ బేరర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్రసేన్ మహారాజ్ జయంతి ఉత్సవాల నాటికి 25 వేల మంది సభ్యులను చేర్చుకోవాలని ప్రణాళికలు రూపొందించామన్నారు. రాష్ట్ర నాయకులు రూపేశ్, డా.సీమా జైన్, అచల్ గుప్తా, రితేశ్, ప్రేమ్, రాజ్‌కుమార్, ఆశిష్ దోచానియా, మహేంద్ర, ముకుంద్‌లాల్, దినేశ్, టి.సునీల్ కుమార్, డి.పి.అగర్వాల్ పాల్గొన్నారు.

ఎన్నిక



గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్

లిబర్టీ: సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఈయన ఏఐఎస్‌ఎఫ్, ఏఐఎఫ్‌ఐ తదితర విద్యార్థి యువజన సంఘాల్లో నాలుగు దశాబ్దాలుగా సేవలందించారు. అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా కూడా చంద్రమోహన్‌గౌడ్ పని చేస్తున్నారు. సాహిత్య, సాంస్కృతిక సంస్థలతో పని చేసిన అనుభవం ఉంది.


నియామకం



నియామకపత్రం అందుకుంటున్న ప్రమోద్

హిమాయత్‌నగర్: భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి హిమాయత్‌నగర్ డివిజన్ కన్వీనర్‌గా బీజేపీ సీనియర్ నేత గోపిశెట్టి ప్రమోద్ నియమితులయ్యారు. ఈ మేరకు గణేశ్ ఉత్సవ సమితి రాష్ట్ర నాయకుడు ఆలే భాస్కర్ సోమవారం నియామకపు పత్రాన్ని అందజేశారు. సమితి ప్రతినిధులు బద్దం మహిపాల్ రెడ్డి, ఖైరతాబాద్ కార్పొరేటర్ విజయా రెడ్డి, కె.నర్సింగ్ రావు గౌడ్, సంజయ్ గనాటె తదితరులు పాల్గొన్నారు.

పటోలా చీరలంటే ఇష్టం



స్టోర్‌ను ప్రారంభిస్తున్న సామాజికవేత్త పింకీరెడ్డి, మోడల్స్

బంజారాహిల్స్: పటోలా చీరలను ఎంతోమంది మహిళలు ఇష్టపడతారని ప్రముఖ సామాజిక వేత్త, పింకీరెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్-36 లో నూతనంగా ఏర్పాటు చేసిన పటాన్ పటోలా స్టోర్‌ను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. అలాగే మోడల్స్ పటోలా డిజైనరీ దుస్తులు ధరించి సందడి చేశారు. నిర్వాహకులు నిర్మల్ సాల్వి మాట్లాడుతూ.. నగరంలో ఇది తొలి పటోలా స్టోర్ అని భిన్న రకాల పటోలా ఉత్పత్తులు ఇక్కడ లభిస్తాయని తెలిపారు.

నిమజ్జనానికి సిద్ధంగా బేబీపాండ్స్!

● జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో పలుచోట్ల నిర్మాణాలు పూర్తి ● భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



నెక్లెస్‌రోడ్డులో నిర్మించిన బేబీపాండ్



బేబీపాండ్ వద్ద సోలార్ బయో టాయిలెట్

బంజారాహిల్స్: జల కాలుష్యాన్ని నివారించేందుకు చిన్నచిన్న వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు జీహెచ్ఎంసీ చేపట్టిన బేబీపాండ్ల నిర్మాణం పూర్తయ్యింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, మట్టితో తయారు చేసిన చిన్న చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నెక్లెస్‌రోడ్డులోని లేక్ ఫ్రంట్ వద్ద, సంజీవయ్య పార్కు పీపుల్స్ ప్లాజా వద్ద బేబీపాండ్లను నిర్మించింది. ఈనెల 23న వినాయక చవితి అనంతరం తెల్లవారుజాము నుంచే చాలామంది తమ ఇళ్లు, గల్లీల్లో ఏర్పాటు చేసిన చిన్న చిన్న విగ్రహాలను సంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుతో తీసుకెళ్లి నిమజ్జనం చేస్తుంటారు. జీహెచ్ఎంసీ సర్కిల్-17 అధికారులు కేవలం పాండ్స్ నిర్మించడమే కాకుండా వాటి వద్ద సోలార్ బయో టాయిలెట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పాండ్ వద్ద భక్తులకు సరిపడా సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు. ప్రతిరోజూ అధికారులు పాండ్స్ నిర్మించిన ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా చిన్న చిన్న విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు జీహెచ్ఎంసీ సర్కిల్-17 అధికారులు జలవిహార్, సనత్‌నగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అమీర్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోనూ మినీ బేబీపాండ్స్‌ను కూడా నిర్మించారు.

నిమజ్జనానికి 9 క్రేన్ల ఏర్పాటు

వినాయక విగ్రహాల నిమజ్జనానికి పీపుల్స్‌ప్లాజాలో అతిపెద్ద బేబీపాండ్ నిర్మించాం.ఇక్కడ 9 క్రేన్లు ఏర్పాటు చేస్తున్నాం. నిరంతరం నిఘాతో పాటు లైటింగ్,భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నాం.
– జయంత్, డీసీ, జీహెచ్ఎంసీ సర్కిల్-17

మహా గణపతి ఉత్సవాలకు రండి



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సభ్యులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో ప్రతిష్ఠించే 69 అడుగుల మట్టి మహా గణపతి వినాయక ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఖైరతాబాద్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కమిటీ సభ్యులు రాంరెడ్డి, బాక్సర్ అశోక్, సింగరి రాజ్‌కుమార్, వీణామాధురి, మహేశ్ యాదవ్, కె.రాజు, రోహిత్ యాదవ్‌తో పాటు పూజారి రంగరాజాచార్యులు సీఎంకు ఆశీర్వచనం చేశారు.

◆ అలాగే రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి సైతం ఖైరతాబాద్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ మహాగణపతి ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.



రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డికి..

సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కృష్ణా యాదవ్ తదితరులు

పంజగుట్ట: తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న లలితా కళాతోరణంలో పెన్షన్ విద్రోహ దినం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నగర అధ్యక్షుడు ఎం.బి.కృష్ణా యాదవ్ తెలిపారు. ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో టీజీవో నగర జాయింట్ సెక్రటరీ కొత్త విద్యాసాగర్‌తో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ప్రభుత్వ ఉద్యోగులందరూ హాజరై ప్రభుత్వానికి మన డిమాండ్‌ను వినిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

'వేర్ హౌస్ సూపర్ వైజర్ ట్రైనింగ్ ప్రోగ్రాం' షురూ



ట్రైనింగ్ ప్రోగ్రాంను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్ కుమార్

హిమాయత్‌నగర్ : నారాయణగూడ బీజేఆర్ కళాశాలలో వేర్ హౌస్ సూపర్ వైజర్ ట్రైనింగ్ ప్రోగాన్ని ప్రిన్సిపాల్ కెప్టెన్ డాక్టర్ విజయ్ కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ఫోసిస్‌తో ఐసీటీ అకాడమీతో ఎంఓయూ కుదుర్చుకున్నామన్నారు. డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు 15 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఐసీటీ కో-ఆర్డినేటర్ డా.ఎస్.దీపిక, ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్ దినేశ్, ట్రైనింగ్ ఆఫీసర్ జితేంద్ర బాబు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కలువల శ్రీనివాస్, వాణిజ్య విభాగాధిపతి డా.నరసింహులు, ఐసీటీ రిలేషన్ షిప్ మేనేజర్ ముకుందర్, మెంటార్స్ నాగరత్నం, అర్చన పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన..

పాత నేరస్తుడి రిమాండ్



నిందితుడు అజయ్

బంజారాహిల్స్: పాత నేరస్తుడిని బంజారాహిల్స్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు సమీపంలోని బాలాజీనగర్‌లో నివసించే తురేకార్ అజయ్ అలియాస్ బబ్లూ (25) కొన్నేళ్లుగా జల్సాలకు అలవాటుపడి బెదిరింపులకు పాల్పడుతున్నాడు. బంజారాహిల్స్ రోడ్డునంబర్-2లోని ఇందిరానగర్‌లో అద్దెకు ఉంటూ బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో రిసెప్షన్‌లో పనిచేస్తున్న విక్టర్‌పాల్ అనే పరిచయం ఉన్న వ్యక్తిని ఈనెల 13న బయటకు రమ్మని పిలిచాడు. తనతో పాటు వచ్చిన శివతో కలిసి విక్టర్‌ను అజయ్ డబ్బులు ఇవ్వాలంటూ కత్తితో బెదిరించి బలవంతంగా జేబులో ఉన్న రూ.3,000, ఫోన్ లాక్కొని పరారయ్యాడు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి ప్రధాన నిందితుడు అజయ్ కోసం గాలింపు చేపట్టారు. బాలాజీనగర్‌లోని ఇంట్లో ఉన్నట్లు సమాచారం రావడంతో పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులను చూసిన అజయ్ గోడ దూకి పారిపోతుండగా క్రైం ఎస్ఐ యాసీన్ అలీతో పాటు సిబ్బంది వెంబడించి నిందితుడిని పట్టుకున్నారు. దర్యాప్తు చేయగా గతంలోనే నిందితుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో మూడు హత్యాయత్నం కేసులు నమోదై ఉన్నట్లు తేలింది. అలాగే ఒక ఆమ్స్ యాక్ట్ కింద కేసు నమోదై ఉంది. విశాఖపట్టణంలోనూ పలు కేసులు ఉన్నాయి. నిందితుడిని రిమాండ్‌కు తరలించి బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండపాలకు ఉచిత విద్యుత్‌పై హర్షం

రహమత్‌నగర్ : గణేశ్, దుర్గామాత మండపాలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడంపై భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ జూబ్లీహిల్స్ కన్వీనర్ తంగలపల్లి లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు. రహమత్‌నగర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఉత్సవ కమిటీల డిమాండ్ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మండపాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని టీజీఎస్‌పీడీసీఎల్ అధికారులకు ఆదేశాల జారీ చేయడం ఆనందంగా ఉందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహించాలి

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంప్ర కుమారస్వామి కోరారు. కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు లేకుంటే ద్వితీయ శ్రేణి నాయకులు, క్షేత్రస్థాయి నాయకులు రాజకీయంగా తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. జెడ్‌పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నందని దానికి అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

అకారణంగా మహిళపై దాడి

వెంగళరావునగర్ : అకారణంగా మహిళపై దాడి చేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం.. రహమత్‌నగర్‌లో నివసించే సంధ్య ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నది. గత నెల 18న సంధ్య డ్యూటీకి వెళ్లేందుకు బయటకు వచ్చింది. పక్కనే నారాయణ అనే వ్యక్తి నూతనంగా నిర్మిస్తున్న బిల్డింగ్ పిల్లర్ రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్నారని ఆమె ఇంటి ఓనర్‌ను ప్రశ్నించింది. దాంతో అతనితో పాటు అతని భార్య సంధ్యను తీవ్రమైన దుర్భాషలాడి ఆమెపై దాడి చేశారు. అలాగే బెదిరించారు. దీంతో బాధితురాలు సోమవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో ద్విచక్ర వాహనంతో ఢీ

వెంగళరావునగర్: మద్యం మత్తులో అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఇరువురిని ఢీకొట్టిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీకృష్ణానగర్‌లో నివసించే బి.ఫణితేజ ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 24న రాత్రి తన స్నేహితుడు గోపితో కలిసి గ్రీన్ బవార్చీ హోటల్ వద్ద ఉన్న కర్రీ పాయింట్‌కు వచ్చాడు. తిరిగి రూంకు వెళ్తుండగా ఎదురుగా భూక్యా నరేశ్ అనే వ్యక్తి మద్యం తాగి ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టాడు. దాంతో ఫణితేజ వాహనం పూర్తిగా దెబ్బతినగా ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. బాధితుడు ఫణితేజ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరదనీటి కాలువలో మృతదేహం లభ్యం



ఫిలింనగర్: వరదనీటి నాలాలో గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహాన్ని ఫిలింనగర్ పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. లక్ష్మీనగర్ నాలా టాటా సర్వీస్ మోటార్స్ షేక్‌పేట ఎదురుగా ఈ మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు స్థానికంగా ఆరా తీసినా ఎలాంటి వివరాలు తెలియకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించుకుందాం'



రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందామని మాజీ కార్పొరేటర్, నగర బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు మహ్మద్ అబ్దుల్ షఫీ పిలుపునిచ్చారు. శ్రీరాంనగర్‌లోని తన కార్యాలయంలో నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహమత్‌నగర్ డివిజన్ నుంచి భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. రహమత్‌నగర్ ఎన్నికల పరిశీలకులు ఎమ్మెల్సీ రవీందర్ రావు, మాజీ ప్రభుత్వ విప్ దాస్యం వినయ్ భాస్కర్ సూచనల మేరకు డివిజన్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నాయకులతో పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు షఫీ తెలిపారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ధనూజ, జగ్గుతో పాటు డివిజన్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ప్లానేటోరియం షో'



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన ప్లానేటోరియం షో ఆకట్టుకున్నది. మూడు రోజుల పాటు అంతరిక్షం, గ్రహాలు, ఖగోళశాస్త్ర శాస్త్రానికి సంబంధించిన ఇతర శాస్త్రీయ భావనలను అర్థం చేసుకోవడానికి, విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు, శాస్త్రీయ దృక్పథాన్ని రేకెత్తించే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగింది. విద్యార్థులకు ఖగోళ వస్తువులు, నక్షత్ర రాశులు, సౌర వ్యవస్థ, ఖగోళ విషయాలను పరిచయం చేశారు.



'ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేస్తున్న పాలకులు'

లిబర్టీ: పాలకులు, ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేస్తున్నారని జాతీయ ప్రజాస్వామ్య లౌకిక కూటమి జాతీయ చైర్మన్ వి.కృష్ణస్వరూప్ ఆరోపించారు. కూటమి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లౌకికవాదాన్ని మంట కలుపుతూ ప్రజల మధ్య సఖ్యత లేకుండా కులమత రాజకీయాలు చేస్తూ కల్లోలను సృష్టిస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని లౌకికవాదాన్ని పరిరక్షణకు పాటుపడుతామని పేర్కొన్నారు. కూటమి 4 ఆవిర్భావ దినోత్సవాన్ని వచ్చే నెల 25న పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకోసం ఈనెల చివరి వారంలో సన్నాహక సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కూటమిలోని అన్ని రాజకీయ పార్టీలు దళిత సంఘాలు, వివిధ సామాజిక సంస్థలు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు మానవ హక్కుల సంఘాలు పాల్గొంటాయని తెలిపారు.

పెంపుడు తల్లిదండ్రులకు 'సుప్రీం'లో ఊరట

కోర్టు తీర్పుతో దత్తత పిల్లల అప్పగింత



చిన్నారితో దుర్గాభవానీ దంపతులు (ఫైల్)

వెంగళరావునగర్ : పెంపుడు తల్లిదండ్రుల 15 నెలల న్యాయ పోరాటం ఫలించింది. సుప్రీంకోర్టు తీర్పుతో ఆ తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది. వివరాల్లోకి వెళ్తే.. గతేడాది మే 29న రెండు తెలుగు రాష్ట్రాల్లో చిన్నారులను విక్రయిస్తున్న గుర్తు తెలియని ముఠా గుట్టు రట్టు చేసి రాచకొండ పోలీసులు 11 మంది చిన్నారులను తీసుకున్నారు. వారిని వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాంగణంలోని శిశువిహార్‌లో అప్పగించారు. అయితే ఈ కేసులో పిల్లలను విక్రయించిన నిందితులు మాత్రం పరారీలో ఉన్నారు. కాగా తమ పిల్లలను ఇవ్వాలని పెంపుడు తల్లిదండ్రులు శిశుసంక్షేమశాఖ కార్యాలయం వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. అయినా ఆ శాఖ సిబ్బంది కరగలేదు. దీంతో కొంతమంది తల్లిదండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా దత్తత పిల్లలను తిరిగి పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించాలని ఆదేశిస్తూ సోమవారం తీర్పునిచ్చింది. దీంతో కొంతమంది తల్లిదండ్రులు మహిళా శిశుసంక్షేమ శాఖకు వచ్చి తమ పిల్లలను తీసుకెళ్లారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: వినాయక చవితిని పురస్కరించుకుని ఖైరతాబాద్ లైబ్రరీ చౌరస్తాలో కార్పొరేటర్ విజయారెడ్డి మట్టి వినాయక ప్రతిమలను సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతిఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయకుడినే పూజించి పర్యావరణ పరిరక్షణకు తమవంతూ సహకారం అందించాలని కోరారు.



ప్రెస్‌క్లబ్‌లో పంపిణీ చేస్తున్న కార్యవర్గం

ప్రెస్‌క్లబ్‌లో..

పంజగుట్ట: హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో హెచ్ఎండీఏ సహకారంతో ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి ఎ.రాజేశ్ జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎండీఏ డీఈ విద్యాసాగర్, ఏఈ అశుతోష్ వర్మ పాల్గొన్నారు.

ముగిసిన మహా కుంకుమార్చన పూజలు



భక్తులకు ఉపదేశం ఇస్తున్న అభిషేక్ బ్రహ్మచారి స్వామీజి

బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో 3 రోజులుగా జరుగుతున్న శ్రీ విద్యా దశ కోటి మహా కుంకుమార్చన పూజలు సోమవారం ముగిశాయి. లోక కల్యాణార్థం, ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని రాజరాజేశ్వరి దేవికి, లలితా త్రిపుర సుందరీ దేవికి కుంకుమార్చన పూజలు నిర్వహించినట్లు అభిషేక్ బ్రహ్మచారి స్వామీజి తెలిపారు. చివరిరోజు అమ్మవారి కుంకుమార్చన పూజల్లో 2 వేల మంది మహిళలు పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు.



సాక్షి
మంగళవారం
। 26 । ఆగస్టు । 2025

చిన్న ఉర్దూ పత్రికలకు ఆర్థిక సాయం

– ఉర్దూ అకాడమి అధ్యక్షుడు తాహెర్

సాక్షి,సిటీబ్యూరో: ఆర్థిక సహాయం కోరే చిన్న ఉర్దూ పత్రికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర ఉర్దూ అకాడమి అధ్యక్షుడు తాహెర్ బిన్ హందాన్, డైరెక్టర్ సజ్జాద్ అలీ తెలిపారు. ఈ వారు సోమవారం మీడియాకు వివరాలు తెలియజేశారు. చిన్న ఉర్దూ పత్రికలకు 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు. దిన, వార, పక్ష, మాస పత్రికలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. సంబంధిత పత్రికకు ఆర్ఎన్ఐ నంబర్ ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే తేదీ నాటి పత్రికతోపాటు రెండు రోజుల వెనుకటి పత్రికలు, ముందస్తు రసీదు, డైరెక్టర్ ఉర్దూ అకాడమి అడ్వాన్స్ చెక్, పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డుతోపాటు డిక్లరేషన్‌ను కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ లోపు అందజేయాలని సూచించారు. ఒక్క ఆధార్ కార్డుకు ఒకే పత్రిక ఉండాలని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం వారి వారి అకౌంట్‌ల్లో నిధులు జమ అవుతాయని పేర్కొన్నారు.

'బాలచెలిమి' కథల పోటీలకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: బాలల దినోత్సవం సందర్భంగా పిల్లలకు కథల పోటీలు నిర్వహిస్తున్నామని చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్, బాలచెలిమి సంపాదకుడు మణికొండ వేదకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 14న బాలల దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో బాలచెలిమి కథల పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలు రాసిన కథలు, పిల్లల కోసం పెద్దలు రాసిన కథలు పంపవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ, మానవతా, నైతిక విలువలు, వ్యసనాలకు దూరంగా ఉండటం వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తామని తెలిపారు. బాలచెలిమి పత్రికలోను ప్రచురణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలకు, పెద్దలకు బహుమతులు వేర్వేరుగా ఉంటాయని, ఆసక్తిఉన్న వారు వచ్చే నెల 20వ తేదీ లోగా తమ కథలను edit.chelimi@gmail.comకు పంపాలని, మరిన్ని వివరాలకు 8686664949; 9030626288 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మహేంద్ర వర్సిటీలో ఐసీఐటీసీఐ సదస్సు ప్రారంభం



సుభాష్‌నగర్: బహదూర్‌పల్లిలోని మహీంద్రా యూనివర్సిటీలో సోమవారం రెండు రోజులపాటు జరిగే 'కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు'అనే అంశంపై ఐదో అంతర్జాతీయ సదస్సు (ఐసీఐటీసీఐ–2025) ప్రారంభమైంది. ఈ సందర్భంగా డీప్ లెర్నింగ్, సీక్వెన్స్ మోడలింగ్, కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌లోని సాధారణ అంశాలపై కొత్త ఆవిష్కరణలను చర్చించారు. సదస్సు మొదటి రోజు ట్యూటోరియల్స్ ఆధునిక కంప్యూటేషనల్ పద్ధతులపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) మాజీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ కుమార్ ఝా మాట్లాడుతూ ''భారత దేశం రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో స్వావలంబన సాధించాలంటే, మెటీరియల్స్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికలోనే ఆవిష్కరణలు జరగాలన్నారు. సదస్సులో 50కి పైగా సంస్థల నుండి శాస్త్రవేత్తలు తమ పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో డెలాయిట్ కన్సల్టింగ్ యూఎస్ఏ(ఇండియా) ప్రెసిడెంట్ విశాల్ శర్మ, మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యజులు మేడురి, ప్రొఫెసర్ చంద్రజిత్ బాజాజ్ (టెక్సాస్ విశ్వవిద్యాలయం, యూఎస్ఏ), ప్రొఫెసర్ కల్యాణ్మయ్ దేబ్ (మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ, యూఎస్ఏ), ప్రొఫెసర్ అకిరా హిరోసే (టోక్యో విశ్వవిద్యాలయం, జపాన్), డా. సమీర్ జైన్ (మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్, ఇండియా), డా. జెఫ్ అడి (నివిడియా కార్పొరేషన్, సింగపూర్) పాల్గొన్నారు.

నగరంలో నేడు

- సిరి ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్ ఎగ్జిబిషన్ మాసబ్ ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్ఏయూ కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో గణేష్ చతుర్థి స్పెషల్ పేరిట ఏర్పాటు చేసిన ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

వచ్చే నెలలో అమృత్ భారత్

- సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ మధ్య రాకపోకలు
- ఉత్తరాది వలస కార్మికులు, యాత్రికులకు భారీ ఊరట
- తెలంగాణకు ఇదే మొదటి రైలు



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ వైపు తొలిసారిగా అమృత్‌భారత్ రైలు పరుగులు పెట్టనుంది. సెప్టెంబర్‌లో పట్టాలెక్కనుంది. ఉత్తరాది ప్రయాణం నిమిత్తం అందుబాటులోకి రానుంది. తక్కువ చార్జీలుండే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుతో సామాన్యులు, వలస కార్మికులు తదితర వర్గాల ప్రయాణికులకు భారీ ఊరట కలగనుంది. సికింద్రాబాద్ నుంచి బీహార్‌లోని ముజఫర్‌పూర్‌కు అమృత్ భారత్ రైలును ప్రవేశపెట్టనున్నారు. దేశవ్యాప్తంగా మూడో శ్రేణికి చెందిన ఈ రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు రైల్వే బోర్డు కొద్దిరోజుల క్రితమే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైదరాబాద్ నుంచి పట్నా, గయా తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారి కోసం ఈ రైలును ప్రవేశపెడుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారి ఒకరు తెలిపారు. ఇది కాజీపేట, పెద్దపల్లి, బెల్లంపల్లి, సిర్పూర్‌కాగజ్ నగర్, బల్లార్షా, నాగ్‌పూర్, గోండియా, దుర్గ్, రాయ్‌పూర్, బిలాస్‌పూర్, ఝార్సుగూడ, రూర్కేలా, హతియా, రాంచీ, బొకారో, పరస్‌నాథ్, కోడెర్మా, గయాజీ, జెహనాబాద్, పాట్నా తదితర ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించనుంది. ఈ అమృత్‌భారత్ రైలులో 11 సాధారణ బోగీలు, 8 స్లీపర్ క్లాస్, ఒక ప్యాంట్రీ కార్, 2 సెకండ్ క్లాస్–కమ్–లగేజ్–కమ్–గార్డ్ వ్యాన్‌లు ఉంటాయి. దివ్యాంగుల కోసం ఒక కంపార్ట్‌మెంట్ ఉండేవిధంగా రూపొందించారు.

వలస కార్మికులకు ప్రయోజనం...

హైదరాబాద్ నుంచి ముజఫర్‌పూర్‌కు ప్రస్తుతం ఒక్క వీక్లీ ఎక్స్‌ప్రెస్ (05293/05294) మాత్రమే అందుబాటులో ఉంది. ఇది కాకుండా సికింద్రాబాద్–దానాపూర్ ఎక్స్‌ప్రెస్ (12791/12792) ప్రతిరోజు రాకపోకలు సాగిస్తోంది. కానీ, ప్రయాణికుల రద్దీ, డిమాండ్ కారణంగా ఈ రైళ్లు ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రతిరోజు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ నడిచినా మరో రెండు రైళ్లకు సరిపడా ప్రయాణికులు పడిగాపులు కాస్తున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డ లక్షలాది మంది ఉత్తరాది వలస కార్మికుల కుటుంబాలకు ఈ ఒక్క రైలే రాకపోకలకు అనుకూలంగా ఉంది. మరోవైపు అయోధ్యలో రామమందిరం ప్రారంభించిన అనంతరం నగరం నుంచి వెళ్లే భక్తుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. ప్రయాగ, వారణాసి తదితర ప్రాంతాలతోపాటు భక్తులు అయోధ్యను సందర్శిస్తున్నారు. ఇలా అన్ని విధాలుగా డిమాండ్ పెరిగినప్పటికీ తగినన్ని రైళ్లు లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అమృత్‌భారత్ ద్వారా అతి తక్కువ చార్జీలతోనే ప్రయాణికులు గయ, పట్నా తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు అవకాశం లభించనుంది. 2023లో దేశంలో అమృత్‌భారత్ రైళ్లను ప్రవేశపెట్టినా సెప్టెంబర్‌లో పట్టాలెక్కనున్న సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్ తెలంగాణకు మొదటి అమృత్ భారత్ రైలు కానుంది. సెప్టెంబర్‌లో జరగనున్న బీహార్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ రైళ్లను పట్టాలెక్కించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. సికింద్రాబాద్–ముజఫర్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌తోపాటు మరో 4 రైళ్లు దేశంలోని పలు ప్రాంతాల నుంచి బీహార్‌లోని పలు నగరాలకు నడుపనున్నారు.

మరికొన్ని అమృత్ భారత్ రైళ్లు....

హైదరాబాద్ నుంచి మరికొన్ని అమృత్‌భారత్ రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. హైదరాబాద్– కోల్‌కత్తా (సంత్రాగచ్చి), చర్లపల్లి– గౌహతి, హైదరాబాద్–కన్యాకుమారి, సికింద్రాబాద్–తిరువనంతపురం మధ్య అమృత్‌భారత్ సూపర్‌ఫాస్ట్ రైళ్లను నడిపే ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. కోల్‌కత్తాకు ప్రవేశపెట్టనున్న రైలును విజయవాడ–విశాఖపట్నం మార్గంలో కాకుండా కాజీపేట్, పెద్దపల్లి, బల్లార్షా మార్గంలో నడపాలని ఉత్తర తెలంగాణకు చెందిన ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

'జూబ్లీహిల్స్' నోడల్ అధికారుల నియామకం

– ఉపఎన్నికకు అధికారులు సన్నద్ధం

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ మేరకు ఆయా అంశాలవారీగా నోడల్ అధికారులను నియమించారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఉత్తర్వు జారీ చేశారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఖాళీ అయిన ఆ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. వివిధ అంశాలు.. వాటిని నిర్వహించే అధికారుల వివరాలిలా ఉన్నాయి.

మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్: అనురాగ్ జయంతి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్
ఈవీఎం, వీవీ ప్యాట్ నిర్వహణ: అపూర్వ్ చౌహాన్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్
వాహనాల కేటాయింపులు: శ్రీనివాస్, సీటీఓ
ఎన్నికల సిబ్బందికి శిక్షణ: హేమంత్ పాటిల్, ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్
ఎన్నికల సామగ్రి నిర్వహణ: కె.వేణుగోపాల్, అడిషనల్ కమిషనర్(అడ్మిన్)
ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు: ఎం.సుదర్శన్, విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ
వల్నరబిలిటీ ప్రాంతాల గుర్తింపు, శాంతిభద్రతలు: నర్సింహారెడ్డి, డీఎస్పీ
ఎన్నికల వ్యయ పరిశీలన: బి.గీతారాధిక, అడిషనల్ కమిషనర్(ఫైనాన్స్)
బ్యాలెట్ పేపర్, డమ్మీ బ్యాలెట్ పేపర్: ఎ.రవి కిరణ్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్
మీడియా, కమ్యూనికేషన్, ఎంసీఎంసీ: ఎం.దశరథ్, పీఆర్ఓ
కంప్యూటరైజేషన్, కమ్యూనికేషన్, సైబర్ సెక్యూరిటీ, ఐటీ: సి.రాధ, జాయింట్ కమిషనర్(ఐటీ)
స్వీప్ కార్యక్రమాలు: డాక్టర్ అబ్దుల్ వకీల్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్
ఎన్నికల రిపోర్ట్స్: కేపీ మంగతాయారు, అడిషనల్ కమిషనర్(ఎన్నికలు)
పోలింగ్ కేంద్రాలు, డీఆర్సీ సెంటర్లు: హేమంత్ బోర్ఖడే, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్
వైద్యసేవలు: డాక్టర్ పద్మజ, చీఫ్ మెడికల్ ఆఫీసర్
పోస్టల్ బ్యాలెట్ పేపర్లు: ఎం.కోటేశ్వర్లు, పర్సనల్ ఆఫీసర్
ఓటరు జాబితా, ముద్రణ: సాయిరాం, సికింద్రాబాద్ ఆర్డీఓ

- ఆయా అంశాల్లో నోడల్ ఆఫీసర్లకు సహాయకులుగా మరికొందరిని నియమించారు. వారంతా తమకు కేటాయించిన విధుల్ని ఎప్పటికప్పుడు నిర్ణీత వ్యవధుల్లోగా పూర్తి చేయాలని కర్ణన్ ఆదేశించారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

– సీఎం రేవంత్‌ను కోరిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రామంతాపూర్: ఇటీవల రామంతాపూర్‌లో విద్యుదాఘాతంతో మృతి చెందిన ఐదుగురు యువకుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం ఆయన సీఎంను కలిశారు. మృతుల కుటుంబాలతోపాటు గాయపడిన వారిని సీఎం పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కమీషన్ ఇవ్వకుంటే ఒకటి నుంచి రేషన్ బంద్



పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారికి వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు

పౌర సరఫరాల కార్యాలయం వద్ద డీలర్ల ఆందోళన

పంజగుట్ట: ఐదు నెలలుగా రావల్సిన కమీషన్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రేషన్ డీలర్లు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎర్రమంజిల్‌లోని పౌర సరఫరాల శాఖ ప్రధాన కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఆగస్టు 31 లోపు కమీషన్లు చెల్లించకపోతే సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపులు బంద్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం పౌర సరఫరాల శాఖ జాయింట్ కమిషనర్ మురళీకృష్ణ రాథోడ్‌కు వినతిపత్రం ఇచ్చారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు, ప్రధాన కార్యదర్శి ఎ.సంజీవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 17,200 మందిరేషన్ డీలర్లు ఉన్నారని, వారికి ఏప్రిల్ నుంచి కమీషన్ రాకపోవడంతో అద్దెలు కట్టుకోలేక, హమాలీ డబ్బులు ఇవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా మూడు నెలల బియ్యం ముందుగానే డీలర్లు పంపిణీ చేశారని తెలిపారు. ప్రతీనెలా డీలర్ల ఖాతాల్లోకి కమీషన్ వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే కమీషన్లు వేర్వేరుగా కాకుండా పాత పద్ధతిలో ఒకేసారి విడుదల చేయాలన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, వెంటనే దానిని నెరవేర్చాలని అన్నారు. గన్ని బ్యాగుల డబ్బులను రెండేళ్ల నుంచి ఇంకా ఇవ్వలేదని విచారం వ్యక్తం చేశారు.

క్రీడలతోనే ఆరోగ్యకర సమాజం



హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న జయేష్ రంజన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: అందరికీ ఆరోగ్యం అందుబాటులో క్రీడలు అన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. సోమవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం క్రీడల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం నిర్వహించనంత ఘనంగా తొమ్మిది రోజులపాటు ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, క్రీడాస్ఫూర్తిని కలిగించే విధంగా నగరంతోపాటు అన్ని జిల్లా కేంద్రాల విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనంతరం క్రీడాకారులు, స్పోర్ట్స్ అథారిటీ కుటుంబ సభ్యులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోని బాలాదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవిచంద్రతోపాటు క్రీడాశాఖ అధికారులు పాల్గొన్నారు.

చేయూత పెన్షన్లు పెంచే దాకా ఉద్యమం



సమావేశంలో పాల్గొన్న పెన్షన్‌దారులు, కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

– మందకృష్ణ మాదిగ

మూసాపేట: చేయూత పెన్షన్లు పెంచే వరకు పోరాటం ఆపేది లేదని ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో సోమవారం జరిగిన మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా చేయూత పెన్షన్‌దారుల సన్నాహాక సభలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చేయూత పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి పెన్షన్ కూడా పెంచలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి పెన్షన్ పెంచకుండా ద్రోహం చేస్తుంటే ప్రతిపక్షపార్టీలు కనీసం మాట్లాడకుండా పెన్షన్‌దారులను మోసం చేస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బంగ్లాలో పుట్టి వచ్చిన నాయకుడు, ప్రతిపక్ష నేత కేసీఆర్ గడీల నుండి పుట్టి వచ్చిన నాయకుడు అందుకే పెన్షన్‌దారుల పక్షాన వారు నిలబడటం లేదన్నారు. తాను గుడిసెలో పుట్టిన బిడ్డగా పెన్షన్‌దారుల పక్షాన పోరాటం చేయడానికి ముందుకు వచ్చానని తెలిపారు. సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో జరిగే చేయూత పెన్షన్‌దారుల మహా గర్జనకు ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ నాయకులు అందె రాంబాబు, జాతీయ దండోరా కళామండలి అధ్యక్షుడు ఎస్.వై.అశోక్ మాదిగ, జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ, రాంచందర్ మాదిగ, పంగ ప్రణయ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ నుంచి శ్రీశైలానికి ఆర్టీసీ బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ బోర్డింగ్ పాయింట్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ 'ఎక్స్'ద్వారా ట్వీట్ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి ఎయిర్‌పోర్టుకు చేరుకొనే భక్తులు బోర్డింగ్ పాయింట్ నుంచి నేరుగా శ్రీశైలానికి బయలుదేరవచ్చని పేర్కొన్నారు. ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

విలువల ఆధారిత అభివృద్ధి ఉండాలి

– రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



భద్రుకా కళాశాల వజ్రోత్సవంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డాక్టర్ లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విలువల ఆధారిత అభివృద్ధే పటిష్టంగా ఉంటుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. సోమవారం ఆర్టీసీ కళ్యాణ మండపంలో భద్రుకా ఎడ్యుకేషనల్ సొసైటీ భద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్య ద్వారా సామాజిక సేవ చేయాలని సూచించారు. బాధ్యత గల పౌరులనుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులదే కీలక పాత్ర అని అన్నారు. భారత దేశ జాతీయ దృక్పథాన్ని గుర్తు చేస్తూ దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 'జై జవాన్, జై కిసాన్'అంటే, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 'జై జవాన్ , జై కిసాన్, జై విజ్ఞాన్'అని అన్నారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'జై జవాన్, జై కిసాన్, జై విజ్ఞాన్, జై అనుసంధాన్'అని పేర్కొన్నారని అన్నారు. ఆధునిక విజ్ఞానంతో పాటు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మికత విలువలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. రాజ్యసభ సభ్యు డు డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ విద్య అనేది డిగ్రీ కోసమే కాకుండా వ్యక్తిత్వ నిర్మాణంలో భా గంగా ఉండాలన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం స్థాపన కోసం తన వంతుగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భద్రుకా విద్యా సంస్థల చైర్మన్ లక్ష్మీనివాస్ శర్మ, గౌరవ కార్యదర్శి కిషన్ భద్రుకా, డాక్టర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

సినీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



మామిడి హరికృష్ణను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ రాంచంద్రు నాయక్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సినీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ మూవీ, టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ పుష్కర ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ కార్మికులకు ప్రభుత్వం తరపున భరోసా కల్పిస్తామని, త్వరలోనే కార్మిక శాఖ అధికారులు, సినీ కార్మికులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. యూనియన్ కార్యాలయానికి స్థలం కేటాయింపు విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు వస్తాయన్నారు. కళాకారులకు పెన్షన్ కోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని పేర్కొన్నారు. డిప్యూటీ స్పీకర్ రాంచంద్రు నాయక్ మాట్లాడుతూ మన సంస్కృతి, నాగరికత, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో కళాకారులదే కీలకపాత్ర అన్నారు. అంతకుముందు పలువురు కళాకారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, మ్యాజిక్ షో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సినీ నటులు శివాజీ, కౌశిక్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్, గౌరవాధ్యక్షుడు పృథ్వీరాజ్, చైర్మన్ ఎన్.రామ్, ప్రధాన కార్యదర్శి నూకరాజు, కోశాధికారి ఏఎస్ఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కార బాధ్యత హెచ్‌ఓడీలదే

– 'ప్రజావాణి'లో కమిషనర్ ఆర్వీ కర్ణన్



ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్: నగర ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయా విభాగాల హెచ్‌ఓడీలే బాధ్యత వహించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వచ్చిన ప్రజలు కమిషనర్‌కు తమ విన్నపాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రతి అర్జీదారు ఒకే సమస్యను మళ్లీ మళ్లీ విన్నవించకుండా పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 81 విన్నపాలు, ఆరు జోన్లలో మొత్తం 113 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పంకజ, గీతా రాధిక వేణుగోపాల్, మంగతాయారు, సీఈ రత్నాకర్, అడిషనల్ సీసీపీలు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శోభాయాత్ర ప్రధాన మార్గం పరిశీలన



శోభాయాత్ర ప్రధాన మార్గాన్ని పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్

చార్మినార్: ఈ నెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శోభాయాత్రలు కొనసాగే ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఉదయం అధికారులతో కలిసి చాంద్రాయణ గుట్ట, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల పరిధిలోని ప్రధాన ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. చాంద్రాయణగుట్ట, ఆషామా బాద్, ఫాతిమా నగర్, పల్లె చెరువు, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్ చౌరస్తా, రాజేంద్రనగర్, పత్తికుంట ప్రాంతాల్లో పర్యటించి రోడ్లపై సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ వినాయక విగ్రహాలు తరలించే భక్తులకు ఇబ్బందులు తేలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే ప్రధాన రోడ్ల పక్కనున్న చెట్ల కొమ్మలను తొలగించామని, గుంతల రోడ్లపై ప్యాచ్ వర్క్ చేపట్టామ ని తెలిపారు. వినాయక మండపాలు, విగ్రహాలు నిమజ్జనం చేసే రాజన్న బావి, పల్లె చెరువు, పత్తికుంట ప్రాంతం, ప్రధాన శోభయాత్రలకు కొనసాగే రహదారుల్లో పారిశుధ్య సమస్యలు రాకుండా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సర్కిల్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యటనలో చాంద్రాయణ గుట్ట, ఫలక్‌నుమా, రాజేంద్ర నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు సురేందర్, అరుణకుమారి, సురేందర్ రెడ్డి, ఏఎంహెచ్ఓ డాక్టర్ ప్రీతి, ఈఈ నరేందర్ గౌడ్, డీఈలు రామారావు, రజనీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక శక్తిగా ఎదగాలి

సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

కాచిగూడ: మహిళలు స్వశక్తిపై ఆధారపడి ఆర్థిక స్వావలంబనతో ముందుకు సాగాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల గద్దర్ అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు పోరండ్ల శారద ప్రభాకర్ అధ్యక్షతన సోమవారం నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో జరిగిన మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మూడు నెలల పాటు మహిళలకు నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా కుట్టు మిషన్లతోపాటు శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. మహిళా అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే వారి కుటుంబాలు పురోగతిని సాధిస్తాయని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ ఆర్థికాభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పసలాది సబిత, అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఒగ్గు చంద్రకళ, పులిపాటి సుకన్య, వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ బర్రెంకల మధుసూదన్, బూరం వీణశంకర్ తదితరులు పాల్గొన్నారు.





స్కిన్ కేర్ రంగంలో భారీ మార్పులు

దేశంలో తొలి ఏఐ స్కిన్ కేర్ వెండింగ్ మిషన్ ఆవిష్కరణ

మిస్ ఇండియా ఎర్త్ డాక్టర్ తేజస్విని మనోజ్ఞ

రాయదుర్గం: 'స్కిన్ టెక్ ఏఐ–2025' భారత బ్యూటీ ఇండస్ట్రీకి సరికొత్త నాందిగా నిలుస్తుందని మిస్ ఇండియా ఎర్త్ డాక్టర్ తేజస్విని మనోజ్ఞ పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్ వేదికగా దేశంలో తొలిసారిగా వార్షిక స్కిన్ కేర్ అండ్ బ్యూటీ ఏఐ/టెక్ సదస్సు–స్కిన్ టెక్ ఏఐ–2025 పేరిట నిర్వహించారు. సదస్సు థీమ్ అనేది స్కిన్ కేర్ రంగంలో భవిష్యత్తుకు మలుపుగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఇది నూతన ఆవిష్కరణ, డేటా, వినియోగదారుల ఆధారంగా భవిష్యత్తును నిర్మిస్తుందన్నారు. ఈ తొలి కార్యక్రమంలో హైదరాబాద్ ఆతిథ్యం ఇవ్వడం, తనకు అవకాశం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్కిన్ కేర్, బ్యూటీ రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులపై చర్చించారు. అనంతరం దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేసిన ఏఐ స్కిన్ స్కేర్ వెండింగ్ మిషన్ ఆవిష్కరించారు. ఎంపీఎఫ్ సీఈఓ సుశీల్ కుమార్, స్కిన్ కేర్ రంగంలో ప్రముఖులు నిజామ్ మహ్మద్, స్టార్టప్‌ల మెంటర్ డాక్టర్ లక్ష్మీ దివ్య, రామ్ చింతలపూడి, శశిమూర్తి పాల్గొన్నారు.

కొంత మంది యువకులు పుట్టుకతో వృద్ధులు అన్నారు మహా కవి శ్రీశ్రీ.. దీనికి భిన్నంగా ఈ వృద్ధులు ఎప్పటికీ యువకులే.. అన్నట్లు కొందరు నగరవాసులు వయసును లెక్కజేయకుండా అన్నింటా మేము సైతం అన్నట్లు నేటి యువతకు చాలెంజ్ విసురుతున్నారు. అరవైల్లోనూ ఇరవైని తలపించే రీతిలో విభిన్న పోటీల్లో భాగస్వాములవుతూ ఉత్సాహంగా ఆటల నుంచి అందాల పోటీల వరకూ పాలుపంచుకుంటున్నారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు కదులుతూ ఏజ్ ఈజ్ జస్ట్ ఏ నంబర్ అంటున్నారు నాటి తరం సీనియర్ సిటి'జెమ్స్'. రిటైర్మెంట్ అనంతరం కృష్ణా.. రామా.. అంటూ మూలన కూర్చోక.. ఎంచక్కా టూర్లు, ట్రెక్కింగ్స్ అంటూ తమకు నచ్చిన రంగంలో సమయాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. - సాక్షి సిటీబ్యూరో









సీనియర్ సిటిజెమ్స్..

అరవైల్లోనూ ఇరవైని తలపిస్తున్న నగరవాసులు

- విభిన్న పోటీల్లో మేము సైతం అంటూ భాగస్వామ్యం
- ఉత్సాహంగా పాల్గొంటున్న వయో వృద్ధులు
- సీనియర్స్ కోసం పుట్టుకొస్తున్న సరికొత్త ట్రెండ్స్
- ఆటల నుంచి అందాల పోటీల వరకూ
- ఆత్మవిశ్వాసంతో ముందుకు కదులుతూ
- ఏజ్ ఈజ్ జస్ట్ ఎ నెంబర్ అంటున్న నాటి తరం

కొండాపూర్‌లో నివసించే బాబూ రాజేంద్రప్రసాద్ రెడ్డికి 70 ఏళ్లు.. అనితరసాధ్యమైన రీతిలో 12వేల అడుగుల ఎత్తుకు ట్రెక్కింగ్ చేశారు. 72 ఏళ్ల వయసులోనూ ఎన్ఎమ్‌డీసీ ఫుల్ మారథాన్ అంటే 42.2 కి.మీ పరుగును పూర్తిచేశారు మరో నగరవాసి నాగభూషణరావు. ఇంకా మరిన్ని మారథాన్‌లలో భాగస్వామ్యం అవుతానంటున్నారు. పోరాట కళల్లో రాణిస్తూ మార్షల్ ఆర్ట్స్‌లో గిన్నిస్ రికార్డ్ సాధించారు మరో నగరవాసి కిరణ్ ఉనియాల్ (53).. ఇలా వయసుతో ప్రమేయం లేని విజయాలతో ఓల్డేజ్ అనే పదానికి కొత్త అర్థాన్ని ఇస్తూ.. తమ రొటీన్ లైఫ్‌ని కొత్తగా మార్చేస్తున్నారు. అలాంటి సీనియర్ల హుషారు సరికొత్త యువ తరాన్ని ఆవిష్కరిస్తూ.. కొత్త కొత్త పోటీలకు ఊపునిస్తోంది.

అప్పుడే అసలైన జీవితం..

రిటైర్మెంట్ వయసు దగ్గర పడుతోంది అంటే ఊళ్లు తిరుగుతూ తీర్థయాత్రలతోనో, ఒళ్లు నలగని పార్ట్ టైమ్ ఉద్యోగాలతోనో, మనవళ్లతోనో.. పార్కుల్లో స్నేహితులతో ముచ్చట్లతోనో కాలం వెళ్లదీసే రోజులు కావివి అంటున్నారు నేటి తరం సీనియర్ సిటిజన్స్. ఓ వైపు ఉద్యోగమో, వ్యాపారమో.. కెరీర్ ముగుస్తుండగానే.. మరో వైపు కొత్త లక్ష్యాలు పుట్టుకొస్తున్నాయి. 'నిజం చెప్పాలంటే ఓ వ్యక్తిగా మనకేం కావాలి.. మనమేం చేయగలం.. అనే ఆలోచనలతో అప్పుడే అసలైన జీవితం మొదలవుతుంది' అని చెబుతున్నారు నగరానికి చెందిన సాహిల్ గులాటి(65).



టాలెంట్, ఆసక్తి ఉండాలేగానీ..

ఇటీవల ఖ్యాల్స్ (కేహెచ్‌వైఏఏఎల్స్) అనే ఏజ్‌టెక్ స్టార్టప్, '50 ఎబవ్' అనే పేరుతో టాలెంట్ హంట్ పోటీలు ప్రారంభించింది. ఇది 50 ఏళ్లు పైబడిన వారికి ప్రత్యేకించింది. గానం, ఫొటోగ్రఫీ, వంటలో ప్రావీణ్యం, కవితలు రాయడం, నటన.. ఇలా అదీ ఇదీ అని లేకుండా దాదాపు అన్ని విభాగాలనూ కలుపుకుని ఏకంగా 50 విభాగాల్లో విజేతలను ఎంపిక చేస్తుండడం విశేషం. కళా ప్రతిభ, ట్రావెల్, లైఫ్‌స్టైల్ వంటి విభాగాల్లో సత్తా ప్రదర్శించే అవకాశం కల్పిస్తోంది.. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పోటీ కోసం 20 నగరాల్లో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. వయసు సంబంధిత స్టీరియో టైప్ పోటీలకు భిన్నంగా వయోజనుల్లో పోటీ తత్వాన్ని, ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యంగా వీటిని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

అందం వయసెరగదు..



ఆత్మవిశ్వాసం ఉండాలేగానీ అందం వయసెరగదు అంటున్నారు మిస్టర్ అండ్ మిసెస్ సీనియర్ ఫ్యాషన్ పేజెంట్ ఇండియా నిర్వాహకులు రేఖా దేశాయ్. గత మే నెల్లో 55 ఏళ్లు దాటిన వారి కోసం ఓ పోటీని కొత్తగా ప్రారంభించారామె. స్వయంగా ఆరు పదుల వయసులో ఉన్న రేఖా దేశాయ్.. 'కలలకు ఎక్స్‌పైరీ డేట్ లేదు. సీనియర్స్ కళ్లలో మెరుపులు చూడడమే నా కార్యక్రమ లక్ష్యం' అంటున్నారు. వీరి సంస్థ నిర్వహించే పీచ్ ఈవెంట్స్ తమ మొదటి సీజన్ పూర్తి స్థాయిలో విజయవంతమైంది.

ఆటలకు, పాటలకు సై..



సీనియర్స్ కోసం నిర్వహించే ఆటల పోటీలకూ కొదవ లేదు. ఈత, గోల్ఫ్ నడక వంటి వాటిలోనూ పోటీలు జరుగుతున్నాయి. అలాగే బోస్, కార్న్‌హోల్, క్రికెట్ వంటి ఆటలు కూడా అందుబాటులో ఉన్నాయి. అస్సాంకు చెందిన 70ఏళ్ల ఖిరాదా సైకియా కలిత దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో పోరాడుతూ గత జూన్‌లో ధర్మశాలలో జరిగిన నేషనల్ మాస్టర్స్ గేమ్స్‌లో నాలుగు బంగారు పతకాలు గెలుచుకోవడం ఎందరికో స్ఫూర్తిని అందించింది. అదే విధంగా 60 ఏళ్ల పైబడిన వారి కోసం నిర్వహించే మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్స్, ఏటీపీ చాంపియన్ టూర్స్, పాన్ ఇండియా ఫెడరేషన్ కప్ వంటి ఆటల పోటీల్లోనూ నగరవాసులు చురుకుగా పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు.



గిన్నిస్‌లో కాగ్నిజెంట్ వైబ్ కోడింగ్

సాక్షి, సిటీ బ్యూరో : ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ కాగ్నిజెంట్ (Cognizant) 'వైబ్ కోడింగ్' ఈవెంట్ గిన్నిస్‌లోకి ఎక్కింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ జనరేటివ్ ఏఐ హాకథాన్ నిర్వహించడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌తో టైటిల్ సాధించామని, ఈ ఈవెంట్‌లో నగరంతో సహా 40 దేశాల్లోని 53,199 మంది ఉద్యోగులు పాల్గొని, 30,601 ప్రోటోటైప్ ప్రాజెక్టులు రూపొందించారని వివరించారు. 'వైబ్ కోడింగ్' అనేది ఏఐ సహాయంతో సహజ భాషలో మనలోని ఆలోచనలను సాఫ్ట్‌వేర్‌గా మార్చే కొత్త కోడింగ్ పద్ధతి కాగా, ఈ విజయంతో కాగ్నిజెంట్ ఉద్యోగుల్లో ఏఐ నైపుణ్యాలను పెంపొందిస్తూ, ఆవిష్కరణలను వేగవంతం చేసే దిశగా మరో అడుగు వేసిందన్నారు.

ముగిసిన 'హైదరాబాద్ ఓపెన్–2025'

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సూపర్‌స్టార్స్‌తో పాటు వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ ఆన్ టూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'హైదరాబాద్ ఓపెన్–2025' ఘనంగా ముగిసింది. ప్రొఫెషనల్ విభాగాల్లో కుల్దీప్ మహాజన్, అనుజా మహేశ్వరి, వంశిక్ కపాడియా, వృషాలి ఠాక్రే సత్తా చాటారు. మూడు రోజుల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. చివరి రోజు ఎనిమిది విభాగాల్లో ఫైనల్స్ నిర్వహించగా రూ.15 లక్షల బహుమతి అందజేశారు. కేఎల్ఓ స్పోర్ట్స్, రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నాని మద్దతుతో దీనిని నిర్వహించారు.





ఆ ఇంట్లో ఏమూల చూసినా గణనాధుల ప్రతిమలు కనువిందు చేస్తుంటాయి. విభిన్న రకాల వినాయక విగ్రహాలతో ఆ ఇల్లే కాదు.. చుట్టుపక్కల ప్రాంతాలన్నీ ఆధ్యాత్మిక సౌరభంతో విరాజిల్లుతుంటాయి. ఆయన తన 12వ ఏట నుంచే అరుదైన సేకరణపై దృష్టిపెట్టారు. అదే వినాయక విగ్రహాలు, ప్రతిమలు, పుస్తకాలు, ఫొటోలు సేకరించడం. ఈ హాబీ ఆయనకు చిన్ననాటి నుంచే అబ్బగా ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రత్యేకత కలిగిన విగ్రహాలు కనిపిస్తే చాలు.. అది ఏ దేశంలో ఉన్నా తన గణపతి మ్యూజియంలోకి చేరాల్సిందే. అంతేకాదు.. విశ్వవినాయక్ పేరుతో వినాయక ఆలయాలపై పుస్తకం కూడా రాస్తున్నారు. ఆయనే వెస్ట్ మారేడ్‌పల్లికి చెందిన పబ్‌శెట్టి శేఖర్. ఎస్‌బీఐలో పనిచేసిన ఆయన ఉద్యోగ విరమణ అనంతరం కూడా తన హాబీని కొనసాగిస్తున్నారు. - బంజారాహిల్స్

అరుదైన గణపతి ప్రతిమల సేకరణ

అబ్బురం.. అపురూపం..

- ఇంట్లో ఏమూల చూసినా కనువిందు చేసే విగ్రహాలు
- 39 దేశాల నుంచి సేకరణ, అనేక రికార్డులు సొంతం
- 12వ ఏట నుంచే ప్రతిమలు, విగ్రహాల సేకరణపై దృష్టి
- ఆశ్చర్యపరుస్తున్న రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి శేఖర్ హాబీ

అమెరికా, చైనా, నేపాల్, జపాన్, అఫ్గానిస్థాన్, ఈజిప్ట్, శ్రీలంక, బాలి, జర్మనీ, టిబెట్, కంబోడియా, థాయ్‌లాండ్, యూకే ఇలా సుమారు 39 దేశాల నుంచి పలు ప్రత్యేకతలు కలిగిన గణేశ విగ్రహాలను సేకరించారు. బంగారం, వెండి, ఇత్తడి, రాగి, అల్యూమినియం, మార్బుల్, క్రిస్టల్, చెక్క, రాతి, పంచలోహం, మట్టితో తయారుచేసిన విగ్రహాలతో ఏకంగా ఓ మ్యూజియాన్ని తలపించే సేకరణ ఇక్కడ కొలువుదీరింది. వీటి 32 రూపాల గణేశుడి నుంచి 12 రాశుల గణపతి ప్రతిమలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రపంచంలో అత్యధిక గణపతి విగ్రహాలు సేకరించిన వ్యక్తిగా పబ్‌శెట్టి శేఖర్ గిన్నిస్ రికార్డులోనూ చోటు సంపాదించుకున్నారు.





21,708 గణేశ విగ్రహాలు..

పబ్‌శెట్టి శేఖర్ ఇప్పటివరకూ తన హాబీలో భాగంగా 21,708 గణేశుడి విగ్రహాలను సేకరించి రికార్డు సృష్టించారు. అంతే కాదు, 19,708 గణేశ పోస్ట్‌కార్డులు తయారు చేశారు. 15,582 గణేశ ఫొటోలూ ఉన్నాయి. 1,105 గణేశ పోస్టర్లు, 260 గణేశ పురాణాలు, పుస్తకాలు సేకరించారు. 250 గణేశ కీచైన్లు అబ్బురపరుస్తున్నాయి. అరుదైన 205 ఆడియో, వీడియో క్యాసెట్లు సేకరించారు. ఇప్పటి వరకూ ఆయన సేకరించినవన్నీ కలుపుకుని 58,498. ఈ ఒక్క ఏడాదిలోనే 2,060 గణేశ విగ్రహాలను సేకరించి తన హాబీకి మరింత వన్నె తెచ్చాడు. 1973లో ప్రారంభమైన ఈ హాబీ రోజురోజుకూ ముందుకెళ్లడమే కానీ, వెనక్కి తగ్గడం లేదు.

లక్ష సేకరించడమే లక్ష్యం..

బొజ్జ గణపయ్యకు సంబంధించి వివిధ రూపాల్లో ఇప్పటివరకూ 50వేలకు పైగా సేకరించారు. మొత్తం లక్ష సేకరణే లక్ష్యంగా పెట్టుకున్నట్లు పబ్‌శెట్టి శేఖర్ చెబుతున్నారు. తాను ఎక్కడికి వెళ్లినా ముందుగా చూసేది వినాయక విగ్రహాలేనని, తప్పనిసరిగా కొనుగోలు చేస్తుంటానని, ఇప్పటివరకూ 15 వరల్డ్ రికార్డులు రాగా, 2014, 2015లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో కూడా చోటు సంపాదించానని తెలిపారు. నేషనల్ బుక్ ఆఫ్ రికార్డు, వండర్ బుక్, మిరాకిల్ వరల్డ్ రికార్డు, ఎవరెస్ట్ వరల్డ్ రికార్డు, కింగ్స్ వరల్డ్ రికార్డు ఇలా ఎన్నో రికార్డులను నమోదు చేసుకున్నారు. ఈ హాబీ తన ప్రాణం ఉన్నంత వరకూ కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు. అంతేకాదు గణపతి దేవాలయాలపై రీసెర్చ్ చేస్తున్నట్లు వివరించారు.

యువ పారిశ్రామికవేత్తలకు అవగాహన



సాక్షి, సిటీబ్యూరో: మహిళలకు వ్యాపార ప్రణాళికలపై నగరంలోని వీ హబ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా బ్రాండింగ్, మార్కెటింగ్, ఉత్పత్తి రంగంలో అభివృద్ధి వంటి ప్రణాళికలు, వ్యూహాలపై ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. చంద్రాయణగుట్ట, మలక్‌పేటలోని జీహెచ్ఎంసీ సర్కిల్‌లోని వీ హబ్ మెప్మా (ఎమ్ఈపీఎమ్ఏ) సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దాదాపు 120 మంది మహిళా వ్యవస్థాపకులు పాల్గొన్నారు. శిక్షణకు చొరవ చూపిన సంస్థ సోషల్ ఇంపాక్ట్ – ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డైరెక్టర్ జాహిద్ అక్తర్ షేక్‌ను జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ వీ.సురేందర్ అభినందించారు.

స్వరోవ్‌స్కీ బ్రాండ్ అంబాసిడర్‌గా రష్మిక



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఆభరణ ప్రియులకు చిరపరిచితమైన అంతర్జాతీయ ప్రసిద్ధి చెందిన ఆభరణాల బ్రాండ్ స్వరోవ్‌స్కీ టాలీవుడ్ నటి రష్మిక మందన్నను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించింది. ఈ విషయాన్ని సంస్థ జీఎం నాస్ర్ స్లీమాన్ తెలిపారు. నగరంతో సహా దేశవ్యాప్తంగా ఉన్న ఆభరణ ప్రియులను ఆమె ఆకర్షించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. రష్మిక మాట్లాడుతూ వ్యక్తుల ఆత్మవిశ్వాస వ్యక్తీకరణకు మార్గంగా నిలిచే ఈ బ్రాండ్‌కు తాను ఎప్పటి నుంచో అభిమానిని అని చెప్పారు.

2.65 లక్షల చదరపు అడుగులు..

రూ. 5.4 కోట్ల అద్దె!

గచ్చిబౌలిలో ఆఫీస్ స్పేస్ కోసం టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ భారీ లీజు ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఏడాది హైదరాబాద్‌లోకెల్లా అతిపెద్ద వాణిజ్య ఒప్పందాల్లో ఒకటి కుదుర్చుకుంది. గచ్చిబౌలిలో ఉన్న 17 అంతస్తుల ఫీనిక్స్ సెంటారస్ భవంతిలోని 3, 4వ అంతస్తుల్లో 2.65 లక్షల చదరపు అడుగుల స్థలం కోసం ఏకంగా నెలకు రూ. 5.4 కోట్ల అద్దె చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు ఆఫీస్ టేబుల్ స్పేస్ టెక్నాలజీస్ సంస్థతో ఐదేళ్ల లీజు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఏడాది జూలై ఒకటి నుంచి ఈ ఒప్పందం అమల్లోకి వచ్చినట్లు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ ప్రాప్ స్టాక్ వెల్లడించింది. ఈ ఒప్పందానికి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీల కింద మైక్రోసాఫ్ట్ ఏకంగా రూ. 92.94 లక్షలు చెల్లించినట్లు తెలుస్తోంది. లీజు పత్రాల ప్రకారం ప్రతి చదరపు అడుగుకు రూ. 67 బేస్ అద్దెతోపాటు నిర్వహణ చార్జీలు, నిర్వహణ ఖర్చులు, మూలధన ఖర్చులు, నిర్వహణ రుసుములు ఉన్నాయి. ఈ ఒప్పందం ప్రకారం ఏటా అద్దె 4.8 శాతం పెరగనుంది. ఐదేళ్ల లీజు కాలానికి కంపెనీ రూ. 42.15 కోట్లను సెక్యూరిటీ డిపాజిట్ చేసింది. గతేడాది టీసీఎస్ గచ్చిబౌలిలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 10.18 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని రూ. 4.3 కోట్ల నెలవారీ అద్దె కింద లీజుకు తీసుకుంది. అలాగే గతేడాది డిసెంబర్‌లో మరో దిగ్గజ సంస్థ ఫేస్‌బుక్ హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో 3.7 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలం లీజు పునరుద్ధరణ కోసం రూ. 2.8 కోట్ల నెలవారీ అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది.

క్లుప్తంగా...

మట్టి వినాయకులనే పూజిద్దాం

సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక



సాక్షి, హైదరాబాద్: మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయకుడి పండుగను ఘనంగా జరుపుకోవాలని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సీహెచ్ ప్రియాంక సూచించారు. సోమవారం సమాచారశాఖ కార్యాలయంలో ఉద్యోగులకు మట్టి గణపతి విగ్రహాల ను పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. గణేశ్ చతుర్థి పది రోజుల పాటు జరిగే ముఖ్యమైన పండుగ అన్నారు. పర్యావరణానికి హానిలేకుండా మట్టి వినాయకులనే పూజించాలని, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ప్రియాంక పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు సంచాలకుడు డీఎస్ జగన్, జాయింట్ డైరెక్టర్లు డి.శ్రీనివాస్, కె.వెంకటరమణ, సీఐఈ రాధాకిషన్, డిప్యూటీ డైరెక్టర్లు ఎం.మధుసూదన్, సి.రాజారెడ్డి, సమాచార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య అనుబంధ వృత్తుల రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేయాలి

మంత్రి దామోదర, కార్యదర్శికి వైద్య అనుబంధ వృత్తులఫోరం వినతి

సాక్షి, హైదరాబాద్: వైద్యశాఖ పరిధిలోని 57 రకాల అనుబంధ వృత్తుల కోసం పూర్తిస్థాయి రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేయాలని వైద్య అనుబంధ వృత్తుల జాయింట్ ఫోరం ప్రధాన కార్యదర్శి మంచాల రవీందర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఇతర అనుబంధ వృత్తి సంఘాల నాయకులతో ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తూను కలిసి వినతిపత్రం అందించారు. కేంద్ర ప్రభుత్వం 2021, మార్చిలో వైద్య అనుబంధ వృత్తుల జాతీయ కమిషన్ ఏర్పాటు చేసి, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మినహా మిగతా 57 రకాల వృత్తులకు సంబంధించిన వారిని ఒకే గొడుగు కిందకి తెచ్చి జాతీయ కమిషన్ ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం 2022లో చైర్మన్, ముగ్గురు కో ఆప్షన్ నంబర్లతో రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేసినా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే వారి కాల పరిమితి పూర్తి అయిందని రవీందర్ తెలిపారు. సమావేశంలో నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్‌తోపాటు పూర్వ కౌన్సిల్ చైర్మన్ విజయ్‌కుమార్, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అధ్యక్షుడు దామోదరనాయుడు, వైద్య అనుబంధ వృత్తుల జాయింట్ ఫోరం కోశాధికారి ఎంఏ వారిస్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్ అనితా రెగో ఉన్నారు.

ఐదుగురు మెడికల్ విద్యార్థుల సస్పెన్షన్

యాంటీ ర్యాగింగ్ కమిటీ నిర్ణయం

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాహుల్ రెడ్డిని ర్యాగింగ్ చేసినందుకు గాను ఇంటర్న్‌షిప్ చేస్తున్న ఐదుగురు మెడికోలపై సస్పెన్షన్ వేటు పడింది. మెడికల్ కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కృష్ణమోహన్ ఆధ్వర్యంలో సోమవారం ఈ కమిటీ ప్రత్యేక సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ అంకిత్, డీసీపీ బస్వారెడ్డిలు హాజరయ్యారు. ర్యాగింగ్ చేసిన ఇంటర్న్‌షిప్ విద్యార్థులు, బాధిత విద్యార్థి, వారి తల్లిదండ్రులను ఈ కమిటీ విచారించింది. అనంతరం కమిటీ చర్చించి ర్యాగింగ్ చేసిన ఐదుగురు విద్యార్థులను 6 నెలల పాటు సస్పెండ్ చేసింది. కళాశాల నుంచి వారిని టర్మినేట్ చేశారు. ఇప్పటికే నిజామాబాద్ ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ ఐదుగురు విద్యార్థులపై కేసు నమోదైంది.

ఏ ఎన్నిక ముందో..?

ముందు పంచాయతీయా లేక మండల, జిల్లా పరిషత్తా అన్నదానిపై సందిగ్ధత

- కోర్టు ఆదేశాలతో పాటు నిధుల కోసమైతే పంచాయతీకే తొలుత జరిగే చాన్స్
- సెప్టెంబర్ నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలన్న హైకోర్టు
- 29న కేబినెట్ భేటీలో ఎన్నికల తేదీలపై నిర్ణయం తీసుకునే అవకాశం
- బీసీలకు పార్టీ పరంగా 42% కోటాపైనా నిర్ణయం?



సాక్షి, హైదరాబాద్: అన్నీ అనుకూలిస్తే వచ్చే నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 29న జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో.. ఎన్నికల తేదీలపై నిర్ణయం తీసుకోనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. అలాగే స్థానిక ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఇప్పటికే సంబంధిత శాఖలకు ఆదేశాలు అందినట్లు చెబుతున్నారు. కాగా 35 నుంచి 40 రోజుల్లో రెండు ఎన్నికల (సర్పంచ్, ఎంపీటీసీ) ప్రక్రియ ముగించేలా ఏర్పాట్లు చేసుకుంటామని ఆయా శాఖలు సర్కార్‌కు చెప్పినట్లు అధికార వర్గాల సమాచారం. రాష్ట్ర మంత్రివర్గం ఎన్నికల తేదీలపై, రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకున్న వెంటనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంబంధిత కసరత్తు మొదలు పెట్టనున్నాయి. సెప్టెంబర్ మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి, నెలాఖరులోగా గ్రామ పంచాయతీ లేదా మండల, జిల్లా పరిషత్‌లలో ఒకటి, ఆ తర్వాత రెండువారాల్లో అంటే అక్టోబర్ 15 లోగా మరో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు. దీనికి తగ్గట్టుగానే రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కూడా ఎన్నికల నిర్వహణ కసరత్తును వేగవంతం చేసినట్లు సమాచారం. అయితే ఎన్నిక ముందు నిర్వహించాలనే దానిపై ఇంకా స్పష్టత లేకపోవడం గమనార్హం.

ఏ ఎన్నిక ముందో తొలగని సందిగ్ధత

సెప్టెంబర్ 30లోగా గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించింది. అయితే దీనికి లోబడి ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారా? లేదా? అనే దానిపై సందిగ్ధత కొనసాగుతోంది. తొలుత రాజకీయ పార్టీల గుర్తులపై జరిగే మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు జరుగుతాయా లేక స్వతంత్ర గుర్తులపై జరిగే పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు చూపుతుందా? అన్న దానిపై స్పష్టత కొరవడింది. ఈ ఎన్నికల అంశం మొత్తం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల చుట్టూనే తిరుగుతున్న విషయం తెలిసిందే. సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ పరంగా రాజకీయ పరమైన రిజర్వేషన్ల అమలుకు అవకాశం ఉండదు కాబట్టి..ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరుపుతారా? అన్న కోణంలో అధికార కాంగ్రెస్‌లో చర్చ సాగుతోంది. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీస్థాయి వరకు వెళ్లినా అటు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ, ఇటు బీఆర్ఎస్ పార్టీ వాటిని రాకుండా అడ్డుకున్నాయనే ప్రచారాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే ఆలోచనతో ప్రభుత్వ ముఖ్యులు, పార్టీ నేతలు ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ గుర్తులపై జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను ముందుగా నిర్వహించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం.

నిధుల కోసమైతే పంచాయతే ముందు..

స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపని కారణంగా కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. దీంతో పల్లెల్లో అభివృద్ధి పనులు స్తంభించిపోయాయనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామాలకు నిధుల విషయానికే ప్రాధాన్యత ఇచ్చే పక్షంలో తొలుత పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అధికారులలు సూచిస్తున్నట్టు తెలుస్తోంది. హైకోర్టు కూడా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించే ఆదేశాలిచ్చినందున ముందుగా వాటిని జరిపితేనే మంచిదనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

'నిషేధిత' భూవివాదాల పరిష్కారానికి కమిటీ

- ఏర్పాటు చేశామని హైకోర్టుకు తెలిపిన సర్కార్
- కమిటీ పని తీరును పరిశీలిస్తామన్న న్యాయస్థానం
- నిషేధిత జాబితాను ప్రజలకు తెలియకుండా ఎందుకు ఉంచారని నిలదీత
- ఆ జాబితాను రిజిస్ట్రార్లకు పంపాలని కలెక్టర్లకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేర్చిన వేలాది భూముల వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక కమిటీని నియమించినట్లు హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం సోమవారం తెలిపింది. ఈ మేరకు ముగ్గురు సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈ నెల 23న జీవో 98 జారీ చేసినట్లు రెవెన్యూ శాఖ ప్రభుత్వ న్యాయవాది కట్రం మురళీధర్‌రెడ్డి చెప్పారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి/భూ పరిపాలన ప్రధాన కమిషనర్.. చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ప్రభుత్వం నియమించే రిటైర్డ్ జిల్లా న్యాయమూర్తి, సర్వే అండ్ సెటిల్‌మెంట్ విభాగం కమిషనర్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. సంబంధిత రికార్డులను పరిశీలించడం, నోటిఫైడ్ ఆస్తుల జాబితా నుంచి అటువంటి ఆస్తిని నిర్ధారించడం, తొలగించడం, సవరించడం ద్వారా ఫిర్యాదును అంగీకరించడం లేదా తిరస్కరించడం చేస్తుందన్నారు. ప్రభుత్వ వాదనను నమోదు చేసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణ వచ్చే నెల 3కు వాయిదా వేసింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని శంకర్‌హిల్స్ కాలనీలోని 475 గజాల భూమి కొనుగోలుకు సంబంధించి సేల్ డీడ్ స్వీకరించకపోవడాన్ని సవాల్ చేస్తూ గుప్తా రియాల్టీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది.

9 వారాల్లో రిజిస్ట్రార్లకు చేరాలి..

గత వారం విచారణ సందర్భంగా.. నిషేధిత జాబితాకు సంబంధించి హైకోర్టులో 5,100 కేసులున్నాయని న్యాయమూర్తి చెప్పారు. ఈ జాబితాను రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, కేసుల నమోదుకు ఇదే ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. వివాదాల పరిష్కారానికి ఓ కమిటీని ఏర్పాటు చేయాలన్న ఆదేశాల మేరకు.. కమిటీని నియమించినట్లు సోమవారం సర్కార్ పేర్కొంది. కమిటీ ఆదేశాలకు రాష్ట్రంతోపాటు బాధిత వ్యక్తి కట్టుబడి ఉంటారని చెప్పింది. కమిటీ ఉత్తర్వులపై న్యాయస్థానాలను ఆశ్రయించే వీలు ఉంటుందని జీవోలో పేర్కొన్నట్లు జీపీ తెలిపారు. ఈ కమిటీ కాలపరిమితి మూడేళ్లని, నెలకోసారి భేటీ అవుతుందని చెప్పారు. కమిటీ ఏర్పాటు చేస్తూ జీవో జారీ చేసినంత మాత్రాన విచారణను ముగించబోమని ధర్మాసనం చెప్పింది. కమిటీ ఎలా పనిచేస్తుందో పరిశీలిస్తామని పేర్కొంది. నిషేధిత జాబితాను ప్రజలకు తెలియకుండా చీకట్లో ఎందుకు ఉంచుతున్నారని ప్రశ్నించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయో పూర్తి వివరాలను సిద్ధం చేయాలని కలెక్టర్లను న్యాయమూర్తి ఆదేశించారు. 9 వారాల్లో జాబితా అంతా రిజిస్ట్రేషన్ కార్యాలయాల (రిజిస్ట్రార్ల)కు పంపాలని.. ఆ భూములు రిజిస్ట్రేషన్ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. దీనిపై అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. అఫిడవిట్ దాఖలులో విఫలమైతే సీఎస్ నేరుగా సెప్టెంబర్ 3న తమ ముందు హాజరై, వైఫల్యానికి కారణాలు తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు.



జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ దొనడి రమేష్, జస్టిస్ సుబేందు సమంత

జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రమేష్ మళ్లీ ఏపీ హైకోర్టుకు..

సుప్రీం సీజే జస్టిస్ బీఆర్ గవాయ్ కొలీజియం సిఫారసు

సాక్షి, అమరావతి: ఏపీ హైకోర్టు నుంచి గతంలో బదిలీపై వెళ్లిన న్యాయమూర్తులు జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ దొనడి రమేష్‌లు తిరిగి రానున్నారు. జస్టిస్ రాయ్ ప్రస్తుతం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తిగా, జస్టిస్ రమేష్ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. వీరిద్దరిని మళ్లీ ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం సోమవారం తీర్మానం చేసింది. ఇదే సమయంలో.. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుబేందు సమంతను ఏపీ హైకోర్టుకు బదిలీ చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం కేంద్రానికి సిఫారసులు పంపింది. దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టులకు చెందిన 14 మంది న్యాయమూర్తులను బదిలీ చేస్తూ కొలీజియం తీర్మానం చేసింది. ఈ ప్రతిపాదనలకు రాష్ట్రపతి ఆమోదముద్ర వేసిన తర్వాత వారు ఆయా హైకోర్టుల్లో ప్రమాణం చేస్తారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా వచ్చిన అనంతరం జస్టిస్ మానవేంద్రనాథ్ మూడో స్థానంలో కొనసాగుతారు. హైకోర్టు కొలీజియంలో సభ్యుడిగా ఉంటారు. జస్టిస్ రమేష్ 6వ స్థానంలో, జస్టిస్ సుబేందు సుమంత 29 స్థానంలో ఉంటారు. ఈ ముగ్గురి నియామకంతో ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 33కి చేరనుంది.

కొన్నోళ్లే కన్నోళ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

తల్లిదండ్రులకు అనుకూలంగా సింగిల్ బెంచ్ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ.. మాతా, శిశు సంక్షేమ శాఖ డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్లింది. ఇందులో డివిజన్ బెంచ్ ప్రభుత్వానికి అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో గత ఫిబ్రవరిలో పిల్లలను కొనుగోలు చేసిన దాసరి అనిల్ కుమార్ కుటుంబంతోపాటు మరో ముగ్గురు దంపతులు సుప్రీంకోర్టులో అప్పీల్‌చేశారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న ధర్మాసనం.. కొనుగోలు చేసిన తల్లిదండ్రులకే 14వ తేదీలోగా పిల్లల్ని ఇవ్వాలని ఈ నెల 12న తుది తీర్పును వెలువరించింది. అయితే, సుప్రీం తీర్పును అధికార యంత్రాంగం పాటించడం లేదంటూ ఆ తల్లిదండ్రులు ఈనెల 18న ధిక్కరణ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. తాము ఇటీవల ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడంపై జస్టిస్ నాగరత్న అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం 5 గంటల లోపు కొనుగోలు చేసిన తల్లిదండ్రులకు పిల్లలను ఇచ్చేయాలని ధర్మాసనం అధికారులను ఆదేశించింది. అయితే, తమకు మంగళవారం వరకు సమయం ఇవ్వాలని ప్రభుత్వం తరపు ఏఎస్‌జీ కోరారు. 'సరే ఈ ఒక్కసారికి అవకాశమిస్తున్నాం, మంగళవారం ఉదయం 11గంటలకల్లా తల్లిదండ్రుల చేతిలో ఆ పసికందులు ఉండాలి'అని జస్టిస్ నాగరత్న ఆదేశించారు. అయితే సోమవారం సాయంత్రంలోపే పిల్లలను ఆ తల్లిదండ్రులకు అధికారులు అప్పగించారు.

ఇదీ జరిగింది : గత ఏడాది మేలో మేడిపల్లిపరిధిలో పిల్లల అక్రమ రవాణా, విక్రయం వ్యవహారం బట్టబయలైంది. మహిళా ఆర్ఎంపీ ఈ తతంగాన్ని నడుపుతున్నట్లు గుర్తించి పోలీసులు 11 మందిని అరెస్ట్‌చేశారు. వారు మొత్తం 16 మంది చిన్నారులు (నలుగురు మగ, 12 మంది ఆడ పిల్లల్ని) అమ్మినట్లు గుర్తించారు. ఏడుగురు చిన్నారులను అమ్మకం దశలోనే పట్టుకోగా, మరో 9 మందిని కొనుగోలు చేసిన తల్లిదండ్రుల నుంచి తీసుకొని మాతా, శిశు సంక్షేమ శాఖకు అప్పగించారు. వీరిని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) ద్వారా ప్రభుత్వం దత్తత ప్రక్రియలో పెట్టింది. వీరిలో అమ్మకం దశలో దొరికిన ఆరుగురు చిన్నారులను పేరెంట్స్ దత్తత తీసుకున్నారు. కొనుగోలు చేసిన తల్లిదండ్రుల నుంచి తీసుకొచ్చిన 9 మంది చిన్నారులను కూడా పిల్లలు లేని తల్లిదండ్రులు ఎంపిక చేసుకొని, తదుపరి రోజు తీసుకోవాల్సి ఉండగా, హైకోర్టు ఆదేశాలతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అప్పటి నుంచి ఈ కేసు కొనసాగుతోంది. ఇందులో నలుగురు మాత్రమే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీరికి మాత్రమే తాజా తీర్పు వర్తిస్తుందని జస్టిస్ నాగరత్న స్పష్టం చేశారు. మిగిలిన ఐదుగురికి సంబంధించిన కేసు ఈ నెల 28న హైకోర్టు ముందుకు రానుంది.

ఏంటి.. చార్జ్‌షీట్‌లో ఇన్ని తప్పులా..?

వివరాలన్నీ అసంపూర్ణం..తప్పుల తడకలు

అధికారుల ముందస్తు అనుమతి లేకుండా చార్జ్‌షీట్ ఎలా దాఖలు చేస్తారు?

ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు దాఖలు చేయకుండా చార్జ్‌షీట్ ఎలా చెల్లుబాటవుతుంది?

దారిమళ్లాయని చెబుతున్న రూ.3,500 కోట్ల వివరాలు సరిగా ఇవ్వాలి

మద్యం అక్రమ కేసులో సిట్ పనితనంపై ఏసీబీ కోర్టు అభ్యంతరం .. అధికారుల ముందు 21 అభ్యంతరాల మెమోరాండం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జలాశయాలకు జలకళ.. చెరువులు వెలవెల..

▶ మొదటి పేజీ తరువాయి

ఓ నివేదికలో ఈమేరకు వెల్లడించింది. జలవనరుల సమర్థ నిర్వహణ, పర్యవేక్షణ కోసం నీటిపారుదల శాఖ నిర్వహిస్తున్న ఇరిగేషన్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్ (ఐడీఎస్‌సీ) డ్యాష్‌బోర్డుకి ఇప్పటివరకు రాష్ట్రంలోని 21,500 చెరువులను మ్యాపింగ్ చేశారు. వాటి మొత్తం నిల్వ సామర్థ్యం 253.8 టీఎంసీలు కాగా, 119.23 టీఎంసీల నిల్వలు (47 శాతం) కలిగి ఉన్నాయి. ఈ చెరువులు మొత్తం 3098.85 చదరపు కి.మీ. ప్రాంతంలో విస్తరించి ఉండగా, 1321.44 చ.కి.మీ. ప్రాంతాని(42.6 శాతం)కే నీటి నిల్వలు పరిమితమయ్యాయి.

నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో కరువే..

గత ప్రభుత్వం నీటిపారుదల శాఖను 19 ప్రాదేశిక ఈఎన్సీలు/చీఫ్ ఇంజనీర్లుగా విభజించింది. శాఖ నివేదిక ప్రకారం రాష్ట్రంలో గజ్వేల్ ఈఎన్సీ పరిధిలో అత్యధిక చెరువులు పూర్తిగా నిండి మత్తడి దూకుతున్నాయి. గజ్వేల్, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో వానాకాలం ముగిసేలోగా కురవనున్న వర్షాలతో చెరువులు పూర్తిగా నిండే అవకాశం ఉంది. అయితే, చెరువుల్లో నీటి నిల్వలపరంగా అత్యంత కరువు పరిస్థితులు నల్లగొండ, నిజామాబాద్ జిల్లాల్లో ఉన్నాయి. నల్లగొండ సీఈ పరిధిలో 1628 చెరువులుండగా, కేవలం 183 చెరువులే పూర్తిగా నిండాయి. పొరుగునే ఉన్న సూర్యాపేట, కొత్తగూడెం జిల్లాల్లో పరిస్థితి మెరుగ్గానే ఉంది. నిజామాబాద్ సీఈ పరిధిలో 997 చెరువులుండగా, 55 చెరువులే పూర్తిగా నిండాయి.

జలాశయాల్లో 75% నిల్వలు

రాష్ట్రంలో కృష్ణా, గోదావరి పరీవాహకంలో మొత్తం 1069.34 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 87 జలాశయాలుండగా, సోమవారం నాటికి 802.92 టీఎంసీల (75శాతం) నిల్వలున్నాయి. ఎగువ నుంచి రెండు నదులకూ వరదలు కొనసాగుతుండటంతోపాటు ప్రస్తుత వానాకాలం ముగిసేలోగా మరికొన్ని దఫాలు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో జలాశయాలు 100శాతం నిండే అవకాశం ఉంది. పరీవాహక ప్రాంతాల వారీగా చూస్తే గోదావరి పరిధిలో 419.81 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో 57 జలాశయాలుండగా, ప్రస్తుతం 223.67 టీఎంసీలకు నిల్వలు చేరాయి. కృష్ణా పరిధిలో 649.53 టీఎంసీల సామర్థ్యంతో 30 జలాశయాలుండగా, నిల్వలు 579.25 టీఎంసీలకు చేరాయి. జలాశయాలు, చెరువులు కలిపి మొత్తం 1323.14 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉండగా, ప్రస్తుతం 922.15 టీఎంసీలకు నిల్వలు చేరాయి.

రాష్ట్రంలో ప్రాదేశిక ఈఎన్సీ/చీఫ్ ఇంజనీర్ల పరిధిలోని చెరువుల పరిస్థితి ఇలా..

ఈఎన్సీ/సీఈ	మొత్తం చెరువులు	పూర్తిగా నిండినవి	75-100% నిండినవి	50-75% నిండినవి	25-50 నిండినవి	0-25శాతం నిండినవి
గజ్వేల్	4,590	1,725	1,093	839	521	412
హైదరాబాద్	2,599	747	559	478	419	396
వరంగల్	2,434	727	944	371	229	163
కరీంనగర్	2,334	213	809	539	421	352
మహబూబ్‌నగర్	2,274	1,224	681	236	82	51
ఆదిలాబాద్	977	566	399	15	1	6
నల్లగొండ	1,628	183	317	281	234	613
సూర్యాపేట	1,225	645	449	110	16	8
కొత్తగూడెం	2,145	1,070	914	153	8	-
నిజామాబాద్	997	55	325	224	305	88



సింఘ్వీని సత్కరిస్తున్న భట్టి. చిత్రంలో శ్రీధర్‌బాబు, పొన్నం, వీహెచ్, ఉత్తమ్, కేకే, సీతక్క తదితరులు

29న కేబినెట్ భేటీలో తుది నివేదిక: భట్టి

సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశంపై ఈనెల 29న జరిగే కేబినెట్ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం తుది నివేదిక అందజేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. సోమవారం ఢిల్లీలో మంత్రుల బృందంతో కలిసి అభిషేక్ మను సింఘ్వీని కలిసిన అనంతరం.. భట్టి విలేకరులతో మాట్లాడారు. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపాం. ఆ బిల్లులు రాష్ట్రపతి దగ్గర పెండింగ్‌లో ఉన్నాయి. సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు చెప్పింది. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి మార్గాలను అన్వేషిస్తున్నాం. సీనియర్ నాయకులతో కలిసి సీనియర్ అడ్వకేట్ సింఘ్వీతో చర్చించాం. దేశంలోని న్యాయకోవిదుల్లో ఒకరైన సింఘ్వీ ఆలోచనలు తీసుకుని ముందుకెళ్తాం. ఈ అంశంపై లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని సింఘ్వీ చెప్పారు'అని పేర్కొన్నారు.

'కోటా' చిక్కుముడి విప్పేదెలా?

▶ మొదటి పేజీ తరువాయి

ఢిల్లీలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గంటపాటు భేటీ అయ్యారు. ఇప్పటికే విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులు రాష్ట్రపతి కోసం వేచి చూస్తున్న విషయాలతోపాటు, 2018లో చంద్రశేఖర్ రావు రిజర్వేషన్లను 50శాతానికి పరిమితి చేస్తూ చేసిన చట్టాన్ని తొలగించాలన్న ఆర్డినెన్స్‌పైనా చర్చించారు. ఈ బిల్లుల ఆధారంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 263 ప్రకారం బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ జీవో ఇవ్వడమా?, ఇస్తే ఈ ఉత్తర్వుల అమలును ఇతరులెవరూ కోర్టుకు వెళ్లి అడ్డుకోకుండా ముందుగానే కేవియట్ దాఖలు చేయడమా? అన్న అంశాలపై మంత్రులు సమాచాలోచనలు చేశారు. ఒకవేళ కోర్టులు అభ్యంతరం చెబితే కులగణన సర్వే ద్వారా సేకరించిన డేటాతో బీసీల జనాభా, వెనకబాటుతనాన్ని నిరూపించే అవకాశాలపైనా చర్చించారు. ఇప్పటికే 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోసం చేసిన 103వ రాజ్యాంగ సవరణతో విద్య, ఉద్యోగాల్లో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటడాన్ని సుప్రీంకోర్టు సమర్థించిన దృష్ట్యా, సర్వే డేటాలోని అంశాలు తమకు కలిసి వస్తాయనే అభిప్రాయం వ్యక్తమైంది. 50 శాతం రిజర్వేషన్లు దాటితే సమానత్వపు హక్కు ఉల్లంఘన జరిగినట్లేనని, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే 50శాతం పరిమితిని దాటవచ్చని సుప్రీంకోర్టు.. గతంలో మరాఠాల రిజర్వేషన్లపై తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎంపిరికల్ డేటాను ఎంతవరకు ప్రామాణికంగా చూపవచ్చనే అంశంపైనా చర్చించారు. హైకోర్టు విధించిన గడువు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితుల్లో అదనపు గడువు కోరే అవకాశాలపైనా చర్చలు జరిగాయి. అయితే ఈ నెల 29న జరిగే కేబినెట్ భేటీలో చర్చించి తుది నిర్ణయం చేయనున్నారు.

నేడు బిహార్‌కు సీఎం, మంత్రులు

రానున్న బిహార్ ఎన్నికలకు ముందు జాతీయ ఎన్నికల సంఘం ఓట్ల చోరీకి పాల్పడుతోందంటూ ఏఐసీసీ అగ్రనేత తలపెట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులు పాల్గొననున్నారు. ఓట్ల చోరీపై రాహుల్ చేస్తున్న పోరాటానికి రాష్ట్ర నేతలు సంఘీభావం తెలపనున్నారు. రోడ్‌షోలో ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ సైతం పాల్గొనే అవకాశాలున్నాయి.

రిజర్వేషన్ల సాధనకు బీసీ సత్యాగ్రహ దీక్ష



సత్యాగ్రహ దీక్షలో అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు

కవాడిగూడ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను చట్టబద్ధంగా అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా బీసీల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం ఇందిరాపార్కు వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అధ్యక్షతన బీసీల సత్యాగ్రహ దీక్షను ఆర్.కృష్ణయ్య చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధమైన మార్గాల ద్వారానే సాధ్యమవుతుందని చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన కమిషన్లు కాకుండా తాత్కాలికంగా నియమించిన కమిషన్ల సిఫార్సులు ఏవిధంగా చెల్లుబాటు అవుతాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీలో నిరసన చేయడం, పవర్ పాయింట్ ప్రజెంటేషన్లు ఇవ్వడం కాలయాపనే తప్ప పరిష్కారం కాదన్నారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు సాధ్యం కాదని తెలిసినా, కాంగ్రెస్ పార్టీ తరఫున స్థానిక ఎన్నికల్లో 42 శాతం సీట్లు ఇస్తామని కొత్త డ్రామాకు తెరలేపిందని చెప్పారు.

- ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు జరిగేంతవరకు వెనక్కి తగ్గమని, ఇది బీసీల హక్కు మాత్రమే కాదని, చారిత్రక అవసరమన్నారు.
- మండలిలో విపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల చట్ట బద్ధ అమలు అంటే సామాజిక న్యాయమని.. ఇది సాధించడానికి బీఆర్ఎస్ పార్టీ బీసీ సమాజానికి తోడుగా ఉంటుందన్నారు.
- మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల పేరిట బీసీలను మోసం చేస్తుందని ఆరోపించారు.
- బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు విధానాలను మానుకొని చట్టబద్ధంగా రిజర్వేషన్ల అమలుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, సత్యం, దూదిమెట్ల బాలరాజుయాదవ్, నీల వెంకటేశ్, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, రాజారాం యాదవ్, బర్క కృష్ణ, శ్రీనివాస్ యాదవ్, అనురాధ, లతాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

- 27వ తేదీ నాటికి అదేప్రాంతంలో అల్పపీడనం
- దీని ప్రభావంతో రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు
- వాతావరణంలో మార్పులతో రాష్ట్రంలో పెరిగిన ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: వాయవ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లోని ఒడిశా, పశ్చిమబెంగాల్ తీరం సమీపంలో సోమవారం ఉదయం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో 27వ తేదీ నాటికి వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనం, ఆ తర్వాత ఏర్పడే అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ వెల్లడించింది. ప్రధానంగా ఉత్తర ప్రాంత జిల్లాల్లో చాలాచోట్ల మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల ఉరుములు, మెరుపులు.. గంటకు 30 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన అతిభారీ వర్షాలు కూడా నమోదు కావొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం ఈసీజన్‌లో యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట్ జిల్లాల్లోఅత్యధిక వర్షపాతం నమోదు కాగా.. 11 జిల్లాల్లో అధిక వర్షపాతం, 17 జిల్లాల్లో సాధారణ వర్షాలు నమోదయ్యాయి. గత నాలుగు రోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 26-8-2025

● వైవాహికం



పెళ్లి మంత్రాల్లో ఏ అర్థం ఉందో తెలుసుకోరు చాలామంది.
పెళ్లిలో ఎలాంటి విధానంతో మెలగాలో తెలుసుకోరు ఎంతకాలమైనా.
బడిలో ఒకటో తరగతి నుంచి పాఠాలు చదువుతారుగాని
పెళ్లిలో ఏ అవగాహన పాఠాలు చదవకుండానే నెట్టుకొచ్చేయాలనుకుంటారు.
వర్తమానంలో దంపతుల మధ్య జరుగుతున్న అనర్థాలు ప్రతి ఒక్కరినీ ఆగి,
తమ వైవాహిక జీవనాన్ని తరచి చూసుకోమని కోరుతున్నాయి.
సరి చేసుకుని ఆనందమయం చేసుకోమంటున్నాయి.

అర్థం చేసుకోవాలి అనర్థాలు నివారించుకోవాలి

న్యూస్

పేపర్లు తెరిస్తే భార్యాభర్తల విడాకులు, హత్యోదంతాలు, ఆత్మహత్యలు... సోషల్ మీడియాలో చూస్తే వీధికెక్కి రచ్చ చేసుకోవడం, ఇంటి గుట్టు బయటపడేయడం... వివాహం వార్తగా మారడం... వివాహ గొడవలే ప్రధాన వార్తలుగా చలామణి కావడం చూస్తుంటే మనం ఎటువంటి సమాజం నుంచి ఎటువంటి సమాజానికి చేరుకుంటున్నామనేది పరిశీలించుకోవాలి.

గతంలో ఎలా ఉండేది?

నలభై, యాభై ఏళ్ల క్రితం వివాహ వ్యవస్థలో ఘోరమైన ఉదంతాలు ఇంత విస్తృతంగా కనిపించేవి కావు. దంపతులు, పిల్లలు, అవ్వా తాతలు... కుటుంబ వ్యవస్థ కొనసాగుతూ ఉండేది. భార్యాభర్తల కీచులాటలు టీకప్పులో తుఫానులా ఉండేవి. చెప్పాలంటే కొందరు భార్యాభర్తల గొడవలు వీధిలో ఉన్నవారికి నవ్వులాటగా ఉండేవి. అంటే భార్యాభర్తలు చీటికి మాటికి కీచులాడుకోవడం నవ్వొదగ్గ విషయంగా, వారి చేతగాని విషయంగా ఉండేది. విడాకులు అనే మాట చాలా అరుదుగా వినవచ్చేది. విడాకుల నిర్ణయానికి ఇటువైపు వర్గం, అటువైపు వర్గం వ్యతిరేకంగా నిలిచేది. యాక్సెప్టెన్స్ ఉండేది కాదు. వివాహాన్ని నిలబెట్టుకోవడానికి చేసే ప్రయత్నం విడిపోవడానికి పట్టుపట్టడంలో ఉండేది కాదు.

ఇవాళ ఎలా ఉంది?

వివాహ వ్యవస్థను గౌరవించకపోవడం, ఒకరి పట్ల ఒకరు చూపాల్సిన నిజాయితీ లోపించడం, పిల్లల మీద కక్ష తీర్చుకోవడం, సమస్యకు బదులుగా భార్యనో భర్తనో నిర్మూలించడమే ఏకైక పరిష్కారం అనుకోవడం, వివాహం జీవితానికి ఒక గుదిబండగా మారిందని దాని నుంచి ఎలాగైనా బయటపడాలని చెడు మార్గాలు వెతకడం, హాయిగా ఉన్న ఇంటి నుంచి దూరంగా వెళ్లి ఆనుసుపైన కొండలపై మరింత హాయిగా గడపాలనుకోవడం... ఇవన్నీ అందమైన జీవితాలను ఆగమాగం చేస్తున్నాయి. పరేషానీలోకి నెట్టేస్తున్నాయి. మానసిక, శారీరక కష్టాలు తెచ్చి భవిష్యత్తును చావు దెబ్బ తీస్తున్నాయి.

పెళ్లి అర్థం కాకుండా పెళ్లెందుకు చేసుకున్నారు?

పెళ్లి బొమ్మలాట కాదు. అది పెద్ద బాధ్యత. జీవితాన్ని ఫలవంతం చేసే దశ. ఒంటరి మనిషికి కుటుంబం అనే అందమైన బాంధవ్యాన్ని ఇచ్చే వరం. సంతానాన్ని ఇచ్చి ఎనలేని తృప్తినిచ్చే మార్గం. వివాహంలో అడుగుపెట్టాలంటే మానసికంగా, శారీరకంగా సిద్ధమయ్యి అన్నీ ఆలోచించుకుని ఉండాలి. కాని గతంతో పోలిస్తే ఇంత ఎక్సర్‌సైజ్ చేస్తున్నట్టు లేదు. అమ్మాయి, అబ్బాయిల ఇష్టాయిష్టాలు తమకు తాము పట్టించుకోకపోవడం, కుటుంబాలు నిర్లక్ష్యం చేయడం, పొంతన కుదురుతుందో లేదో చూడకపోవడం, అబ్బాయికి అమ్మాయికి ఉన్న ఉపాధి మార్గాలు వారిని కలిపి ఉంచుతాయా... ఎక్కువ పని గంటల వల్ల గాని, ఇతర ఊర్లకు వెళ్లి పని చేయడం వల్లగాని గ్యాప్ తెస్తాయా చూడకపోవడం... డబ్బు పట్ల ఎవరికి ఎంత ఆశ, అత్యాశ ఉంది... అబ్బాయి/అమ్మాయి గురించి ఆరా తీస్తే వారు పెద్దలకు, సంప్రదాయాలకు ఇచ్చే విలువ ఏ మాత్రం ఉంటుంది... ఇవన్నీ చూడకుండానే చేసేస్తున్నారు. దాని వల్ల సమస్యలు వెంటనే బయల్దేరుతున్నాయి.

మీ వివాహం సమస్యల్లో ఉంటే-

మీ వివాహం సమస్యల్లో ఉంటే మీ వివాహ బంధంలో ఈ విషయాలను చెక్ చేసుకోండి.

1. నిజాయితీ: మీరు మీ జీవిత భాగస్వామి పట్ల నిజాయితీతో ఉన్నారా? నిజమైన ప్రేమతో ఉన్నారా? నిజమైన ప్రేమ పొందేలా మీ చర్యలు ఉన్నాయా? ప్రేమను ప్రదర్శిస్తున్నారా? నువ్వంటే నాకు చాలా ప్రేమ అని ఒకసారైనా చెప్పగలుగుతున్నారా. ప్రేమ వివాహానికి మూలం. ప్రేమను వ్యక్తం చేయనప్పుడు ప్రేమ పొందలేరు.

2. కమ్యూనికేషన్: మీ మనసులో ఉన్నది స్పష్టంగా మీ జీవిత భాగస్వామికి చెబుతున్నారా? చెప్పి వారికి అది అర్థం చేసుకోవడానికి సమయం ఇస్తున్నారా? అన్నీ మనసులో పెట్టుకుని మౌనంగా ఉంటే అది హింస కిందకు వస్తుంది. మౌనంతో హింసించే విధానం మానుకుంటే వివాహంలో మాట, మంచి మాట మెల్లగా వస్తాయి.

3. వింటున్నారా?: వినడం తెలిస్తే సగం సమస్యలు పోతాయి. మీ జీవితభాగస్వామి ఏదైనా చెప్పబోతే మధ్యలోనే తుంచేస్తే, ఎదురు చెప్తే ఇక ఏమీ ముందుకు వెళ్లదు. ఎదుటి వారు చెప్తున్నది పూర్తిగా విని, సమయం తీసుకొని అందులోని మంచి చెడు పట్ల మీ అభిప్రాయం మెత్తగా, స్పష్టంగా చెప్పగలిగితే, అరవడాలు కరవడాలు లేకుండా మాట్లాడుకోగలిగితే చాలు. వివాహం వర్ధిల్లుతుంది.

4. గౌరవం ఉండాలి: ఒక మనిషి మరో మనిషిని ఎప్పుడు ఇష్టపడతాడంటే ఆ మనిషి తనను గౌరవిస్తున్నాడని తెలిసినప్పుడే. మనం వెళితే గౌరవించి టీ ఇచ్చే ఇంటికే మనం వెళ్తాం తప్ప ముఖాన తలుపు వేసే వారింటికి వెళతామా? భార్యాభర్తల విషయం కూడా అంతే. చులకన భావం వివాహానికి ప్రథమ విరోధి. భార్య/భర్త ఒకరినొకరు చులకన భావంతో చూస్తే వివాహం చులకనకు లోనవుతుంది. ఆ తర్వాత హేళన, ఆపైన తిట్టు, అటుపై కొట్లాట, తదుపరి నువ్వెంతంటే నువ్వెంత అనే మాటలు వచ్చేస్తాయి. చులకన వద్దు.

5. సహానుభూతి: పని చేసి అలసిపోయి ఉంటాడేమో, వంటపని, ఇంటి పనితో డస్సిపోయిందేమో అని ఒక నిమిషం పరస్పరం ఆలోచిస్తే... సానుభూతి అందిస్తే ఎంతో ఓదార్పుగా ఉంటుంది. అలసిపోయి ఉన్న జీవిత భాగస్వామిని 'ఆ.. పెద్ద చేశావులే' అనే ఒక్క మాటతో శాశ్వతంగా దూరం చేసుకోవచ్చు. సహానుభూతి చూపితే అది పెద్ద సహాయం చేస్తుంది. ఎమోషనల్ ఇంటిమసీ చాలా ముఖ్యం.

6. హద్దులు: మీరు వివాహం చేసుకున్నారు కాని పొలంలో పని చేసే ఎద్దును తెచ్చుకోలేదు. వివాహంలో హద్దులు ఉంటాయి. భార్య/భర్తల పర్సనల్ స్పేస్‌లో ఎంత వరకు వెళ్లాలో తెలుసుకొని ఉండాలి. ఉమ్మడి ఇష్టాలను కలిసి నిర్వహించుకోవాలి.

7. ఆర్థికం: ఆర్థిక విషయాలలో భార్యాభర్తల మధ్య అవగాహన అన్నింటి కంటే ముఖ్యం. అప్పులు, అధిక ఖర్చులు ఇద్దరిలో ఎవరు చేసినా ఆ వివాహం ప్రమాదంలో ఉన్నట్టు. అలాగే ప్రతి పైసా గీచిగీచి లెక్క అడిగినా ప్రమాదమే. ఇంటి ఖర్చు, పొదుపు, బాధ్యతలకు అవసరమైన సహాయం... వీటిని జాగ్రత్తగా చూసుకుంటే అంతటా అనుకూలమే.

ఈ ఏడు సలహాలు వివాహం ముందుకెళ్లడానికి ఏడడుగులు.

● హెల్త్ లైన్



దిండు రెండు ఏళ్లుగా వాడుతున్నారా?

'దిండును రెండు సంవత్సరాలుగా వాడుతున్నారా? వెంటనే దూరం పెట్టండి' అంటున్నారు హార్వర్డ్ వైద్యులు. 'ఎక్కువ కాలం వాడే దిండ్లు ధూళికణాలు, చెమట, బ్యాక్టీరియాలతో అలెర్జీలకు కారణమవుతాయి. సైనస్, చర్మసంబంధిత సమస్యలు ఎదురవుతాయి' అని హెచ్చరిస్తున్నారు. కొద్దిమంది దిండు కవర్ శుభ్రం చేయడానికి మాత్రమే పరిమితమై ఏళ్లకు ఏళ్లుగా దిండును వాడుతుంటారు. ఇది సరికాదు అంటున్నారు వైద్యులు. దుర్వాసనను దూరం పెట్టడానికి ఎయిర్ ఫ్రెషనర్స్‌ను వాడుతుంటారు. అయితే సింథటిక్ వెరైటీల వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది అని కొన్ని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి.

● సమ్‌థింగ్ స్పెషల్

ఇంతకీ నన్ను గుర్తు పట్టారా?



ఈ ఫోటోను చూడగానే... 'ఈవిడను ఎక్కడో చూసినట్లుగా ఉందే!' అనుకున్న వాళ్లు, వెంటనే... 'అంజూ బాబీ కదూ!' అని ఆశ్చర్యపోతారు.

లాంగ్ జంప్ స్టార్, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అంజూ బాబీ సరికొత్త వేషధారణతో కనిపించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. కేరళలోని కన్నూర్‌లో జరిగిన ఫ్యామిలీ గెట్–టు–గెదర్‌లో భాగంగా చేతిలో పాతకాలపు గొడుగు, కేరళ సంప్రదాయ పల్లె వస్త్రధారణతో కనువిందు చేసింది బాబీ.

'కుటుంబ సభ్యులందరూ ఒకే చోట కలుసుకోవడాన్ని మించిన గొప్ప సంతోషం ఏముంటుంది! ప్రతి క్షణాన్ని నవ్వులతో ఆనందంగా ఆస్వాదిస్తాం' అని తన పోస్ట్‌లో రాసింది అంజూ బాబీ.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్ట్ 25న ముగింపు ధరల్లో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,02,200	బంగారం (24 క్యారెట్లు)	1,03,300	బంగారం (24 క్యారెట్లు)	1,01,660	బంగారం (24 క్యారెట్లు)	1,03,300	బంగారం (24 క్యారెట్లు)	1,02,050	బంగారం (24 క్యారెట్లు)	1,01,500
బంగారం (22 క్యారెట్లు)	95,640	బంగారం (22 క్యారెట్లు)	93,050	బంగారం (22 క్యారెట్లు)	93,050	బంగారం (22 క్యారెట్లు)	95,840	బంగారం (22 క్యారెట్లు)	93.890	బంగారం (22 క్యారెట్లు)	93,050
వెండి	1,19,800	వెండి	1,19,600	వెండి	1,21,000	వెండి	1,19,600	వెండి	1,18,500	వెండి	1,31,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

మఖ కార్తె: ఆగస్టు 30 వరకు
పుబ్బ కార్తె: 31 నుంచి

ఐదు దొంతర్ల సాగు ద్వారా ఏటా రూ.3 లక్షల నికరాదాయం



సుభాష్ పాలేకర్ కృషి (ఎస్పీకే) పద్ధతిలో అద్భుతమైన ఆవిష్కరణ ఐదు దొంతర్ల ఉద్యాన పంటల సాగు చేపడితే వరి సాగులో రైతులు పొందే ఆదాయంతో పోల్చితే పది రెట్లు అధికాదాయం పొందవచ్చని సేవ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, ఎస్పీకే తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త విజయ్‌రామ్ తెలిపారు. భూతాపం పెరిగిపోతున్న దశలో వ్యవసాయదారులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను అధిగమించేందుకు ఎస్పీకే సేద్యం దోహదపడుతుందన్నారు. నిమగ్నమై పనిచేసే రైతులు ఐదు అంచెల ఉద్యాన పంటల సాగు ద్వారా ఎకరానికి ఏడాదికి రూ. 3 లక్షల వరకు నికరాదాయం పొందే విధంగా కొత్తగా వ్యవసాయం చేపట్టాలనుకునే వారికి శిక్షణ ఇస్తామని ఆయన వివరించారు.

సెప్టెంబర్ 2న పాలేకర్ ప్రసంగం

హైదరాబాద్ దోమల్‌గూడ శ్రీరామచంద్ర మిషన్‌లో సెప్టెంబర్ 2 (మంగళవారం)న ఉదయం 9 గంటలకు జరిగే తెలుగు రాష్ట్రాల ఎస్పీకే ముఖ్యుల సమావేశంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఎస్పీకే రూపశిల్పి డా. సుభాష్ పాలేకర్ ప్రసంగిస్తారని విజయ్‌రామ్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని పూర్వ జిల్లాల ప్రకారం ఎస్పీకే వ్యవసాయ పద్ధతిని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో అంకితభావంతో పని చేసే వారిని జిల్లా సమన్వయకర్తలుగా నియమించనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల రైతులు, యువ రైతులు, విశ్రాంత ఉద్యోగులు అందరికీ ఆహ్వానం పలుకుతున్నారు. జిల్లాకు కనీసం నలుగురు ప్రతినిధులు సెప్టెంబర్ 2 సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు.

డిసెంబర్‌లో క్షేత్ర సందర్శన

కృష్ణా జిల్లా గూడూరు మండలం తరకటూరు గ్రామంలో తాను పెంచిన ఐదు దొంతర్ల నమూనా క్షేత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 25 నుంచి వచ్చే ఏడాది జనవరి 15 మధ్య కాలంలో నిర్దేశిత తేదీల్లో సందర్శించవచ్చని విజయ్‌రామ్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని పాత జిల్లాలకు చెందిన వారికి ఒక్కో రోజు ఒక్కో జిల్లాకు చెందిన వంద మంది రైతులు సందర్శించవచ్చన్నారు. ఇతర వివరాలకు: ఫోన్: 6309111427

వ్యవసాయంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకం విపరీతంగా పెరుగుతోంది. మల్చింగ్ షీట్లు, మొలక ట్రేలు, డ్రిప్ లైన్లు, చెరువు లైనర్ షీట్లు, పాలీహౌస్‌ల నిర్మాణంతో పాటు ఆహార పదార్థాల నిల్వ, ప్యాకేజింగ్, రవాణా క్రమంలోనూ విరివిగా ప్లాస్టిక్ వాడుతున్నారు. పంట భూముల్లో మిగిలిపోయే పాలిథిన్ అవశేషాలు ఇప్పుడు హెక్టారుకు 300 కిలోలకన్నా ఎక్కువట. ప్లాస్టిక్ వస్తువుల్లో 16 వేల రకాల రసాయనాలు ఉంటాయి. వీటిలో 4,200 రసాయనాలు అత్యంత విషపూరితమైనవి. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ఇవి తీవ్ర హాని చేస్తున్నాయని ప్లాస్టకెమ్ ప్రాజెక్టు శాస్త్రవేత్తల బృందం గతేడాది గుర్తించింది. కాబట్టి, ప్లాస్టిక్ వాడకంలోను, వాడిన వాటిని పారేయటంలోనూ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



పొలాల్లో ప్లాస్టిక్ భూతం!

ప్లాస్టిక్ వస్తువులు మానవ సమాజానికి తిరుగులేని ప్రయోజనాలను అందిస్తున్నాయి. కానీ ఇప్పుడు ప్లాస్టిక్ 'అరికట్టలేని సంక్షోభం'గా మారిపోయింది. కృత్రిమ రసాయనాలతో సింథటిక్ ప్లాస్టిక్ వస్తువులను 1907లో మొట్టమొదట తయారు చేశారు. 1950 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఏటా 2 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వస్తువులు ఉత్పత్తి అయ్యేవి. ఇప్పుడు ఏటా 45 కోట్ల మెట్రిక్ టన్నులకు మించిపోయింది. ఇందులో, వాడేసిన ప్లాస్టిక్ వస్తువుల్లో కేవలం 9 శాతాన్ని మాత్రమే సేకరించి, తిరిగి ఉపయోగించుకుంటున్నాం. 91% శాతం ప్లాస్టిక్ వస్తువులు మట్టిలోనో, నీటిలో కలిసిపోతున్నాయి.

ప్రతి సంవత్సరం 1.9 కోట్ల నుంచి 2.3 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు నీటి ద్వారా సరస్సులు, నదులు, సముద్రాలను కలుషితం చేస్తున్నాయి. 1.3 కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు మట్టిలో పేరుకుపోతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు కనపడని చోటేదీ ఇప్పుడు మిగల్లేదు. మన అడవులు, నేల, నీరు, గాలిని కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు కలుషితం చేస్తున్నాయి. కంటికి కనిపించనంత చిన్న ప్లాస్టిక్ ముక్కలు (మైక్రోప్లాస్టిక్‌లు) జంతువులు, మొక్కలు, పండ్లు, మానవ శరీరాల్లోకి కూడా ప్రవేశించాయి. ఒక లీటరు మంచినీటి సీసాలో దాదాపు 2,40,000 చిన్న ప్లాస్టిక్ ముక్కలు ఉన్నాయని ఇటీవలి అధ్యయనంలో తేలింది.

ప్లాస్టిక్ పదార్థాలు ప్రపంచంలోని ప్రతి మూలలోకి చొరబడ్డాయి. మనం తాగే నీరు, తినే ఆహారం, పీల్చే గాలిని కూడా కలుషితం చేశాయి. వీటిని బాధ్యతతో వాడుకోవటం, వాడిన ప్లాస్టిక్‌ను ఎక్కడ పడితే అక్కడ పారేయకుండా పద్ధతి ప్రకారం సేకరించి తిరిగి ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీలో వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మనలో ప్రతి ఒక్కరూ సమష్టిగా చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

వ్యవసాయంలో ప్లాస్టిక్‌తో ముప్పు

వ్యవసాయంలో ప్లాస్టిక్ వస్తువుల వాడకం గత కొన్ని దశాబ్దాలుగా అలవాటైంది. ఆధునిక కాలంలో వాణిజ్య పద్ధతుల్లో వ్యవసాయం తీవ్రతరం కావటంతో దీని వాడకం మరింత పెరుగుతోంది. నేల ఉష్ణోగ్రతను విజయవంతంగా నియంత్రించడం, కలుపు పెరుగుదలను చాలా వరకు అరికట్టడం, నేలలో తేమ నష్టాన్ని నిరోధించడం కోసం వ్యవసాయ భూముల్లో మల్చింగ్ షీట్(పాలిథిన్ ఫిల్మ్)ను విస్తృతంగా వాడటం మన దేశంలో మొదలుపెట్టింది కొద్ది సంవత్సరాల క్రితమే.

అయితే, అభివృద్ధి చెందిన దేశాల్లో 1950లలోనే ప్రారంభమైంది. ఈ పద్ధతి పత్తి, మొక్కజొన్న తదితర పంటల సాగు ఖర్చును తగ్గించటంతో పాటు దిగుబడిని సగటున 30 శాతం పెంచుతోంది. ప్లాస్టిక్‌ను ఇప్పుడు మల్చింగ్ షీట్, మొలక ట్రేలు, డ్రిప్ లైన్లు, చెరువు లైనర్ షీట్లు, పాలీహౌస్‌లు, ఆహార నిల్వ, ప్యాకేజింగ్, రవాణాలో విరివిగా ఉపయోగిస్తున్నారు. పంట భూముల్లో మిగిలిపోయే పాలిథిన్ అవశేషాలు ఇప్పుడు హెక్టారుకు 300 కిలోలకన్నా ఎక్కువగానే ఉన్నాయని ఒక అధ్యయనం చెబుతోంది.

ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్‌ఏవో) వ్యవసాయంలో ప్లాస్టిక్‌ల వినియోగాన్ని అంచనా వేసే ఒక కీలక నివేదికను విడుదల చేసింది. 2019లో ప్రపంచవ్యాప్తంగా పంటలు, పశువుల ఆహారోత్పత్తుల సాగు నుంచి విక్రయం వలకు వివిధ దశల్లోని విలువ గొలుసులో 1.2 కోట్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తులు వాడారు. ఆహార ప్యాకేజింగ్‌లో 3.73 కోట్ల టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తులను ఉపయోగించారని ఎఫ్‌ఏవో లెక్క తేల్చింది.

ప్లాస్టిక్ వాడకంపై నియంత్రణ అవసరమనే విషయమై 3 దశాబ్దాలుగా చర్చలు జరుగుతున్నాయి. పది రోజుల శిఖరాగ్రసభ జెనీవాలో ఈ నెల 15న ముగిసింది. భారత్ సహా 184 దేశాలకు చెందిన 3,700 మంది ప్రతినిధులు ఏకాభిప్రాయానికి రాలేక ఎటువంటి ఒడంబడికా చేసుకోలేదు. ముప్పయ్యేళ్లుగా ఇదే తంతు.

మన దేశంలో పరిస్థితేంటి?

వ్యవసాయంలో ప్రపంచవ్యాప్తంగా వాడుతున్న ప్లాస్టిక్ ఉత్పత్తుల్లో సగం ఆసియా దేశాల్లోనే వినియోగిస్తున్నారు. వాడేసిన ప్లాస్టిక్‌ను తగులబెట్టడం, పూడ్చిపెట్టటం లేదా చెత్తకుప్పల్లో పోయటం మనకు తెలిసిందే. అయితే, దీనికి సంబంధించిన ఏ లెక్కలూ దొరకవు. ఎందుకంటే, వ్యవసాయ ప్లాస్టిక్ కాలుష్యం గురించి ఆలోచించే వారే కరువు. మన దేశంలో 90 శాతం గ్రామాల్లో చెత్త యాజమాన్య వ్యవస్థలే లేవు. ఎవరికిష్టం వచ్చినట్లు వాళ్లు ఎక్కడ పడితే అక్కడ పారెయ్యటమే. 67 శాతం మంది మామూలు చెత్తతో పాటు ప్లాస్టిక్ చెత్తను కూడా కాల్చేస్తున్నారని ఒక అధ్యయనం చెబుతోంది.



దేశంలోని 6.65 లక్షల గ్రామాలు, 2.68 లక్షల పంచాయతీల్లో ప్రతి ఏటా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తుంటాయి. వీటిలో క్లైమేట్ ఛేంజ్ యాక్షన్ ప్లాన్‌ను చేర్చాలి. అందులో వ్యవసాయ, వ్యవసాయేతర ప్లాస్టిక్ నిర్వహణను కూడా జోడించాలి. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్లాస్టిక్‌కు బదులు పంట వ్యర్థాలతో, వత్తుగా పంటలతోనే సజీవ ఆచ్ఛాదన చేస్తూ ఉంటారు. ఆ పద్ధతులపై అవగాహన కలిగించి, ప్రోత్సహించే పథకాలను తీసుకురావాలని నిపుణులు సూచిస్తున్నారు.

మల్చింగ్ షీట్లతో ముప్పేమిటో తెలుసా?

ఆధునిక పంట పొలాల్లో ప్లాస్టిక్ షీట్లు విస్తారంగా కనిపిస్తుంటాయి. ఇవి చాలా పల్చటి ప్లాస్టిక్‌తో తయారు చేసినవి. పొలంలో పరచిన ఒక సంవత్సరంలో చిరిగిపోతాయి. అవి ఎంత పలచనంటే.. ఒక కిలో మల్చింగ్ షీట్ కట్టను 700 చదరపు అడుగుల వ్యవసాయ భూమిపై పరచడానికి సరిపోతుంది. దాని వల్ల ఉపయోగాలున్నాయి. అయితే, అంత భూమిని అనేక విధాలుగా నాశనం చేస్తోందన్నది కూడా వాస్తవం.

బయో ప్లాస్టిక్‌లూ విషపూరితమే!

పెట్రోలియం ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా మొక్కల ఆధారంగా బయోప్లాస్టిక్ వస్తువులు తయారు చేస్తున్నారు. మొక్కజొన్న, బంగాళదుంపలు, చెరకు, సుగర్‌బీట్ అనే దుంపల ద్వారా బయోప్లాస్టిక్‌లను తయారు చేస్తారు. అయితే, ఇవి కూడా పూర్తిగా మేలైనవనుకోవటానికి లేదు. బయోప్లాస్టిక్ వస్తువుల తయారీలో వాడే ముడి పదార్థాలను ఈ మొక్కల నుంచి తీసుకుంటున్నప్పటికీ.. బయోప్లాస్టిక్‌ను తయారు చేసే క్రమంలో గట్టితనం, రంగు తదితర గుణాల కోసం రసాయనిక ప్రక్రియల్లో వాడే వేలకొద్దీ సింథటిక్ రసాయనాలు చాలా విషపూరితమైనవని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో ఎకోటాక్సికాలజీ–పర్యావరణ శాస్త్ర ప్రొఫెసర్ బెథానీ అల్‌మ్రోత్ ఇలా స్పందించారు: 'చాలా మందికి ప్లాస్టిక్‌లోని విషతుల్య పదార్థాల గురించి తెలియదు. ప్లాస్టిక్‌లతో పనిచేసే వ్యక్తులకు కూడా బయోప్లాస్టిక్‌లలోని టాక్సిన్స్ గురించి సరైన సమాచారం లేదు. అందుకని, ప్లాస్టిక్‌లు పర్యావరణానికి, ప్రజారోగ్యానికి ముప్పుగా మారకుండా ఉండాలంటే, మొదట వాటి వాడకం తగ్గించాలి. వాడేసిన ప్లాస్టిక్ వస్తువుల్ని పారేసే అలవాట్లను మనందరం పనిగట్టుకొని మార్చుకోవాలి' అంటున్నారామె. కాబట్టి, ప్రజల్లో ప్లాస్టిక్ చైతన్యం పెరగాలి. బయోప్లాస్టిక్ తయారీని పాతికేళ్ల క్రితమే కనుగొన్నప్పటికీ ప్రస్తుతం వీటి ఉత్పత్తి మొత్తం ప్లాస్టిక్ వాడకంలో ఒక్క శాతానికే పరిమితమైంది.

పాలిథిన్ మల్చింగ్ షీట్లతో ఇదీ ముప్పు

- వ్యవసాయ భూముల్లో వేసిన ప్లాస్టిక్ మల్చింగ్ షీట్ వ్యర్థాలు మిగిలిపోతాయి.
- వేసిన నెలల్లోనే చిరిగి పోతుంది. కాబట్టి దాని ముక్కలన్నిటినీ మట్టిలో నుంచి ఏరెయ్యటం సాధ్యపడదు.
- నేల ఆరోగ్యాన్ని, పర్యావరణ వ్యవస్థలను దెబ్బతీస్తుంది.
- వ్యవసాయ భూముల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు నేల సారాన్ని తగ్గిస్తుంది.
- పంట భూమి లోపలికి గాలి ప్రసరించటం కూడా అవసరం. ప్లాస్టిక్ షీట్ కింద మట్టిలో గాలి ప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది.
- నేల ఆరోగ్యంగా ఉండాలంటే అందులో సూక్ష్మజీవులు ఆరోగ్యంగా ఉండాలి. మల్చింగ్ షీట్ వీటికి ప్రతికూలంగా పనిచేస్తుంది.
- వేర్లు, మొత్తంగా మొక్కల పెరుగుదలపై ప్లాస్టిక్ ప్రతికూలంగా పని చేస్తుంది.
- మట్టిలోని వానపాములు వంటి మేలు చేసే జీవరాశికి హాని కలుగుతుంది. వాటి పోషణ దెబ్బతింటుంది.
- వానపాములు బొరియలు చేసుకుంటూ మట్టిపైకి వచ్చి వదిలే విసర్జితాలే నేలను సారవంతం చేస్తాయి. ఆ ప్రక్రియ ప్లాస్టిక్ మల్చింగ్ వల్ల దెబ్బతింటుంది.
- ప్లాస్టిక్ సూక్ష్మ ముక్కల (మైక్రోప్లాస్టిక్‌ల)ను మొక్కలు వేర్ల ద్వారా గ్రహించి, ఆకుల్లో, పువ్వుల్లో, కాయల్లో, గింజల్లోకి చేర్చుతాయి.
- ఆ భూమిలో పండే ఆహారోత్పత్తుల ద్వారా మైక్రోప్లాస్టిక్స్ ఆహారంలోకి, మానవ శరీరాల్లోకి ప్రవేశించే అవకాశం ఉంది.
- వ్యవసాయంలో ప్లాస్టిక్ కాలుష్యంపై పాలకులు పట్టించుకోవటం లేదు. అధ్యయనాలూ జరగక పోవటం దురదృష్టకరం. ఈ నిర్లక్ష్యం వ్యవసాయాన్ని, యావత్ పర్యావరణ వ్యవస్థల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేస్తోంది.
- పంట పొలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను జాగ్రత్తగా సేకరించి, రీసైకిల్ చేసే వారికి పంపటం ద్వారా ఈ ముప్పును కొంత తగ్గించవచ్చు. అయితే, దీని గురించి రైతులకు చైతన్యం కలిగించే వారు కరువయ్యారు.
- అర్బన్ ప్రాంతాల్లోని ఇళ్లలో ప్రజలు వాడిన ప్లాస్టిక్ సేకరణ, రీసైక్లింగ్‌పై కార్యాచరణ ప్రణాళికల్లోనూ వ్యవసాయ ప్లాస్టిక్ వ్యర్థాల ఊసే లేదు. అగ్రి ప్లాస్టిక్ సమస్యపై అవగాహన ఇటీవలే ముందుకు వస్తుండటం దీనికి కారణం.
- ఈ నేపథ్యంలో వ్యవసాయ ప్లాస్టిక్ వస్తువుల సుస్థిర వినియోగం, నిర్వహణపై ఎఫ్‌ఏవో గత అక్టోబర్‌లో వాలంటరీ గైడ్‌లైన్స్‌ను ప్రకటించింది.

4,200 ప్లాస్టిక్ రసాయనాల్లో విషం!

మనం దైనందిన జీవితంలో వాడే ప్లాస్టిక్ వస్తువులు పెట్రో కెమికల్స్‌తోనే తయారవుతున్నాయి. ఈ ప్లాస్టిక్ వస్తువుల్లో 16 వేల రకాల రసాయనాలు ఉంటాయి. ఇవన్నీ హాని చేసేవి కాదు. వీటిలో 4,200 రసాయనాలు మాత్రం అత్యంత విషపూరితమైనవి. ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ఇవి తీవ్ర హాని చేస్తున్నాయని ప్లాస్టకెమ్ ప్రాజెక్టు శాస్త్రవేత్తల బృందం గతేడాది గుర్తించింది. మరో 10 వేల ప్లాస్టిక్ రసాయనాల విషతుల్యత ఎంత అనేదానిపై ఇప్పటికీ తగినంత సమాచారం లేదని బృందం తెలిపింది. ప్లాస్టిక్ వస్తువుల్లోని రసాయనాలు 70 శాతం అసాంక్రమిక వ్యాధుల(ఎన్‌సీడీలు) వ్యాప్తికి ఒకానొక ముఖ్యకారణమని అంచనా.



గుకేశ్, ప్రజ్ఞానంద గేమ్‌లు 'డ్రా'

సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద ఖాతాలో మరో 'డ్రా' చేరింది. అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో ఈ టోర్నీ జరుగుతోంది. సోమవారం జరిగిన ఆరో రౌండ్‌లో... అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌ను గుకేశ్ 78 ఎత్తుల్లో; జాన్ క్రిస్టాఫ్ డూడా (పోలాండ్)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 32 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు. మాక్సిమి లాగ్రేవ్ (ఫ్రాన్స్)-నొదిర్బెక్ అబ్దుసత్తోరోవ్ (ఉజ్బెకిస్తాన్) గేమ్ 85 ఎత్తుల్లో... ఫాబియానో కరువానా-సామ్ సెవియాన్ (అమెరికా) గేమ్ 27 ఎత్తుల్లో... వెస్లీ సో-లెవోన్ అరోనియన్ (అమెరికా) గేమ్ 36 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. పది మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీని నిర్వహిస్తున్నారు. ఆరో రౌండ్ తర్వాత కరువానా నాలుగు పాయింట్లతో అగ్రస్థానంలో... అరోనియన్, ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నారు.





'పసిడి'తో పునరాగమనం

కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో మీరాబాయి చానుకు స్వర్ణం

అహ్మదాబాద్: పారిస్ ఒలింపిక్స్ తర్వాత పాల్గొన్న తొలి ఈవెంట్‌లోనే భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను మెరిసింది. సోమవారం మొదలైన కామన్వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 31 ఏళ్ల మీరాబాయి చాను స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. మహిళల 48 కేజీల విభాగంలో బరిలోకి దిగిన మీరాబాయి మొత్తం 193 కేజీల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచింది. స్నాచ్‌లో 84 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 109 కేజీలు బరువెత్తిన మీరాబాయి... ఈ క్రమంలో కొత్త కామన్వెల్త్ చాంపియన్‌షిప్ రికార్డులు నెలకొల్పింది. ఏడాది విరామం తర్వాత మళ్లీ బరిలోకి దిగిన మీరాబాయి ముందుగా స్నాచ్ తొలి ప్రయత్నంలో విఫలమైంది. రెండో ప్రయత్నంలో 84 కేజీలు ఎత్తిన ఈ మణిపూర్ లిఫ్టర్... మూడో ప్రయత్నంలో 89 కేజీలు ఎత్తబోయి విఫలమైంది. క్లీన్ అండ్ జెర్క్ తొలి ప్రయత్నంలో 105 కేజీలు, రెండో ప్రయత్నంలో 109 కేజీలు ఎత్తిన మీరాబాయి... మూడోసారి 113 కేజీలు ప్రయత్నించి విఫలమైంది. టోక్యో ఒలింపిక్స్‌లో 49 కేజీల విభాగంలో రజత పతకం నెగ్గిన మీరాబాయి... గత ఏడాది జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. ఇటీవల అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య అన్ని వెయిట్ కేటగిరీలను సవరించింది. ఇందులో భాగంగా 49 కేజీల విభాగాన్ని తొలగించి 48 కేజీల విభాగాన్ని మళ్లీ తెచ్చారు. గతంలో మీరాబాయి 48 కేజీల విభాగంలో 2017 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో.. 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో.. 2013, 2017 కామన్వెల్త్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు సాధించింది.

రిషికాంతకు బంగారు పతకం

కామన్వెల్త్ చాంపియన్‌షిప్ తొలి రోజు రిషికాంత సింగ్ ప్రదర్శనతో భారత్‌కు రెండో స్వర్ణం దక్కింది. పురుషుల 60 కేజీల విభాగంలో రిషికాంత మొత్తం 271 కేజీలు (స్నాచ్‌లో 120 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 151 కేజీలు) బరువెత్తి మొదటి స్థానంలో నిలిచాడు.

'డ్రీమ్ 11'తో కటీఫ్!

ఒప్పందం రద్దు చేసుకున్న బీసీసీఐ ● స్పాన్సర్‌షిప్‌పై టయోటా ఆసక్తి

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు ప్రధాన స్పాన్సర్‌షిప్ నుంచి ఫాంటసీ స్పోర్ట్స్ కంపెనీ 'డ్రీమ్ 11'ను తప్పించారు. డ్రీమ్ ఎలెవన్‌తో ఒప్పందాన్ని అధికారికంగా రద్దు చేసుకుంటున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కార్యదర్శి దేవజిత్ సైకియా ప్రకటించారు. మూడేళ్ల కాలానికి 2023లో రూ.358 కోట్లతో డ్రీమ్ 11 ఒప్పందం కుదుర్చుకుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తెచ్చిన 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్' ప్రకారం ఇకపై 'డ్రీమ్ 11' తన కార్యకలాపాలు కొనసాగించే అవకాశం లేదు. దాంతో ఆర్థికపరంగా ఆ కంపెనీకి భారం కావడంతో పాటు ప్రభుత్వం నిషేధించిన సంస్థతో ఒప్పందాన్ని కొనసాగించరాదని బోర్డు కూడా నిర్ణయించింది. 'మాకు ఈ విషయంలో చాలా స్పష్టత ఉంది. ప్రభుత్వ కొత్త మార్గదర్శకాల ప్రకారం డ్రీమ్ 11 లేదా అలాంటి ఏ గేమింగ్ కంపెనీతోనైనా బీసీసీఐ ఒప్పందాన్ని కొనసాగించదు. కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఒప్పందం రద్దు చేయాల్సిందే. ప్రధాన స్పాన్సర్‌గా మరో కొత్త కంపెనీ కోసం ప్రయత్నిస్తున్నాం. ఈ ప్రక్రియ ఇంకా ఆరంభ దశలోనే ఉంది' అని సైకియా వెల్లడించారు. 'డ్రీమ్ 11తో ఒప్పందం 2026 వరకు ఉంది. అయితే తాజా పరిణామాల్లో డ్రీమ్ 11 వైపు నుంచి ఎలాంటి తప్పు లేదు కాబట్టి ఉల్లంఘన అనే మాటే తలెత్తదని సైకియా చెప్పారు. 'ప్రధాన స్పాన్సర్ పరిస్థితిని మేం అర్థం చేసుకోగలం. చెల్లింపుల ఉల్లంఘనలాంటివేమీ వర్తించవు కాబట్టి వారిపై ఎలాంటి జరిమానా కూడా విధించడం లేదు. ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్ణయం కాబట్టి అందరూ పాటించాల్సిందే. వారి వ్యాపారం దెబ్బ తినడమే కాదు, బీసీసీఐ లాభాలపై కూడా ఇది ప్రభావం చూపిస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. ఐపీఎల్ స్పాన్సర్లలో ఒకటిగా ఉన్న 'మై సర్కిల్ 11'తో కూడా ఒప్పందం ముగియడం ఖాయమైంది. 'మై సర్కిల్ 11' ఏడాదికి రూ. 125 కోట్ల చొప్పున ఐదేళ్లకు రూ. 625 కోట్లతో బోర్డుతో ఒప్పందం కుదుర్చుకుంది.

ఆసియా కప్‌లోగా సాధ్యమేనా!

'డ్రీమ్ 11' తప్పుకోవడంతో బీసీసీఐ కొత్త స్పాన్సర్ వేటలో పడింది. ఆసియా కప్‌కు ముందే ఈ ఒప్పందం చేసుకోవాలని భావిస్తున్నా...అది సాధ్యం కాకపోవచ్చు. సెప్టెంబర్ 9 నుంచే టోర్నీ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో కొత్త స్పాన్సర్ కోసం ప్రకటన ఇచ్చి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తుది నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం పట్టవచ్చు. కాబట్టి ఆసియా కప్‌లో టీమిండియా ప్రధాన స్పాన్సర్ లేకుండానే బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇది మరింత ఆలస్యం అయితే వన్డే వరల్డ్ కప్‌లో మహిళల జట్టు కూడా స్పాన్సర్ లేకుండానే ఆడుతుంది. భారత జట్టుతో జత కట్టేందుకు జపాన్‌కు చెందిన ప్రఖ్యాత మోటార్ కంపెనీ టయోటా ముందుకు వస్తున్నట్లు సమాచారం. టయోటా ఇప్పటికే ఇంగ్లండ్ క్రికెట్ టీమ్‌కు ప్రధాన స్పాన్సర్‌గా ఉండటంతో పాటు ఆస్ట్రేలియా టీమ్‌తో కూడా సహ స్పాన్సర్లలో ఒకటిగా కొనసాగుతోంది. ఫైనాన్షియల్ సర్వీస్ కంపెనీ అయిన 'ఫిన్‌టెక్' కూడా ఆసక్తి చూపిస్తోంది. ఈ నేపథ్యంలో పలు కంపెనీల వద్ద పోటీ ఉండవచ్చు కాబట్టి పూర్తి స్థాయిలో ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది. బోర్డు కూడా గత ఒప్పందంకంటే ఎక్కువ మొత్తాన్ని ఆశిస్తోంది. నిజానికి 'డ్రీమ్ 11' లోగోతో కూడిన జెర్సీలతో భారత టీమ్ కిట్ సిద్ధంగా ఉంది. అయితే వీటిని వేసుకోరాదని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించింది.





నీరూ 'డబుల్' ధమాకా

● మహిళల ట్రాప్ వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లలో స్వర్ణాలు సొంతం

షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. సోమవారం సీనియర్ విభాగంలో భారత్‌కు రెండు స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్యాలు లభించాయి. మహిళల ట్రాప్ ఈవెంట్‌లో నీరూ ధండ రెండు బంగారు పతకాలతో అదరగొట్టింది. ఆరుగురు పోటీపడ్డ మహిళల ట్రాప్ ఫైనల్లో భారత షూటర్ నీరూ ధండ 43 పాయింట్లు స్కోరు చేసి చాంపియన్‌గా అవతరించింది. భారత్‌కే చెందిన ఆషిమా అహ్లావత్ 29 పాయింట్లు సాధించి కాంస్య పతకాన్ని సంపాదించింది. నీరూ, ఆషిమా, ప్రీతి రజక్‌లతో కూడిన భారత జట్టు 319 పాయింట్లతో టీమ్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించింది. పురుషుల ట్రాప్ వ్యక్తిగత ఈవెంట్‌లో భౌనీశ్ మెండిరట్టా రజత పతకాన్ని దక్కించుకున్నాడు. ఫైనల్లో భౌనీశ్ 45 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచాడు.

ఇషా బృందానికి కాంస్యం

మహిళల 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణ షూటర్ ఇషా సింగ్ సభ్యురాలిగా ఉన్న భారత జట్టు కాంస్య పతకం నెగ్గింది. ఇషా సింగ్, మనూ భాకర్, సిమ్రన్‌ప్రీత్ కౌర్ బృందం 1749 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. 25 మీటర్ల వ్యక్తిగత విభాగం ఫైనల్లో మనూ భాకర్ 25 పాయింట్లతో నాలుగో స్థానంలో, ఇషా సింగ్ 18 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి పతకాలకు దూరమయ్యారు. జూనియర్ మహిళల 25 మీటర్ల పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్లు క్లీన్‌స్వీప్ చేశారు. పాయల్ స్వర్ణం, నామ్యా కపూర్ రజతం, తేజస్విని కాంస్యం గెలిచారు. ప్రస్తుతం భారత్ 29 స్వర్ణాలు, 11 రజతాలు, 14 కాంస్యాలతో కలిపి 54 పతకాలతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది.



ఇషా సింగ్, సిమ్రన్‌ప్రీత్, మనూ భాకర్ (ఫైల్)

లక్ష్య సేన్ అవుట్

పారిస్: ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. ప్రపంచ నంబర్‌వన్ షి యుకి (చైనా)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 21వ ర్యాంకర్ లక్ష్య సేన్ 17–21, 19–21తో ఓడిపోయాడు. 2021 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్యం నెగ్గిన లక్ష్య సేన్, 2022, 2023లలో ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లలో రుత పర్ణ-శ్వేతాపర్ణ (భారత్) 12–21, 11–21తో గాబ్రియేలా-స్టెఫానీ (బల్గేరియా) చేతిలో... ప్రియ-శ్రుతి (భారత్) 17–21, 16–21తో మార్గోట్-కామిల్లె (ఫ్రాన్స్) చేతిలో ఓటమి పాలయ్యారు.



● యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ ఫలితాలు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

హాలీవుడ్ యాక్షన్



● జేజే పెర్రీ, యశ్

'కేజీఎఫ్' ఫేమ్ యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ ద్విభాషా(ఇంగ్లిష్, కన్నడ) చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్‌పై వెంకట్ కె.నారాయణ, యశ్ నిర్మిస్తున్నారు. 'జాన్ విక్', 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్', 'డే షిఫ్ట్' వంటి హాలీవుడ్ సినిమాలకు పని చేసిన యాక్షన్ కొరియోగ్రాఫర్ జేజే పెర్రీ 'టాక్సిక్' సినిమాకు వర్క్ చేస్తున్నారు. తన హాలీవుడ్ స్టంట్ టీమ్‌తో కలిసి ఈ సినిమా కోసం కొన్ని యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. తాజాగా 'టాక్సిక్' కోసం 45రోజుల సుదీర్ఘమైన యాక్షన్ షూటింగ్ షెడ్యూల్‌ను ముంబైలో ప్లాన్ చేశారు మేకర్స్. ఈ షెడ్యూల్‌లో పెర్రీ తన రెగ్యులర్ స్టంట్ టీమ్‌ని పక్కన పెట్టి, ఇండియన్ స్టంట్ టీమ్‌తో వర్క్ చేయనుండటం విశేషం. ఈ అంశంపై జేజే పెర్రీ మాట్లాడుతూ–''నా 35 ఏళ్ల కెరీర్‌లో 39 దేశాల్లో పని చేశాను. భారతీయ సంస్కృతి, నాగరికత ఎంతో గొప్పది. మా అమెరికన్ కల్చర్ కొన్ని వందల ఏళ్ల క్రితంనాటిదే. భారతీయ చిత్రాలకు నేను పెద్ద అభిమానిని. ఇండియన్ స్టంట్ టీమ్ వరల్డ్ క్లాస్‌గా ఉంది. 'టాక్సిక్' కొత్త షెడ్యూల్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అని తెలిపారు.

స్నేహం.. లక్ష్యం



● తమన్నా

ఇద్దరు స్నేహితుల సాహసోపేతమైన ప్రయాణం, కొత్త సంస్థ ఏర్పాటులో వారు ఎదురొన్న సవాళ్ల నేపథ్యంతో సాగే వెబ్‌సిరీస్ 'డు యూ వనా పార్ట్‌నర్'. ఈ న్యూ ఏజ్ కామెడీ డ్రామా సిరీస్‌లో తమన్నా, డయానా పెంటీ ఫ్రెండ్స్‌గా నటించారు. నిషాంత్ నాయక్, గంగోపాధ్యాయ ఈ సిరీస్‌ను డైరెక్ట్ చేశారు. కరణ్ జోహార్, అదార్ పూనావాలా, అపూర్వ మెహతా నిర్మించారు. ఈ సిరీస్ సెప్టెంబరు 12 నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్నట్లు వెల్లడించి, ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ''శిఖా (తమన్నా పాత్ర), అనహిత (డయానా పెంటీ) అనే ఇద్దరు మహిళలు కలిసి ఓ ఆల్కాహాల్ బ్రాండ్ స్టార్టప్‌ను మొదలు పెట్టాలనుకుంటారు. పురుషాధిక్యత అధికంగా ఉండే ఈ రంగంలో వారిద్దరూ తమ లక్ష్యాలను ఎలా సాధించారు? ఈ క్రమంలో వారు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? వంటి అంశాల నేపథ్యంతో ఈ సిరీస్ సాగుతుంది'' అని మేకర్స్ తెలిపారు.

పరదా చేసినందుకు గర్వపడుతున్నా - అనుపమా పరమేశ్వరన్



● విజయ్ డొంకాడ, అనుపమా పరమేశ్వరన్, ప్రవీణ్ కండ్రేగుల

''తెలుగులో 'పరదా' లాంటి కథని నమ్మి, నిర్మించిన విజయ్‌గారికి ధన్యవాదాలు. నా కెరీర్‌లో మోస్ట్ ఫేవరెట్ ఫిలిం ఇది. కెరీర్‌లో ఉత్తమ నటన ఇచ్చానని రివ్యూస్ రావడం చాలా ఆనందంగా ఉంది. 'పరదా' లాంటి సినిమా చేసినందుకు గర్వపడుతున్నాను'' అని అనుపమా పరమేశ్వరన్ తెలిపారు. ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వంలో అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'పరదా'. భాగ్యలక్ష్మి పోస సమర్పణలో శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకాడ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న విడుదల అయింది. ఈ సందర్భంగా నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ–''ప్రవీణ్‌గారు చాలా నిజాయతీగా ఈ సినిమా తీశారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చాలా బాగుంది. ఈ సినిమా కొన్ని సంవత్సరాలు పాటు గుర్తుండిపోతుంది'' అని చెప్పారు. ''మా చిత్రానికి జాతీయ స్థాయిలో చాలా మంచి రివ్యూలు వచ్చాయి. ఈ చిత్రంలో నటనకుగానూ అనుపమకి తప్పకుండా జాతీయ అవార్డు వస్తుందని నమ్మకంగా ఉన్నాను'' అని తెలిపారు. ''పరదా' చాలా మంది అమ్మాయిల జీవితాన్ని గుర్తు చేసిందని ఒక పెద్దావిడ చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. ఈ సినిమా చేసినందుకు ఒక నిర్మాతగా చాలా గర్వపడుతున్నాను'' అన్నారు విజయ్ డొంకాడ.

ఘాటి గొప్ప అనుభూతిని ఇస్తుంది

- రాజీవ్ రెడ్డి



''ఘాటీ' మూవీ టీజర్, ట్రైలర్‌లో ఎంత ఇంటెన్సిటీ చూసారో సినిమా కూడా అంతే ఇంటెన్స్‌గా ఉంటుంది. ఫుల్ యాక్షన్ సినిమా ఇది. అయితే క్రిష్ మార్క్ డ్రామా ఉంటుంది. అనుష్క గారి నటన తర్వాతి స్థాయిలో ఉంటుంది. మా సినిమా ప్రేక్షకులకు గొప్ప అనుభూతిని ఇస్తుంది'' అని నిర్మాత రాజీవ్ రెడ్డి చెప్పారు. అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఘాటి'. క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబరు 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రాజీవ్ రెడ్డి మాట్లాడుతూ–''ఒక ఫీమేల్ సూపర్ స్టార్‌తో కమర్షియల్ యాక్షన్ మూవీ చేయాలనేది మెయిన్ ఐడియా. విజయశాంతి గారి 'కర్తవ్యం' తర్వాత ఆ స్కేల్లో మళ్లీ సినిమా రాలేదు. ఇప్పుడున్న స్టార్స్‌లో అనుష్కగారికి అలాంటి స్టార్ డమ్ ఉంది. క్రిష్ గారు అనుష్కగారితో ఒక ప్రాజెక్టు చేయాలనుకున్నప్పుడు 'ఘాటీ' ప్రయాణం ఆరంభమైంది. ఈ చిత్రాన్ని ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్స్‌లో ఎక్కువగా చిత్రీకరించాం. ఒరిస్సాలో దాదాపు వేలమంది జనం అనుష్కని చూసేందుకు వచ్చారు.. వాళ్లని కంట్రోల్ చేయడానికి పోలీసులు రెండు మూడుసార్లు లాఠీ చార్జ్ చేశారు.. అనుష్కగారికి దేశవ్యాప్తంగా ఆ స్థాయి ప్రేక్షకాదరణ ఉంది. క్రిష్-అనుష్కగార్ల కాంబినేషన్లో వచ్చిన 'వేదం' చిత్రం చాలా పెద్ద హిట్. ఆ సినిమా అంచనాలను అందుకోవాలని 'ఘాటీ' ని తీశాం.. రీచ్ అవుతుందనే నమ్మకం ఉంది. నటుడు విక్రమ్ ప్రభ ఎంపిక క్రిష్‌గారిదే. మా బ్యానర్‌లో వరుణ్ తేజ్‌తో చేస్తున్న చిత్రం షూటింగ్ దాదాపు 80శాతం పూర్తయింది. 'అరేబియన్ కడలి' వెబ్ సిరీస్ సీజన్ 2 స్క్రిప్ట్ వర్క్స్ జరుగుతున్నాయి''అన్నారు.

కన్యాకుమారి నవ్విస్తుంది

- బన్నీ వాసు

''కన్యా కుమారి' మంచి వినోదాత్మక చిత్రం.. చాలా నిజాయతీగా తీసిన ఈ సినిమా ప్రేక్షకులను నవ్విస్తుంది. గీత్ సైని, శ్రీచరణ్ చాలా అందంగా కనిపించారు. స్క్రీన్ ప్లే బాగుంది. దర్శకుడు సృజన్ అద్భుతంగా ప్రజెంట్ చేశారు. ఇంత మంచి సినిమాను సపోర్ట్ చేయాలని ముందుకు వచ్చాను. మధుశాలినిగారు సినిమాల్లో సంపాదించి మళ్లీ సినిమాల్లోనే పెట్టుబడి పెట్టడం గొప్ప'' అని నిర్మాత బన్నీ వాసు తెలిపారు. గీత్ సైని, శ్రీ చరణ్ రాచకొండ జంటగా రాడికల్ పిక్చర్స్ పతాకంపై సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'కన్యా కుమారి' ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో చిత్ర సమర్పకురాలు, నటి మధుశాలిని మాట్లాడుతూ–''సృజన్ ప్రయాణం విన్న తర్వాత నేను ఈ మాత్రమైనా చేయకపోతే ఇండస్ట్రీలో ఉండి వృథా అనిపించింది. బన్నీ వాసుగారితో అసోసియేట్ కావడం ఆనందంగా ఉంది'' అన్నారు. ''మా సినిమాను రిలీజ్ చేస్తున్న వాసుగారికి థ్యాంక్స్'' అన్నారు శ్రీ చరణ్. ''మా మూవీని వాసుగారు రిలీజ్ చేయడం మా మొదటి సక్సెస్‌గా భావిస్తున్నాం'' అన్నారు సృజన్.



● సృజన్, శ్రీ చరణ్, బన్నీ వాసు, గీత్ సైని, మధుశాలిని

సుందరకాండ చాలా కొత్త కథ

- నారా రోహిత్



''సుందరకాండ' చాలా క్లీన్ ఫిలిం. 30 ఏళ్లు దాటినా కూడా కావాల్సిన అర్హతలున్న అమ్మాయి కోసం హీరో వెతకడం అనేది చాలా ఆసక్తిగా ఉంటుంది. నా క్యారెక్టర్‌లో కొత్త ఎగ్జిట్ ఉంది.. ఈ పాత్రని చాలా ఎంజాయ్ చేశాను.. నేటి తరానికి ఇది చాలా కొత్త కథ. అన్ని వర్గాల వారికి కనెక్ట్ అవుతుంది'' అని నారా రోహిత్ చెప్పారు. వెంకటేష్ నిమ్మలపూడి దర్శకత్వంలో నారా రోహిత్ హీరోగా, వృతి వాఘాని, శ్రీదేవి విజయ్ కుమార్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సుందరకాండ'. సందీప్ పిక్చర్ ప్యాలెస్‌పై సంతోష్ చిన్నపొల్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా నారా రోహిత్ విలేకరులతో మాట్లాడుతూ – ''2022లోనే 'సుందరకాండ' స్క్రిప్ట్ వర్క్ ఆరంభించాం. వెంకటేష్ అద్భుతమైన కథ రాశాడు. ఈ సినిమా నా ప్రొడక్షన్‌లోనే స్టార్ట్ చేశాను. అయితే నా కజిన్ సంతోష్, గౌతమ్, రాకేష్.. ఈ కథ నచ్చి నిర్మాణంలో భాగమయ్యారు. లియాన్ జేమ్స్ మంచి పాటలు, నేపథ్య సంగీతం ఇచ్చారు'' అని తెలిపారు.

1990లో...

అరుణ్ రాయదుర్గం, రాణి వరదా జంటగా నటించిన చిత్రం '1990'స్. నందకుమార్. సి.ఎం. దర్శకత్వం వహించారు. మనసు మల్లిగే బ్యానర్‌పై చంద్రశేఖర్.బి.ఎస్. నిర్మించిన ఈ సినిమా తెలుగు, కన్నడ, తమిళ, మలయాళంలో సెప్టెంబరులో రిలీజ్ కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ మూవీ ట్రైలర్, సాంగ్స్ లాంచ్ ఈవెంట్‌కి డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ ముఖ్య అతిథిగా హాజరై, '1990'స్ విజయం సాధించాలని ఆకాంక్షించారు. చంద్రశేఖర్ బి.ఎస్. మాట్లాడుతూ– ''నేను తెలుగు వాడినే. ఐటీ రంగంలో కర్ణాటకలో స్థిరపడ్డాను. ఈ చిత్రం మన మూలాలు కలిగిన కథా కథనాలతో సాగుతుంది'' అని చెప్పారు. ''మా సినిమా కొత్త తరహాలో సాగుతూ మిమ్మల్ని మెప్పిస్తుంది'' అన్నారు నందకుమార్ సి.ఎం. ''తెలుగు ప్రేక్షకులు మా మూవీని సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాం'' అని అరుణ్ రాయదుర్గం, రాణి వరదా పేర్కొన్నారు.



● రాణి, అరుణ్

సంతృప్తిగా అనిపించింది

- విజయ్ పాల్ రెడ్డి



''త్రిబాణధారి బార్బరిక్' చాలా కొత్త కథ.. చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది'' అని నిర్మాత విజయ్ పాల్ రెడ్డి అడిదల అన్నారు. సత్య రాజ్, ఉదయ భాను, వశిష్ఠ ఎన్ సింహా, సత్యం రాజేష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకత్వంలో మారుతి సమర్పణలో విజయ్ పాల్ రెడ్డి అడిదల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. విజయ్ పాల్ రెడ్డి మాట్లాడుతూ–''మోహన్ చెప్పిన 'త్రిబాణధారి బార్బరిక్' కథ నచ్చడంతో సినిమా ఆరంభించాం. నేను ఇండస్ట్రీ కొత్త.. దీంతో డైరెక్టర్ మారుతిగారు అండగా నిలిచారు. ఇన్ఫ్యూజన్ బ్యాండ్ వారు మంచి పాటలు, ఆర్ఆర్ ఇచ్చారు. రమేష్ రెడ్డి విజువల్స్ మెప్పిస్తాయి. నైజాంలో మైత్రీవారు మా సినిమా రిలీజ్ చేస్తున్నారు. వరంగల్‌లో ప్రదర్శించిన మా చిత్రం స్పెషల్ ప్రీమియర్ షోలో ఓ జంట ఉచితంగా చూశారు. అయితే, ఇది ఫ్రీగా చూడాల్సిన చిత్రం కాదంటూ వాళ్లు తిరిగి డబ్బులు ఇచ్చారు.. అది చూసిన తర్వాత నాకు ఎంతో సంతృప్తిగా అనిపించింది. 'త్రిబాణధారి బార్బరిక్' తో పాటుగా 'బ్యూటీ' సినిమా నిర్మించాను. ఈ రెండు సినిమాల్లో ఏ ఒక్క చోట కూడా బోర్ కొట్టదు.. ఇది నా సవాల్'' అని చెప్పారు.

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	329	81,636
నిఫ్టీ ▲	98	24,968

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	21,532	▲	35
డోజోన్స్	45,371	▼	263
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,321	▲	12
డాక్స్	24,271	▼	92
షాంఘై	3,883	▲	58
నికాయ్	42,808	▲	175

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.00	88.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.80	118.75
€	యూరో	ఎస్‌బీఐ	101.00	103.81
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.65	60.15
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.63	57.87
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.91	69.61
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.47	23.97
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.95	24.21
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.36	13.19

జీఎస్‌టీ తగ్గాకే కొందాంలే..!

- వాహనాలపై నిర్ణయాలు వాయిదా వేస్తున్న కొనుగోలుదారులు
- పండుగ సీజన్లో తంటాలు పడుతున్న వాహన డీలర్లు
- కొత్త రేట్లు తక్షణం అమలు చేయాలంటూ కేంద్రానికి విజ్ఞప్తి

సాక్షి, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత సీజన్లో ఆఫర్లు బాగున్నాయని గోపాల్ కొత్తగా మారుతీ బలెనో కొనుక్కుందామని బుక్ చేశారు. అడ్వాన్స్ పేమెంట్ కూడా చేశారు. కానీ, అకస్మాత్తుగా కొనుక్కోవడాన్ని వాయిదా వేసుకున్నారు. అటు డీలరు రోజూ ఇం కాస్త కట్టేసి కారును తీసుకెళ్లండంటూ వెంటబడుతున్నప్పటికీ రేపు, మాపు అంటూ సాగదీస్తున్నారే తప్ప డీల్ పూర్తి చేయడం లేదు. గోపాలే కాదు వాహనాల కొనుగోలు నిర్ణయాలను చాలా మంది ఇలాగే వాయిదా వేసుకుంటున్నారు. కొత్తగా ప్రతిపాదించిన జీఎస్టీ విధానంలో కార్లపై పన్నులు తగ్గి, మరింత ప్రయోజనం లభించనుండటమే ఇందుకు కారణం. ఇది కొనుగోలుదారులపరంగా చూస్తే బాగానే ఉన్నప్పటికీ వాహనాల డీలర్లు గగ్గోలు పెడుతున్నారు. దీనివల్ల పండుగ సీజన్ అంతా తుడిచిపెట్టుకుపోతుందని ఆందోళన చెందుతున్నారు.

నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్‌టీ రేట్లను రెండింటికి తగ్గించేట్లుగా కేంద్ర ఆర్థిక శాఖ ప్రతిపాదనలు చేసిన సంగతి తెలిసిందే. దీపావళి కానుకగా దీన్ని అమల్లోకి తేవాలనేది ప్రభుత్వ ఉద్దేశం. అయితే, దీన్ని ఆ తర్వాతెప్పుడో అమలు చేస్తామంటూ, పండుగ సీజన్‌లో ముందుగా ప్రకటించడమే ప్రస్తుతం తంటా తెచ్చిపెట్టింది. ప్రతిపాదనల ప్రకారం ప్రస్తుతం 5, 12, 18, 28గా ఉన్న శ్లాబుల స్థానంలో ఇకపై 5, 18 శ్లాబులు మాత్రమే ఉంటాయి. నిర్దిష్ట ఉత్పత్తులకు మాత్రం 40% ఉంటుంది. వాహనాల విషయం తీసుకుంటే.. ప్రస్తుతం వాటిపై జీఎస్టీ 28 శాతంగా ఉండగా, రకాన్ని బట్టి 1 నుంచి 22 శాతం వరకు కాంపన్సేషన్ సెస్సు కూడా ఉంటోంది. ఫలితంగా చిన్న పెట్రోల్ కార్లపై 29 శాతం నుంచి మొదలుకుని ఎస్యూవీలకు 50 శాతం వరకు జీఎస్టీ వర్తిస్తోంది. కొత్తగా అమల్లోకి వచ్చే జీఎస్‌టీ విధానంతో వాహనాలపై జీఎస్‌టీ 28% నుంచి 18 శాతానికి తగ్గనుంది. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు జీఎస్‌టీ కౌన్సిల్ సెప్టెంబర్ 3–4న సమావేశం కానుంది. ఎకాయెకిన 10% మేర పన్ను భారం తగ్గితే గణనీయంగా మిగులుతుంది కాబట్టి వాహన కొనుగోలుదారులు.. కొత్త జీఎస్‌టీ వచ్చాకే కొనుక్కుందాములే అని వాయిదా వేసుకుంటున్నారు. ఇది ఇప్పుడు డీలర్లకు సంకటంగా మారింది. సరిగ్గా పండుగ సీజన్‌లో ఇలా చేయడం వల్ల అమ్మకాలు తగ్గిపోతాయని భయపడుతున్నారు. పండుగ సీజన్‌పై ఆశలు పెట్టుకుని ఉత్పత్తిని భారీగా పెంచుకోగా, అమ్మకాలు నెమ్మదిస్తే, నిల్వలు పేరుకుపోతాయని కంపెనీలు కూడా ఆందోళన చెందుతున్నాయి.



కొత్త రేట్లను వెంటనే అమలు చేయాలి: ఎఫ్‌ఏడీఏ

కొత్త జీఎస్టీ రేట్లను సత్వరం అమల్లోకి తేవాలంటూ కేంద్రానికి ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య ఎఫ్ఏడీఏ విజ్ఞప్తి చేసింది. **జీఎస్టీపై ప్రకటన** వల్ల క్షేత్ర స్థాయిలో సమస్యలు **తలెత్తుతున్నాయ**ని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కి ఎఫ్ఏడీఏ లేఖ రాసింది. దీని ప్రకారం ఓనం (ఆగస్టు 26), వినాయక చవితి (ఆగస్టు 27), అక్టోబర్లో దసరా, దీపావళి పండుగల సందర్భంగా దేశవ్యాప్తంగా డీలర్లు గణనీయంగా వాహనాల నిల్వలను పెంచుకున్నారు. అయితే, జీఎస్టీ క్రమబద్ధీకరణ ప్రకటనతో కస్టమర్లు కొనుగోళ్లను వాయిదా వేస్తుండటంతో పాటు, కొత్త రేట్ల వివరాల గురించి డీలర్లను అడుగుతున్నారు. దీంతో పండుగ అమ్మకాలు మొత్తం తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఏర్పడింది. కొత్త రేట్లను ప్రకటించిన తర్వాత దీపావళి సందర్భంలో మాత్రమే అమ్మకాలు పుంజుకునే అవకాశం నెలకొంది. 'కాబట్టి జీఎస్టీ మండలి ప్రధాన పండుగల కన్నా కాస్త ముందుగానే సమావేశమై, కొత్త రేట్లను ప్రకటించాలని అభ్యర్థిస్తున్నాం. దీనివల్ల దీపావళికే పరిమితం కాకుండా సీజన్ ఆసాంతం డిమాండ్ ఏర్పడుతుంది. ఇటు పరిశ్రమకు అటు కొనుగోలుదారులకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది' అని లేఖలో ఎఫ్ఏడీఏ తెలిపింది.

ఫైనాన్సింగ్ వ్యవధిని పెంచాలి..

మరోవైపు, నిల్వలను సమకూర్చుకునేందుకు తీసుకున్న స్వల్పకాలిక ఫైనాన్సింగ్ తిరిగి చెల్లింపు వ్యవధిని అదనంగా 30–45 రోజుల వరకు పొడిగించేలా బ్యాంకులు, నాన్–బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలను (ఎన్బీఎఫ్సీ) ఆదేశించాలని ఎఫ్ఏడీఏ కోరింది. సాధారణంగా 45–60 రోజుల వరకు ఈ వ్యవధి ఉంటుంది. కానీ కొత్త జీఎస్టీ రేట్ల కోసం ఎదురుచూపులతో అమ్మకాలు మందగిస్తే, డీలర్లకు ఆర్థికంగా పెనుభారం పడుతుంది కాబట్టి ఈ మేరకు వెసులుబాటు కల్పించాలని ఎఫ్ఏడీఏ వివరించింది. ఎఫ్ఏడీఏలో దేశవ్యాప్తంగా దాదాపు 15,000 డీలర్ ప్రిన్సిపల్స్, సుమారు 30,000 డీలర్లకు సభ్యత్వం ఉంది.

భారత్ రేటింగ్ యథాతథం

బీబీబీ మైనస్‌గా కొనసాగింపు

- స్థిరమైన అవుట్‌లుక్
- ఫిచ్ రేటింగ్స్ ప్రకటన



న్యూఢిల్లీ: భారత సార్వభౌమ రుణ రేటింగ్‌ను బీబీబీ మైనస్, స్థిరమైన అవుట్‌లుక్ వద్దే కొనసాగిస్తున్నట్టు ఫిచ్ రేటింగ్స్ ప్రకటించింది. బలమైన ఆర్థిక వృద్ధికితోడు పటిష్టమైన విదేశీ మారకం నిల్వలు, విదేశీ రుణ భారం నియంత్రణలో ఉండడాన్ని పరిగణనలోకి తీసుకుంది. భారత జీడీపీ వృద్ధి రేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025–26) 6.5 శాతంగా ఉండొచ్చన్న తమ అంచనాలను ప్రతిపాదిత 50 శాతం అమెరికా టారిఫ్‌లు ప్రభావితం చేయొచ్చని తెలిపింది. గత రెండేళ్లలో వృద్ధి వేగం నిదానించినప్పటికీ పోటీ దేశాలతో పోల్చి చూసినప్పుడు భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉన్నట్టు పేర్కొంది. భారత సావరీన్ రేటింగ్‌ను ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ ఇటీవలే 'బీబీబీ'కి అప్‌గ్రేడ్ చేయగా.. ఫిచ్ రేటింగ్స్ మాత్రం యథాతథ రేటింగ్‌ను కొనసాగించడం గమనార్హం. ఫిచ్ పేర్కొన్న బీబీబీ మైనస్ అన్నది పెట్టుబడుల్లో అతి తక్కువ గ్రేడ్ రేటింగ్. మరో రేటింగ్ సంస్థ మార్నింగ్ డీబీఆర్ఎస్ సైతం భారత రేటింగ్‌ను బీబీబీకి అప్‌గ్రేడ్ చేస్తున్నట్టు ఈ ఏడాది మేలో ప్రకటించింది. రేటింగ్‌ను యథాతథంగా కొనసాగించినప్పటికీ, జీడీపీ వృద్ధి రేటు అంచనా 6.5 శాతంలో ఫిచ్ మార్పు చేయలేదు. బలమైన ప్రభుత్వ మూలధన వ్యయాలు, ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవడం, పనిచేయగలిగిన అధిక జనాభా వంటి సానుకూలతలతో మధ్య కాలంలోనూ భారత జీడీపీ 6.4 శాతం వృద్ధిని కొనసాగిస్తుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది.

జీఎస్‌టీ తగ్గించడం పాజిటివ్: ప్రతిపాదిత జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణతో వినియోగం పెరుగుతుందని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. వృద్ధి రిస్కులను ఇది కొంత వరకు తగ్గిస్తుందని పేర్కొంది. ముఖ్యంగా భూమి, కార్మిక చట్టాలకు సంబంధించి కీలక సంస్కరణలకు ఆమోదం ఈ దశలో రాజకీయంగా కష్టమేనని అభిప్రాయపడింది. పలు దేశాలతో ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నప్పటికీ వాణిజ్య అవరోధాలు గణనీయంగానే ఉన్నట్టు తెలిపింది. బీబీబీ రేటింగ్ గల పోటీ దేశాల కంటే భారత్‌కు అధిక ద్రవ్యలోటు, రుణ భారం ఉండడం రేటింగ్ పరంగా బలహీనతగా పేర్కొంది. తలసరి ఆదాయం తక్కువగా ఉండడం కూడా రేటింగ్‌ను పరిమితం చేస్తున్నట్టు ఫిచ్ రేటింగ్స్ వివరించింది.

ఐపీవో సన్నాహాల్లో ఓయో

నవంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు!



న్యూఢిల్లీ: గ్లోబల్ ట్రావెల్ టెక్ సంస్థ ఓయో పబ్లిక్ ఇష్యూ బాటలో సాగుతోంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి నవంబర్‌లో ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేయనుంది. లిస్టింగ్ ద్వారా 7–8 బిలియన్ డాలర్ల(రూ. 61,000–69,600 కోట్లు) విలువను ఆశిస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు సంబంధించి వచ్చే వారం బోర్డుముందు ప్రతిపాదనను ఉంచే వీలున్నట్లు తెలియజేశాయి. అయితే ప్రాస్పెక్టస్ దాఖలు సమయం లేదా ఐపీవో సంబంధ ప్రణాళికలపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయబోమని కంపెనీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ఆయా అంశాలు పూర్తిగా ఓయో బోర్డు నిర్ణయాలకు అనుగుణమై ఉంటాయని తెలియజేశారు. ప్రస్తుతం కంపెనీ వాటాదారుల విలువ పెంచే వివిధ వ్యూహాలపై దృష్టిపెట్టినట్లు వివరించారు.

ఫెడ్ రేట్ల కోత అంచనాల దన్ను!

- ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు
- రాణించిన ఐటీ, ఆటో షేర్లు
- సెన్సెక్స్ 329 పాయింట్లు, నిఫ్టీ 98 పాయింట్లు అప్



ముంబై: ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు సంకేతాలతో దేశీయ స్టాక్ మార్కెట్ సోమవారం లాభాలతో ముగిసింది. ఐటీ, ఆటో షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 329 పాయింట్లు పెరిగి 81,636 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98 పాయింట్లు బలపడి 24,968 వద్ద నిలిచింది. సానుకూలంగా మొదలైన సూచీలు ప్రారంభంలో కాస్త తడబడినా.., వెంటనే తేరుకున్నాయి. సెప్టెంబర్‌లో వడ్డీరేట్ల తగ్గింపు ఉండొచ్చని ఫెడ్ చైర్మన్ సంకేతాలతో రోజంతా స్థిరమైన లాభాలతో ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 492 పాయింట్లు బలపడి 81,799 వద్ద, నిఫ్టీ 98 పాయింట్లు ఎగసి 24,968 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకింది. ఆసియాలో, దక్షిణ కొరియా కోస్పి, జపాన్ నికాయ్, చైనా షాంఘై, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీలు 2% వరకు పెరిగాయి. యూరోపియన్ మార్కెట్లు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని స్వల్ప లాభాల్లో ముగిశాయి. అమెరికా సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

→ ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాలతో ఐటీ షేర్లలో భారీ కొనుగోళ్లు జరిగాయి. ఇన్ఫోసిస్, టీసీఎస్ 3%, హెచ్‌సీఎల్ టెక్ 2.50%, విప్రో 2.30%, ఎంఫసిస్, 2%, టెక్ మహీంద్రా, ఎల్‌టీఐఎం, పెర్సిస్టెంట్, కోఫోర్జ్ 1.50 నుంచి 1% లాభపడ్డాయి.

→ డాలర్ ఇండెక్స్ బలహీనత మెటల్ షేర్లకు డిమాండ్ పెంచింది. జిందాల్ స్టెయిన్‌లెస్ 3%, హిందుస్తాన్ జింక్ 2.50%, హిందాల్కో 2%, వేదాంత 1.50% రాణించాయి. నాల్కో, ఎన్ఎండీసీ, టాటా స్టీల్ 1%, సెయిల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ అరశాతం చొప్పున పెరిగాయి.

→ క్యాపిటల్ గూడ్స్, టెలికమ్యూనికేషన్, ఇండస్ట్రియల్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లు నష్టపోయాయి. రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో ఐటీ 2.35%, టెక్ 1.67%, ఆటోమొబైల్ 0.50%, కన్జూమర్ డ్యూరబుల్స్ 0.46% లాభపడ్డాయి. ఇక మిడ్ క్యాప్ 0.10% పెరిగింది. స్మాల్ క్యాప్ సూచీ 0.02% లాభపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
కంపెనీల కొనుగోళ్లకూ బ్యాంక్ నిధులు! | ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు: ఆర్‌బీఐ గవర్నర్

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం– భౌతిక శాస్త్రం » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–కంప్యూటర్ అవేర్‌నెస్

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్‌పీసీఐఎల్‌లో 70 అప్రెంటిస్‌లు

ఉత్తరప్రదేశ్‌లోని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్)లో ట్రేడ్, డిప్లొమా, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 70.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ట్రేడ్ అప్రెంటిస్–50, డిప్లొమా అప్రెంటిస్–10, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్–10.
» **ట్రేడులు:** ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 02.09.2025 నాటికి ట్రేడ్ అప్రెంటిస్‌కు 18 నుంచి 24 ఏళ్లు, డిప్లొమా అప్రెంటిస్‌కు 18 నుంచి 25 ఏళ్లు, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 18 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7,700 నుంచి రూ.8,050, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.09.2025
» **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌లో 30 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్) ఆర్మీ డెంటల్ కార్ప్స్‌లో షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ)మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
» **అర్హత:** డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(డీసీఐ) గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీడీఎస్/ఎండీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. 30.06.2025 నాటికి ఒక సంవత్సరం ఇంటర్న్‌షిప్ పూర్తి చేయాలి. స్టేట్ డెంటల్ కౌన్సిల్/డీసీఐ రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. నీట్(ఎండీఎస్) 2025 పరీక్షలో హాజరై ఉండాలి.
» **వయసు:** 31.12.2025 నాటికి 45 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** నీట్(ఎండీఎస్) మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ, ఫిజికల్, మెడికల్ స్టాండర్డ్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 18.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.09.2025
» **వెబ్‌సైట్:** www.join.afms.gov.in.

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో అకడమిక్ అసోసియేట్ పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన అకడమిక్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంటెక్/ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 40 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.60,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 27.08.2025
» **వెబ్‌సైట్:** http://career.nirdpr.in

ఎన్‌సీడీసీ, న్యూఢిల్లీలో డైరెక్టర్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ).. ఒప్పంద ప్రాతిపదికన చీఫ్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** చీఫ్ డైరెక్టర్(మార్కెటింగ్)–01, డిప్యూటీ డైరెక్టర్(మార్కెటింగ్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి మార్కెటింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఎంబీఏ/పీజీడీఎం ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు చీఫ్ డైరెక్టర్‌కు రూ.1,23,100 నుంచి రూ.2,15,900, డిప్యూటీ డైరెక్టర్‌కు రూ.67,700 నుంచి రూ.2,08,700.
» **వయసు:** చీఫ్ డైరెక్టర్‌కు 45 ఏళ్లు, డిప్యూటీ డైరెక్టర్‌కు 35 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, నేషనల్ కో–ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) 4–సిరి, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, హౌజ్ ఖాస్, న్యూఢిల్లీ–110016 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.08.2025.
» **వెబ్‌సైట్:** http://www.ncdc.in

టీటీడీ–ఎస్‌వీఐఎంఎస్, తిరుపతిలో 106 ఫ్యాకల్టీ పోస్టులు

తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎస్‌వీఐఎంఎస్–ఎస్‌పీఎంసీడబ్ల్యూ) రెగ్యులర్ ప్రాతిపదికన మెడికల్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 106.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్–09, అసోసియేట్ ప్రొఫెసర్–30, అసిస్టెంట్ ప్రొఫెసర్–67.
» **విభాగాలు:** అనాటమి, అనెస్తీషియాలజీ, బయోకెమిస్ట్రీ, కార్డియాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్, జనరల్ సర్జరీ, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మెడికల్ ఆంకాలజీ, న్యూరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, అప్తల్మాలజీ, పీడియాట్రిక్, డెర్మటాలజీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, నెఫ్రాలజీ, సైకియాట్రీ, యూరాలజీ తదితరాలు.
» **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డీఎన్‌బీ/ఎంఎస్/ఎండీ, ఎంసీహెచ్, డీఎం ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** ప్రొఫెసర్‌కు 58 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,48,200 నుంచి రూ.2,11,400, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500 నుంచి రూ.1,67,400, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.138,300 నుంచి రూ.2,09,200.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది రిజిస్ట్రార్, శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎస్‌వీఐఎంఎస్), అలిపిరి రోడ్, తిరుపతి–517507 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 08.09.2025.
» **వెబ్‌సైట్:** https://svimstpt.ap.nic.in

ఎల్ఐసీలో అడ్మినిస్ట్రేటివ్ కొలువులు

» 491 ఉద్యోగాలకు ప్రకటన విడుదల
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ

జాబ్స్ ఇన్ఫో



బీమా సంస్థలో భద్రమైన కొలువు కోరుకునే వారికోసం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) స్వాగతం పలుకుతోంది. భారత ప్రభుత్వరంగానికి చెందిన ఎల్ఐసీ పలు విభాగాల్లో 491 అసిస్టెంట్ ఇంజినీర్స్ (ఏఈ–సివిల్/ఎలక్ట్రికల్), అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (ఏఏఓ– స్పెషలిస్ట్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. డిగ్రీ, బీఈ/ బీటెక్, లా డిగ్రీ, సీఏ, ఐసీఏఐ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.

- **మొత్తం ఖాళీలు:** 491
- **అసిస్టెంట్ ఇంజినీర్స్ (ఏఈ)**–81 ఖాళీలు
  విభాగాల వారీగా..
  ఏఈ (సివిల్) – 50, ఏఈ (ఎలక్ట్రికల్)– 31 పోస్టులున్నాయి.
- **అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ (ఏఏఓ–స్పెషలిస్ట్):** 410 ఖాళీలు
  విభాగాల వారీగా..
  ఏఏఓ సీఏ– 30, ఏఏఓ (సీఎస్)– 10, ఏఏఓ (యాక్చ్యూరియల్)– 30, ఏఏఓ (ఇన్సూరెన్స్ స్పెషలిస్ట్)– 310, ఏఏఓ (లీగల్) – 30

అర్హతలు

పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, బీఈ/ బీటెక్, లా డిగ్రీ, సీఏ, ఐసీఏఐ ఉత్తీర్ణులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే కొన్ని పోస్టులను ఐసీఎస్ఐ మెంబర్‌షిప్‌తో పాటు ఉద్యోగానుభవం కూడా పరిగణలోకి తీసుకుంటారు.

వయసు

01.08.2025 నాటికి ఏఈ పోస్టులకు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఏఏఓ సీఏ, లీగల్ పోస్టులకు 21 నుంచి 32 ఏళ్లు, ఇతర పోస్టులకు 20– 30 ఏళ్ల మధ్య ఉండాలి.

వయోసడలింపు

ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగ అభ్యర్థులకు పదేళ్లు, ఎల్ఐసీ ఉద్యోగులకు ఐదేళ్ల వయోసడలింపు ఉంటుంది.

ఎంపిక ఇలా

ఎంపిక ప్రక్రియలో భాగంగా మూడు దశల అర్హత పరీక్షలను నిర్వహిస్తారు. ప్రిలిమినరీ పరీక్ష (ఆన్‌లైన్– ఆబ్జెక్టివ్), మెయిన్ (ఆబ్జెక్టివ్ + డిస్క్రిప్టివ్), ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా అభ్యర్థులను తుది ఎంపిక చేసి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

ఏఏఓ స్పెషలిస్ట్

ఫేజ్–1 (ప్రిలిమినరీ పరీక్ష)

ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో నిర్వహిస్తారు. మొత్తం 100 ప్రశ్నలకు గాను 70 మార్కులుంటాయి. మూడు విభాగాల నుంచి ప్రశ్నలను అడుగుతారు. రీజనింగ్ ఎబిలిటీ 35 ప్రశ్నలు– 35 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 35 ప్రశ్నలు– 35 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 30 ప్రశ్నలకు– 30 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో ఇంగ్లిష్ లాంగ్వేజ్ క్వాలిఫయింగ్ పరీక్ష మాత్రమే. తుది ఎంపికలో వీటి మార్కులను పరిగణలోకి తీసుకోరు. ప్రతి తప్పు సమాధానానికి 1/4 వంతు మార్కులను తగ్గిస్తారు. ప్రతి విభాగానికి 20 నిమిషాల చొప్పున 60 నిమిషాల పరీక్ష సమయం ఇస్తారు.

ఏఏఓ (లీగల్)

ఈ పోస్టులకు నిర్వహించే ప్రిలిమ్స్ పరీక్ష కూడా స్పెషలిస్ట్ ఆఫీసర్ తరహాలోనే ఉంటుంది. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ స్థానంలో లీగల్ పోస్టుల వారికి జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్ట్ లో పరీక్ష ఉంటుంది. జనరల్ అవేర్‌నెస్ కేవలం క్వాలిఫయింగ్ పరీక్ష మాత్రమే. తుది ఎంపికలో వీటి మార్కులను పరిగణలోకి తీసుకోరు.

ఏఏఓ స్పెషలిస్ట్ ఆఫీసర్, లీగల్ (మెయిన్స్)

ఈ పరీక్ష కూడా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ప్రిలిమ్స్‌తో పోల్చితే కొంచెం లోతుగా పరీక్ష విధానం ఉంటుంది. ఐదు విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఇందులో రెండు డిస్క్రిప్టివ్ విభాగాలు కాగా మిగత మూడు విభాగాలు ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలుంటాయి. రీజనింగ్ ఎబిలిటీ 30 ప్రశ్నలు– 30 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు– 20 మార్కులు, ప్రొఫెషనల్ నాలెడ్జ్ 50 ప్రశ్నలు– 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. అలాగే డిస్క్రిప్టివ్‌కి సంబంధించి ప్రొఫెషనల్ నాలెడ్జ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ రెండు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ప్రొఫెషనల్ నాలెడ్జ్ (డిస్క్రిప్టివ్)

ఈ విభాగంలో మొత్తం 6 ప్రశ్నలుంటాయి. 4 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. 50 మార్కులుంటాయి. 60 నిమిషాలు పరీక్ష సమయం.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగం నుంచి రెండు ప్రశ్నలు వస్తాయి. 25 మార్కులుంటాయి. పరీక్ష సమయం 30నిమిషాలు. ఇది క్వాలిఫయింగ్ విభాగం మాత్రమే. ఫైనల్ ర్యాంకింగ్‌లో ఈ మార్కులను పరిగణలోకి తీసుకోరు.

క్వాలిఫయింగ్ పరీక్షగానే

స్పెషలిస్ట్ పోస్టులకు నిర్వహించే మెయిన్స్ పరీక్షలో ఇంగ్లిష్‌ను క్వాలిఫయింగ్ పరీక్షగానే పరిగణిస్తారు. అలాగే ఏఏఓ లీగల్ పోస్టులకు నిర్వహించే మెయిన్స్ పరీక్షలో జనరల్ అవేర్‌నెస్‌ను కూడా క్వాలిఫయింగ్ పరీక్షగానే పరిగణిస్తారు.

ఇంటర్వ్యూ

మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఫేస్ టూ ఫేస్ నిర్వహించే ఈ ఇంటర్వ్యూలో అభ్యర్థి పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ అంశాలను పరిశీలించే విధంగా ప్రశ్నలను అడుగుతారు.

మెడికల్ టెస్ట్

విజయవంతగా ఇంటర్వ్యూ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు మెడికల్ పరీక్షలను నిర్వహించి ఫిట్‌గా ఉన్న వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తు చివరి తేదీ:** 08.09.2025
- **ప్రిలిమినరీ పరీక్ష:** 03.10.2025
- **మెయిన్ పరీక్ష:** 08.11.2025
- **వెబ్‌సైట్:** https://licindia.in/recruitment-of-aao-generalists/-specialists/-assistant-engineers-2025

క్లుప్తంగా...

ప్రతీ ఇంజనీరింగ్ విద్యార్థి బాధ్యతగా వ్యవహరించాలి

- హోలీమేరీ కాలేజీ గ్రాడ్యుయేషన్ డేలో రెక్టార్ విజయకుమార్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ పూర్తి చేసిన ప్రతీ విద్యార్థి మరింత బాధ్యతగా వ్యవహరించాలని జేఎన్టీయూహెచ్ రెక్టార్ విజయకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం కీసర మండలం భోగారం గ్రామంలోని హోలీ మేరీ ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన గ్రాడ్యుయేషన్ డేకు విజయకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నిజమైన జీవితం గ్రాడ్యుయేషన్ పూర్తయినప్పటి నుంచే మొదలవుతుందని, సిన్సియర్‌గా లక్ష్యంపై గురిపెట్టాలని సూచించారు. కాలేజీలో అంతర్జాతీయ ప్రమాణాల మెరుగుకు కృషి చేస్తున్నామని హోలీమేరీ కాలేజీ ఫౌండర్ చైర్మన్ అరవింద్ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. కాలేజీ టాపర్స్ రామోజి శివానీ, భూక్యా కృష్ణవేణికి రెక్టార్ మెడల్స్‌ను అందజేశారు. వరప్రసాద్‌రెడ్డి, చైర్మన్ అరవింద్ సిద్ధార్థరెడ్డి, ఫౌండర్ సెక్రటరీ విజయ శారదా రెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య



కొల్లాపూర్ రూరల్: నూతన విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధానకార్యదర్శి శ్రీజన్ భట్టాచార్య పిలుపునిచ్చారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సింగోటంలో రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీజన్ భట్టాచార్య మాట్లాడుతూ దేశంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన విద్యావిధానం పేరుతో విద్యారంగాన్ని మూఢనమ్మకాల వైపు, కార్పొరేట్‌కు అప్పజెప్పే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. స్వాతంత్ర్యోద్యమంలో ఎలాంటి ప్రాత లేని సావర్కర్ లాంటి వారి జీవితచరిత్రను పాఠ్యాంశంలో చేరుస్తున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల్ని యూనివర్సిటీ వీసీలుగా నియమిస్తూ ప్రశ్నించే గొంతుకలను నొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా, విద్యార్థుల గోడు వినే మంత్రి లేకపోవడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి చూసే శాఖలోనే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు చేపట్టే విధంగా రాష్ట్ర కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో దామెర కిరణ్ పూజ, ప్రశాంత్ శంకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేషనల్ బెస్ట్.. పవిత్ర టీచర్

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక



విద్యార్థులను సైంటిస్టుల్ని చేయడమే లక్ష్యం
-మారం పవిత్ర

నా ఉద్యోగ జీవితంలో కనీసం ఒకరిద్దరు విద్యార్థులనైనా శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నా. విద్యార్థులు సిద్ధాంతపరంగా నేర్చుకున్న విషయాలు ప్రయోగపూర్వకంగా నిర్ధారణ చేసుకునే అవకాశం, పరిస్థితులను ఉపాధ్యాయులు కల్పించాలి. సైన్స్ అభ్యసనంలో ప్రయోగాత్మకతకు ఎక్కువ ప్రాధాన్యమిస్తే విద్యార్థులకు నేర్చుకోవడం సులువు అవుతుంది.

పెన్‌పహాడ్ (సూర్యాపేట): జీవ శాస్త్రంలో ఆమె బోధన వినూత్నంగా ఉంటుంది. ప్రతి పాఠ్యాంశాన్ని విద్యార్థుల కళ్లకు కట్టినట్టుగా వివరిస్తారు. వారితో ప్రయోగాలు చేయిస్తారు. ఇందుకోసం సాంకేతికతను వినియోగిస్తారు. విద్యార్థులు తాను చెప్పే విషయంలో లీనమయ్యేలా చేస్తారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయురాలు మారం పవిత్ర అనుసరిస్తున్న బోధన పద్ధతులు, విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు ఆమెకు జాతీయ స్థాయి గుర్తింపును తీసుకువచ్చాయి. జాతీయ స్థాయిలో ఏటా ప్రతిష్టాత్మకంగా అందించే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు కేంద్ర ప్రభుత్వం మారం పవిత్రను ఎంపిక చేసింది. దేశ వ్యాప్తంగా 44 మంది ఉపాధ్యాయులను ఈ అవార్డు కోసం ఎంపిక చేయగా, తెలంగాణ నుంచి మారం పవిత్రను ఈ అవార్డు వరించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డు స్వీకరిస్తారు. మారం పవిత్రకు జాతీయ ఉపాధ్యాయ అవార్డు–2025 లభించడంపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికొలస్ అభినందనలు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది దరఖాస్తు

రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోగా, రాష్ట్ర జ్యూరీ కమిటీ 15 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసింది. ఢిల్లీ స్థాయిలో పలు అంశాలపై ఇంటర్వ్యూ చేసిన తర్వాత.. అందులో టాప్ ఆరుగురిని నలుగురు సభ్యులతో కూడిన నేషనల్ జ్యూరీ ఆగస్టు 13న ఢిల్లీలోని డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి గూగుల్ మీట్ ద్వారా ఇంటర్వ్యూ చేసింది. అనంతరం ఒక్కొక్క ఉపాధ్యాయుడికి 10 నిమిషాల చొప్పున సమయం ఇచ్చి వారు చేసిన ప్రయోగాల ప్రదర్శనకు అవకాశం ఇచ్చారు. ఆ టాప్ 6 ఉపాధ్యాయుల్లో ఒకరిని (మారం పవిత్ర) అవార్డుకు ఎంపిక చేశారు.

భర్త ప్రోత్సాహంతో..

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన మారం పవిత్ర పదో తరగతి వరకు వేములపల్లి, తడకమళ్ల ప్రభుత్వ పాఠశాలల్లో చదివారు. ఇంటర్, డిగ్రీ మిర్యాలగూడలోని ప్రైవేట్ కళాశాలలో చదివారు. కాగా చివ్వెంల మండలం గుంపుల తిరుమలగిరికి చెందిన టీచర్ నాతాల మన్మథరెడ్డితో ఆమెకు వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో బీఈడీ, డీఈడీ పూర్తి చేసి 2008 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించారు. 2009లో మొదటగా ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెం యూపీఎస్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా విధులు చేపట్టారు. 2012 నుంచి 2015 వరకు గోరెంట్ల జెడ్పీహెచ్‌లో, ఆ తర్వాత గడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ప్రస్తుతం పెన్‌పహాడ్‌లో పనిచేస్తున్నారు.

ఎన్నో వినూత్న బోధనలు..

- జాతీయ స్థాయిలో సీఐఈటీ, ఎన్‌సీఈఆర్‌టీ యూట్యూబ్ చానల్ ద్వారా 2020–21లో ఉపాధ్యాయులకు ఉపయోగపడే ఐసీటీ టూల్స్‌పై పవిత్ర అవగాహన తరగతులు అందించారు.
- 2019లో విద్యా విధానంపై జాతీయ స్థాయి సెమినార్‌లో 'సైన్స్ టీచింగ్ త్రూ హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్' అనే అంశంపై ప్రసంగించారు.
- 2017 నుంచి ఇప్పటివరకు స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ (ఎస్ఐఈటీ) ద్వారా జీవశాస్త్రంలో 14 డిజిటల్ పాఠాలను బోధించారు.
- తెలంగాణ పాఠ్యపుస్తకాల్లో 6, 7 తరగతులు, సామాన్య శాస్త్రం 8, 9, 10 తరగతుల జీవశాస్త్రం పాఠ్యపుస్తకాలలో ఉన్న క్యూ ఆర్ కోడ్‌లలో కంటెంట్ తయారీకి ఎస్‌సీఈఆర్‌టీ దీక్ష ఆధ్వర్యంలో 60 వీడియోలు, 16 క్వశ్చన్ సెట్‌లను తయారు చేశారు. వాటిని ఎస్‌సీఆర్‌టీ క్యూ ఆర్ కోడ్‌లో పబ్లిష్ చేశారు.
- ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు వర్క్‌షీట్‌ల తయారీ, పదోతరగతి విద్యార్థులకు పరీక్షలపై ఒత్తిడి తగ్గించడానికి ఎస్‌సీఈఆర్టీ రూపొందించిన జీవశాస్త్ర అభ్యసన దీపికల్లో పాల్గొన్నారు.
- జీవశాస్త్ర శిక్షణ, అభ్యసన ఫలితాలకు సంబంధించి 2016–19, 2020–21 సంవత్సరాల్లో రాష్ట్రస్థాయి సెమినార్లలో పాల్గొన్నారు.
- కోవిడ్ సమయంలో యూట్యూబ్ చానల్ ద్వారా 50 వీడియోలు రూపొందించి వాట్సాప్ ద్వారా విద్యార్థులకు అందించారు.
- తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ యూట్యూబ్ చానల్ ద్వారా పదో తరగతి విద్యార్థుల కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ, హోమ్‌సైన్స్ పాఠాలు బోధించారు.

అందుకున్న అవార్డులు ఇవే...

- 2019లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ టీచర్ అవార్డు.
- 2021లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు.
- టెక్ మహీంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం నిర్వహించిన సైన్స్ ఉపాధ్యాయ పోటీల్లో ట్రాన్స్‌ఫార్మింగ్ అవార్డు.
- 2023లో నేషనల్ సైన్స్ డే సందర్భంగా సారాబాయి టీచర్ సైంటిస్ట్ నేషనల్ అవార్డును జమ్మూకాశ్మీర్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ రవిశంకర్ చేతుల మీదుగా అందుకున్నారు.
- 2023–24లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందారు.
- ప్రస్తుతం (2025) జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు.

అవే డాక్యుమెంట్లు... అదే హడావుడి

- తూతూ మంత్రంగా ఫీజుల పునఃపరిశీలన
- ఫీజు పెంపుపై ఎఫ్‌ఆర్‌సీ నుంచి స్పష్టత లేదన్న యాజమాన్యాలు
- తొలి రోజు 15 కాలేజీలు హాజరు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఫీజులపై సోమవారం పరిశీలన మొదలైంది. రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ మండలి (ఎఫ్‌ఆర్‌సీ) తొలి రోజు 15 కాలేజీలతో సంప్రదింపులు జరిపింది. ఫీజుల పెంపు కోర్టు తీర్పు, ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని చెబుతోంది. దీనిపై ఎలాంటి నిర్ణయాన్ని వెల్లడించలేదని కాలేజీల ప్రతినిధులు తెలిపారు. ఎఫ్‌ఆర్‌సీకి గతంలో ఇచ్చిన డాక్యుమెంట్లనే ప్రైవేటు కాలేజీలు మళ్లీ ఇచ్చాయి. కాకపోతే ఈసారి నోటరీ చేసిన అఫిడవిట్‌లో కొన్ని కొత్త పాయింట్లు చేర్చాయి. 2025–28 బ్లాక్ పీరియడ్‌కు ఎఫ్‌ఆర్‌సీ ఖరారు చేసిన ఫీజులను ప్రభుత్వం అంగీకరించకపోవడంతో కాలేజీలు హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో ఆరు వారాల్లో ఫీజులపై నిర్ణయం వెల్లడించాలని కోర్టు చెప్పింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. కమిటీ సిఫార్సులతో ఫీజులపై మళ్లీ పరిశీలన జరపాలని ఎఫ్‌ఆర్‌సీని ఆదేశించింది.

కమిటీ మార్గదర్శకాలు ఏమయ్యాయి?

నాణ్యత గల కాలేజీలకే ఫీజుల పెంపునకు అనుమతి ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ పేర్కొంది. కొన్నేళ్లుగా కాలేజీల్లో బోధన ఫలితాలు, ఉద్యోగ అవకాశాలు, కాలేజీ ర్యాంకులను కొలమానంగా తీసుకోవాలని చెప్పింది. అయితే, తొలి రోజు ఎఫ్‌ఆర్‌సీ భేటీలో ఇవేవీ కన్పించలేదని కాలేజీ ప్రతినిధుల ద్వారా తెలిసింది. అయితే సోమవారం కమిటీ సంప్రదింపులు జరిపిన కాలేజీల జాబితాల్లో తక్కువ ఫీజులున్న కాలేజీలే ఉన్నాయి. అయినప్పటికీ మార్గదర్శకాల గురించి ప్రస్తావించకపోవడం కాలేజీలకు అనుమానంగా ఉంది. ప్రత్యేక కమిటీ సిఫార్సులు ఈ బ్లాక్ పీరియడ్‌కు కాదని, వచ్చే బ్లాక్ పీరియడ్‌కు పరిగణనలోనికి తీసుకుంటామని ఎఫ్‌ఆర్‌సీ సభ్యులు చెప్పినట్టు తెలిసింది. ఇదే నిజమైనప్పుడు అసలు మళ్లీ విచారణ చేపట్టడంలో ఉద్దేశమేమిటని కాలేజీ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

ఎఫ్‌ఆర్‌సీలోనూ అసహనం

ఫీజులను తిరిగి పరిశీలించడంపై ఎఫ్‌ఆర్‌సీ సభ్యుల్లోనూ అసహనం కన్పిస్తోందని కాలేజీ యాజమాన్యాలు అంటున్నాయి. ఫీజులపై అన్ని విధాలా పరిశీలించాకే ప్రభుత్వానికి సిఫార్సు చేశామని, వీటిని మళ్లీ పరిశీలించమనడం అర్థరహితమని కమిటీ భావిస్తున్నట్టు కాలేజీల ప్రతినిధులు గుర్తించారు. ప్రభుత్వ ఆదేశం కావడంతో తూతూ మంత్రంగానే పరిశీలన జరుగుతున్నట్టు చెబుతున్నారు. గతంలో మాదిరి అవే డాక్యుమెంట్లు, అదే హడావుడి కన్పించిందని చెబుతున్నారు. అసలు ఎందుకు ఈ ప్రక్రియ చేపట్టామో తమకు స్పష్టత లేదని ఎఫ్‌ఆర్‌సీలో ఓ సభ్యుడు అన్నట్టు ఓ కాలేజీ యజమాని చెప్పారు. ఫీజులు పెంచుతారా? లేదా? అనేది ఎఫ్‌ఆర్‌సీ పరిధిలోది కాదని, ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని కొంతమందికి, కోర్టు చూసుకుంటుందని మరి కొంత మందికి చెప్పినట్టు తెలిసింది.



మెరుగైన బోధనకు అ'డ్రెస్'



భీమపుత్ర శ్రీనివాస్

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ఏరియా ఎంపీపీఎస్ (ప్రభుత్వ) పాఠశాలలో ఉపాధ్యాయుడు జలంపల్లి భీమపుత్ర శ్రీనివాస్ బోధించే విధానం విద్యార్థులను ఆకట్టుకుంటోంది. సోమవారం ప్రత్యేకంగా తయారుచేసిన మానవ అంతర్గత అవయవాల డ్రెస్ ధరించి ఐదవ తరగతి గదిలో ఆయన విద్యార్థులకు పాఠాలు బోధించారు. బాడీసూట్ ధరించి మానవ శరీరంలోని అవయవాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ వాటి పనితీరును సులభంగా అర్థమయ్యేలా వివరించారు. మానవశరీరం, అస్థిపంజర వ్యవస్థ, కండరాల పనితీరు, మెదడు, నాడీవ్యవస్థ, రక్తప్రసరణ పనితీరు తదితర అంతర్గత అవయవాల పనితీరుపై చిత్రాలను చూపిస్తూ బోధించారు. విద్యార్థులు మరింత సులభంగా విషయ పరిజ్ఞానం పొందేందుకు ఇలాంటి బోధన అవసరమని ఉపాధ్యాయుడు తెలిపారు.

మందమర్రి రూరల్

నీట్‌లో స్పోర్ట్స్ కోటాపై స్పష్టత ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నీట్ అడ్మిషన్లలో స్పోర్ట్స్ కోటాపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కేటాయింపులో గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కోటాకు 0.5 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ 2017, జూలై 5న జారీ చేసిన జీవో 114 ఇప్పుడు అమల్లో ఉందా? లేదా? తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదికి సూచించింది. తదుపరి విచారణ సెప్టెంబర్ 4కు వాయిదా వేసింది. స్పోర్ట్స్ కోటా కింద తనకు సీటు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జూలై 25న వినతిపత్రం సమర్పించినా.. స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ ముఖ్య కార్యదర్శి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని సవాల్ చేస్తూ నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన ఎం.అరుణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ అరుణ్ దరఖాస్తును పరిగణనలోకి తీసుకుని స్పోర్ట్స్ కోటా కింద సీటు కేటాయించేలా కాళోజీ నారాయణ ఆరోగ్య వర్సిటీకి ఆదేశాలివ్వాలని కోరారు. స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లను ప్రభుత్వం తొలగించిందని వర్సిటీ తరఫు న్యాయవాది చెప్పారు. దీనిపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది.

మహిళలకు శిక్షణ కార్యక్రమాలపై ప్రభుత్వంతో హెచ్‌సీసీబీ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: మహిళా శక్తి క్యాంటీన్లు ఆర్థిక స్వావలంబన, మహిళల స్వాతంత్ర్యానికి నిదర్శనమని గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం (సెర్ప్) సీఈవో దివ్య దేవరాజన్ అన్నారు. మహిళా వ్యాపారులకు శిక్షణ కార్యక్రమాలపై రాష్ట్రప్రభుత్వంతో హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ (హెచ్‌సీసీబీ) సోమవారం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ఎస్ఈఆర్‌పీ దేవరాజన్, హెచ్‌సీసీబీ సీఎస్ఆర్ హెడ్ శ్వేత పునీతతో పాటు ఉన్నతాధికారుల సమక్షంలో జరిగింది. మహిళా శక్తి క్యాంటీన్లతో అనుబంధంగా ఉన్న 1,000 మందికిపైగా మహిళా వ్యాపారులకు ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, సేల్స్, మార్కెటింగ్, రిటైల్ అంశాలపై శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా భాగస్వామ్యం కానున్నారని హెచ్‌సీసీబీ తెలిపింది. ఈ మేరకు స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జీవో) సహాయంతో మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించుకుంది. దివ్య దేవరాజన్ మాట్లాడుతూ హిందుస్థాన్ కోకాకోలా సంస్థ తమ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా మహిళా శక్తి క్యాంటీన్లతో అనుబంధం ఉన్న మహిళలకు శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకోవడం సంతోషమన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

మధ్యయుగ వైద్య చరిత్రలో మేటి..

అగ్గలయ్య



సైదాపురంలో చాళుక్యుల కాలంలో ఉన్న పురావస్తు అవశేషాలు

చాళుక్య రాజైన జయసింహ-2 ఆస్థానంలో గొప్ప శస్త్రచికిత్స వైద్యుడు

జైన ఆయుర్వేద, శస్త్ర చికిత్సలో ప్రత్యేక గుర్తింపు

యాదాద్రి భువనగిరి జిల్లా సైదాపురం గ్రామంలో అగ్గలయ్య శాసనాలు

ఆయుర్వేద చరిత్రను తెలిపే అతి విలువైనదిగా సైదాపురం శాసనం



అగ్గలయ్య నమూనా చిత్రం

యాదగిరిగుట్ట రూరల్: తెలంగాణ ప్రాంతంలో మధ్య యుగ కాలంలో వైద్య చరిత్రకు ఒక మూలస్తంభంగా, వైద్య వారసత్వానికి శక్తిమంతమైన చిహ్నంగా నిలిచిన ప్రముఖ జైన ఆయుర్వేద, శస్త్ర వైద్యుడు అగ్గలయ్య. ఈయనకు సంబంధించిన శాసనాలు యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని సైదాపురం గ్రామంలో ఉన్నాయి. ఈ శాసనాలు దక్షిణ, మధ్య భారతదేశంలో 6 నుంచి 12 శతాబ్దాల మధ్య పరిపాలించిన చాళుక్య రాజుల కాలం నాటివని ఆర్కియాలజీ అధికారులు గుర్తించారు. చాళుక్యుల రాజుల్లోని రెండవ జయసింహుడుతో పాటు మరి కొంత మంది రాజుల కాలంలో సామంతుడుగా ఉన్న జైన శస్త్ర వైద్యుడు అగ్గలయ్య గురించి ఈ శాసనంలో వివరించారు. అప్పట్లో అగ్గలయ్య చేసిన సేవలకు రెండవ జయసింహుడు అతని పేరు మీద కొన్ని మాన్యాలను ఈ సైదాపురం ప్రాంతంలో ఇచ్చారని ఈ శాసనంలో పొందుపరిచారు.

ఆయుర్వేదం, శస్త్ర చికిత్సలో మాంత్రికుడు

ఆయుర్వేదం, శస్త్ర చికిత్సలో అగ్గలయ్య మాంత్రికుడు. శస్త్ర వైద్యంలో జబ్బు నయం కానటువంటి వారిని, ఈ అగ్గలయ్య వద్దకు పంపించేవారని, ఈ శాసనం తెలుపుతుంది. భారత దేశంలోనే 11వ శతాబ్దం నాటికి ఒక సర్జన్ ఉన్నాడని ప్రాథమిక వనరుగా ఈ శిలాశాసనం తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. దక్షిణ భారతదేశంలో ఆయుర్వేద చరిత్రను తెలిపే అతి విలువైన శాసనం ఈ సైదాపురం శాసనం . మధ్యయుగం కాలంలో కొందరు వైద్యులు శస్త్ర చికిత్సలు చేసేవారు అని అనడానికి రుజువు ఈ శాసనం.

అగ్గలయ్య చరిత్ర

అగ్గలయ్య జైన మతానికి చెందిన శస్త్ర చికిత్స వైద్యుడు. ఈయన దక్షిణ భారతదేశంలోని తెలంగాణ ప్రాంతానికి చెందిన గొప్ప వైద్యుడు. ఇతను సుమారుగా 1000 ఏడీలో జన్మించి, 1080 ఏడీలో మరణించాడు. ఈయన భార్య పేరు వల్లికాంబే. తెలంగాణలోని ఆలేరు సమీపంలోని ఇక్కురికే (ప్రస్తుతం ఇక్కుర్తి) గ్రామం ఈయన స్వస్థలం. ఈయన స్థాపించిన వైద్య రత్నాకర జినాలయాలు, అనేక చారిత్రక నిర్మాణాలు ఈ ఇక్కుర్తి ప్రాంతంలో ఉండేవని పురావస్తుశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ ఇక్కుర్తి ప్రాంతంలోనే ఈయన సమాధి గత కొన్ని సంవత్సరాల కిందట వరకు ఉందని, కాలానుగుణంగా ఆ సమాధిని తవ్వకాల్లో తీసేశారని అధికారులు చెబుతున్నారు.

శస్త్ర విద్యలో ప్రావీణ్యుడు

చాళుక్యుల కాలంలో అగ్గలయ్య శస్త్ర చికిత్సలో ఓ వెలుగు వెలిగిన వైద్యుడు. ఇతర వైద్యులు నయం చేయని వ్యాధులను నయం చేసేవాడు. ఈయనకు నరవైద్యవర, ప్రాణాచార్య, వైద్యరత్నాకర, వైద్యశిఖామణి అనే బిరుదులు ఉన్నాయి. అగ్గలయ్యను రాజ వైద్యుడుగా పిలిచేవారు. జైనులకు శస్త్రచికిత్స, ఆయుర్వేద కళను బోధించేవాడు. విదేశాల నుంచి వచ్చే ఇతర వైద్యుల సందేహాలను నివృత్తి చేసేవాడు.

సామంత రాజుగా అగ్గలయ్య

అగ్గలయ్య చేసిన వైద్య సేవలకు ప్రత్యేక గుర్తింపు కల్పిస్తూ, ఆనాటి చాళుక్య రాజులు ఈయన్ను సామంత రాజుగా చేసుకున్నారు. నలుగురు రాజులు మారినా ఈయననే ఆస్థాన వైద్యుడిగా, సామంత రాజుగా కొనసాగించారు.

జైన మతం అయినప్పటికీ..

అగ్గలయ్య జైన మతానికి సంబంధించిన వ్యక్తి అయినప్పటికీ, వైద్య శాస్త్రంలో ఆయన అభివృద్ధిని అడ్డుకోలేదని శాసనాలు చెబుతున్నాయి. అహింస జైన సూత్రం అయినా, శస్త్ర చికిత్సలో వైద్య విద్య కోసం, అభ్యాస కేంద్రాలను ఏర్పాటు చేసి, 9వ శతాబ్దంలో ఉగ్రాదిత్య వంటి జైన పండితులు వైద్య గ్రంథాలను ఏర్పాటు చేయడంలో అగ్గలయ్య తమ వంతు పాత్ర పోషించాడని చరిత్ర చెబుతుంది.

సైదాపురంలో రెండు శాసనాలు

సైదాపురం గ్రామంలో అగ్గలయ్యకు సంబంధించిన రెండు శాసనాలు ఉన్నాయి. ఈ శాసనాలు రాతి స్తంభాలపై మూడువైపులా చెక్కబడి ఉన్నాయి. మొదట రెండు భాగాలు తెలుగు, కన్నడ లిపిలో ఉండగా, మూడో వైపు సంస్కృత భాషలో ఉన్నాయి.

శాసనంలో మొదటి భాగం

అగ్గలయ్య జైనుడని, ఆయనకు వైద్యరత్నాకరుడని, ప్రాణాచార్యుడని, నరవైద్యుడని బిరుదులు ఉన్నట్లు ఈ శాసనం తెలుపుతుంది. పూర్వ కాలంలో కొలిపాక, (నేడు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక) పరిధిలో ఉన్న ముప్పనపల్లి గ్రామాన్ని అగ్గలయ్య నిర్మించిన జైన వసతులు (జైన సంప్రదాయాన్ని పాటించే సన్యాసులు, గురువులు, శిష్యులు నివసించే మఠాలు) వీటి నిర్వహణకు అప్పటి గ్రామ పెద్ద గవుండ బహుమానంగా ఇచ్చినట్లు ఈ శాసనం తెలుపుతుంది. శక సంత్సరం 956 నుంచి క్రీ.శ. 1034 జూన్ 4 గురువారం నాడు సంభవించిన చంద్ర గ్రహణాన్ని పురస్కరించుకుని మహారాజు హైదరాబాద్‌కు ఉత్తరాన 20 మైళ్ల దూరంలో ఉన్న పొట్లకేరి (నేటి పఠాన్ చెరువు) విడిది చేసిన సందర్భంగా ఈ దానం చేశారు.

శాసనంలో రెండవ భాగం

శాసనంలో రెండవ భాగంలో బహుమానంగా ఇచ్చిన భూమి, దానిపై వచ్చే రాబడి అంశాల వివరాల గురించి ఉంది.

మూడవ భాగం

అగ్గలయ్య జైనమత వాలంబి, మంచివారికి ఎల్లప్పుడూ సహాయం చేయాలని అనుకునే వాడు. తోటి వైద్యుల సందేహాలను నివృత్తి చేస్తూ, జయసింహుని ఆస్థానంలో వర్ధిల్లిన ఇతర ఆయుర్వేద పండితులకు, బ్రహ్మస్వరూపమని, చికిత్సా విధానంలో పాండిత్యుడని, మందులకు లొంగని మొండి వ్యాధులకు ఉపశమనం లభించినా, ప్రాణాపాయ స్థితి నుంచి తప్పినా, అది అగ్గలయ్య చేతి చలవేనని చెబుతుంది. స్వయంగా జయసింహుని ముదిరిన వ్యాధి (ప్రకర్ష) దశలో ఉన్నప్పుడు ఎందరో వైద్యులు కాపాడాలని యత్నించి విఫలం కాగా, తన చేతి వాటంతో చికిత్స చేసి, వ్యాధిని తగ్గించిన ఘనుడు అగ్గలయ్య. తంత్ర శాస్త్రంలోని ఉమా తంత్రం, సంగ్రహ పరిచ్ఛేదాలో కూడా అగ్గలయ్య నిపుణుడని ఈ శాసనం తెలుపుతుంది.

సిరూర్ శాసనాలు

అగ్గలయ్య గురించి మరి కొన్ని విషయాలు సంగారెడ్డి జిల్లాలోని సిరూర్ గ్రామంలో వెలువడిన మరో రెండు శాసనాల ద్వారా తెలుస్తుంది. ఈ శాసనాలు పశ్చిమ చాళుక్య రాజైన భువనైకమల్లదేవ (సోమేశ్వర-2) క్రీ.శ 1069లో వేసిందిగా గుర్తించారు. ఈ శాసనంలో అగ్గలయ్య ప్రశంసలను, జైనమత దేవత పద్మావతితో ఆయనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేస్తుంది. అదేవిధంగా 1074లో వేసిన మరో శాసనంలో ఆయనను వైద్య శిఖామణి అని స్పష్టంగా సూచిస్తుంది. అలాగే మహాసామంత రాజుగా ఆయన హోదాను నిర్ధారిస్తుంది. అగ్గలయ్య పండితులకు, రుషులకు వారి జీవనోపాధి కోసం, భూములు, ఇళ్ల స్థలాలను బహుమతిగా ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ శాసనం ఆయన భార్య లక్షణాలను, సమాజం, సంక్షేమ పట్ల నిబద్ధతను చూపిస్తుంది. ప్రస్తుతం ఈ శాసనాలు పురావస్తు శాఖ అధికారులు మ్యూజియంలో భద్రపరిచారు.

అగ్గలయ్య పేరు మీద గుట్ట

అగ్గలయ్యకు ఉన్న విస్తృత గుర్తింపు శాసనాలకే పరిమితం కాకుండా, ప్రదేశాలకు కూడా విస్తరించి ఉన్నాయి. వరంగల్‌లోని హనుమకొండ సమీపంలో ఉన్న ఒక కొండకు అగ్గలయ్య గుట్ట (అగ్గలయ్య దిబ్బ) అనే పేరును ఆ కాలంలోని రాజులు పెట్టారు. ఈ ప్రాంతం 9, 10 శతాబ్దాల్లో అనేక జైన శిల్పాలకు నిలయంగా ఉంది. ఈ కొండపైన ఒక పెద్ద విగ్రహం ఉంది, అది అగ్గలయ్య విగ్రహమేనని చరిత్రకారులు చెబుతున్నారు. ప్రముఖ చరిత్ర కారుడు శ్రీ రామోజీ హరగోపాల్ అగ్గలయ్య గురించి పలు పరిశోధనలు చేసి వెలుగులోకి తీసుకొచ్చారు.

ఎన్ఐఎమ్‌హెచ్ బృందం పరిశోధనలు

హైదరాబాద్‌లోని ఎన్ఐఎమ్‌హెచ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్) బృందం, డాక్టర్ జీపీ ప్రసాద్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి, డాక్టర్ పి.సాకేత్ రామ్ రీసెర్చ్ ఆఫీస్ (ఆయుర్వేద), పి.మురళీ మనోహర్ అసిస్టెంట్ రీసెర్చ్ ఆఫీసర్ (క్యురేటర్) తెలంగాణలో ప్రముఖ పరిశోధన, చరిత్ర కారుడు, కవి రామోజు హరగోపాల్ సహాయ సహకారాలతో ఈ సైదాపురం అగ్గలయ్య శాసనాల్లో పరిశోధనలు జరిపి, వైద్య శాసనాలను గుర్తించారు. ఈ శాసనాల వివరాలను ఫ్రేమ్ రూపంలో ఎన్ఐఎమ్‌హెచ్‌లో పొందుపరిచారు.

> **చాళుక్యుల కాలంలో గొప్ప వైద్యుడు**
>
> గొప్ప వైద్యుడు అగ్గలయ్య. వివిధ దేశాల నుంచి వైద్యులు అగ్గలయ్య వద్దకు సర్జరీలో మెళకువలను నేర్చుకునేవారు. కొన ఊపిరితో ఉన్న వారిని కూడా అగ్గలయ్య బతికించేవాడు. క్రీస్తు పూర్వం సుశ్రుతుడు వైద్య సేవలందించగా, క్రీస్తు శకంలో అగ్గలయ్య వైద్య సేవలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం వారసత్వ సంపదను కాపాడాలి.
>
> - డాక్టర్ జీపీ ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌చార్జి, ఎన్ఐఎమ్‌హెచ్, హైదరాబాద్



యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో అగ్గలయ్య శిలాశాసనం



యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామంలో అగ్గలయ్య గురించి తెలిపే శాసన స్తంభం



సైదాపురం గ్రామంలో అగ్గలయ్య గురించి తెలిపే మరో శాసన స్తంభం

‘ట్రాన్స్‌జెండర్ల’ పిటిషన్‌కు నంబర్ ఇవ్వండి

- రిజిస్ట్రీని ఆదేశించిన సీజే ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: న్యాయస్థానం ఆదేశాల మేరకు ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించకపోవడం సహా పలు అంశాలను సవాల్ చేస్తూ దాఖలైన ధిక్కరణ పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. తెలంగాణ నపుంసకుల చట్టం రాజ్యాంగానికి విరుద్ధమని.. కొట్టివేస్తున్నామని 2023లో హైకోర్టు తీర్పు వెల్లడించింది. అలాగే ఆసరా పింఛన్లను వీలైనంత త్వరగా లింగమార్పిడి వ్యక్తులకు విస్తరించాలని, విద్యాసంస్థలు, ప్రభుత్వ నియామకాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సర్కార్‌ను ఆదేశించింది. టాన్స్‌జెండర్ల కోసం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శిగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని.. ఇందులో సభ్యకార్యదర్శి శాశ్వత సభ్యుడిగా ఉంటారని.. ఇతరులకు కాలపరిమితి విధించవచ్చని స్పష్టం చేసింది. ఈ బోర్డు ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతి కోసం తీసుకున్న చర్యలను పర్యవేక్షిస్తుందని పేర్కొంది. తీర్పునిచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు వీటి అమలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను పాటించడం లేదంటూ హైదరాబాద్ హైదర్‌గూడకు చెందిన వైజయంతీ వసంత మొగిలి హైకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిని పేర్కొన్నారు. అయితే, పలు అభ్యంతరాలతో ఈ పిటిషన్‌కు రిజిస్ట్రీ నంబర్ కేటాయించేందుకు నిరాకరించింది.

ఆసరా లేక ఆర్థిక ఇబ్బందులు..: పిటిషన్‌ను ఫైలింగ్ నంబర్ (ఎస్ఆర్ నంబర్)పైనే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఎ.సత్యసిరి వాదనలు వినిపిస్తూ.. 2023లో హైకోర్టు సీజే ధర్మాసనం ఇచ్చిన తీర్పుతోపాటు నల్సా ఉత్తర్వులను కూడా అమలు చేయడం లేదన్నారు. ఆసరా పింఛన్లు అందక ట్రాన్స్‌జెండర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. లింగమార్పిడి వ్యక్తుల (హక్కుల రక్షణ) చట్టం-2019, లింగమార్పిడి వ్యక్తుల (హక్కుల రక్షణ) నియమాలు-2020ను సరిగా అమలు చేయడం లేదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సహా రాష్ట్ర విభాగాలు జారీ చేసిన వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లతోపాటు విద్యాసంస్థల్లో ప్రవేశాల కోసం టాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించకపోవడంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని నివేదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. రిజిస్ట్రీ అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని ఆదేశించింది.

నిషేధిత భూములకు పట్టాలెలా ఇచ్చారు?

- నాగారం భూములపై సర్కార్‌ను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా నాగారం పరిధి సర్వే నంబర్ 194, 195లోని భూములను 2018లోనే నిషేధిత జాబితాలో చేర్చితే ప్రైవేట్ పార్టీలకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నుంచి వివరాలు తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ.. తదుపరి విచారణ నేటికి వాయిదా వేసింది. నాగారంలో దాదాపు 50 ఎకరాల భూమికి సంబంధించి ప్రైవేట్ వ్యక్తులైన అబ్దుల్ జావీద్, అర్షియా సుల్తానా, అబ్దుల్ లతీఫ్ తదితరుల పేరిట పట్టాదార్ పాస్‌బుక్‌లను జారీ చేసిన అధికారి సుబ్రమణ్యంపై చర్యలు తీసుకోవాలంటూ బిర్లా మల్లేష్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సర్వే నంబర్ 194, 195లోని 700 ఎకరాల భూమిని ప్రభుత్వ భూములుగా పేర్కొన్నారన్నారు. 2018లోనే వీటిని నిషేధిత జాబితాలో చేర్చగా.. 2019, ఫిబ్రవరిలో అన్యాక్రాంతమై పట్టాదార్ పుస్తకాలు జారీ అయ్యాయన్నారు. ఆ పాస్‌బుక్‌ల ఆధారంగా అనేక లావాదేవీలు జరిగాయని, సర్వే నం.194లోని భూములను అనేక మంది ఐఏఎస్, ఐపీఎస్‌లు కొనుగోలు చేయడం వివాదాస్పదంగా మారిందని నివేదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పాస్‌పుస్తకాల జారీపై వివరాలను సమర్పించాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

హోంగార్డులను అభినందించిన అడిషనల్ డీజీ స్వాతిలక్రా



సాక్షి, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేంద్ర హోంశాఖ విడుదల చేసిన జాబితాలో ఉత్తమ సేవా పతకాలు పొందిన హోంగార్డులు జొన్నాడ రాజు, పిసారి సంగంను ఆర్గనైజేషన్స్, హోంగార్డ్స్ అడిషనల్ డీజీ స్వాతి లక్రా అభినందించారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఇద్దరు హోంగార్డులకు ప్రశంసాపత్రాలను అందించారు. జొన్నాడ రాజు తెలంగాణ పోలీస్ అకాడమీలో, పిసారి సంగం గ్రేహౌండ్స్‌లో పనిచేస్తున్నారు.

‘ఇంటర్ నెట్ కేబుల్స్ కట్ చేయడం ఏంటి?’

సాక్షి, హైదరాబాద్: ఐటీ శాఖ మంత్రి సలహా తీసుకోకుండా ఇంటర్ నెట్ కేబుల్స్ కట్ చేయడం ఏంటని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి కుటుంబం అవినీతి, అరాచకాలకు పాల్పడుతోందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు తిరిగిన ల్యాండ్ క్రూయిజర్ కారు కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరు మీద ఉందని, ఇప్పుడు అదే కేఎల్ఎస్ఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.320 కోట్ల కాంట్రాక్టు రేవంత్ రెడ్డి ఇచ్చారని తెలిపారు. రేవంత్ రెడ్డి కుటుంబ దోపిడీపై ఏఐసీసీ ఎందుకు మౌనంగా ఉంటోందని ప్రశ్నించారు.

‘సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి’

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 1న వచ్చిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, ఆ రోజున పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని తెలంగాణ టీకెన్ ఓవర్ కాలేజీ ఎంప్లాయి అసోసియేషన్ (టీటీసీఈఏ) అధ్యక్షుడు మంకెన కరుణాకర్‌రెడ్డి కోరారు. పెన్షన్ ఉద్యోగి హక్కు అని, భిక్ష కాదని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సీపీఎస్ ఏర్పాటు ద్వారా ఉద్యోగులకు సామాజిక భద్రత లోపించిందని, వారికి అశనిపాతంగా మారిన జీవో 28ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్మిక శాఖలో అధికారులే కనిపించడం లేదు: ఐఎన్‌టీయూసీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కార్మిక శాఖ కమిషనరేట్‌లో అధికారుల జాడ లేదని ఐఎన్‌టీయూసీ ఆందోళన వ్యక్తం చేసింది. రోజుల తరబడి ఉన్నతాధికారులు, విభాగాధిపతులు కార్యాలయానికి హాజరు కావడం లేదని, దీంతో సందర్శకులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడింది. అదనపు బాధ్యతల పేరిట అధికారులు కార్యాలయానికి రావడం లేదని సమాచారం ఉందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.సంజీవ రెడ్డి, దేవసాని బిక్షపతి తెలిపారు. ఈమేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయంతో పాటు కార్మిక శాఖమంత్రి జి.వివేక్, కార్మికశాఖ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కార్మికులు, ఇతర సందర్శకులకు అధికారులు అందుబాటులో ఉండాలని, ఈమేరకు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ఉన్నతాధికారులకు అదనపు బాధ్యతల నుంచి రిలీవ్ చేసి రెగ్యులర్ బాధ్యతలు పూర్తి స్థాయిలో అప్పగించాలని కోరారు.

పీసీసీ చీఫ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం: బీజేపీ



సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ ఎంపీలు ఓటు చోరీతోనే గెలిచారని, కేంద్రమంత్రి బండి సంజయ్‌ను దేశ్‌ముఖ్ అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు బీజేపీ కార్యదర్శి డా.ఎస్.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ‘తెలంగాణలో 8 ఎంపీ సీట్లు బీజేపీ గెలిస్తే, 8 కాంగ్రెస్ గెలిచింది కదా? మరి ఓటు చోరీతోనే కాంగ్రెస్ గెలిచిందా? మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ పిచ్చాస్పత్రిలో చికిత్స చేసుకోవాలి’అని మండిపడ్డారు. తెలంగాణలో దొంగ ఓట్లు ఉన్నందువల్లే కాంగ్రెస్‌కు చెందిన 63 మంది ఎమ్మెల్యేలు గెలిచి అధికారంలోకి వచ్చారా అని ప్రశ్నించారు. ఈవీఎంలపై నమ్మకం లేదంటున్న కాంగ్రెస్ పార్టీ బ్యాలెట్ పేపర్లతో మూడు ఎమ్మెల్సీ సీట్లకు జరిగిన ఎన్నికల్లో ఎందుకు ఓడిపోయిందని ప్రశ్నించారు.

పీసీసీ చీఫ్‌పై చట్టపర చర్యలు తప్పవు

బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి కుమార్ హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బీసీ కాదని దేశ్‌ముఖ్ అని చేసిన ఆరోపణలను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నిరూపించకపోతే ఆయనపై చట్టపరమైన చర్యలు తప్పవని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ హెచ్చరించారు. సంజయ్‌తో పాటు బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారన్న వ్యాఖ్యలు నిరూపించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం కుమార్ మీడియాతో మాట్లాడుతూ రిగ్గింగ్ సంస్కృతి కాంగ్రెస్ పార్టీకి చెందిందేనన్నారు. కిషన్ రెడ్డి, సంజయ్, ఇతర బీజేపీ నేతలు అనేక పోరాటాలు, యాత్రలతో ప్రజల మద్దతు పొందారని కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగ వ్యవస్థపై, ఈవీఎంలపై, చివరకు ఓటర్లపైనా నమ్మకం లేదని మండిపడ్డారు. దొంగ ఓట్లతోనే కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌లలో కాంగ్రెస్ గెలిచిందా? అని ప్రశ్నించారు. బీసీలకే మొత్తం 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించే ధైర్యం కాంగ్రెస్ పార్టీకి ఉందా? అని కుమార్ నిలదీశారు.

రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనా?

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డి నక్సలైట్లకు అండగా పనిచేసిన కంచ ఐలయ్యను ఓబీసీ ఐడియాలజీ అడ్వైజరీ కమిటీలో చేర్చుకున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్నది కాంగ్రెస్ పార్టీయా? లేక అర్బన్ నక్సలైట్ భావజాలమున్న వ్యక్తుల వలయమా? అని ప్రశ్నించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జార్జి రెడ్డి, గద్దర్ నడిచిన నేల అని రేవంత్ రెడ్డి అంటున్నారని, వాళ్లు స్వాతంత్ర్య సమరయోధులా? లేక దేశసేవ చేసిన వారా?, అసలు సీఎంగా విద్యార్థులకు ఏమి సందేశం ఇవ్వడానికి ఆయన ఓయూ వెళ్లారని నిలదీశారు. ‘ఓయూలో కత్తులు, గొడ్డళ్లు, గన్ కల్చర్‌ను పరిచయం చేసిన జార్జిరెడ్డిని పొగడటం సిగ్గుచేటు. అటువంటి వారిని హీరోలుగా చిత్రీకరిస్తూ రేవంత్ రెడ్డి జీరో అయ్యారు’అని మండిపడ్డారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, వందేమాతరం రామచందర్ రావు వంటి వారు రేవంత్ రెడ్డికి గుర్తురాలేదా అని ప్రశ్నించారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లడానికి రేవంత్ రెడ్డికి అంత భయం ఎందుకన్నారు. ‘పోలీసు పహారా మధ్య సీఎం వెళ్లారు. ఓయూ వెళ్లే మార్గంలో లా కాలేజీ నుంచి ఆడిటోరియం వరకు 12 అడుగుల ఎత్తైన ఇనుప కంచెలు, పోలీసు పహారా మధ్య వచ్చారు’అని విమర్శించారు. ‘తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులపై తుపాకీ ఎక్కుపెట్టి దాడి చేసిన చరిత్ర రేవంత్‌ది. అందుకే ఆయనకు ఓయూ విద్యార్థులు ‘తుపాకీ రెడ్డి’అని బిరుదు ఇచ్చారు. ఈ విషయాన్ని రేవంత్ రెడ్డి మరిచిపోయారు’అని కాసం వెంకటేశ్వర్లు వ్యాఖ్యానించారు.

సందడిగా 'సాగు'తూ



అలస్యంగానైనా సరే ఆశించినంత వర్షం కురవడంతో రైతులు ఆనందపరవశులయ్యారు. కనుపాపలా కాపాడుకున్న నారును పీకి నాట్లువేయడం మొదలుపెట్టారు. సోమవారం నంద్యాల జిల్లా ఆత్మకూరు సమీపంలో సిద్దేశ్వరం వద్ద ఓ రైతు నాట్లువేసేందుకు పొలం సిద్ధం చేస్తుండగా సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

పసిడి కాంతులు విసిరి..



అస్తమిస్తూ భానుడు పసిడి కాంతులు వెదజల్లాడు.భాస్కరుని కిరణ స్పర్శకు ప్రకృతి పులకించిపోయింది. సరస్సులోని నీరు పసిడి వర్ణంలో తళుకులీనింది. అనంతపురం నగరంలోని వడియంపేట సమీపంలో ఈ మనోహర దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

జైజై గణేశా



వినాయక చవితి వేడుకలకు ఊరూవాడా సిద్ధమవుతున్నాయి. వాడవాడలా మండపాలు వెలుస్తున్నాయి. యువత విగ్రహాల కొనుగోలు, తరలింపు పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. సోమవారం విజయవాడలోని నున్న మ్యాంగో మార్కెట్ వద్ద విగ్రహం కొనుగోలుచేసి తీసుకువెళ్తున్న యువకులు – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కడలిపైకి కదననౌకలు

నౌకాదళంలోకి ఐఎన్ఎస్ హిమగిరి, ఉదయగిరి



ఐఎన్ఎస్ హిమగిరి



ఉదయగిరి

- నేడు జాతికి అంకితం చేయనున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- ఒకేరోజు రెండు భారీ యుద్ధనౌకల కమిషనింగ్ ఇదే తొలిసారి

సాక్షి, విశాఖపట్నం: భారత రక్షణశాఖ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ.. రెండు భారీ యుద్ధనౌకలు మంగళవారం నౌకాదళ అమ్ములపొదిలో చేరనున్నాయి. అత్యాధునిక సాంకేతికతతో నిర్మితమైన నీలగిరి క్లాస్‌లో కీలకమైన ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధనౌకలు విశాఖపట్నం వేదికగా జాతికి అంకితం కానున్నాయి. అత్యాధునిక ప్రాజెక్ట్–17లో భాగంగా మల్టీ–మిషన్ స్టెల్త్ ఫ్రిగేట్‌లుగా రూపుదిద్దుకున్న వీటిని విశాఖపట్నంలోని ఐఎన్ఎస్ సర్కార్‌లో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ త్రిపాఠీ కమిషనింగ్ చేయనున్నారు. ముంబైలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో ఉదయగిరి, కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్–ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ)లో హిమగిరి యుద్ధనౌకలు నిర్మించారు. ఆధునిక కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ (సీవోడీవోజీ) ప్రొపల్షన్ ప్లాంట్లు, అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ ప్లాట్‌ఫామ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌తో పాటు ఇండియన్ టెక్నాలజీతో అభివృద్ధి చేసిన అత్యాధునిక ఆయుధాలు, సెన్సార్ల సూట్స్ ఉన్న ఈ నౌకలకు సముద్రజలాల్లో నిర్దేశిత లక్ష్యాలను నూరుశాతం పూర్తిచేయగల సామర్థ్యం ఉంది. హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటా సముద్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు, దేశ సామర్థ్యాన్ని బలోపేతం చేయడానికి ఇవి ముఖ్య భూమిక పోషించనున్నాయి. 75 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ యుద్ధనౌకలు పలు రికార్డులను లిఖించనున్నాయి.

- ఐఎన్ఎస్ ఉదయగిరి.. నేవీ వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ షిప్.
- రెండు వేర్వేరు షిప్‌యార్డ్‌ల్లో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధనౌకల్ని ఒకేసారి ప్రారంభించడం నౌకాదళ చరిత్రలో ఇదే తొలిసారి.
- భారత షిప్‌యార్డ్‌లు అవలంబించిన మాడ్యులర్ నిర్మాణ పద్ధతిలో భాగంగా నిరిృతమై అత్యంత వేగవంతంగా కమిషనింగ్ అవుతున్న యుద్ధనౌక ఉదయగిరి.
- ప్రపంచవ్యాప్తంగా నౌకా నిర్మాణంలో చైనాను భారత్ అధిగమించింది. చైనా 19 వార్‌షిప్స్ నిర్మిస్తుండగా.. భారత్ నిర్మాణ సంఖ్య 20కి చేరుకుంది.
- ఈ షిప్స్ తయారీలో 200 ఎంఎస్ఎంఈలు పాల్గొన్నాయి. వీటి నిర్మాణం ద్వారా 4 వేల మందికి ప్రత్యక్షంగా, 10 వేలమందికి పరోక్షంగా ఉపాధి లభించింది.

అసెస్‌మెంట్ పుస్తకాలపై పునరాలోచించాలి

నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో అసెస్‌మెంట్ పుస్తకాల మూల్యాంకనంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఈ విధానంపై పునరాలోచించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు విద్యాశాఖకు సోమవారం విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల స్థాయిని అంచనా వేసేందుకు రూపొందించిన ఈ బుక్‌లెట్‌లో ఉన్న విధానాలు ఉపాధ్యాయులపై అదనపు భారాన్ని మోపుతున్నాయన్నారు. టూల్ 1,2,3,4 ప్రకారం మార్కులు నమోదు చేయాలని, మొదట బుక్‌లెట్‌లో నమోదు చేసి, మళ్లీ పర్సనల్ రిజిస్టర్, సీసీఈ రిజిస్టర్, చివరగా ఆన్‌లైన్ పోర్టల్‌లోనూ ఎంట్రీ చేయాల్సి వస్తోందన్నారు. ఒకే డేటాను ఇన్నిసార్లు నమోదు చేయడం ఉపాధ్యాయులకు భారంగా మారుతోందన్నారు.

అంతర్ మేనేజ్‌మెంట్ బదిలీలు చేయాలి: ఎంటీఎఫ్

మునిసిపల్ ఉపాధ్యాయులకు ఒకే జిల్లాలో అంతర్ మేనేజ్ మెంట్, అంతర్ జిల్లా మేనేజ్ మెంట్ బదిలీలు చేపట్టాలని పురపాలక టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మునిసిపాలిటీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీకి అవకాశం కల్పించాలని కోరారు. జిల్లాలో జెడ్పీ టీచర్లు అంతా ఒకే మేనేజ్‌మెంట్‌లో ఉంటారని, కానీ రాష్ట్రంలో పురపాలక సంఘం టీచర్లు, నగరపాలక సంస్థల టీచర్లు, మహా నగరపాలక సంస్థల టీచర్లు అనే 3 రకాల యాజమాన్యాలు ఉన్నాయన్నారు. దీంతోపాటు పురపాలక స్కూళ్లు అన్ని జిల్లాల్లోను లేవని, రాష్ట్ర వ్యాప్తంగా 59 యూఎల్బీల్లో మాత్రమే ఉన్నాయన్నారు. మిగిలిన 61 పట్టణాల్లో జెడ్పీ స్కూళ్లే ఉన్నాయన్నారు. వీటన్నిటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి బదిలీకి అవకాశం కల్పించాలని కోరారు.

లైంగిక దాడి కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

బతికున్నంత వరకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు

చిత్తూరు అర్బన్: పదహారేళ్ల మైనర్‌పై లైంగిక దాడి చేసి కేసులో చిత్తూరు వెంకటేష్ (34), బుక్కే అ రాజమోహన్‌నాయక్ (34)కు బతికున్నంత వరకు జైలు శిక్ష పడింది. ఈ మేరకు చిత్తూరులోని పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి ఎం.శంకరరావు సోమవారం తీర్పుచెప్పారు. పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి వివరాల మేరకు... 2019 నవంబర్ 24న మదనపల్లెకు చెందిన మైనర్ బాలిక తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుపతి జిల్లా తిరుచానూరు సమీపంలో నడిచి వెళ్తోంది. ద్విచక్ర వాహనంపై వచ్చిన వెంకటేష్ బాలికకు లిఫ్ట్ ఇస్తామని నమ్మించి వాహనంలో ఎక్కించుకున్నాడు. కొంత దూరం వెళ్లాక వాహనంలో పెట్రోలు అయిపోయిందని చెప్పి తన స్నేహితుడు రాజామోహన్‌కు ఫోన్‌చేశాడు. వీళ్లిద్దరూ కలిసి బాలికను బలవంతంగా ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆపై స్థానికుల సాయంతో బాలిక తన ఊరికి వెళ్లి జరిగిన ఘటనను కుటుంబ సభ్యులకు వివరించింది. వారు తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితులు ఇద్దరూ బతికున్నంత వరకు జైలు శిక్ష అనుభవించాలని, వెంకటేష్‌కు రూ.17,500లు, రాజామోహన్‌కు రూ.13,500లు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బాధిత బాలికకు రూ.3 లక్షల పరిహారాన్ని ఇవ్వాలని తిరుపతి కలెక్టర్‌ను న్యాయమూర్తి ఆదేశించారు.

ఆర్టీఈ ఉచిత ప్రవేశాలకు 11,702 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: ఆర్టీఈ చట్టం కింద 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతి ఉచిత ప్రవేశాలకు సంబంధించి అదనపు నోటిఫికేషన్ లాటరీ ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం 5 కి.మీ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు 11,702 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. సీట్లు పొందిన విద్యార్థులు మంగళవారం నుంచి సర్టిఫికెట్లను తమకు కేటాయించిన పాఠశాలల్లో చూపి అడ్మిషన్ పొందాలన్నారు. 31వ తేదీలోగా చేరకపోతే వారి అడ్మిషన్లు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఎంపికై న విద్యార్థుల సమాచారం తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ పంపించి, https://cse.ap.gov.in/ వెబ్‌సైట్‌లో లిస్ట్ అందుబాటులో ఉంచామని తెలిపారు.



శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 72,119 మంది స్వామిని దర్శించుకున్నారు. 25,294 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శరవేగంగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు

కాణిపాకం : చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవ ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఆహ్వాన కటౌట్ ఏర్పాట్లు ఆకట్టుకుంటున్నాయి. ఆలయానికి బ్రహ్మోత్సవ శోభను తీసుకొస్తున్నాయి. భక్తుల రద్దీ దృష్ట్యా క్యూలైన్లను పెంచారు. మంగళవారం సాయంత్రం నాటికి ఈ ఏర్పాట్లను పూర్తిచేయనున్నారు. అలాగే 28న జరిగే ధ్వజారోహణాన్ని పురస్కరించుకుని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేసి పచ్చని పందిరి కొయ్యను నాటారు. కార్యక్రమంలో ఈఓ పెంచల కిషోర్, ఈఈ వెంకట నారాయణ, సిబ్బంది బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

కాణిపాకానికి ప్రత్యేక బస్సులు

కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చిత్తూరు నుంచి కాణిపాకానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీపీటీఓ రాము తెలిపారు.

శాస్త్రోక్తంగా వరాహస్వామి జయంతి

తిరుమల : తిరుమలలోని శ్రీ భూ వరాహస్వామివారి ఆలయంలో సోమవారం ఉదయం వరాహ జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ మూలమూర్తికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో విశేష అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.61 కోట్లు

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. ఈ లెక్కింపులో గడచిన 38 రోజులకు గాను నగదు రూపేణా స్వామివారికి రూ.3,61,54,678 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ తెలిపారు.

క్లుప్తంగా...

కొత్త రైస్ కార్డులకు రూ.8కోట్లు కేటాయింపు

సాక్షి, అమరావతి: క్యూ ఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి రూ.8 కోట్లు ఖర్చుకు అనుమతిస్తూ పౌరసరఫరాలశాఖ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి సౌరభ్‌గౌర్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఒక్కో కార్డుకు రూ.4.66కు తోపాటు రవాణ, ఇతర ఖర్చులకు ఈ మొత్తాన్ని కేటాయించినట్లు వివరించారు.రాష్ట్రంలోని 1,46,21,223 మంది రేషన్ లబ్ధిదారులకు కొత్తగా కార్డులు అందజేస్తున్నట్లు చెప్పారు.

అంతర్ జిల్లా బదిలీ నిబంధనల్లో సడలింపు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీల నిబంధనలను విద్యాశాఖ సడలించింది. బదిలీ కోరుకునే ఉపాధ్యాయులు రెండేళ్ల సర్వీసు పూర్తిచేయాలన్న నిబంధనను ఎత్తివేసింది. సర్వీసు కాలంతో సంబంధం లేకుండా (జీరో సర్వీస్) దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని వీరికి కల్పించింది. అలాగే, 2027 జూలై 31లోగా ఉద్యోగ విరమణ చేసే ఉపాధ్యాయులు అంతర్ జిల్లా బదిలీలకు అర్హులు కాదని వెల్లడించింది. ఉపాధ్యాయులు ఈ బదిలీల దరఖాస్తులను ఈనెల 27 వరకు స్థానిక ఎంఈఓలకు సమర్పించాలని తెలిపింది.

ఎన్‌టీపీసీలో సమ్మెలు నిషేధం..

సాక్షి, అమరావతి: ఎన్‌టీపీసీ లిమిటెడ్‌లో ఉద్యోగులు సమ్మెను ఆరు నెలలపాటు రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. సెప్టెంబరు ఒకటి నుంచి ఈ నిషేధం అమలులోకి వస్తుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ రూరల్ అగ్రికల్చర్ పవర్ సప్లై కంపెనీ (ఏపీఆర్ఏపీఎస్‌సీఓఎం) పేరును ఆంధ్రప్రదేశ్ రూరల్ అగ్రికల్చర్ పవర్ లిమిటెడ్‌గా మారుస్తూ ఆయన ఉత్తర్వులు జారీచేశారు.

నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు

సాక్షి, అమరావతి : ప్రజలకు నేత్రదానంపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలో సోమవారం నుంచి నేత్రదాన పక్షోత్సవాలు ప్రారంభించినట్లు రాష్ట్ర వైద్య శాఖ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. అన్ని జిల్లాల్లో వచ్చే నెల 8 వరకూ ఈ అవగాహన కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించింది. దేశంలో సుమారు 12 లక్షల మంది కార్నియా అంధత్వంతో బాధపడుతున్నట్లు పేర్కొంది. వీరిలో 40 వేల మంది చిన్నారులున్నారు. మరోవైపు.. రాష్ట్రంలో 45 వేల మంది కార్నియా దానం చేయడానికి పేర్లు నమోదు చేయించుకోగా.. 2024లో 6,112 మంది కార్నియాలు సేకరించారు.

వెబ్‌సైట్‌లో పర్యాటక భూ వివరాలు

సాక్షి, అమరావతి: పర్యాటక భూ కేటాయింపు విధానానికి అనుబంధంగా మరో భూమి కేటాయింపు విధానాన్ని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఇందులో పర్యాటక శాఖకు చెందిన ఆస్తులను ఏపీ టూరిజం అథారిటీ (ఆప్టా) ఆన్‌లైన్‌లో ఉంచనుంది. ఆసక్తి కలిగిన పెట్టుబడిదారులు రూ.25 వేలు చెల్లిస్తే భూమి వివరాలను ఆప్టా అందించడంతోపాటు డీపీఆర్ తయారీలో సేవలందిస్తుందని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ విద్యార్థులకు సీఎం అభినందన

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదివి..ఈ ఏడాది ఐఐటీ, ఎన్ఐటీ, నీట్‌లో సీట్లు సాధించిన 55 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను సీఎం చంద్రబాబు అభినందించారు. ఈ విద్యార్థులు సోమవారం సచివాలయంలో సీఎంను కలవగా వారికి మెమెంటోలతోపాటు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున సీఎం చెక్కులు అందజేశారు.

నానో ఎరువులపై సందేహాలు అక్కర్లేదు..

ఇఫ్కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ బీఎల్ రాజు

సాక్షి, అమరావతి: రైతులందరూ నానో ఎరువులను ఎలాంటి సందేహం లేకుండా వినియోగించి సుస్థిర వ్యవసాయం వైపు అడుగులు వేయాలని భారత రైతులు, ఎరువుల సహకార సంస్థ (ఇఫ్కో) స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ బీఎల్ రాజు సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేస్తూ, పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నానో ఎరువులపై జరిగిన పరిశోధనలు తాము సూచించిన ప్రొటోకాల్ ప్రకారం జరగలేదని పేర్కొన్నారు. ప్రతికూలమైన వాతావరణ పరిస్థితులలో జరిపిన పరిశోధన ఫలితాల ఆధారంగా నానో ఎరువులపై దుష్ప్రచారం చేయడం ఎంతమాత్రం సరికాదన్నారు. నానో ఎరువులు భూమి, నీరు, గాలిలో కాలుష్యాన్ని తగ్గిస్తాయని, సంప్రదాయ ఎరువులతో పోలిస్తే అధిక శోషణ సామర్థ్యం కలిగి ఉంటాయన్నారు. పంజాబ్ యూనివర్సిటీ ఇఫ్కోకు ఇచ్చిన పెయిడ్ ట్రయిల్స్‌లో వరి, గోదుమలో దిగుబడులు, గింజల్లో ప్రొటీన్ శాతం తగ్గిందని నివేదికలు ఇచ్చిన నేపథ్యంలో బీఎల్ రాజు తాజా ప్రకటన చేశారు.

యూరియాపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఏపీ రైతు సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: యూరియా దిగుమతి, పంపిణీ, తదితర విషయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ఏపీ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, హరిబాబు సోమవారం ప్రకటన విడుదల చేశారు. జూలై వరకు 1.30 లక్షల టన్నుల యూరియాను ఏపీకి కేంద్రం కేటాయించిందని, ఆ తర్వాత జూలై 18 నాటికి 49,485 టన్నుల యూరియా రాష్ట్రానికి చేరిందని చెబుతున్నారని చెప్పారు. యూరియా కొరత కారణంగా రాష్ట్రానికి ఎరువులు తగినంత కేటాయించాలని కోరగా, ఆగస్టు 21 నాటికి మరో 29 వేల టన్నులు సరఫరా చేస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారే తప్ప రాష్ట్రానికి రాలేదన్నారు. ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్రానికి ఇంకా 3 లక్షల టన్నులకు పైగా యూరియా రావాల్సి ఉందన్నారు. ఏపీకి సరిపడా యూరియాను తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఓవైపు యూరియా కొరతతో రైతులు అల్లాడిపోతుంటే..అవసరమైనంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఇతర అవసరాలకు దారి మళ్లుతుందని ప్రభుత్వం చెప్పడంపై మండిపడ్డారు.

జపాన్ వెళ్లిన విద్యార్థులకు అభినందన



జపాన్ సందర్శించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ 'సకురా సైన్స్ ప్రోగ్రాం'లో భాగంగా జపాన్ సందర్శించి సోమవారం స్వదేశానికి వచ్చిన విద్యార్థులను సమగ్ర శిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు అభినందించారు. జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ 2014 నుంచి 'జపాన్–ఆసియా యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ఇన్ సైన్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. 'సకురా సైన్స్ ప్రోగ్రాం'గా పిలిచే ఈ కార్యక్రమానికి దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి 34 మంది విద్యార్థులు హాజరవగా.. రాష్ట్రం నుంచి టి.పుష్పాంజలి (జెడ్పీహెచ్ఎస్, గొల్లప్రోలు, కాకినాడ), కె. హరీష్ (ఏపీ మోడల్ స్కూల్, భోగాపురం), ఎం. ఐశ్వర్య (కేజీబీవీ, బిట్రగుంట, ప్రకాశం జిల్లా), పి. వరుణ్ సాయి (ఎంపీఎల్ హైస్కూల్, మంగళగిరి) విద్యార్థులు హాజరయ్యారు. వీరు ఈనెల 17 నుంచి 23 వరకు జపాన్‌లో పర్యటించారు. వీరు సోమవారం విజయవాడలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో ఎస్పీడీని కలిసి జపాన్ పర్యటన విశేషాలను ఆయనతో పంచుకున్నారు.

ప్రాంతాల నవీకరణ జాబితాలు పంపండి

రాష్ట్ర ప్రభుత్వానికి జనాభా గణన డైరెక్టరేట్ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల తర్వాత అధికార పరిధిలో మార్పులకు సంబంధించిన జిల్లాలు, మండలాలు, రెవెన్యూ గ్రామాలు, పట్టణాల నవీకరణ వివరాలన్నింటినీ సంబంధిత జియో రిఫరెన్స్‌లో ఎన్నికల వార్డు మ్యాప్‌లతో సహా ఈ నెల 31లోగా పంపించాలని జనాభా గణన డైరెక్టరేట్ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. 2027 జనాభా లెక్కల కోసం కచ్చితమైన జిల్లా, మండల, గ్రామ, వార్డులకు సంబంధించి జరిగిన మార్పులు, సరిహద్దుల వివరాలను మ్యాప్‌లతో సహా వివరాలను పంపాల్సిందిగా కలెక్టర్లు, తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేయాల్సిందిగా ఆ లేఖలో కోరింది. గ్రామ రిజిస్టర్లను నవీకరించడంతోపాటు ధ్రువీకరించడం, గ్రామ స్థాయిలో జియో రిఫరెన్స్ చేసిన మండల పటాలను అందించడం, సంబంధిత గెజిట్ నోటిఫికేషన్‌లతో గ్రామ రిజిస్ట్రార్‌లో చేసిన ఏవైనా మార్పులను ధ్రువీకరిస్తూ సంబంధిత వివరాలను పంపాల్సిందిగా కోరింది. అలాగే.. వార్డు స్థాయిలో పట్టణ రిజిస్ట్రార్‌ను సిద్ధం చేసి ధ్రువీకరించడంతోపాటు వార్డు స్థాయిలో భౌగోళికంగా సూచించబడిన పట్టణ పటాలను, వివరాలను పంపాల్సిందిగా కోరింది.

సౌత్ వెస్ట్ మైనింగ్ కంపెనీకి ఇనుప ఖనిజం లైసెన్స్

అనంతపురం జిల్లాలో 1,327 హెక్టార్ల విస్తీర్ణానికి అనుమతి

సాక్షి, అమరావతి: అనంతపురం జిల్లాలో ఇనుప ఖనిజం కాంపోజిట్ లీజు లైసెన్స్‌ను సౌత్‌వెస్ట్ మైనింగ్ లిమిటెడ్ కంపెనీకి ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్వర్వులిచ్చింది. అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలం నేమకల్లు గ్రామంలోని మించేరి రిజర్వు ఫారెస్టు, డి హిరేహాల్ మండలంలోని హిరేహాల్, ఓబులాపురం గ్రామాల పరిధిలోని 1,327 హెక్టార్ల విస్తీర్ణానికి ఈ లైసెన్స్ ఇచ్చింది. ఈ–ఆక్షన్ టెండర్‌లో 12.60 శాతం ఎక్కువ ధర కోట్‌చేసి విజయవంతమైన బిడ్డర్‌గా నిలవడంతో సౌత్‌వెస్ట్ మైనింగ్ లిమిటెడ్‌కు లైసెన్స్ మంజూరు చేసినట్లు తెలిపింది. గనుల అన్వేషణ ప్రారంభించడానికి ముందు.. అటవీ శాఖ, పర్యావరణ శాఖతోపాటు అన్ని సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా పొందాలని ప్రభుత్వం ఆదేశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలు, నియమ నిబంధనల ప్రకారం అన్ని పనులు జరగాలని స్పష్టంచేసింది.

లైమ్‌స్టోన్ గనుల లీజు పొడిగింపు..

అలాగే, నంద్యాల జిల్లా గుడివేముల మండలం గడిగరవుల, దుర్వేశి గ్రామాల పరిధిలోని లైమ్‌స్టోన్ గనుల లీజును మరో 50ఏళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం మరో ఉత్తర్వు ఇచ్చింది. 2.834 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఈ గనులను మొదట 2003లో ఎం. నారాయణగౌడ్‌కు 20 ఏళ్లపాటు లీజు ఇచ్చారు. ఆయన మరణం తరువాత వారసుడిగా ఎం. మహేష్ ఖన్నా లీజుదారుడిగా గుర్తింపు పొందారు. సంబంధిత ఖనిజ బకాయిలన్నీ చెల్లించి, అవసరమైన అనుమతులు తీసుకోవడంతో 2004 జనవరి 7 నుంచి 2054 జనవరి 6 వరకు లీజును పొడిగించింది. ఈ లీజు నాన్ క్యాప్టివ్ (వ్యవసాయ, పరిశ్రమేతర) అవసరాల కోసం మాత్రమే ఉపయోగించుకోవాలని స్పష్టంచేసింది.


విట్, ఎస్ఆర్ఎంలకు అదనంగా చెరో 100 ఎకరాలు

ఎకరం రూ.2 కోట్ల చొప్పున కేటాయింపు

సాక్షి, అమరావతి: అమరావతిలో విట్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు అదనంగా చెరో 100 ఎకరాల చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఎకరం రూ.2 కోట్ల చొప్పున కేటాయించాలని మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయం మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. విట్, ఎస్ఆర్ఎం వర్సిటీలకు అమరావతిలో 2016లో చేరో 200 ఎకరాల చొప్పున కేటాయించడానికి ప్రభుత్వం అంగీకరించింది. అందులో భాగంగా తొలి దశ కింద ఆ 2 వర్సిటీలకు చేరో 100 ఎకరాల చొప్పున ఎకరం రూ.50 లక్షలకు కేటాయించింది. ప్రస్తుతం రెండో దశలో చెరో 100 ఎకరాలను కేటాయించింది.

సాక్షి ప్లస్
మంగళవారం ॥ 26-8-2025

హెల్త్



నీడ పట్టున వద్దండి

ఇది పెద్ద లోపము డి



ఇటీవల చాలామందిలో విటమిన్ - డి లోపం చాలా ఎక్కువగా కనిపిస్తోంది. ఇలాంటి ధోరణి గతంలో అంతగా కనిపించేది కాదు. మన దేశం సూర్యరశ్మి సమృద్ధిగా లభ్యమయ్యే దేశమైనందువల్లా, అలాగే మూడు నాలుగు దశాబ్దాల కిందటి వరకూ మనలో చాలామంది వ్యవసాయ వృత్తుల్లో ఉండేవారు కావడంతో విటమిన్-డి లోపం చాలా అరుదుగానే కనిపించేది. కానీ ఈమధ్య మన వృత్తులు చాలావరకు మారిపోవడం, ఇన్‌డోర్స్‌లోనే ఉంటూ పనులు చేసుకునే వారి సంఖ్య పెరగడంతో విటమిన్-డి లోపం చాలామందిలో తరచూ కనిపిస్తూనే ఉంది. పైగా వ్యాధి నిరోధకతకు తోడ్పడటంతో పాటు అనేక జీవక్రియల్లో ఇదెంతో కీలకమైనందున... విటమిన్ డి నిర్వహించే వివిధ కార్యకలాపాలతో పాటు ఆ లోపం కలిగినప్పుడు దాన్ని ఎలా భర్తీ చేసుకోవాలి, తద్వారా వ్యాధి నిరోధక శక్తిని ఎలా పెంపొందించుకోవాలన్న అనేక అంశాల అవగాహన కోసం ఇదో విపులమైన కథనం.



డాక్టర్ శ్రీకృష్ణ ఆర్. బొడ్డు
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్

ప్రపంచంలోని చాలా పాశ్చాత్య దేశాలు ఉత్తరార్ధ గోళంలోని భూమధ్య రేఖ నుంచి దూరంగా ఉండే అక్షాంశాల్లో ఉండటంతో ఆయా దేశాల్లో సూర్యకాంతి అంతగా ప్రసరించదు. కాబట్టి... అలాంటి దేశాల్లో విటమిన్ 'డి' లోపం చాలా సాధారణం. అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఒక బిలియన్ మంది అంటే నూరు కోట్ల మంది, (వారిలో పాశ్చాత్యులే ఎక్కువ) విటమిన్-డి లోపంతో బాధపడుతున్నారని ఒక అంచనా. అందుకే వారు అక్కడి బీచ్‌లలో సన్ బాత్‌ల వంటి ప్రక్రియలను ఆశ్రయిస్తూ సూర్యకాంతికి తమ దేహం ఎక్స్‌పోజ్ అయ్యేలా చేసుకుంటూ విటమిన్-డి పొందడానికి ప్రయత్నిస్తుంటారు.

అయితే ఇటీవల సూర్యకాంతి, ఎండ పుష్కలంగా ఉండే మన భారతదేశంలాంటి చోట్ల కూడా చాలామందిలో విటమిన్ 'డి' లోపం విస్తృతంగా కనిపిస్తోంది. మన సమాజంలో చాలావేగంగా చోటు చేసుకున్న మార్పుల కారణంగా ఎండలోకి వెళ్లి చేసే పనుల కంటే నీడపట్టునే ఉండి చేసే పనులు పెరిగిపోవడం, ఎండకు ఎక్స్‌పోజ్ అయ్యే అవసరాలు తగ్గడం అన్న అంశమే విటమిన్-డి లోపం పెరగడానికి ప్రధాన కారణం. దాంతో విటమిన్-డి లోపం వల్ల కనిపించే అనర్థాలు చాలామందిలో కనిపిస్తున్నాయి. అందుకే చాలామంది ఫిజీషియన్లు ఈ విటమిన్‌ను ప్రిస్క్రయిబ్ చేయడం ద్వారా ఈ లోపాన్ని అధిగమించడానికి ప్రయత్నిస్తున్నారు.

వాస్తవానికి ఏమిటీ విటమిన్ 'డి'..?

ఎముకల బలం మొదలుకొని అనేక జబ్బుల నుంచి రక్షణ కల్పించే వ్యాధి నిరోధక శక్తి వరకు దేహానికి అవసరమైన పోషకాల్లో అతి ముఖ్యమైనది విటమిన్ డి. నిజానికి ఈ పోషకం ఆహారం కంటే సూర్మరశ్మి నుంచే ఎక్కువగా దొరుకుతుంది. వాస్తవానికి సూర్యకాంతి వల్ల దొరికేది 80 శాతమైతే... మిగతా 20 శాతం మాత్రమే ఆహార పదార్థాల నుంచి లభ్యమవుతుంటుంది. ఇది కొవ్వులో కరిగే (ఫ్యాట్ సాల్యుబుల్) విటమిన్. సాంకేతిక పరిభాషలో చెప్పాలంటే దీన్ని 'సెకో స్టెరాయిడ్' అంటారు. అంటేదీని మాలెక్యూల్స్ నిర్మాణాన్ని పరిశీలిస్తే ఇందులో... పరమాణు వలయాలు తెగినట్లుగా ఉంటాయి. (సెకో అంటే బ్రోకెన్ అని అర్థం). పైగా స్టెరాయిడ్ వంటి పదార్థాల నుంచి ఆవిర్భవించిందనే మరో అర్థం కూడా ఉంది. కాబట్టి ఇది సహజ స్వాభావికమైన స్టెరాయిడ్ గుణాలతో పాటు విటమిన్ (వైటల్ ఎమైన్)గా కూడా పనిచేస్తుండటంతో దీంతో దేహానికి ఒనగూరే ఎన్నో ప్రయోజనాలెన్నో ఉన్నాయి.

* * *

విటమిన్ డి ఎలా తయారవుతుందంటే..?

సూర్యరశ్మిలోని అల్ట్రావయొలెట్ కిరణాలు చర్మాన్ని తాకినప్పుడు కొన్ని రకాల జీవరసాయనాలూ ఉత్పత్తి అవుతాయి. వాటిని 'క్యాల్సిఫెరాల్స్' అంటారు. ఒకరకంగా ఈ క్యాల్సిఫెరాల్స్ విటమిన్ డి తయారీకి కారణమవుతాయని చెప్పవచ్చు. కాల్సిఫెరాల్... రక్తంలో కలిసి ఎట్టకేలకు కాలేయాన్ని చేరుతుంది. కాలేయంలో అది 'క్యాల్సీడియల్' అనే ఒక పూర్తిస్థాయి హార్మోన్ తాలూకు తొలిరూపాన్ని తీసుకుంటుంది. మళ్లీ అది రక్తప్రవాహంలో కలిసి 'క్యాల్సీడియల్' నుంచి 'క్యాల్సిట్రియల్'గా మారుతుంది. ఈ క్యాల్సిట్రియాల్‌నే దాదాపుగా 'విటమిన్-డి' అనుకోవచ్చు. రక్తప్రవాహం ద్వారా ఇది మూత్రపిండాల్లోకి చేరినప్పుడు పూర్తిస్థాయి 'విటమిన్-డి'గా రూపొందుతుంది. అంతే కాదు... వ్యాధి నిరోధకత కలిగించే కణాల్లోనూ ఈ విటమిన్ తయారవుతుంటుంది. అందుకే ఈ విటమిన్ అంతటి ప్రభావవంతమైన 'సహజమైన వ్యాధినిరోధత కల్పించే కీలక జీవరసాయనం'గా పనిచేస్తుంది.

* * *

కనుగొన్న తీరు ఆద్యంతం ఆసక్తికరం...

విటమిన్-డి ని కనుగొన్న తీరు ఒక థ్రిల్లర్‌ను తలపింపజేస్తుంది. కొన్ని శతాబ్దాల కిందట... ముఖ్యంగా నావికులు (సెయిలర్స్) ప్రపంచం (గ్లోబు)లోని కొత్త కొత్త ప్రాంతాలను కనుగొనడానికి నావికా ప్రయాణాలు చేసే రోజుల్లో రికెట్స్ అనే ఎముకల వ్యాధి చాలా ఎక్కువగా ఉండేది. మామూలు ప్రజల్లోనూ కనిపించే ఈ రికెట్స్ వ్యాధి నిల్వ ఉండే ఆహారాలు ఎక్కువగా తీసుకునే నావికుల్లో మరింత ఎక్కువగా కనిపిస్తుండేది.

రికెట్స్ వ్యాధి వచ్చిన వాళ్లలో ఎముకలు తమ సహజ ఆకృతిని కోల్పోయి వంకర తిరగడం, కాళ్లు దొడ్డికాళ్లలా మారడం వంటి పరిణామాలు చోటుచేసుకునేవి.

పిల్లల్లో వచ్చే రికెట్స్‌ను 'ఆస్టోమలేసియా' అనేవారు. దాదాపు వంద ఏళ్ల కిందట హాలెండ్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాల్లో ఈ రికెట్స్‌కు విరుగుడుగా వైద్యులు 'కాడ్ లివర్ ఆయిల్' అనే నూనెను ఉపయోగించేవారు. దీన్ని కాడ్ అనే రకం చేప కాలేయం నుంచి తయారు చేయడం వల్ల దాన్ని 'కాడ్ లివర్ ఆయిల్' అనే పిలిచేవారు.

1918లో ఎడ్వర్డ్ మెలాన్‌బీ అనే శాస్త్రవేత్త - కాడ్‌లివర్ ఆయిల్‌లోని కొవ్వులో కరిగే ఒకానొక పోషకం రికెట్స్ వ్యాధికి మంచి విరుగుడు అని తెలుసుకున్నాడు. ఆ తర్వాత 1924లో హెచ్. స్టీన్‌బాక్, ఆల్ఫ్రెడ్ ఫేబియన్ హెస్ అనే శాస్త్రవేత్తల పరిశోధనల్లో ఓ కొత్త విషయం తెలిసింది. అదేమిటంటే... సూర్యరశ్మిలోని అల్ట్రా వయొలెట్ కిరణాలు కొన్ని జీవులను తాకినప్పుడు... ఆ జీవుల్లో కొవ్వులాంటి ఓ పోషకం ఉత్పత్తి అవుతోందని కనుగొన్నారు. ఆ పోషకాన్ని తొలుత వాళ్లు 'వయొస్టెరాల్' అని పిలిచేవారు. ఇక 1935లో దీన్ని ల్యాబ్‌లో ఐసోలేట్ చేసి, దానికి 'క్యాల్సిఫెరాల్' అని పేరుపెట్టారు. ఆ తర్వాత అందులో కొద్దికొద్ది నిర్మాణపరమైన మార్పులతో ఉండే... అనేక రకాల విటమిన్ డి (డి1, డి2, డి3, డి4, డి5, డి6, డి7, డి8)లను కనుగొన్నారు.

* * *

స్వాభావికంగానే విటమిన్ 'డి'ని పొందాలంటే...


ముఖం, చేతులు, భుజాలు వంటి శరీర భాగాలను సాధ్యమైనంత వరకు లేత ఎండకూ లేదా హాని చేయనంత సూర్యకాంతికి ఎక్స్‌పోజ్ అయ్యేలా సూర్యోదయ వేళల్లో ఆరుబయట నడవడం మేలు. ఒకవేళ మాత్రలు సరిపడనివారు నేచురల్‌గానే విటమిన్-డి ని పొందాలని అనుకుంటే తీసుకోవాల్సిన ఆహారాలివి...



* **చేపల్లో...** చేపల కాలేయాల్లో లభ్యమయ్యే నూనెల్లో విటమిన్ డి సమృద్ధిగా లభ్యమవుతుంది. మరీ ముఖ్యంగా కాడ్, మాకెరెల్, సొరచేప (షార్క్), సార్డైన్, ట్యూనా వంటి చేపల కాలేయాలలో విటమిన్-డి ఎక్కువ.



* **మాంసాహారాల వంటి యానిమల్ సోర్స్ నుంచి...** వేట మాంసం, అందులోనూ ప్రత్యేకంగా కాలేయం మాంసంలో; అలాగే వెన్న, నెయ్యి, గుడ్డులోని పచ్చసొనలో 'విటమిన్-డి' ఎక్కువ. ఇటీవల చాలామంది పచ్చసొన ఆరోగ్యానికి మంచిది కాదంటూ దాన్ని తీసుకోవడం లేదు. కానీ గుడ్డు తాలూకు పచ్చసొనలో కొలెస్ట్రాల్‌తో పాటు క్యాల్సిటరాల్ అని పిలిచే విటమిన్-డి ఉంటుంది. కాబట్టి విటమిన్-డి పొందాలనుకునేవాళ్లు గుడ్డులోని పచ్చసొన తీసుకోవడం చాలా మంచిది. పచ్చసొన తీసుకోకపోవడం వల్ల ఆరోగ్యానికి కలిగే మేలు కంటే క్యాల్సిటరాల్ వంటి ఎన్నో పోషకాలను పోగొట్టుకోవడం ద్వారా పొందే నష్టమే ఎక్కువ. అందుకే పరిమిత స్థాయిలో పచ్చసొన తీసుకోవడం ఆరోగ్యానికి మంచి చేస్తుందని గుర్తించాలి.






* **మష్రూమ్స్‌లో...** పుట్టగొడుగుల్లో (మష్రూమ్స్‌లో) విటమిన్-డి2 సమృద్ధిగా దొరుకుతుంది. విటమిన్-డి లోపం ఉన్నవారు పుట్టగొడుగులతో చేసిన రకరకాల ఆహార పదార్థాలు తీసుకోవడంతో పాటు ఎండలో నడవటం వల్ల స్వాభావికంగానే విటమిన్-డి2 లభ్యమవుతుంది.



* **ఫోర్టిఫైడ్ ఆహారాల్లో...** పాలు, జ్యూస్ వంటి కొన్ని రకాల ఆహార పదార్థాల్లో ఇతర పోషకాలతో మరింత సంతృప్తమయ్యేలా చేస్తారు. ఇలాంటి ఆహారాలను ఫోర్టిఫైడ్ ఆహారాలుగా పేర్కొంటారు. మామూలుగా అయితే పాలలో విటమిన్-డి పాళ్లు తక్కువే. కానీ ఫోర్టిఫైడ్ మిల్క్, ఫోర్టిఫైడ్ సోయామిల్క్, ఫోర్టిఫైడ్ ఆరెంజ్, ఫోర్టిఫైడ్ ఓట్‌మీల్, ఫోర్టిఫైడ్ సిరేల్స్ (తృణధాన్యాల) వంటి సంతృప్తం చేసిన ఆహార పదార్థాల్లో విటమిన్-డి మోతాదులు ఎక్కువ.

విటమిన్ 'డి'లో అనేక రకాలు...

'విటమిన్ డి'లో విటమిన్ డి1, డి2, డి3...డి7... ఇలా చాలా రకాలు (దాదాపు పది వరకు) ఉన్నాయి. కానీ వాటిల్లో విటమిన్ డి2 (ఎర్గో క్యాల్సిఫెరాల్), విటమిన్ డి3 (కోలీ క్యాల్సిఫెరాల్) చాలా ముఖ్యమైనవి, కీలకమైనవి.



విటమిన్-డి లోపాలతో వచ్చే సమస్యలు...

విటమిన్-డి లోపాలతో వచ్చే ఆరోగ్య సమస్యల జాబితా చాలా పెద్దదే. అందుకే ఇటీవల సాధారణ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రులకు వెళ్లే బాధితుల్లో విటమిన్'డి' లోపాన్ని డాక్టర్లు ఎక్కువగా కనుగొంటున్నారు.

విటమిన్ 'డి'లోపం వల్ల కనిపించే సమస్యలు...

● శరీరంలో ఖనిజలవణాల అసమతౌల్యత (ముఖ్యంగా జింక్, ఐరన్, ఫాస్ఫరస్ వంటివి) ● హార్మోన్ల అసమతౌల్యత ● అత్యంత వేగంతో భావోద్వేగాలు మారిపోవడం (మూడ్స్ స్వింగింగ్) ● మానసిక ఆరోగ్యం దెబ్బతినడం ● గర్భవతుల్లో పిండం ఎదుగుదలలో లోపాలు ● మెదడు కణాలైన న్యూరాన్లు (నరాల కనెక్షన్లలో) లోపాలు ● కండరాల కదలికల్లో సమన్వయలోపాలు ● రక్తపోటు ● ధమనుల్లో రక్తప్రసరణ లోపాలు● చక్కెర నియంత్రణలో లోపాలు ● దంతసంబంధమైన సమస్యలు ● కణ విభజనలో లోపాలు ● ఎముకల బలం లోపించడం ● వ్యాధి నిరోధక శక్తి తగ్గడం ● రికెట్స్ వ్యాధి ● ఆస్టియోపోరోసిస్ ● ఆస్టియోమలేసియా ● ఒక్కోసారి ఫిట్స్ రావడం మొదలైనవి.

* గర్భిణులకు తగినంత విటమిన్ -డి ఇవ్వడం వల్ల వాళ్లకు పుట్టే పిల్లలు భవిష్యత్తులో ఆరోగ్యంగా ఎదుగుతారు. అన్ని రకాలుగా వాళ్ల వికాసానికి (మైల్ స్టోన్స్‌కు) విటమిన్-డి ఎంతగానో తోడ్పడుతుంది.

విటమిన్ డి లోపం నిర్ధారణ ఇలా...

ఒక రకమైన రక్తపరీక్ష ద్వారా విటమిన్-డి ఉండాల్సిన మోతాదులో ఉన్నదా. లేదా అనే విషయాన్ని తెలుసుకుంటారు. ఇందుకోసం 25 (ఓహెచ్)డీ అనే పరీక్షనూ లేదా 1.25 (ఓహెచ్) డీ3 అనే పరీక్షను చేస్తారు. విటమిన్-డి ఉండాల్సిన మోతాదును తెలుసుకునేందుకు పైన పేర్కొన్న మొదటి పరీక్ష అయిన 25 (ఓహెచ్)డీ బాగా ఉపయోగపడుతుంది. ఇక 25 (ఓహెచ్)డీ పరీక్షనే 25-హైడ్రాక్సీక్యాల్సిఫెరాల్ లేదా 25-హైడ్రాక్సీ విటమిన్- డి అనే మాటకు సంక్షిప్త రూపం. సాధారణంగా ఆరోగ్యవంతుడి రక్తంలో విటమిన్ డి మోతాదు 50 -65 ఎన్‌జీ/ఎమ్ఎల్ ఉండాలి. దాని కంటే తక్కువగా ఉంటే డాక్టర్లు విటమిన్-డి టాబ్లెట్స్ ప్రిస్క్రయిబ్ చేస్తారు.

ఇతరత్రా అనేక ఆరోగ్య సమస్యల్లోనూ చికిత్స కోసం...

ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికీ విటమిన్ 'డి'ని వైద్యులు ప్రిస్క్రయిబ్ చేస్తారు. హై కొలెస్ట్రాల్‌తో బాధపడేవారికి, డయాబెటిస్, స్థూలకాయం ఉన్నవారికి, మల్టిపుల్ స్క్లిరోసిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మునరీ డిసీజ్ (సీఓపీడీ) ఉన్నవారికి, ఆస్తమా, బ్రాంకైటిస్ బాధితులకు, మహిళల్లో ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్‌తో బాధపడేవారికి, పంటి, చిగుళ్ల వ్యాధుల నివారణకు, అనేక రకాల చర్మం వ్యాధుల చికిత్సలో అంటే ఉదాహరణకు... విటిలిగో (బొల్లి), స్క్లిరోడెర్మా, సోరియాసిస్ వంటి చర్మరోగాలు ఉన్నవారికి డాక్టర్లు విటమిన్-డిని సూచిస్తారు. సోరియాసిస్ చికిత్సలో 'క్యాల్సిట్రియల్' లేదా 'క్యాల్సిపోట్రియాల్ / క్యాల్సిపోట్రిన్' అనే రూపంలో విటమిన్-డిని పైపూత మందుగా పూస్తారు. ఇక విటమిన్-డి ఎన్నో రకాల క్యాన్సర్లను సమర్థంగా నివారిస్తుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. అందుకే అనేక రకాల క్యాన్సర్ల చికిత్సల్లో 'విటమిన్-డి'ని ఒక మందులా డాక్టర్లు తమ ప్రిస్క్రిప్షన్‌లో సూచిస్తారు.

ఏయే పదార్థాలలో ఎంతెంత...?

వాస్తవానికి ఆహారపదార్థాల ద్వారా లభ్యమయ్యేదాని కంటే సూర్యరశ్మికి తాకినప్పుడు చర్మం కింది పొరలో దీని ఉత్పత్తి ఎక్కువ. అయినప్పటికీ కొద్ది మోతాదుల్లో కొన్ని రకాల ఆహారపదార్థాల నుంచి అది లభిస్తుంది. అవి...

ఆహార పదార్థం	పరిమాణం (మైక్రోగ్రాముల్లో)
కాడ్‌లివర్ ఆయిల్	175
షార్క్ లివర్ ఆయిల్	50
గుడ్లు (పచ్చసొనతో)	1.5
నెయ్యి	2.5
వెన్న	1.0

(ఇవన్నీ 100 గ్రాముల ఎడిబుల్ పోర్షన్‌లో లభించే మోతాదులు)

విటమిన్ 'డి' తాలూకు కొన్ని విశేషాలు...

* ఎండవేళలోనే విటమిన్-డి తయారవుతుంది. పైగా చర్మాన్ని తాకాక అది కాలేయాన్ని చేరుతుంది. ఇలా విటమిన్-డి తయారీలోనూ, నిక్షిప్తం చేయడంలోనూ కాలేయం కీలక పాత్ర వహిస్తుంది కాబట్టి... ఎండ తక్కువగా ఉండే చలి కాలం నాలుగు నెలల కోసం అవసరమైన విటమిన్-డిని కాలేయం నిల్వ చేసుకుని పెట్టుకుంటుంది.



* క్యాల్షియమ్ నక్రమంగా ఎముకల్లోకి ఇంకిపోవడంతో పాటు ఎముకల్ని మరింత బలంగా, పటిష్ఠంగా రూపొందేలా చేసేందుకు విటమిన్-డి చాలా అవసరం. ఆహారంలోని క్యాల్షియమ్‌ను శరీరం గ్రహించే ప్రక్రియ మన పేగుల్లోనే జరిగేందుకు విటమిన్-డి సహాయపడుతుంది.

* జుట్టు ఒత్తుగా పెరగడం కోసం కూడా విటమిన్-డి సహాయపడుతుంది.

* * *

విటమిన్ డి టాక్సిసిటీ అంటే....

ఇంతటి ఉపయోగకరమైన విటమిన్-డి ఉండాల్సిన మోతాదు కంటే మించితే... అది ప్రతికూల ఫలితాలకు దారి తీస్తుంది. ఉదాహరణకు సొంతంగా విటమిన్-డి మాత్రలు వాడటం, కాడ్‌లివర్ ఆయిల్ క్యాప్సూల్స్ తీసుకోవడం వల్ల రోజుకు 125 మైక్రో గ్రాముల మోతాదు దాటితే ఒక్కోసారి విపరీతంగా దాహం, కంట్లో కురుపులు, చర్మంపై దురదలు రావడం సాధారణం. దాంతోపాటు వాంతులు, నీళ్లవిరేచనాలు వంటివి కూడా కనిపించవచ్చు. ఒక్కోసారి రక్తనాళాల్లోని గోడలపైనా, మూత్రపిండాలలో క్యాల్షియమ్ పెచ్చులు (క్యాల్సిఫికేషన్) రావచ్చు. రక్తనాళాలతో పాటు కాలేయంలో, ఊపిరితిత్తుల్లో, మూత్రపిండాల్లో, కడుపులో క్యాల్షియమ్ మోతాదులు పెరిగే ప్రమాదం ఉంటుంది. అందుకే ఎండలో తిరగడం లేదా స్వాభావికమైన ఆహారం ద్వారా కాకుండా... ఇతరత్రా రూపాల్లో విటమిన్-డి తీసుకోవాల్సి వచ్చినప్పుడు కేవలం నిపుణుల సూచనల మేరకే, దేహానికి అవసరమైనప్పుడు మాత్రమే దాన్ని తీసుకోవాల్సి ఉంటుంది.

నిర్వహణ: యాసీన్

బిజినెస్ రీల్

క్యాన్సర్ ఔషధాల విభాగంలోకి జీఎస్‌కే



న్యూఢిల్లీ: ఫార్మా దిగ్గజం గ్లాక్సోస్మిత్‌క్లైన్ తాజాగా అంకాలజీ విభాగంలోకి ప్రవేశించింది. గైనకాలజీ క్యాన్సర్లకు సంబంధించి జెంపెర్లీ (డోస్టార్‌లిమాబ్), జెజూలా (నిరాపారిబ్) ఔషధాలను దేశీయంగా ప్రవేశపెట్టింది. భారత్‌లో దీర్ఘకాలికంగా స్పెషాలిటీ మెడిసిన్ పోర్ట్‌ఫోలియోను పటిష్టం చేసుకునేందుకు ఇవి తోడ్పడతాయని జీఎస్‌కేఇండియా ఎండీ భూషణ్ అక్షికర్ తెలిపారు. 2045 నాటికి గర్భాశయ, అండాశయ క్యాన్సర్ కేసులు వరుసగా 78 శాతం, 69 శాతం మేర పెరుగుతాయనే అంచనాలు ఉన్నాయి. గర్భాశయ క్యాన్సర్ చికిత్సలో జెంపెర్లీ, అండాశయ క్యాన్సర్ చికిత్సలో జెజూలా ఉపయోగిస్తారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్ దాతృత్వం



హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ జీఆర్‌టీ జ్యువెలర్స్ దాతృత్వం చాటుకుంది. తమిళనాడు కిడ్నీ రీసెర్చ్ ఫౌండేషన్‌కు కోటి రూపాయిల విరాళం అందించింది. డయాలసిస్, మూత్రపిండ మార్పిడి, మందులు, ఆర్థిక సహాయం అవసరమయ్యే నిరుపేద మూత్రపిండ రోగులకు వైద్య పరీక్షలు అందించడం ద్వారా ఉచిత లేదా సబ్సిడీ చేసిన మూత్రపిండ సంరక్షణను సులభతరం చేస్తుంది. ఈ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ ఎండీ జీఆర్ ఆనంద్ అనంత పద్మనాభన్ మాట్లాడుతూ... దశాబ్దాలుగా మమ్మల్ని విశ్వసించి, మద్దతు ఇచ్చిన కమ్యూనిటీలకు కృతజ్ఞత చూపించడానికి మా వంతు సహకారం అందిస్తున్నాము. వారసత్వం కేవలం సృష్టించే ఆభరణాల గురించి మాత్రమే కాదు, వెలుగులు నింపిన జీవితాల గురించి కూడా.. అని అన్నారు.

డిసెంబర్ నాటికి ఐటీ నిబంధనల నోటిఫై



న్యూఢిల్లీ: కొత్త ఆదాయ పన్ను చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నందున ఈ ఏడాది డిసెంబర్ నాటికి నిబంధనలను నోటిఫై చేయనున్నట్టు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) సభ్యుడు ఆర్ఎన్ పర్బత్ తెలిపారు. అలాగే సులభతర ఐటీఆర్ ఫారమ్‌లపైనా పనిచేస్తున్నట్టు చెప్పారు. కొత్త ఆదాయపన్ను చట్టానికి సంబంధించి తరచుగా ఎదురయ్యే ప్రశ్నలు, వాటికి సమాధానాలను విడుదల చేస్తామన్నారు. ఆదాయపన్ను చట్టం, 2025కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలపడం తెలిసిందే. దీంతో ఆదాయపన్ను చట్టం, 1961 స్థానంలో ఇది అమల్లోకి రానుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-8-2025	
విశాఖ	535-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,533.30	3.08
TCS	3,142.10	2.88
HCLTECH	1,505.00	2.64
WIPRO	254.4	2.32
HINDALCO	716.8	1.79

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,302.80	-0.95
APOLLOHOSP	7,848.50	-0.93
NESTLEIND	1,152.80	-0.87
BEL	372.3	-0.68
SBILIFE	1,849.70	-0.5

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,133
ఎన్ఎస్ఈ	81,588
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,59,450
ఎఫ్ఐఐ	- 2,466
డీఐఐ	+ 3,177

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	64.80 (రాత్రి 11.30కు)	$ 63.66 (క్రితం ముగింపు)
బ్రెంట్	68.22 (రాత్రి 11.30కు)	$ 67.22 (క్రితం ముగింపు)

కంపెనీల కొనుగోళ్లకూ బ్యాంక్ నిధులు!

ఆర్‌బీఐని కోరనున్న ఐబీఏ ● ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడి



ముంబై: లిస్టెడ్ కంపెనీలు చేపట్టే విలీనాలు, కొనుగోళ్ల (ఎంఅండ్ఏ) లావాదేవీలకు కూడా నిధులు సమకూర్చడంపై బ్యాంకులు దృష్టి పెడుతున్నాయి. ఇందుకు అనుమతించాలంటూ రిజర్వ్ బ్యాంకును దేశీ బ్యాంకుల అసోసియేషన్ (ఐబీఏ) సూత్రప్రాయంగా అభ్యర్థించనుంది. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ సీఎస్ శెట్టి ఈ విషయం తెలిపారు. వినియోగాన్ని పెంచేందుకు ఓవైపు ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్న నేపథ్యంలో మరోపక్క ప్రయివేట్ రంగం సైతం సామర్థ్య విస్తరణపై పెట్టుబడులకు ఉపక్రమించాలని సూచించారు. సాధారణంగా బలవంతపు టేకోవర్లకు తోడ్పడకూడదనే ఉద్దేశమే, ఎంఅండ్ఏ ఫండింగ్‌కి బ్యాంకులను దూరంగా ఉంచడానికి కారణమని పేర్కొన్నారు. అయితే, అత్యంత పారదర్శకంగా, వాటాదారుల అనుమతితో లిస్టెడ్ కంపెనీలు చేపట్టే కొనుగోళ్లకైనా నిధులు అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలంటూ ఆర్‌బీఐకు విన్నవించనున్నట్లు తెలియజేశారు. దీనితో బలవంతపు టేకోవర్లకు ఫండింగ్ చేసే సందర్భాలు తగ్గుతాయని పేర్కొన్నారు. భారత వాణిజ్య సమాఖ్య, ఐబీఏ సంయుక్తంగా నిర్వహించిన 2025 ఎఫ్ఐబీఏసీ సందర్భంగా శెట్టి పలు అంశాలపై స్పందించారు.

పెట్టుబడి వ్యయాలు ఇలా..

దేశీ కార్పొరేట్ రంగం అంతర్గత వనరులు, ఈక్విటీ, రుణ మార్కెట్ల ద్వారా ప్రస్తుతం పెట్టుబడి వ్యయాలను సమకూర్చుకుంటున్నట్లు ఎస్‌బీఐ చీఫ్ శెట్టి తెలియజేశారు. ప్రభుత్వ చర్యల కారణంగా వినియోగం పుంజుకోనుందన్న అంచనాలతో కంపెనీలు సామర్థ్య విస్తరణపై పెట్టుబడులు చేపట్టవలసి ఉన్నట్లు అభిప్రాయపడ్డారు. అయితే నిలకడైన డిమాండ్ వాతావరణం కనిపించినప్పుడు మాత్రమే పెట్టుబడి వ్యయాలు పుంజుకుంటాయని అత్యధికులు చెబుతున్నట్లు ప్రస్తావించారు. జీఎస్‌టీ రేట్లలో వ్యవస్థాగత సంస్కరణలు, రూ. 12 లక్షలవరకూ ఆదాయ పన్ను మినహాయింపులు తదితర పలు చర్యలకు ప్రభుత్వం తెరతీస్తున్నట్లు పేర్కొన్నారు. నిజానికి డిమాండ్ మళ్లీ భారీస్థాయిలో పుంజుకుంటే కార్పొరేట్లకు పెట్టుబడి వ్యయాలు లేదా తగిన ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులో లేకపోవచ్చని వ్యాఖ్యానించారు. సామర్థ్య విస్తరణవైపు కంపెనీలు ఇప్పటికిప్పుడు దృష్టి పెడితే అటు క్యాపిటల్ మార్కెట్లు, ఇటు బ్యాంకింగ్ వ్యవస్థ ద్వారా రుణ మార్కెట్లు కచ్చితంగా మద్దతిస్తాయని వివరించారు. కస్టమర్ సర్వీసుల పెంపు, సైబర్ సెక్యూరిటీ పటిష్టత, మరింత ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌కు దేశీ బ్యాంకింగ్ రంగం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేశారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల(ఎంఎస్ఎంఈలు)కు రుణాలందించడంపై ఇటీవల బ్యాంకులు అత్యధికంగా దృష్టిసారించినట్లు పేర్కొన్నారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్–జూన్(క్యూ1)లో వీటికి 19 శాతం అధికంగా రూ. 5.28 లక్షల కోట్ల రుణాలందించినట్లు వెల్లడించారు.

అమెజాన్ మరో 40 కొత్త ఆశ్రయ్ కేంద్రాలు



న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా తాజాగా తమ ఆశ్రయ్ ప్రాజెక్టును మరింతగా విస్తరించింది. ప్రభుత్వ రంగ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)తో కలిసి మరో 40 కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీంతో వీటి సంఖ్య 13 నగరాలవ్యాప్తంగా 65కి చేరింది. 2025 ఆఖరు నాటికి ఇలాంటి 100 సెంటర్స్ ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నట్లు అమెజాన్ ఆపరేషన్స్ డైరెక్టర్ (ఇండియా) సలీం మెమన్ తెలిపారు. పెట్రోల్ బంకులు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసే ఈ సెంటర్స్.. అమెజాన్ సొంత నెట్‌వర్క్‌లోని వారితో పాటు ఈ-కామర్స్, లాజిస్టిక్స్ వ్యవస్థలోని ఇతరత్రా డెలివరీ అసోసియేట్స్ కూడా కాస్సేపు సేద తీరేందుకు ఉపయోగపడతాయి. వీటిలో ఎయిర్ కండీషన్డ్ సీటింగ్, తాగునీరు, మొబైల్ చార్జింగ్ పాయింట్లు, వాష్‌రూమ్‌లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ మొదలైనవి ఉంటాయి. ఉదయం 9 గం.ల నుంచి రాత్రి 9 గం.ల వరకు, ఏడాదిపొడవునా, వారానికి ఏడు రోజులు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ట్రాఫిక్ రద్దీ, వాతావరణ మార్పులతో ఇబ్బందిపడే డెలివరీ అసోసియేట్స్ ప్రతి విజిట్‌లో అరగంట సేపు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

స్వాన్ ఎనర్జీ ఇకపై స్వాన్ కార్ప్

కొత్త లోగో ఆవిష్కరణ

SWAN CORP

ముంబై: స్వాన్ ఎనర్జీ తన కంపెనీ పేరును స్వాన్ కార్ప్ లిమిటెడ్‌గా మార్చుకున్నట్లు ప్రకటించింది. కొత్త లోగోనూ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ నిఖిల్ మాట్లాడుతూ.. కొత్త ఐడెంటిటీతో మా ప్రయాణంలో ధైర్యవంతమైన దశ ప్రారంభమైనట్లు భావిస్తాము. ప్రభావిత రంగాల్లో కార్యకలాపాలను విస్తరిస్తూ, దేశ ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వడంలో మా వంతు పాత్ర పోషిస్తామన్నారు. శతాబ్దానికి పూర్వం ప్రారంభమైన స్వాన్ కార్ప్ ప్రస్తుతం ఆయిల్‌అండ్‌గ్యాస్, వాణిజ్యం, డిఫెన్స్ షిప్‌బిల్డింగ్, హెవీ ఇంజనీరింగ్, ఆఫ్‌షోర్ ఫ్యాబ్రికేషన్, రియల్ ఎస్టేట్ రంగాల్లో సేవలు అందిస్తోంది.

ప్రాపర్టీపై రుణ సేవల్లోకి హోమ్ క్రెడిట్ ఇండియా

ఈ విభాగం హెడ్‌గా నీరజ్ జైన్



హైదరాబాద్: ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ హోమ్ క్రెడిట్ ఇండియా ప్రాపర్టీపై రుణం (ఎల్ఏపీ) వ్యాపార విభాగంలోకి విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. ఈ విభాగానికి హెడ్‌గా నీరజ్ జైన్‌ను నియమించింది. తన ఉత్పత్తుల పోర్ట్‌ఫోలియోను మరింత వైవిధ్యం చేయడంలో, ఆర్థిక సేవల మార్కెట్లో మరింత బలమైన స్థానాన్ని సొంతం చేసుకునే విషయంలో ఇది కీలక నిర్ణయం అవుతుందని పేర్కొంది. ఆర్థిక సేవల రంగంలో నీరజ్ జైన్ 22 సంవత్సరాలకు పైగా విస్తృత అనుభవం ఉన్నట్టు.. సెక్యూర్డ్ లెండింగ్, ఆపరేషన్స్, కస్టమర్ సేవలు వంటి ప్రధాన విభాగాల్లో పని చేసినట్టు తెలిపింది. దీనిపై హోమ్ క్రెడిట్ ఇండియా సీఈవో వివేక్ సింగ్ మాట్లాడుతూ.. ''ప్రాపర్టీపై రుణాల వ్యాపారాన్ని ప్రారంభించడం మా వృద్ధి వ్యూహంలో సహజమైన ముందడుగు. దీని ద్వారా మరింత విస్తృతంగా కస్టమర్ అవసరాలను తీర్చగలం. ఎల్ఏపీపై ఆయనకు ఉన్న విశాల అనుభవం మా వ్యాపార విస్తరణలో కీలకం కాబోతుంది'' అని అన్నారు.

వొడాఫోన్‌కు ఉపశమనంపై స్పష్టత

ప్రస్తుతం ఎలాంటి ప్రణాళికలు లేవన్న టెలికం మంత్రి



న్యూఢిల్లీ: రుణ భారంతో సతమతమవుతున్న మొబైల్ టెలికం రంగ దిగ్గజం వొడాఫోన్ ఐడియాకు ఆర్థిక ఉపశమనాన్ని కలిగించే యోచన చేయడంలేదని టెలికం శాఖ స్పష్టం చేసింది. కంపెనీ స్థూల సర్దుబాటు ఆదాయం(ఏజీఆర్) బకాయిలపై ప్రస్తుతం తమవద్ద ఎలాంటి ప్రణాళికలు లేదా ఆలోచనలు లేవని కమ్యూనికేషన్స్ శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. 'ఇటీవల కంపెనీకున్న భారీ రుణ భారాన్ని ఈక్విటీగా మార్పు చేసుకున్నాం. ప్రభుత్వ ఆలోచన ప్రకారం ఇది చేపట్టాం. ప్రభుత్వం చేయదలచినదంతా ఇప్పటికే పూర్తి చేసింది. ప్రస్తుతం వీటిపై ఎలాంటి సమాలోచనలూ చేయడంలేదు' అంటూ స్పష్టతనిచ్చారు. స్పెక్ట్రమ్ వేలం బకాయిలకుగాను మార్చిలో ప్రభుత్వం రూ. 36,950 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను సొంతం చేసుకోవడం ద్వారా వొడాఫోన్ ఐడియాలో అతిపెద్ద వాటాదారుగా అవతరించిన సంగతి తెలిసిందే. ఇంతక్రితం 2023లోనూ ప్రభుత్వం రూ. 16,000 కోట్ల బకాయిలకుగాను వొడాఫోన్ ఐడియాలో 33 శాతం వాటాను అందుకోవడం గమనార్హం! 2025 జూన్‌కల్లా కంపెనీ ఏజీఆర్ లయబిలిటీ రూ. 75,000 కోట్లుగా నమోదైంది. ఈ వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో వొడాఫోన్ ఐడియా షేరు 5 శాతం జంప్‌చేసి రూ. 7.40 వద్ద ముగిసింది.

ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు

- పెట్టుబడులను పెంచుకోవాల్సిన తరుణం
- ఇందుకు బ్యాంక్‌లు, కార్పొరేట్లు కలసి పనిచేయాలి
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా
- వాణిజ్య చర్చలతో ఫలితం రావచ్చన్న ఆశాభావం



ముంబై: టారిఫ్ పరమైన అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఆర్థిక సవాళ్లను విసురుతున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ తరుణంలో పెట్టుబడులను ఇతోధికం చేసేందుకు బ్యాంక్‌లు, కార్పొరేట్లు కలసి రావాలని పిలుపునిచ్చారు. ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. అమెరికా–భారత్ వాణిజ్య ప్రతినిధుల మధ్య కొనసాగుతున్న సంప్రదింపులు అంతిమంగా ఒక నిర్ణయానికి దారితీస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అప్పుడు టారిఫ్‌ల కారణంగా దేశీ ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం పరిమితం అవుతుందన్నారు. భారత ఉత్పత్తులపై అమెరికా 25 శాతం టారిఫ్‌లు విధించగా, ఈ నెల 27 నుంచి మరో 25 శాతం టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. ఈ క్రమంలో టెక్స్‌టైల్స్, రొయ్యలపై అధిక ప్రభావం పడుతుందన్న ఆందోళనల నేపథ్యంలో అవసరమైతే రంగాల వారీ ఆర్థిక చేయూతకు అవకాశం ఉంటుందని మల్హోత్రా సంకేతం ఇచ్చారు. పరపతి విధానంలో భాగంగా ద్రవ్యోల్బణంతోపాటు వృద్ధి క్రమాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు చెప్పారు. ''క్లిష్టమైన పరిస్థితుల్లో ఉన్నాం. భౌగోళిక రాజకీయ, టారిఫ్ పరమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. కనుక ఆర్థిక విస్తరణ మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బ్యాంక్‌లు, కార్పొరేట్ బ్యాలన్స్ షీట్లు మెరుగ్గా ఉన్నాయి. కనుక అవి పరస్పర సహకారంతో పెట్టుబడుల సైకిల్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలి. ఈ కీలక తరుణంలో ఇది ఎంతో అవసరం''అని పేర్కొన్నారు.

రుణ వృద్ధికి చర్యలు..

ధరల స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం వృద్ధికి అడ్డు కావని మల్హోత్రా అభిప్రాయపడ్డారు. బ్యాంకుల రుణ వృద్ధి మూడేళ్ల కనిష్టానికి తగ్గిన తరుణంలో.. ఇందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఆర్‌బీఐ నియంత్రణలోని సంస్థల వ్యాపార సులభతర నిర్వహణను పెంచడంపైనా దృష్టి పెట్టినట్టు చెబుతూ, దీనివల్ల వ్యయాలు తగ్గుతాయన్నారు. ఆర్‌బీఐ ఎన్నో వివరాలు కోరుతుందన్న అభిప్రాయాలు నెలకొన్నాయని చెబుతూ.. అడిగిన సమాచారం విషయంలో భాగస్వాములు సహకరించాలని కోరారు. దీనివల్ల మెరుగైన నియంత్రణలకు అవకాశం ఉంటుందన్నారు. త్వరలోనే బాసెల్–3 నిబంధనలను అమల్లోకి తెస్తామని చెప్పారు. అందరికీ ఆర్థిక సేవలను మరింత విస్తృతం చేయడం, చిన్న వ్యాపారులకూ రుణ సాయం చేరువ చేయడం, కస్టమర్ సేవల నాణ్యతను పెంచడం తమ ప్రాధాన్యతలుగా చెప్పారు.

రెనాల్ట్.. కైగర్ ఫేస్‌లిఫ్ట్



న్యూఢిల్లీ: రెనాల్ట్ ఇండియా కొత్తగా అప్‌డేట్ చేసిన రెనాల్ట్ కైగర్ ఫేస్‌లిఫ్ట్‌ను ఆవిష్కరించింది. ఎక్స్ షోరూమ్ వద్ద ప్రారంభ ధర రూ.6.29 లక్షలుగా ఉంది. ప్రీమియం ఫీచర్లు కలిగిన టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.11.29 లక్షలుగా నిర్ణయించారు. ఈ మోడల్‌లో ఆకట్టుకునేలా ఎక్స్‌టీరియర్ మార్పులు చేశారు. ప్రీమియం లుక్ వచ్చేలా ఇంటీరియర్ అప్‌డేట్ చేశారు. స్ట్రైకింగ్ ఫ్రంట్ గ్రిల్, పూర్తిగా కొత్త హుడ్ డిజైన్, రిడిజైన్ చేసిన ఫ్రంట్, రియర్ బంపర్లు, లేటెస్ట్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్, టెయిల్ ల్యాంప్స్, ఫాగ్ ల్యాంప్స్ వంటివి అమర్చబడ్డాయి. భద్రత పరంగా 21 స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్లతో వస్తోంది. కైగర్ తన సెగ్మెంట్‌లో ప్రత్యేక ఉత్పత్తిగా ఉందని రెనాల్ట్ ఎండీ, సీఈవో వెంకట్రామ్ మామిళ్లపల్లి తెలిపారు.

ఫోన్‌పే నుంచి గృహ బీమా పాలసీ



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే కొత్తగా గృహ బీమా పాలసీలను ప్రకటించింది. అగ్ని, వరదలు, భూకంపాలు సహా 20 రిస్కులకు కవరేజీ అందించేలా పాలసీలను ప్రకటించింది. రూ. 10 లక్షల నుంచి రూ. 12.5 కోట్ల వరకు కవరేజీని ఎంచుకోవచ్చు. వీటి ప్రీమియంలు కవరేజీని బట్టి వార్షికంగా రూ. 181 నుంచి (జీఎస్‌టీ కూడా కలిపి) ప్రారంభమవుతాయి. గృహ రుణాలకు సంబంధించి ఈ పాలసీలకు అన్ని బ్యాంకులు, రుణ సంస్థల్లో ఆమోదయోగ్యత ఉంటుందని కంపెనీ తెలిపింది. ఫోన్‌పే యాప్ ద్వారా యూజర్లు దీన్ని పొందవచ్చు.

ద్విచక్ర వాహన విక్రయాలు 6–9% పెరగొచ్చు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంపై రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో ద్విచక్ర వాహన విక్రయాలు 6–9% పెరగొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంచనా వేసింది. స్థిరమైన రిప్లేస్‌మెంట్(పాత వాహనాన్ని మార్చి కొత్త వాహనాన్ని కొనుగోలు చేయడం), పట్టణ ప్రాంతాల్లో వినియోగ రికవరీ, సాధారణ వర్షపాతం నమోదుతో గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయాలు పెరగడం, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు తదితర అంశాలు అమ్మకాల వృద్ధికి తోడ్పడతాయని రేటింగ్ సంస్థ తెలిపింది. ''పరిశ్రమ అవుట్‌లుక్ ఇప్పటికి సానుకూల వైఖరి కలిగి ఉంది. స్థిరమైన డిమాండ్ ఉతమిస్తుంది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అంశం వృద్ధి వేగవంతం కావడానికి అదనపు ప్రోత్సాహాన్నిస్తుంది'' అని పేర్కొంది. పండుగ సీజన్‌కు ముందు ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ మానుఫ్యాక్చరర్లు (ఓఈఎంలు) డీలర్లకు బలమైన పంపిణీ కారణంగా ఈ జూలైలో టూ వీలర్స్ హోల్‌సేల్ అమ్మకాలు 9% వృద్ధితో 15 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. ఇదే జూలైలో రిటైల్ అమ్మకాలు 6.5% క్షీణించాయి. పట్టణ ప్రాంతంలో డిమాండ్ స్తబ్దత, అధిక వర్షపాతంతో గ్రామీణ ప్రాంతాల్లో కొనుగోళ్లు తగ్గడం ఇందుకు కారణమని పేర్కొంది. ఎగుమతుల వృద్ధి సైతం కొనసాగొచ్చని తెలిపింది. రాబోయే పండుగ సీజన్ నాటికి రిటైల్ డిమాండ్ పుంజుకోవచ్చని రేటింగ్ ఏజెన్సీ చెప్పుకొచ్చింది.

దేశాభివృద్ధికి సంస్కరణల అజెండా

- సులభతర జీఎస్‌టీ నిర్మాణం
- పెట్రోలియం, రియల్టీకి సైతం వర్తింపు
- ఉపాధి, గిగ్ వర్కర్లకు ప్రత్యేక విధానాలు
- కేంద్రానికి సీఐఐ సూచనలు



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు వీలుగా కీలక సంస్కరణల అజెండాను భారతీయ పరిశ్రమల సమాఖ్య కేంద్ర ప్రభుత్వం ముందుంచింది. సులభతర జీఎస్‌టీ నిర్మాణం ఉండాలంటూ అందులోకి పెట్రోలియం, రియల్ ఎస్టేట్‌ను కూడా చేర్చాలని సూచించింది. జాతీయ స్థాయిలో ఉపాధి, తాత్కాలిక కార్మికుల పని విధానాలను తీసుకురావాలని కోరింది. 'పోటీతత్వంతో కూడిన భారత్ కోసం విధానాలు' పేరుతో తన నివేదికలో 250కు పైగా సిఫారసులు చేసింది. ఇందులో 14 కీలక సంస్కరణల విభాగాలనూ ప్రస్తావించింది. 2047 నాటికి వికసిత్ భారత్ (అభివృద్ధి చెందిన దేశం) లక్ష్య సాధనకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై పరిశ్రమల నేతలు, ఆర్థికవేత్తలు, విధానపరమైన నిపుణులతో సంప్రదింపుల అనంతరం సీఐఐ ఈ నివేదికను రూపొందించింది. ద్రవ్య క్రమశిక్షణ, ద్రవ్యోల్బణం నియంత్రణ, అధునాత గణాంకాల విధానాలు, వ్యూహాత్మకం కాని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం, సావరీన్ వెల్త్ ఫండ్ ఏర్పాటు, స్వల్ప ఉల్లంఘనలను నేరాలుగా పరిగణించకపోవడం, సకాలంలో అనుమతులు, సింగిల్ విండో అనుమతులు, రెండో తరం దివాలా అండ్ బ్యాంక్రప్టసీ కోడ్ (ఐబీసీ) సంస్కరణలు, క్రమబద్ధీకరణతో కూడిన కార్మిక చట్టాలు, కనీస వేతన కార్యాచరణ, వివాదాలను వేగంగా పరిష్కరించడం వంటి సూచనలు ఈ నివేదికలో ఉన్నాయి. ఇక ఇంధన రంగానికి సంబంధించి.. పోటీతో కూడిన టారిఫ్‌లు, క్రాస్ సబ్సిడీని తొలగించడం, బలమైన ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌లు, న్యూక్లియర్ విద్యుత్‌లో ప్రైవేటు రంగానికి చోటు కల్పించడం, గ్రీన్ హైడ్రోజన్ వినియోగాన్ని ప్రోత్సహించడం వంటి చర్యలను సూచించింది. ఈ కామర్స్ ఎగుమతులకు సంబంధించి ప్రత్యేక విధానం, మూలధన మద్దతుతో తయారీకి ఊతం, పారిశ్రామిక కారిడార్‌ల ఏర్పాటు, రవాణా అనుసంధానత తదితర చర్యలను తన నివేదికలో ప్రస్తావించింది.

ప్రభుత్వ సంస్కరణలకు అనుగుణంగానే..

ఈ నివేదికపై సీఐఐ ప్రెసిడెంట్ రాజీవ్ మెమానీ మాట్లాడుతూ.. ''ఈ సిఫారసులు ప్రభుత్వ సంస్కరణల పథానికి అనుగుణంగా ఉన్నాయి. అంతేకాదు సాహసోపేత, పరివర్తనాత్మక మార్పు కోసం ప్రధాని ఇచ్చిన పిలుపునకు మద్దతుగా ఉన్నాయి. భారత పోటీతత్వం కోసం తీసుకోవాల్సిన చర్యలు, విధాన నిర్ణేతలకు తాజా ఐడియాలు ఇందులో ఉన్నాయి''అని పేర్కొన్నారు. ఈ చర్యలు వృద్ధిని వేగవంతం చేస్తాయని, ఉపాధి కల్పనను విస్తృతం చేస్తాయని, వికసిత్ భారత్ దిశగా చేరువ చేస్తాయని సీఐఐ అభిప్రాయపడింది. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానానికి భారత్ చేరువ అవుతున్నందున.. అంతర్జాతీయంగా మరింత పోటీ పడేందుకు వీలుగా ఈ సంస్కరణలు అవసరమని సీఐఐ మాజీ ప్రెసిడెంట్ సంజీవ్ బజాజ్ సైతం అభిప్రాయపడ్డారు.

ఫార్ములేషన్స్, ఏపీఐలపై జీఎస్‌టీ రేట్లు క్రమబద్ధీకరించండి

ఫార్మెక్సిల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: ఔషధాలకు సంబంధించి ఫార్ములేషన్స్, యాక్టివ్ ఫార్మా ఇంగ్రిడియంట్స్ (ఏపీఐ)పై వస్తు, సేవల పన్నును (జీఎస్‌టీ) క్రమబద్ధీకరించాలని ఫార్మా ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మెక్సిల్) కేంద్రాన్ని కోరింది. దీనితో సంక్లిష్టత తగ్గుతుందని, నిబంధనలను పాటించడం పెరుగుతుందని వివరించింది. ప్రస్తుతం ఫార్ములేషన్స్‌పై 12 శాతం, ఏపీఐలపై 18 శాతంగా జీఎస్‌టీ ఉంటోంది. ఒకవేళ ఫార్ములేషన్లను 5 శాతంలోకి మార్చి ఏపీఐలను 18 శాతం శ్లాబ్‌లోనే కొనసాగిస్తే ఇన్‌పుట్, ఔట్‌పుట్ ట్యాక్స్‌ల మధ్య వ్యత్యాసం ఆరు శాతం నుంచి 13 శాతానికి పెరిగిపోతుందని ఫార్మెక్సిల్ వైస్ చైర్మన్ భవిన్ మెహతా తెలిపారు. దీని వల్ల వర్కింగ్ క్యాపిటల్ చిక్కుబడి పోతుందని, రిఫండ్‌లకు సంబంధించి బ్యాక్‌లాగ్‌లకు దారి తీస్తుందని వివరించారు.



సబలెంకా

సబలెంకా బోణీ

- మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లోకి డిఫెండింగ్ చాంప్
- మెద్వెదెవ్‌కు షాక్
- జొకోవిచ్ శుభారంభం
- కీస్ తొలి రౌండ్‌లోనే అవుట్



జొకోవిచ్



మెద్వెదెవ్

న్యూయార్క్: ఈ ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్ టైటిల్ నిలబెట్టుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన బెలారస్ స్టార్ సబలెంకా గెలుపు బోణీ కొట్టింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో డిఫెండింగ్ చాంపియన్, వరల్డ్ నంబర్‌వన్ సబలెంకా 7-5, 6-1తో రెబెకా మసరోవా (స్విట్జర్లాండ్)ను చిత్తు చేసింది. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సబలెంకా రెండు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. ఈ ఏడాది సబలెంకా ఆ్రస్టేలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్‌లలో రన్నరప్‌గా నిలిచి, వింబుల్డన్ టోర్నీలో సెమీఫైనల్లో ఓడిపోయింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో ఆరో సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) 7-6 (10/12), 6-7 (3/7), 5-7తో రెనాటా జరజువా (మెక్సికో) చేతిలో ఓడిపోయింది. మరోవైపు పురుషుల సింగిల్స్ విభాగంలో సెర్బియా దిగ్గజం, 24 గ్రాండ్‌స్లామ్‌ల విజేత నొవాక్ జొకోవిచ్ కూడా శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో 7వ సీడ్ జొకోవిచ్ 6-1, 7-6 (7/3), 6-2తో లెర్నర్ టైన్ (అమెరికా)ను చిత్తు చేశాడు. 2 గంటల 25 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో దిగ్గజ ఆటగాడి ముందు లెర్నర్ నిలవలేకపోయాడు. జొకో ఈ మ్యాచ్‌లో 7 ఏస్‌లు సంధించాడు. వింబుల్డన్ సెమీస్‌లో ఓటమి తర్వాత తొలిసారి బరిలోకి దిగిన సెర్బియా ప్లేయర్ ఇటీవలి కాలి గాయంనుంచి పూర్తి స్థాయిలో కోలుకోలేదు. ఈ మ్యాచ్ మధ్యలో అతను చికిత్స తీసుకోవాల్సి వచ్చింది. అమెరికాకు చెందిన నాలుగో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ కూడా ముందంజ వేశారు. ఫ్రిట్జ్ 7-5, 6-2, 6-3తో అమెరికాకే చెందిన ఎమీలియా నవాపై గెలుపొందాడు. మహిళల సింగిల్స్‌లో నాలుగో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) 6-0, 6-4తో మాయర్ షరీఫ్ (ఈజిప్ట్)ను ఓడించి రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టింది. ఏడో సీడ్ పావోలిని (ఇటలీ) 6-2, 7-6 (7/4)తో ఐవా (అమెరికా)పై, ఒస్టాపెంకో (లాత్వియా) 6-4, 6-3తో వాంగ్ (చైనా)పై, అజరెంకా (బెలారస్) 7-6 (7/0), 6-4తో హినా ఇనో (అమెరికా)పై గెలుపొందారు. చెక్ రిపబ్లిక్‌కు చెందిన క్విటోవా తన కెరీర్‌ను ఓటమితో ముగించింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో క్విటోవా 1-6, 0-6తో దయానా పారీ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది. క్విటోవా తన కెరీర్‌లో 31 సింగిల్స్ టైటిల్స్ నెగ్గగా... ఇందులో రెండు గ్రాండ్ స్లామ్ (వింబుల్డన్; 2011, 2014) టైటిల్స్ ఉన్నాయి.

మళ్లీ అతడే...

నాలుగేళ్ల క్రితం 2021లో యూఎస్ ఓపెన్ గెలిచి తన కెరీర్‌లో ఏకైక గ్రాండ్‌స్లామ్ సాధించిన 13వ సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా)కు మరోసారి తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. ఈ సీజన్‌లో ఒక్క ఆ్రస్టేలియన్ ఓపెన్‌లోనే రెండో రౌండ్ చేరగలిగిన అతను మిగతా మూడు గ్రాండ్‌స్లామ్‌లోనూ మొదటి రౌండ్‌లోనే ఓటమి పాలయ్యాడు. వింబుల్డన్ టోర్నీలో తనను తొలి రౌండ్‌లో ఓడించిన బెంజమిన్ బోన్జీ (ఫ్రాన్స్) ఈసారి కూడా మెద్వెదెవ్‌కు అడ్డుగోడగా నిలిచాడు. 3 గంటల 45 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో బోన్జీ 6-3, 7-5, 6-7 (5/7), 0-6, 6-4తో మెద్వెదెవ్‌పై విజయం సాధించాడు. బోన్జీ 6-3, 7-5 తర్వాత మూడో సెట్‌లో 5-4తో సర్వీస్ చేస్తూ విజయానికి చేరువైనా... మెద్వెదెవ్ ఒక్కసారిగా పుంజుకొని వరుసగా రెండు సెట్‌లు గెలుచుకున్నాడు. అయితే చివరకు ప్రత్యర్థిదే పైచేయి అయింది. ఒకదశలో అనుకోకుండా ఫొటోగ్రాఫర్ కోర్టులోకి రావడంతో బోన్జీకి మళ్లీ సర్వ్ చేసేందుకు అనుమతి ఇవ్వడంతో అంపైర్‌తో మెద్వెదెవ్ వాగ్వాదానికి దిగాడు. ఓటమి తర్వాత ఈ అసహనం మెద్వెదెవ్‌లో తీవ్రంగా కనిపించింది. కుర్చీలో కూర్చున్న అతను తన రాకెట్‌ను బలంగా నేలకు బాదుతూ దానిని విరగ్గొట్టాడు!



షకీబ్ 500 వికెట్ల క్లబ్‌లో...

ఢాకా: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ అద్భుతమైన ఘనతను సొంతం చేసుకున్నాడు. టి20 క్రికెట్‌లో 500 వికెట్ల మైలురాయిని అందుకున్నాడు. వెస్టిండీస్‌లో జరుగుతోన్న కరీబియన్ ప్రీమియర్ లీగ్ (సీపీఎల్)లో ఆంటిగ్వా-బార్బుడా ఫాల్కన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న షకీబ్... సెయింట్ కిట్స్-నెవిస్ పేట్రియాట్స్ బ్యాటర్ మొహమ్మద్ రిజ్వాన్‌ను రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేశాడు. టి20ల్లో షకీబ్‌కిది 500 వికెట్ కావడంతో అరుదైన ఈ క్లబ్‌లో చేరిన ఐదో బౌలర్‌గా రికార్డులకెక్కాడు. ఈ మ్యాచ్‌లో అతను మొత్తం 3 వికెట్లు తీసి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. పొట్టి ఫార్మాట్‌లో 500 పైచిలుకు తీసిన బౌలర్లు ఇంతకుముందు నలుగురే ఉన్నారు. అఫ్గానిస్తాన్ వెటరన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ 660 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. తర్వాత డ్వేన్ బ్రేవో (631; వెస్టిండీస్), సునీల్ నరైన్ (590; వెస్టిండీస్), ఇమ్రాన్ తాహిర్ (554; దక్షిణాఫ్రికా) మాత్రమే 500 క్లబ్‌లో ఉండగా ... తాజాగా ఈ జాబితాలో షకీబ్ (502) చేరాడు. అంతేకాదు ప్రస్తుతం టి20 క్రికెట్ చరిత్రలో 7000 పైచిలుకు పరుగులు, 500కు పైగా వికెట్లు తీసిన ఏకైక బౌలర్ అతనొక్కడే కావడం మరో విశేషం.

ఫాతిమా కెప్టెన్సీలో...

లాహోర్: భారత్-శ్రీలంక వేదికగా వచ్చే నెలలో మొదలయ్యే మహిళల వన్డే ప్రపంచ కప్ క్రికెట్ టోర్నీలో పాల్గొనే పాకిస్తాన్ జట్టును ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన పాకిస్తాన్ జట్టుకు ఆల్‌రౌండర్ ఫాతిమా సనా నాయకత్వం వహిస్తుంది. ఇమాన్ ఫాతిమా, నటాలియా పర్వేజ్, రమీన్ షమీమ్, సదాఫ్ షమాస్, సాదియా ఇక్బాల్, షవాల్ జుల్ఫికర్, సయ్యదా అరూబ్ షా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ ఆడనున్నారు.

పాకిస్తాన్ జట్టు: ఫాతిమా సనా (కెప్టెన్), మునీబా, అలియా రియాజ్, దయానా బేగ్, ఇమాన్ ఫాతిమా, నష్రా, నటాలియా పర్వేజ్, ఒమైమా సొహైల్, రమీన్ షమీమ్, సదాఫ్ షమాస్, సాదియా ఇక్బాల్, షవాల్ జుల్ఫికర్, సిద్రా అమీన్, సిద్రా నవాజ్, సయ్యదా అరూబ్ షా.



రెజ్లర్ నేహాపై రెండేళ్ల సస్పెన్షన్



న్యూఢిల్లీ: రెజ్లర్ నేహా సాంగ్వాన్‌పై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) సస్పెన్షన్ వేటు వేసింది. ఇటీవల జరిగిన అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నేహ అధిక బరువు కారణంగా అనర్హతకు గురైంది. దీంతో ఆమెపై రెండేళ్ల నిషేధం విధించిన సమాఖ్య... సీనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టు నుంచి కూడా తప్పించింది. శరీర బరువు సరిచూసుకోవడంలో ఆమె తరచూ విఫలమవుతుండటం వల్లే సస్పెన్షన్ వేటు వేసినట్లు డబ్ల్యూఎఫ్ఐ వర్గాలు తెలిపాయి. బల్గేరియాలో జరిగిన అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 59 కేజీల కేటగిరీలో పోటీపడేందుకు వెళ్లిన ఈ హరియాణా రెజ్లర్ చివరి నిమిషంలో అనర్హతకు గురైంది. 59 కేజీల్లో నేహ ఉండాల్సిన గరిష్ట బరువు కంటే కూడా ఏకంగా 600 గ్రాములు అధికంగా ఉండటంతో నిర్వాహకులు అనర్హత వేటు వేశారు. దీంతో భారత్ 59 కేజీల కేటగిరీలో పోటీకి దూరం కావాల్సి వచ్చింది. దీని వల్ల భారత్ ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కోల్పోవాల్సి వచ్చింది. బల్గేరియా ఈవెంట్‌లో భారత్ 7 పతకాలతో మొత్తం 140 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. జపాన్ (165) ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. బంగారు పతకం ఆశలు పెట్టుకున్న నేహ పోటీల్లో గెలిచి ఉంటే జపాన్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానంలో భారత్ నిలిచేది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 13 నుంచి 21 వరకు క్రొయేషియాలోని జాగ్రెబ్‌లో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జట్టు నుంచి నేహాను తప్పించి సారిక మలిక్‌ను ఎంపిక చేశారు. 59 కేజీల కేటగిరీలో నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో సారిక రన్నరప్‌గా నిలువడంతో ఆమెను ఎంపిక చేసినట్లు డబ్ల్యూఎఫ్ఐ తెలిపింది.


'ఆసియా కప్ గెలుస్తాం'


భారత హాకీ జట్టు చీఫ్ కోచ్ ఫుల్టన్

రాజ్‌గిర్: ఇప్పటికే మూడు సార్లు ఆసియా కప్ నెగ్గిన భారత హాకీ జట్టు సొంతగడ్డపై మరోసారి సాధించి ప్రపంచకప్ హాకీ మెగా ఈవెంట్‌కు నేరుగా అర్హత సంపాదించాలనే లక్ష్యంతో ఉంది. ఈ నెల 29 నుంచి ఇక్కడ జరిగే ఆసియా ఈవెంట్‌లో సత్తా చాటేందుకు భారత జట్టు సిద్ధంగా ఉందని చీఫ్ కోచ్ క్రెయిగ్ ఫుల్టన్ చెప్పారు. 2022లో జకార్తాలో జరిగిన గత టోర్నీలో భారత్ మూడో స్థానంతో తృప్తి పడింది. ఈసారి మాత్రం టైటిల్‌పై కన్నేసిందని కోచ్ అన్నారు. 'ఈ టోర్నీ కోసం భారత్ పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. పారిస్ ఒలింపిక్స్ కోసం ఎంతగా కసరత్తు చేశామో ఇప్పుడూ అలాగే చేశాం. అక్కడ లీగ్ దశలో ఎలాగైతే గెలుచుకుంటూ వెళ్లామో ఇక్కడ కూడా ఒక్కో మ్యాచ్ నెగ్గుకుంటూ ముందంజ వేస్తాం. టైటిల్ వేటలో ఏ ఒక్క ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకోం' అని ఫుల్టన్ వివరించారు. ఈ టోర్నీ విజేతకు ప్రపంచకప్ బెర్త్ లభిస్తుంది. ఈ నేపథ్యంలో భారత్ హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో పటిష్టమైన జట్టుతోనే బరిలోకి దిగుతోంది. టోర్నీ కోసం బీహార్‌కు రావడం చాలా సంతోషంగా ఉందని, ఇక్కడ తమ ఆటతో ప్రేక్షకుల్ని అలరిస్తామని తెలిపారు.

ఛెత్రి లేకుండానే...

భారత ఫుట్‌బాల్ జట్టును ప్రకటించిన హెడ్ కోచ్ ఖాలిద్ జమీల్





బెంగళూరు: సెంట్రల్ ఏషియా ఫుట్‌బాల్ అసోసియేషన్ (సీఏఎఫ్ఏ) నేషన్స్ కప్‌లో పాల్గొనే భారత ఫుట్‌బాల్ జట్టును సోమవారం ఎంపిక చేశారు. 23 మందితో కూడిన ఈ జట్టులో దిగ్గజ మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రిని ఎంపిక చేయలేదు. నిజానికి ముందుగా ప్రకటించిన ప్రాబబుల్స్‌లోనూ ఛెత్రి లేడు. ఆగస్టు 1 నుంచి జరిగిన శిక్షణ శిబిరంలో పాల్గొన్న 29 మందిలో 23 మందిని ఎంపిక చేశారు. కొత్త కోచ్ ఖాలిద్ జమీల్ జట్టుతో పాటు తజికిస్తాన్‌కు పయనమవుతారు. ఈ నెల 29 నుంచి జరిగే నేషన్స్ కప్‌లో భారత్ గ్రూప్ 'బి'లో ఉంది. ఇందులో ఆతిథ్య జట్టు తజికిస్తాన్‌తో పాటు ఇరాన్, అఫ్గానిస్తాన్ జట్లున్నాయి. ముందుగా 29న తజికిస్తాన్‌తో టీమిండియా తలపడుతుంది. అనంతరం సెప్టెంబర్ 1న ఇరాన్, 4న అఫ్గానిస్తాన్‌లో పోటీపడుతుంది. ఏఎఫ్‌సీ ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భారత్‌కు కీలకమైన మ్యాచ్‌లు ముందున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత నేషన్స్ కప్‌ను పూర్తిస్థాయి సన్నాహక టోర్నీగా సద్వినియోగం చేసుకోవాలని భారత్ ఆశిస్తోంది. ఏఎఫ్‌సీ క్వాలిఫయర్స్‌లో తన కన్నా తక్కువ ర్యాంకు జట్లు బంగ్లాతో డ్రా చేసుకున్న భారత్... 0-1తో హాంకాంగ్ చేతిలో ఓడిపోయింది. థాయ్‌లాండ్‌తో జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్ 0-2తో ఓడిపోవడంతో కోచ్ మనోలో మార్క్వెజ్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో చాన్నాళ్ల తర్వాత మళ్లీ జట్టుకు స్వదేశీ కోచ్ జమీల్‌ను ఎంపిక చేశారు. తదుపరి ఏఎఫ్‌సీ క్వాలిఫయర్స్‌లో భారత్ అక్టోబర్ 9, 14 తేదీల్లో సింగపూర్‌తో ఇంటా బయటా రెండు మ్యాచ్‌లు ఆడనుంది.

ఛెత్రిలాంటి మేటి ఆటగాళ్లు లేరు

నేషన్స్ కప్ జట్టులోకి మాజీ కెప్టెన్ సునీల్ ఛెత్రిని ఎంపిక చేయనప్పటికీ అతనిలాంటి నాణ్యమైన ఆటగాళ్లు ప్రస్తుత జట్టులో లేరని కోచ్ జమీల్ అంగీకరించారు. నేషన్స్ కప్ అనేది కేవలం సన్నాహక టోర్నీ కావడం వల్లే ఛెత్రిలాంటి దిగ్గజాన్ని ఎంపిక చేయలేదని చెప్పారు. 'భారత్‌లో సునీల్ ఛెత్రి అంతటి ఆటగాళ్లు లేనపుడు... అతను ఆడతానంటే అభ్యంతరం ఏముంటుంది. అతనొక దిగ్గజం. జట్టు కోసం ఎంతో చేశాడు. అలాంటి ఆటగాడి అనుభవాన్ని తప్పకుండా ఉపయోగించుకుంటాం' అని జమీల్ అన్నాడు. ప్రస్తుతం నేషన్స్ కప్‌పై దృష్టి పెట్టినట్లు చెప్పాడు. కీలకమైన ఆసియా క్వాలిఫయర్స్‌కు ముందు జరుగుతున్న ఈ పోటీలను సద్వినియోగం చేసుకుంటామన్నాడు.

భారత ఫుట్‌బాల్ జట్టు: గుర్‌ప్రీత్ సింగ్, అమ్రిందర్, హృతిక్ (గోల్ కీపర్స్); రాహుల్, నోరెమ్ రోషన్, అన్వర్ అలీ, సందేశ్, చింగ్లేశన సింగ్, మింగ్తన్‌మవియా రాల్తే, మొహమ్మద్ ఉవాయ్ (డిఫెండర్లు); నిఖిల్ ప్రభు, సురేశ్, ఫరూఖ్ భట్, జీక్సన్ సింగ్, బోరిస్ సింగ్, ఆశిక్ కురునియన్, ఉదాంత సింగ్, మహేశ్ సింగ్ (మిడ్ ఫీల్డర్లు); ఇర్ఫాన్, మాన్‌వీర్, జితిన్, లలియంజులా ఛాంగ్తే, విక్రమ్ ప్రతాప్ (ఫార్వర్డ్).



ముంబై: భారత వన్డే జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఇటీవలే టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించాడు. వన్డేలు, టి20ల్లో అద్భుత ప్రదర్శనతో ఎన్నో గొప్ప రికార్డులు సాధించిన రోహిత్... టెస్టుల్లో అలాంటి ప్రభావం చూపలేకపోయాడు. పడుతూ, లేస్తూ సాగిన కెరీర్‌లో 67 టెస్టులు ఆడిన అతను 4301 పరుగులు మాత్రమే చేయగలిగాడు. టెస్టు క్రికెట్ అంత సులువు కాదని, అది ప్రతీ ఆటగాడికి సవాల్ విసురుతుందని రోహిత్ వ్యాఖ్యానించాడు. దాని కోసం సన్నద్ధత కూడా చాలా కఠోరంగా ఉంటుందని అతను అభిప్రాయపడ్డాడు. 'టెస్టుల కోసం సన్నద్ధత చాలా భిన్నంగా ఉంటుంది. ఈ ఫార్మాట్‌లో ఎక్కువ సేపు మైదానంలో గడపాల్సి ఉంటుంది. ఐదు రోజుల పాటు ఆటలో ఉండాలంటే అంత సులువు కాదు. శారీరకంగా ఎంతో అలసిపోవడమే కాదు, మానసికంగా కూడా ఇది పెద్ద సవాల్ విసురుతుంది. అయితే ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఎక్కువగా ఆడటం వల్ల దీనికి అలవాటు పడతారు. మేం ముంబైలో పోటీ క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన సమయంలో రెండు లేదా మూడు రోజుల మ్యాచ్‌లు జరిగేవి. దానికి అనుగుణంగా మా శరీరాలను సిద్ధం చేసేవాళ్లం. కఠిన పరిస్థితులు ఎదురైనా దీని వల్ల పని కాస్త సులువవుతుంది' అని సియెట్ టైర్ సంస్థ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా రోహిత్ అన్నాడు.

ప్రాక్టీస్‌తో క్రమశిక్షణ...

యువ ఆటగాళ్లు తమ కెరీర్ ఆరంభంలో ఈ సన్నద్ధతపై దృష్టి పెట్టరని, అయితే దాని ప్రాధాన్యత ఏమిటో తర్వాతి రోజుల్లో తెలుసుకుంటారని రోహిత్ శర్మ అభిప్రాయపడ్డాడు. 'నేను క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన రోజుల్లో అంతా సరదాగా ఉండేది. వినోదం కోసమే ఆడేవాళ్లం. అయితే వివిధ వయోవిభాగాల్లో ఆడటం మొదలు పెట్టి ముందుకు వెళుతుంటే పరిస్థితి మారిపోతుంది. ఎంతో మంది సీనియర్లు, కోచ్‌లకు ప్రాక్టీస్ ప్రాధాన్యత ఏమిటో మీకు వివరిస్తారు. ఈ తరహాలో సాధన కొనసాగిస్తే మీలో క్రమశిక్షణ పెరగడంతో పాటు పరిస్థితులు అర్థం అవుతాయి. సన్నద్ధత వల్లే జట్టు నీనుంచి ఏం ఆశిస్తుందో తెలుస్తుంది' అని దేశవాళీ క్రికెట్‌లో ముంబై జట్టుకు ఆడిన రోహిత్ విశ్లేషించాడు.

ఒత్తిడిలో స్పందించడం కీలకం...

టెస్టుల కోసం సిద్ధమయ్యేందుకు మానసికంగా కూడా ఎంతో దృఢంగా ఉండాలని ఈ ముంబైకర్ సూచించాడు. 'టెస్టు మ్యాచ్‌లో బరిలోకి దిగడానికి ముందు ఎంతో సన్నద్ధత ఉంటుంది. సుదీర్ఘ ఫార్మాట్ ఆడేటప్పుడు ఏకాగ్రత చాలా ముఖ్యం. అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలంటే మానసికంగా ప్రశాంతంగా, దృఢంగా ఉండటం చాలా అవసరం. మైదానంలో ఎక్కువ సేపు ఆడేందుకు అవసరమైన పట్టుదల సాధనతోనే వస్తుంది. నేను కూడా అలాగే చేశాను. ముందుగా ముంబై తరఫున ఆడటం మొదలు పెట్టినప్పుడు, ఆ తర్వాత భారత్‌కు ఆడినప్పుడు కూడా సన్నద్ధతకే ఎక్కువ సమయం ఇచ్చేవాడిని. ఒక్కసారి ఆట మొదలైందంటే మనం సొంతంగా చేసేవాటికంటే జరుగుతున్న పరిణామాలకు అప్పటికప్పుడు స్పందించడమే కీలకంగా మారుతుంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఏం చేసినా తీవ్ర ఒత్తిడి మధ్య సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి మ్యాచ్‌కు ముందు సన్నాహకమే అన్నింటికంటే కీలకంగా మారుతుంది' అని రోహిత్ వివరించాడు.

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు నందిని దూరం

న్యూఢిల్లీ: తెలంగాణ మహిళా అథ్లెట్, ఆసియా చాంపియన్ అగసార నందిని వచ్చే నెలలో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు దూరమైంది. టోక్యోలో జరిగే ఈ మెగా ఈవెంట్‌కు ఇప్పటికే అర్హత సంపాదించినప్పటికీ గాయం కారణంగానే పాల్గొనడం లేదని ఆమె ప్రకటించింది. మేలో దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో ఏడు క్రీడాంశాల సమాహారమైన హెప్టాథ్లాన్‌లో ఆమె బంగారు పతకం సాధించింది. అలా విజేతగా నిలువడంతోనే ఆమెకు ప్రపంచ చాంపియన్‌షిప్ బెర్త్ లభించింది. ఆ పోటీల సందర్భంగానే తనకు గాయమైందని చెప్పింది. ప్రస్తుతం గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదని పేర్కొంది. తనకు వచ్చే ఏడాది చాలా కీలకమని, కామన్వెల్త్, ఆసియా క్రీడలు జరుగనున్నాయని దీంతో ఫిట్‌నెస్‌పై దృష్టిపెట్టినట్లు చెప్పింది. అంతర్జాతీయ క్రీడల్లో పతకం తెచ్చిన ఆమెను తెలంగాణ ప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీకి స్పోర్ట్స్ అడ్వైజర్‌గా నియమించింది.





అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రం నాపా కౌంటీలోని పికెట్ ప్రాంతంలో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్న ఫైర్ ఫైటర్



రోమ్‌లో బుల్లెట్ ప్రూఫ్ ధరించి, చేతిలో చిన్నారి మృతదేహంతో ఉన్న ‘ది ఏంజెల్’ చిత్రం వద్ద ఓ యువతి. హ్యారీ గ్రెబ్ అనే కళాకారుడు దీనిని గాజాలో ప్రాణాలు కోల్పోతున్న జర్నలిస్టులకు అంకితమిచ్చారు.



వీరు నీళ్లలో ఆడుతున్న ఈ ఆట రివర్ విండ్‌రష్ ఫుట్‌బాల్. ఇంగ్లండ్‌లోని కోట్స్‌వోల్డ్స్ గ్రామంలో వందేళ్లుగా ఈ ఆటల పోటీలు జరుగుతున్నాయి.

భారతీయులను రిక్రూట్ చేసుకోవడానికి రష్యా కంపెనీల ఆసక్తి

మాస్కో: రష్యాలోని కంపెనీలు, ముఖ్యంగా యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు చెందిన కంపెనీలు భారతీయులను రిక్రూట్ చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని రష్యాలోని భారత రాయబారి వినయ్ కుమార్ అన్నారు. వచ్చిన వారిలో ఎక్కువ మంది నిర్మాణ, వస్త్ర రంగాల్లో పనిచేస్తున్నారని, కానీ యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో భారతీయులకు డిమాండ్ బాగా ఉందని వెల్లడించారు. ఆ దేశీయ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. రష్యాలోని అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఎక్కువ మంది భారతీయులు వస్తుండటంతో కాన్సులర్ సేవల పనిభారం పెరుగుతోందన్నారు. అమెరికా, కెనడా, యూకే సహా పాశ్చాత్య దేశాల్లో వలసలపై పెరుగుతున్న అణిచివేత మధ్య ఈ వ్యాఖ్యలు వచ్చాయి. రష్యాలో పెరుగుతున్న భారతీయ కార్మికుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని కాన్సులర్ సైతం తమ సేవలను విస్తరింపజేస్తోందన్నారు.

రష్యాలో పెరుగుతున్న భారతీయుల సంఖ్య

రష్యాలో భారతీయుల సంఖ్య పెరుగుతోంది. విద్యార్థులు, వివిధ రంగాల్లోని నిపుణులు, కార్మికులు గణనీయమైన కార్మిక లోటును పూడ్చుతున్నారు. భారత రాయబార కార్యాలయం ఇచ్చిన డేటా ప్రకారం ప్రస్తుతం రష్యాలోని భారతీయుల సంఖ్య 14,000 గా ఉంది. అదనంగా, భారత సంతతికి చెందిన దాదాపు 1,500 మంది ఆఫ్ఘన్ జాతీయులు ఉన్నారు. ఇక ఇటీవలి కాలంలో రష్యాలోని వైద్య, సాంకేతిక సంస్థల్లో సుమారు 4,500 మంది భారతీయ విద్యార్థులు చేరారని తెలుస్తోంది. వారిలో 90 శాతం మంది దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 20 విశ్వవిద్యాలయాలు/సంస్థలలో వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. మిగిలిన వారు ఇంజనీరింగ్, ఏరోనాటికల్ డిజైనింగ్, కంప్యూటర్ సైన్స్, రవాణా సాంకేతికత, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, బిజినెస్/ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ వంటివి చదువుతున్నారు.

బీజేపీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: బీజేపీ ప్రజాస్వామ్యాన్నే కాదు.. మొత్తం వ్యవస్థనే అపహాస్యం చేసిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) పరీక్షల్లో అవకతవకలపై నిరసన తెలుపుతున్న అభ్యర్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. న్యాయం కోసం నెలలుగా పోరాడుతున్న విద్యార్థులపై పోలీసులు శనివారం రాత్రి దాడి చేయగా.. చాలా మంది గాయపడ్డారు. కవర్ చేయడానికి వచ్చిన మీడియానూ అడ్డుకున్నారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీనిపై కేజ్రీవాల్ స్పందించారు. ‘అభ్యర్థుల చెప్పేది వినడానికి బదులుగా, రాత్రి చీకటిలో వారిని లాఠీలతో కొట్టారు. ఊహించుకోండి... నిన్న పుస్తకాలు పట్టుకున్న చేతులకు ఇప్పుడు గాయాల గుర్తులు మిగిలాయి’అని ఆయన ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. ‘బీజేపీ నియంతృత్వం చూడండి.... దేశంలో దుండగులు బహిరంగంగా రాజ్యమేలుతున్నారు. బీజేపీని ప్రశ్నించే వారిపై లాఠీ ఛార్జీలు ఝుళిపించి నోరు మూయిస్తున్నారు. ఎవరినైనా అరెస్టు చేసి జైలులో పెట్టవచ్చు, ఏ చట్టాన్నైనా వారు కోరుకున్నప్పుడల్లా మార్చవచ్చు. ఎవరైనా బీజేపీకి ఓటు వేయకపోతే, వారి ఓటు తీసేస్తారు’అని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ.. మంత్రిత్వ శాఖలు, విభాగాలు మరియు ఇతర ప్రభుత్వ సంస్థలలోని వివిధ పోస్టులకు నియామక పరీక్షలను నిర్వహించే ఒక చట్టబద్ధమైన సంస్థ. జూలై 24 నుంచి ఆగస్టు 1 మధ్య 142 నగరాల్లోని 194 కేంద్రాల్లో 13 ఫేజుల్లో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు దాదాపు 5 లక్షల మంది హాజరయ్యారు. అయితే.. ఆకస్మిక రద్దులు, సాఫ్ట్‌వేర్ క్రాష్‌లు, బయోమెట్రిక్ ధ్రువీకరణలో వైఫల్యాలు, తప్పుడు సెంటర్ కేటాయింపుల వంటి సమస్యలతో అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యలపై ఢిల్లీ అంతటా నిరసనలు వెల్లువెత్తాయి. వేలాది మంది ఆశావహులు వీధుల్లోకి వచ్చారు. సోషల్ మీడియాలోనూ నిరసన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరీక్ష ఫలితాలను రద్దు చేయాలని, తిరిగి పరీక్ష నిర్వహించాలని, అక్రమాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మొదటి అంతరిక్ష యాత్రికుడు హనుమాన్!

పాఠశాల పిల్లలకు బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ కొత్త పాఠాలు

విద్యా వ్యవస్థలో శాస్త్రీయతపై విద్యావేత్తల ఆందోళన

ఉనా (హిమాచల్): మొదటి అంతరిక్ష యాత్రికుడు ఎవరు? యూరీ గగారిన్.. ఇది చరిత్ర చెబుతున్న సత్యం. కానీ.. హిమాచల్ ప్రదేశ్‌లో పిల్లలు చెప్పిన సమాధానం.. అందుకు మన కేంద్ర మాజీ మంత్రి ఇచ్చిన వివరణ.. మన దేశ విద్యా వ్యవస్థ దుస్థితి ఏంటో తెలియజెప్తోంది. ఇటీవల బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్.. హిమాచల్ ప్రదేశ్‌లోని ఓ పాఠశాలకు వెళ్లారు. అక్కడ ఆయన విద్యార్థులను ‘అంతరిక్షంలోకి ప్రయాణించిన మొదటి వ్యక్తి ఎవరు?’ప్రశ్నించారు. దానికి పిల్లలంతా ముక్త కంఠంతో ‘నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్’అని చెప్పారు. అందుకు ఎంపీ.. ‘కాదు.. నేను హనుమాన్ అనుకుంటున్నాను. వేల సంవత్సరాల నాటి మన సంప్రదాయం, జ్ఞానం, సంస్కృతి ముఖ్యమైనవని ఇది చూపిస్తుంది. మనం మన స్వంతం గురించి నేర్చుకోకపోతే, బ్రిటిష్ వారు మనకు నేర్పించిన దానికే మనం పరిమితం అవుతాం’అని బదులిచ్చారు. దీనికి సంబంధించిన వీడియో ఒకటి ఎక్స్‌లో వైరల్ అవుతోంది. ఆ రెండు సమాధానాలు తప్పు. ‘నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ కాదు.. యూరీ గగారిన్’అని చెప్పాల్సిన ఒక పార్లమెంటేరియన్.. జాతీయ అంతరిక్ష దినోత్సవం నాడు పిల్లల తప్పును సరిదిద్దకపోగా.. పురాణాలను చరిత్రగా చెప్పడం వివాదాస్పదమైంది.

చరిత్ర తప్పుదోవ..

అంతరిక్షంలోకి ప్రయాణించిన మొదటి మానవుడు సోవియట్ వ్యోమగామి యూరి గగారిన్. అతను 1961లో ఆయన భూమిని చుట్టి వచ్చారు. ఆ తరువాత 1969లో అమెరికాకు చెందిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై నడిచిన మొదటి మానవుడిగా చరిత్ర సృష్టించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ (హెచ్) శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించాలని చెబుతోంది. ఇప్పుడు ఆ చర్చ పక్కకు పోవడంపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ‘పిల్లల మనసులను వలస ఆలోచనల నుంచి విముక్తి చేసి.. స్వతంత్ర ఆలోచనలను ప్రోత్సహించాలన్న ప్రధాని పిలుపు మేరకే ఠాకూర్ అలా మాట్లాడి ఉండవచ్చు. కానీ.. సొంత సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకోవడమంటే... సైన్స్, చరిత్ర పేరుతో పురాణాలను వల్లించడం కాదనే విషయాన్ని మరిచారు. మన చరిత్ర, సంస్కృతిని విద్యార్థులకు చెప్పాలనుకున్నప్పటికీ.. వాస్తవాలు, కల్పనల మధ్య తేడాను గుర్తించడం వారికి నేర్పించాలి. పురాణాలను పురాణాలుగానే చెప్తే తప్పు లేదు. కానీ.. పురాణాలను చరిత్రగా చెప్పడం కొత్త తరాన్ని తప్పుదోవ పట్టించడమే’అంటున్నారు.



శాస్త్రీయ రుజువులు లేని పురాణాలు..

చరిత్ర వేరు.. పురాణాలు వేరు. రామాయణం, మహాభారతం వంటివి పురాణ కథలు. ఇవి నమ్మకం మీద నడిచేవి. కవి హోమర్ వర్ణనలను పోలిన నగరం 19వ శతాబ్దపు త్రవ్వకాల్లో బయటపడే వరకు ట్రాయ్ కూడా కల్పితంగానే పరిగణించారు. మన దేశంలో చాలా కథలకు భౌతిక ఆధారాలు లేవు. గుజరాత్ తీరంలో మునిగిపోయిన పురాతన నిర్మాణాలను పురావస్తు శాస్త్రవేత్తలు, శాస్త్రవేత్తలు మహాభారతంలోని ద్వారక నగరానికి లింక్ చేశారు. దానిపై ఇంకా చర్చ కొనసాగుతోంది. శాస్త్రీయ రుజువు లేకుండా, ఈ కథలు శక్తివంతమైన సాంస్కృతిక కథనాలుగా మిగిలిపోతాయే తప్ప, చరిత్రగా కాదు. గట్టి రుజువుతో నిరూపించబడే వరకు, యూరి గగారిన్ అంతరిక్షంలో మొదటి వ్యక్తిగా స్థిరపడతాడు. పిల్లలకు ఈ తేడాను నేర్పించాలి మరియు పార్లమెంటు సభ్యులు విద్య నాణ్యతను మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలి.

‘ఆర్‌జీ కర్’ విధ్వంసం సీపీఎం నేతల పనే

- సీపీఎం కీలక నేతలు సహా 54 మందిపై ఛార్జిషీట్
- సియల్దా కోర్టులో దాఖలు చేసిన కోల్‌కతా పోలీసులు
- కోర్టులో లొంగిపోయి బెయిల్ పొందిన నిందితులు

కోల్‌కతా: 2024 ఆగస్టు 14వ తేదీ రాత్రి కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో జరిగిన విధ్వంసానికి వామపక్ష నేతలే కారణమని కోల్‌కతా పోలీసులు ఆరోపిస్తున్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు మీనాక్షీ ముఖర్జీ సహా 54 మంది పేర్లతో కూడిన నివేదికను సియల్దా కోర్టుకు సమర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ నేతలు దేబాంజన్ దేవ్, కలతన్ దాస్‌గుప్తా, సీపీఎంఎల్ మాజీ నేత దిధితి రాయ్, సీపీఎం నేత దీపూ దాస్ పేర్లు కూడా చార్జిషీటులో ఉన్నాయి. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో పనిచేసే ట్రెయినీ వైద్యురాలు ఆగస్టు 9వ తేదీన దారుణ హత్యాచారానికి గురయ్యారు. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఈ ఘటనపై నిరసనలు పెల్లుబికాయి. ఈ నేపథ్యంలో ఆస్పత్రిపై దాడి జరిగింది. ఆస్పత్రి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న ఎమర్జెన్సీ వార్డులో విధ్వంసం సృష్టించారు. అడ్డుకోబోయిన పలువురు వైద్యాధికారులతోపాటు పోలీసులు సైతం గాయపడ్డారు. దీనికి సంబంధించి కోల్‌కతా పోలీసులు ఐదు కేసులు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు సీసీటీవీ ఫుటేజీని, కాల్ డేటా రికార్డులను పరిశీలించడంతోపాటు ప్రత్యక్ష సాక్ష్యులు, బాధితులను వందలాది మందిని ప్రశ్నించారు. మీనాక్షీ ముఖర్జీని కూడా ప్రశ్నించారు. వీరంతా కోల్‌కతాలోని ఓ సీపీఎం నేత ఇంట్లో సమావేశమై ధ్వంస రచన చేసినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. చార్జిషీటును పరిశీలించిన సియల్దా కోర్టు మేజిస్ట్రేట్ సోమవారం మీనాక్షీ ముఖర్జీ సహా పలువురికి సమన్లు జారీ చేశారు. వీరంతా కోర్టు ఎదుట లొంగిపోయారు. కోర్టు వీరికి ఈ కేసులో బెయిల్ మంజూరు చేసింది.

కాల్పుల్లో స్టాండప్ కమెడియన్ మృతి

మిస్సిస్సిప్పి: అమెరికాలోని బాల్టిమోర్‌కు చెందిన స్టాండప్ కమెడియన్ రెజినాల్డ్ ‘రెగ్గీ’కరోల్(54) మిస్సిస్సిప్పిలో జరిగిన కాల్పుల ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. బర్టన్ లేన్ ప్రాంతంలో బుల్లెట్ గాయాలైన రెగ్గీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారని పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించి ఒకరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. కాల్పుల ఘటన బుధవారం జరిగినట్లుగా భావిస్తున్నారు. మోనిక్ వంటి వారితో కలిసి దేశవ్యాప్తంగా ఉన్న కామెడీ క్లబ్బుల్లో ప్రదర్శనలు ఇచ్చిన రెగ్గీ అందరికీ సుపరిచితుడు.

అమెరికా రాయబారి చార్లెస్ కుష్నర్‌కు ఫ్రాన్స్ సమన్లు

ఫ్రాన్స్: అమెరికా రాయబారి చార్లెస్ కుష్నర్‌కు ఫ్రాన్స్ సమన్లు జారీ చేసింది. యూదు వ్యతిరేకత పెరుగుదలను అరికట్టడంలో విఫలమయ్యారనే ఆరోపణలను విదేశాంగ శాఖ తోసి పుచ్చింది. కుష్నర్ వ్యాఖ్యలు ఆమోదయోగం కాదని పేర్కొంది. రాయబారులు తమ దేశం అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడానికి అనుమతించబోమని మంత్రిత్వ శాఖ నొక్కి చెప్పింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అల్లుడు జారెడ్ కుష్నర్ తండ్రి చార్లెస్ కుష్నర్‌ను ఫ్రాన్స్ రాయబారిగా నియమించిన విషయం తెలిసిందే. అయితే.. తాజాగా ఆయన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్‌కు బహిరంగ లేఖ రాశారు. గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఫ్రాన్స్‌లో యూదుల పట్ల ద్వేషం పెల్లుబుకిందని కుష్నర్ ఆరోపించారు. ఇజ్రాయెల్‌పై తన విమర్శలను తగ్గించుకోవాలని మాక్రాన్‌కు పిలుపునిచ్చారు. అంతే కాదు.. ఫ్రాన్స్ వీధుల్లో యూదులపై దాడి జరగకుండా, యూదుల ప్రార్థనా మందిరాలు, పాఠశాలలు, యూదుల వ్యాపారాలు ధ్వంసం చేయకుండా ఒక్క రోజు కూడా లేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రణాళికను రూపొందించాలని, అందుకు మాక్రాన్, ఇతర ఫ్రెంచ్ నాయకులతో కలిసి పనిచేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. కుష్నర్ లేఖ... పాలస్తీనాకు గుర్తింపునివ్వడం యూదు వ్యతిరేకతకు దోహదపడుతోందంటూ మాక్రాన్‌పై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చేసిన వ్యాఖ్యలనే పునరుద్ఘాటించింది. కాగా, సెప్టెంబర్‌లో పాలస్తీనాను అధికారికంగా గుర్తించాలన్న యోచనలో ఫ్రాన్స్ ఉంది.

పాత ‘డ్రంక్ అండ్ డ్రైవ్’ కేసులతో ట్రంప్ పంపేస్తారా?

- గతంలో తప్పుచేశారని గ్రీన్‌కార్డ్, వీసాదారులను సైతం బహిష్కరించేందుకు ట్రంప్ యత్నం
- ఇప్పటికే దిగువసభలో ఆమోదం పొందిన సంబంధిత బిల్లు
- ఎగువసభలోనూ ఆమోదం పొందితే చట్టంగా మారే ప్రమాదం
- భారతీయులకు ఎదురవుతున్న కొత్త సమస్య

వాషింగ్టన్: అమెరికాలోని ప్రతి ఒక్క ఉద్యోగం అమెరికన్లకే దక్కాలనే దురాశతో దొరికిన ప్రతి ఒక్క అవకాశాన్ని, లొసుగును వాడుకునేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈసారి గ్రీన్‌కార్డ్, వీసాదారులను దేశం నుంచి బహిష్కరించేందుకు కొత్త ఎత్తుగడతో ముందుకొచ్చారు. మద్యం తాగి వాహనం నడపడంతో నమోదైన పాత కేసులను సైతం తిరిగి తోడి ఆయా వ్యక్తులపై మళ్లీ నేరాభియోగాలు మోపి దేశం నుంచి బహిష్కరించాలని ట్రంప్ సర్కార్ కంకణం కట్టుకుంది. ఇందులోభాగంగా ఇప్పటికే ‘ప్రొటెక్షన్ అవర్ కమ్యూనిటీస్ ఫ్రమ్ డ్రంక్ అండర్ ఇన్‌ఫ్లూయన్స్’చట్టాన్ని అక్కడి కాంగ్రెస్ ప్రతినిధుల(దిగువ)సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బిల్లుకు జూలై చివరివారంలో ఆమోద ముద్రపడింది. వెంటనే దీనిని ఎగువ సభ అయిన సెనేట్‌లో ప్రవేశపెట్టారు. జూన్‌లో ఈ బిల్లును సెనేట్ జుడీషియరీ, రూల్స్ కమిటీ పరిశీలనకు పంపించారు. అక్కడ బిల్లుకు ఆమోదముద్రపడితే సెనేట్‌లో తర్వాత ఆమోదం పొందే అవకాశాలు మెరుగవుతాయి. ఈ లెక్కన బిల్లు చివరకు చట్టంగా మారితే ఇప్పటికే పాత ‘డ్రంక్ అండ్ డ్రైవ్’కేసులున్న గ్రీన్‌కార్డ్ పొందిన భారతీయులకూ కష్టాలు మొదలుకానున్నాయి. ఇక విద్యార్థి, హెచ్–1బీ వంటి వీసాలు పొందిన భారతీయులకూ బహిష్కరణ వేటు పడే అవకాశముంది. ఇమిగ్రేషన్ అండ్ నేషనల్ చట్టానికి సవరణలు తెస్తూ ఈ హెచ్.ఆర్.875 బిల్లును తీసుకొచ్చారు. అమెరికా పౌరసత్వంలేని విదేశీయులు అమెరికాలో మద్యం తాగి, లేదంటే మద్యం మత్తులో వాహనం నడిపి రోడ్డు ప్రమాదం చేసినా, అమెరికన్ల ప్రాణాలు హరించినా అలాంటి వ్యక్తులను దేశబహిష్కరణ చేయాలనే ప్రధానోద్దేశ్యంతో ఈ బిల్లును తీసుకొచ్చారు. ఈ బిల్లుపై గ్రీన్‌కార్డ్, వీసాదారుల నుంచి సర్వత్రా విమర్శలు, అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి.

అత్యంత నిర్దయగా నిబంధనలు

కొత్త బిల్లులో పేర్కొన్న నిబంధనలు, షరతులు చూస్తుంటే ఎలాగైనా సరే పాత, చిన్నపాటి నేరాలకు పాల్పడిన విదేశీయులను ఖచ్చితంగా దేశబహిష్కరణచేయాలనే ఉద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తుంది. ‘‘ఒక పదేళ్ల క్రితంనాటి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు అయినాసరే, అది ఇప్పటికే మూసేసిన కేసు అయినాసరే దానిని మళ్లీ తెరచి నేరం మోపుతారు. ఆ కేసులో నిందితుడు క్షమాపణ చెప్పడం, సంబంధిత ట్రయల్ కోర్టు అందుకు సమ్మతి తెలపడం వంటి సందర్భాల్లోనూ పాత కేసులను తిరగతోడి దేశ బహిష్కరణచేస్తారు’’అని వలసదారుల కేసులను వాదించే లాయర్ జోసెఫ్ ట్సాంగ్ ఆందోళన వ్యక్తంచేశారు. ‘‘ఇది అత్యంత దారుణమైన బిల్లు. ఉదాహరణకు గ్రీన్‌కార్డ్‌దారుడు లేదంటే స్టూడెంట్ వీసా, హెచ్–1బీ వంటి అంతర్జాతీయ వీసా పొందిన వ్యక్తి పదేళ్ల క్రితం మద్యం మత్తులో చిన్నపాటి యాక్సిడెంట్ చేసి తర్వాత కేసు నుంచి బయటపడ్డాను అనుకుందాం. ఈరోజు ఆ వ్యక్తి స్వదేశానికి లేదంటే వేరే పని నిమిత్తం న్యూజిలాండ్ వంటి దేశానికి వెళ్లాడనుకుందాం. ఈలోపు హెచ్.ఆర్.875 బిల్లు చట్టంగామారితే ఇకపై ఆ వ్యక్తిని అమెరికాలోకి అనుమతించబోరు. కనీసం ఆ పాత కేసుపై వాదించుకునే అవకాశం అతనికి ఇవ్వబోరు. నిన్ను అమెరికాలోకి అనుమతించబోమనే ముందస్తు హెచ్చరిక కూడా ప్రభుత్వం పంపబోదు. అసలు అమెరికాలోకి వచ్చే అధికారిక మార్గాలన్నీ మూసుకుపోతాయి. ఇంతటి నిర్దయ నిబంధనలు ఈ బిల్లులో ఉన్నాయి’’అని జోసెఫ్ చెప్పారు. ‘‘ఎలాంటి అధికారిక పత్రాలు లేని వలసదారులు, వీసా, శాశ్వత స్థిరనివాస హోదా సవరణ కోసం దరఖాస్తు చేసుకుని వేచిచూస్తున్న వ్యక్తులకు సైతం ఈ బిల్లు వర్తిస్తుంది’’అని వలసదారుల న్యాయసేవల సంస్థ ‘ల్యాండర్‌హోమ్ ఇమిగ్రేషన్’పేర్కొంది. ఈ బిల్లు చట్టంగా మారేలోపే పాత కేసులున్న వ్యక్తులు తక్షణం కోర్టులను ఆశ్రయించి తమ వాదనలను వినిపించడం ఉత్తమమని ఈ సంస్థ అభిప్రాయపడింది.

పాకిస్తాన్‌కు భారత్ వరద హెచ్చరిక

మానవీయ దృక్పథంతోనేనన్న కేంద్రం

న్యూఢిల్లీ/పాకిస్తాన్: జమ్మూకశ్మీర్‌లోని తావి నది ఉప్పొంగుతుండటంతో దిగువనున్న పాకిస్తాన్‌కు వరద హెచ్చరికల సమాచారం అందజేసినట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం వెల్లడించింది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం సింధూ నదీ జలాల ఒప్పందం నుంచి వైదొలగడం సహా పలు తీవ్ర చర్యలను భారత్ చేపట్టడం తెల్సిందే. అయితే, కేవలం మానవతా దృక్పథంతోనే పాకిస్తాన్‌కు తాజాగా వరద హెచ్చరికను పంపినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ సమాచారాన్ని ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం ఆదివారం పాక్ ప్రభుత్వానికి తెలిపిందని జల్ శక్తి మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. భారత్ ఇచ్చిన వివరాల ఆధారంగానే ప్రభుత్వం వరద హెచ్చరికలు జారీ చేస్తూ, ముందస్తు చర్యలను ప్రకటించిందని పాక్ మీడియా తెలిపింది. మేలో రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తాక జరిగిన మొట్టమొదటిసారి ముఖ్య సంప్రదింపుల ఘటన ఇదేనని పేర్కొంది. హిమాలయాల్లో పుట్టిన తావి నది జమ్మూ మీదుగా ప్రయాణిస్తూ పాకిస్తాన్‌లో చినాబ్‌లో కలుస్తుంది. ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో 1960లో కుదిరిన ఒప్పందం మేరకు భారత్–పాక్‌కు సింధూ, ఉపనదుల నీటిని పంచుకుంటున్నాయి. వరద హెచ్చరికల సమాచారాన్ని మొన్నటి వరకు భారత్ సింధూ జలాల కమిషనర్ ద్వారా పాకిస్తాన్‌కు పంపేది. కాగా, పాకిస్తాన్‌లోని పలుప్రాంతాల్లో ఇప్పటికే ఎడతెరిపి లేని వానలు కురుస్తున్నాయి. ఈ నెలాఖరు వరకు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ విభాగం తెలిపింది.

గత ఎన్నికల్లో అత్యధిక ఓట్లెలా పడ్డాయి?

కాంగ్రెస్ ఓట్ చోరీ ఆరోపణలకు బీజేపీ కౌంటర్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పదేపదే చేస్తున్న ఓట్ చోరీ ఆరోపణలపై బీజేపీ 2024 ఎన్నికల గణాంకాలతో దీటుగా బదులిచ్చింది. గత 35 ఏళ్లలోనే అత్యధికంగా 2024 ఎన్నికల్లో కాంగ్రెస్, మిత్రపక్షాలకు ఓట్లు పడ్డాయంది. బీజేపీ ఐటీ విభాగం చీఫ్ అమిత్ మాలవీయ సోమవారం ఈ మేరకు ‘ఎక్స్’లో పలు పోస్టులు చేశారు. ‘ఓట్ చోరీ అంటూ కాంగ్రెస్ కన్నీరు కారుస్తోంది. వాస్తవమేమిటంటే కాంగ్రెస్ మిత్రపక్షాలకు 35 ఏళ్లలోనే రానన్ని ఓట్లు 2024 ఎన్నికల్లో అత్యధికంగా పడ్డాయి. ఈ విషయం రాహుల్ గాంధీకి ఎవరూ చెప్పినట్టు లేదు’అంటూ వ్యాఖ్యానించారు. బీజేపీ జాతీయ ప్రతినిధి సీఆర్ కేశవన్ సైతం ఓట్ చోరీపై స్పందించారు. ‘ఓట్లు దొంగతనానికి గురయ్యాయంటూ రాజ్యాంగ సంస్థల్ని రాహుల్ గాంధీ దుష్ప్రచారం సాగిస్తున్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం పెరిగింగా? లేదా? కారణాలు వివరించగలరా?’అని పేర్కొన్నారు. ఓట్ల చోరీయే జరిగినట్లయితే 1989 నుంచి కాంగ్రెస్ ఓట్ల శాతం 39 నుంచి 41 వరకు ఎలా పెరుగుతుందని బీజేపీ నేత ప్రదీప్ భండారి పేర్కొన్నారు.

కేరళ ఎమ్మెల్యేపై కాంగ్రెస్ బహిష్కరణ వేటు

కన్నూర్: పలు లైంగిక వేధింపుల ఆరోపణలను ఎదుర్కొంటున్న పార్టీకి చెందిన కేరళ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కూటథిల్‌ను కాంగ్రెస్ పార్టీ బహిష్కరించింది. ప్రాథమిక సభ్యత్వం నుంచి ఆయన్ను తొలగిస్తున్న కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ సోమవారం తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇది రాష్ట్ర నాయకత్వం ఏకగ్రీవంగా తీసుకున్న నిర్ణయమన్నారు. ఆయన ఎమ్మెల్యేగా కొనసాగుతారని స్పష్టం చేశారు. రాహుల్‌పై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవని చెప్పారు. బాధితులెవరూ తమకు గానీ, పోలీసులకు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. కేసు సైతం నమోదు కాకున్నా ఇప్పటికే యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగి ఆదర్శంగా నిలిచారన్నారు. కాంగ్రెస్ పార్టీ మహిళల గౌరవానికి, భద్రతకు ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే రాహుల్‌పై వచ్చిన ఆరోపణలకు సంబంధించి మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండానే సమావేశాన్ని ముగించారు. ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన యువనేత తనతో అనుచితంగా ప్రవర్తించారంటూ మలయాళం నటి రినీ ఆన్ జార్జితోపాటు పలువురు మహిళలు, ట్రాన్స్‌జెండర్ ఒకరు చేసిన ఆరోపణలు రాష్ట్రంలో సంచలనం రేపాయి. పలక్కడ్ అసెంబ్లీ స్థానానికి గతేడాది డిసెంబర్‌లో జరిగిన ఉప ఎన్నికలో రాహుల్ మమ్‌కూటథిల్ గెలుపొందారు.

ముంబై బీజేపీ చీఫ్‌గా అమీత్ సత్నాం

ముంబై: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ముంబై యూనిట్ కొత్త అధ్యక్షుడిగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అమీత్ సత్నాం నియమితులయ్యారు. ఈ మేరకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సోమవారం వెల్లడించారు. ఈ ఏడాది చివర్లో బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ చీఫ్‌ను మార్చారు. సత్నాం నాయకత్వంలో బీఎంసీలో బీజేపీ తిరిగి అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ఫడ్నవీస్ ఆశాభావం వ్యక్తం చేశారు. 49 ఏళ్ల సత్నాం ముంబైలోని అంధేరి వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మూడు పర్యాయాలు వరుసగా గెలుపొందారు.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం

ట్రాక్టర్ ట్రాలీ, ట్రక్కు ఢీకొని 10 మంది మృతి..41 మందికి గాయాలు

బులంద్‌షహర్: ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో జరిగిన రోడ్డు రోడ్డు ప్రమాదంలో 10 మంది చనిపోగా 41 మంది గాయపడ్డారు. కాస్‌గంజ్ జిల్లా రఫత్‌పూర్‌కు చెందిన 61 మంది ట్రాక్టర్ ట్రాలీలో రాజస్తాన్‌లో జహర్‌పీర్ పుణ్యక్షేత్రానికి బయలుదేరారు. బులంద్ షహర్– అలీగఢ్ మార్గంలో అర్నియా బైపాస్ వద్ద ఆదివారం అర్ధరాత్రి ట్రాలీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ట్రక్కు ఢీకొంది. దీంతో, ట్రాలీ రోడ్డుపై పలుమార్లు పల్టీలు కొట్టింది. ఘటనలో అక్కడికక్కడే 8 మంది, ఆస్పత్రుల్లో మరో ఇద్దరు చనిపోయారు. తీవ్రంగా గాయపడిన 41 మంది బాధితులను వేర్వేరు ఆస్పత్రులకు తరలించారు. ట్రాలీలోని 10 మందికి మాత్రం స్వల్పగాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఎక్కువ మందిని తరలించేందుకు వీలుగా ట్రాక్టర్ ట్రాలీలో రెండు డెక్కులు ఏర్పాటు చేశారని వివరించారు. ట్రాక్టర్లలో జనం తరలింపుపై రాష్ట్రంలో నిషేధం ఉంది.



లక్నోలో జరిగిన విక్టరీ పరేడ్‌లో శుభాంశు శుక్లా, కామ్నా దంపతులు

శుభాంశుకు లక్నోలో అపూర్వ స్వాగతం

లక్నో: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో అడుగిడిన మొదటి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాకు సోమవారం లక్నోలో అపూర్వ స్వాగతం లభించింది. యాగ్జియం–4 మిషన్‌ను దిగ్విజయం ముగించుకుని ఇటీవల ఢిల్లీకి చేరుకున్న ఆయన..మొదటిసారిగా సొంతూరుకు చేరుకున్నారు. ఎయిర్‌పోర్టులో తల్లిదండ్రులు శంభు, ఆశా శుక్లా, భార్య కామ్నా, కుమారుడు కియాష్‌తోపాటు పెద్ద సంఖ్యలో అభిమానులు త్రివర్ణ పతకాలు చేబూని, వందే మాతరం అంటూ నినాదాలు చేస్తూ స్వాగతం పలికారు. సిటీ మాంటిస్సోరి స్కూలుకు చెందిన విద్యార్థులు డ్రమ్ములు వాయిస్తూ బాకాలు ఊదుతూ సందడి చేశారు. సొంతూరు రావడం ఎంతో ఉత్కంఠగా ఉందని శుభాంశు పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటలకు లక్నోలో కాలు పెట్టిన దగ్గర్నుంచి అభిమానులతో కనీసం 2 వేల సెల్ఫీలు తీసి ఉంటానని అన్నారు. ఓపెన్ టాప్ వాహనంలో పూల వాన కురిపిస్తుండగా త్రివేణీ నగర్‌లోని సొంతింటి వైపు ఆయన విక్టరీ పరేడ్ సాగింది. స్పేస్ టెక్నాలజీ చదివే విద్యార్థులకు శుభాంశు శుక్లా పేరుతో స్కాలర్‌షిప్పులను అందజేస్తామని ఈ సందర్భంగా సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. నాసా బదులుగా ఇస్రో గురించి అందరూ మాట్లాడుకునే రోజు ఎంతో దూరంలో లేదని డిప్యూటీ సీఎం మౌర్య వ్యాఖ్యానించారు. ఇస్రో చైర్మన్ నారాయణన్ సమక్షంలో శుభాంశు శుక్లాకు సీఎం యోగి సన్మానం చేశారు. లక్నోలోని ఓ పార్కుకు శుక్లా పేరు పెడతామని మేయర్ తెలిపారు. నగరమంతటా పెద్ద సంఖ్యలో ఏర్పాటైన భారీ డిజిటల్, ఎల్ఈడీ స్క్రీన్లపై శుభాంశు శుక్లా ఘనతను ప్రదర్శించారు. శుక్లాను భారత రత్నతో గౌరవించాలని రాష్ట్రీయ కిసాన్ మంచ్ డిమాండ్ చేసింది.

దేశంలో ఏర్పాటు చేసిన మొదటి మున్సిపాలిటీ ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

74వ రాజ్యాంగ సవరణ చట్టం

74వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని 'నగరపాలక చట్టం' అని కూడా అంటారు. దీని ద్వారా పట్టణ ప్రభుత్వాలకు రాజ్యాంగ ప్రతిపత్తిని కల్పించారు. నగర పాలక బిల్లును పార్లమెంటులో 1991లో ప్రవేశపెట్టారు. దీన్ని 1992లో ఆమోదించారు. 1993 జూన్ 1 నుంచి దీన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ప్రకరణలు 243(P) నుంచి 243(ZG) వరకు ఈ చట్టం గురించి తెలియజేస్తాయి. వీటిని ప్రత్యేకంగా IX(A) భాగంలో చేర్చారు.

ప్రకరణ 243(P)–మున్సిపాలిటీల నిర్వచనం

మున్సిపల్ కార్పొరేషన్: ఒక నగరాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

మున్సిపాలిటీ: ఒక పట్టణాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

నగర పంచాయతీ: గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా మారుతున్న పట్టణాన్ని పరిపాలించడానికి ఏర్పాటు చేసిన సంస్థ.

మెట్రోపాలిటన్ నగరం: జనాభా 10 లక్షలు దాటిన నగరం. దేశంలో వీటి సంఖ్య 53.

ప్రకరణ 243(Q)–మున్సిపాలిటీల ఏర్పాటు:

మున్సిపల్ కార్పొరేషన్: జనాభా 3 లక్షలు దాటిన నగరాన్ని కార్పొరేషన్‌గా గుర్తించవచ్చు. **తెలంగాణలో వీటి సంఖ్య 6. అవి:**

1. హైదరాబాద్ 2. వరంగల్
3. కరీంనగర్ 4. నిజామాబాద్
5. రామగుండం 6. ఖమ్మం

ఆంధ్రప్రదేశ్‌లో 13 ఉన్నాయి. అవి:

1. కర్నూల్ 2. కడప
3. అనంతపురం 4. చిత్తూర్
5. తిరుపతి 6. నెల్లూరు
7. ఒంగోలు 8. గుంటూరు
9. విజయవాడ 10. ఏలూరు
11. కాకినాడ 12. రాజమండ్రి
13. విశాఖపట్నం

మున్సిపాలిటీ: జనాభా 40 వేలు దాటిన పట్టణాన్ని మున్సిపాలిటీగా గుర్తిస్తారు. తెలంగాణలో 37, ఆంధ్రప్రదేశ్‌లో 67 మున్సిపాలిటీలు ఉన్నాయి. వార్షిక ఆదాయం ఆధారంగా వీటిని అయిదు రకాలుగా పేర్కొంటారు.

1. థర్డ్‌గ్రేడ్ – రూ. కోటి లోపు ఆదాయం
2. సెకండ్ గ్రేడ్ – రూ. కోటి నుంచి రెండు కోట్ల ఆదాయం
3. ఫస్ట్‌గ్రేడ్ – రెండు నుంచి మూడు కోట్ల రూపాయల ఆదాయం
4. స్పెషల్ గ్రేడ్ – మూడు నుంచి నాలుగు కోట్ల ఆదాయం
5. సెలక్షన్ గ్రేడ్ – నాలుగు కోట్ల రూపాయలకు పైగా ఆదాయం

నగర పంచాయతీ: సాధారణంగా 11,000 కంటే ఎక్కువ 40,000 కంటే తక్కువ జనాభా ఉన్న, గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతంగా మారుతున్నదాన్ని నగర పంచాయతీగా గుర్తిస్తారు. తెలంగాణలో 26, ఆంధ్రప్రదేశ్‌లో 32 నగర పంచాయతీలు ఉన్నాయి.

ప్రకరణ 243(R) – మున్సిపాలిటీల నిర్మాణం

I. మున్సిపల్ కార్పొరేషన్

ఇందులో ప్రధానంగా 4 విభాగాలు ఉంటాయి.

కార్పొరేషన్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1. ప్రత్యక్షంగా ఎన్నికైన కార్పొరేటర్లు
2. పదవీ రీత్యా సభ్యులు
3. సహకార సభ్యులు

మేయర్: ఈయనను పరోక్షంగా ఎన్నుకుంటారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

స్థాయి సంఘాలు: కార్పొరేషన్‌లో 6 స్థాయి సంఘాలు ఉంటాయి. ఇవి కీలకపాత్ర పోషిస్తాయి.

కమిషనర్: ఈయన కార్పొరేషన్ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

II. మున్సిపాలిటీ

ఇందులో ప్రధానంగా మూడు విభాగాలు ఉంటాయి.

మున్సిపల్ కౌన్సిల్: ఇందులో మూడు రకాల సభ్యులు ఉంటారు.

1. ప్రత్యక్షంగా ఎన్నికైన కౌన్సిలర్లు
2. పదవీ రీత్యా సభ్యులు
3. సహకార సభ్యులు

మున్సిపల్ చైర్మన్: పరోక్షంగా అయిదేళ్లకు ఎన్నికవుతారు. అవిశ్వాస తీర్మానం ద్వారా ముందుగానే తొలగించవచ్చు.

మున్సిపల్ కమిషనర్: మున్సిపల్ సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తారు.

ప్రకరణ 243(S)–వార్డు కమిటీల ఏర్పాటు: ప్రతి వార్డుకు లేదా ఒకటి కంటే ఎక్కువ వార్డులకు కలిపి వార్డు కమిటీని ఏర్పాటు చేయవచ్చు. దీని అధ్యక్షుడిగా వార్డు కౌన్సిలర్ కొనసాగుతారు. సభ్యులుగా పౌర ప్రముఖులను నియమిస్తారు. వీటి ఉద్దేశం పౌరుల సహకారం, భాగస్వామ్యంతో వార్డును అభివృద్ధి పరచడం.

ప్రకరణ 243 (T) – రిజర్వేషన్లు: జనాభా ప్రాతిపదికన ఎస్సీలకు 18.25%, ఎస్టీలకు 8.25% రిజర్వేషన్లు కల్పించారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకే వదిలేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 34%, మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించారు. ఈ రిజర్వేషన్లను రొటేషన్ పద్ధతిలో అమలు పరుస్తారు.

ప్రకరణ243 (U) – కాలపరిమితి: మున్సిపాలిటీల సాధారణ కాలపరిమితి అయిదేళ్లు. ఏదైనా మున్సిపాలిటీ రద్దైతే 6 నెలల్లోపు ఉప ఎన్నికలు నిర్వహించాలి. ఒకవేళ మున్సిపాలిటీ కాలం పూర్తవడానికి 6 నెలల కంటే తక్కువ సమయం ఉంటే ఉపఎన్నిక జరపాల్సిన అవసరం లేదు.

ప్రకరణ 243(V) – అభ్యర్థుల అనర్హతలు: మున్సిపాలిటీలకు పోటీ చేసే అభ్యర్థుల అర్హతలను రాజ్యాంగం ద్వారా కాకుండా శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తారు. వీటికి పోటీ చేయడానికి కనీస



వయసు 21 సంవత్సరాలు. 1995 తర్వాత ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్నవారు అనర్హులు.

ప్రకరణ 243(W) – మున్సిపాలిటీల విధులు, అధికారాలు: మున్సిపాలిటీలకు మొత్తం 18 అంశాలపై అధికారం కల్పించారు. వీటిని ప్రత్యేకంగా 12వ షెడ్యూల్లో చేర్చారు. ఈ అధికారాలను బదలాయించే అధికారం రాష్ట్ర శాసనసభకు కల్పించారు. వీటిలో 11 తప్పనిసరి, 7 ఐచ్ఛిక విధులు ఉన్నాయి.

తప్పనిసరి విధులకు ఉదాహరణ:

1. నగర ప్రణాళిక రూపకల్పన
2. భూముల క్రమబద్ధీకరణ,భవనాల నిర్మాణం
3. మురికివాడల అభివృద్ధి
4. రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం
5. ప్రజారోగ్యం, పారిశుధ్యం
6. అగ్నిమాపక సేవలు
7. పట్టణ పర్యావరణ రక్షణ ఏర్పాట్లు
8. పట్టణ, పేదరిక నిర్మూలన
9. జనన, మరణాల నమోదు
10. శ్మశానాల ఏర్పాటు, నిర్వహణ

ప్రకరణ 243 (X) – మున్సిపాలిటీల ఆదాయ మార్గాలు: మున్సిపాలిటీలకు ప్రధానంగా 5 రకాల ఆదాయ మార్గాలు ఉన్నాయి.

1. పన్నులు (ఇంటి పన్ను, నీటి పన్ను, ఆస్తి పన్ను, వినోద పన్ను).
2. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే నిధులు
3. ఆస్తులు
4. విరాళాలు
5. ధర్మ, ఇతర సంస్థల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం

ప్రకరణ 243 (Y) – ఆర్థిక సంఘం: మున్సిపాలిటీలకు నిధుల పంపిణీ కోసం గవర్నర్ రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయాలి. అధికరణ 243(I) ప్రకారం ఏర్పాటు చేసే ఆర్థిక సంఘం వీటికి కూడా వర్తిస్తుంది.

ప్రకరణ 243 (Z) – మున్సిపాలిటీల ఆడిటింగ్ అండ్ అకౌంటింగ్: వీటి నిర్వహణ కోసం శాసనసభ చట్టం ద్వారా ప్రత్యేక ఆడిటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం వీటిని ఏర్పాటు చేయలేదు. జిల్లా స్థాయి ఆడిటర్లు వీటిని నిర్వహిస్తున్నారు.

ప్రకరణ 243 (ZA) – మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ: మున్సిపాలిటీలకు సకాలంలో, సక్రమంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడానికి గవర్నర్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఏర్పాటు చేయాలి. ప్రకరణ 243(K) ప్రకారం ఏర్పాటు చేసే రాష్ట్ర ఎన్నికల సంఘం వీటికి కూడా ఎన్నికలను నిర్వహిస్తుంది.

ప్రకరణ 243 (ZB) – కేంద్రపాలిత ప్రాంతాలకు వర్తింపు: నగరపాలక చట్టం కేంద్రపాలిత ప్రాంతాలకు కూడా వర్తిస్తుంది. అసెంబ్లీ ఉన్నవాటికి అసెంబ్లీ చట్టం ద్వారా, లేనివాటికి రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా వర్తింపజేస్తారు.

ప్రకరణ 243 (ZC) – కొన్ని ప్రాంతాలకు మినహాయింపు: ప్రకరణ 244లో పేర్కొన్న షెడ్యూల్డు ప్రాంతాలకు, ఆదివాసీ ప్రాంతాలకు నగరపాలక చట్టం వర్తించదు. పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతానికి కూడా వర్తించదు.

ప్రకరణ–243 (ZD) – జిల్లా ప్రణాళిక కమిటీ: ప్రతి జిల్లాకు ఒక ప్రణాళిక కమిటీని ఏర్పాటు చేయాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2007లో ఏర్పాటు చేశారు. వీటిలో 30 మంది సభ్యులు ఉంటారు. వీరిలో 24 మంది ఎన్నికైనవారు (పంచాయతీలకు ఎన్నికైన సభ్యుల నుంచి 80%, మున్సిపాలిటీలకు ఎన్నికైన సభ్యుల నుంచి 20% మందిని తీసుకుంటారు). మిగిలిన ఆరుగురిలో.. అల్పసంఖ్యాక వర్గం నుంచి ఒకరు, వివిధ రంగాల్లో నిపుణులైన ముగ్గురు, జడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఉంటారు. పదవీ రీత్యా జడ్పీ చైర్మన్ దీని అధ్యక్షుడిగా కొనసాగుతారు.

ప్రకరణ 243 (ZE) – మెట్రోపాలిటన్ ప్రణాళిక కమిటీ: జనాభా 10 లక్షలు కంటే ఎక్కువ ఉన్న ప్రాంతాలకు వీటిని ఏర్పాటు చేస్తారు. దీని నిర్మాణం, విధులను రాష్ట్ర శాసనసభ చట్టం ద్వారా నిర్ణయిస్తారు. దీని అధ్యక్షునిగా నగర మేయర్ కొనసాగుతారు. కమిషనర్ మెంబర్ సెక్రటరీగా కొనసాగుతారు. మున్సిపల్ పరిపాలన అనుభవం ఉన్న నలుగురిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. మరికొందరిని గ్రామపంచాయతీ అధ్యక్షులు, మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికైన సభ్యులు ఎన్నుకొంటారు.

ప్రకరణ 243 (ZF) – పాత శాసనాల కొనసాగింపు: 74వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చేంత వరకూ పాత చట్టాలే కొనసాగుతాయని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభ చట్టం ద్వారా కొత్త చట్టాలను అనువర్తింపజేసుకోవాలని ఈ ప్రకరణ తెలియజేస్తుంది.

ప్రకరణ 243 (ZG) – న్యాయస్థానాల జోక్యం నుంచి మినహాయింపు: మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, ఎన్నికల నిర్వహణ, వార్డుల విభజన మొదలైన విషయాల్లో న్యాయస్థానాలు జోక్యం చేసుకోకూడదు.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశంలో ఏర్పాటు చేసిన మొదటి మున్సిపాలిటీ ఏది?
ఎ) ముంబై బి) మద్రాస్
సి) మచిలీపట్నం డి) కోల్‌కతా

2. దేశంలో ఉన్న కంటోన్మెంటు బోర్డులెన్ని?
ఎ) 55 బి) 60 సి) 62 డి) 65

3. భారతదేశంలో కంటోన్మెంటు చట్టాన్ని ఏ సంవత్సరంలో చేశారు?
ఎ) 1907 బి) 1914
సి) 1924 డి) 1927

4. భారతదేశంలో మొదటగా ఏర్పాటు చేసిన పట్టణాభివృద్ధి సంస్థ ఏది?
ఎ) ముంబై బి) ఢిల్లీ
సి) కోల్‌కతా డి) అలహాబాద్

5. జిల్లా ప్రణాళిక కమిటీ అధ్యక్షునిగా ఎవరు కొనసాగుతారు?
ఎ) జిల్లా కలెక్టర్
బి) జిల్లా పరిషత్ అధ్యక్షుడు
సి) సంబంధిత జిల్లా మంత్రి
డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు

6. భారతదేశంలో అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ ఏది?
ఎ) ముంబై బి) కోల్‌కతా
సి) ఢిల్లీ డి) చెన్నై

7. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మొదటి మేయర్ ఎవరు?
ఎ) సరోజినీ పుల్లారెడ్డి
బి) మాడపాటి హనుమంతరావు
సి) సలావుద్దీన్
డి) వెంకట్రామి రెడ్డి

8. నగరపాలక సంస్థలకు సంబంధించి ప్రత్యేక సిబ్బంది విధానం ఏయే రాష్ట్రాల్లో అమల్లో ఉంది?
ఎ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ
బి) ఉత్తరప్రదేశ్, బిహార్
సి) గుజరాత్, పశ్చిమబెంగాల్
డి) పైవేవీ కావు

9. సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ ఏ నగరంలో ఉంది?
ఎ) హైదరాబాద్ బి) పుణే
సి) న్యూఢిల్లీ డి) చెన్నై

సమాధానాలు

1) బి; 2) సి; 3) సి; 4) బి; 5) బి; 6) ఎ; 7) బి; 8) సి; 9) సి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. భారత రాజ్యాంగంలోని 12వ షెడ్యూల్‌లో మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్ని పాలనా నియంత్రణ వ్యవహారాల గురించి పేర్కొన్నారు?
ఎ) 15 బి) 16 సి) 17 డి) 18

2. గ్రామీణ ప్రాంతం నుంచి నగర ప్రాంతానికి మారేవి:
ఎ) నగర పంచాయతీలు
బి) రూరల్ మున్సిపాలిటీలు
సి) పంచాయతీ మున్సిపాలిటీలు
డి) మున్సిపల్ పంచాయతీలు

3. భారత రాజ్యాంగ ఎన్నో ఆర్టికల్ ప్రకారం మున్సిపాలిటీలకు అధికారాలను ఇచ్చే హక్కు రాష్ట్ర శాసనసభకు ఉంది?
ఎ) 243 (V) బి) 243 (W)
సి) 243 (Z) డి) 243 (S)

4. భారతదేశంలో మొత్తం స్థానాల్లో మూడో వంతు స్థానాలను మహిళలకు ఏ ఎన్నికలకు సంబంధించి కేటాయించారు?
ఎ) గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలు
బి) విధాన సభలు
సి) విధాన మండలి
డి) పైవన్నీ

5. భారతదేశంలో నగర స్థానిక సంస్థలకు సంబంధించిన రాజ్యాంగ సవరణ ఏది?
ఎ) 64వ సవరణ బి) 72వ సవరణ
సి) 73వ సవరణ డి) 74వ సవరణ

సమాధానాలు

1) డి; 2) ఎ; 3) బి; 4) ఎ; 5) డి.

ఈశాన్య భారతదేశంలో యురేనియం ఖనిజం ఎక్కడ లభిస్తుంది?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భూగోళశాస్త్రం

భారతదేశం ఇంధన వనరులు

సాధారణంగా ప్రతి పోటీ పరీక్షలో ఖనిజ వనరులకు సంబంధించి ప్రశ్నలు కచ్చితంగా ఉంటాయి. ఖనిజ వనరుల్లో ఇంధన వనరులు అతి ప్రధానమైనవి. ఆర్థిక వ్యవస్థ ప్రగతి ఆయా దేశాల, ప్రాంతాల ఇంధన వనరుల స్థాయి మీద ఆధారపడి ఉంటుంది. ప్రశ్నలు సాధారణంగా వివిధ ఇంధన ధాతువులు, వాటి లభ్యత స్థాయి, విస్తరణ, గనుల(ఉత్పత్తి) కేంద్రాలు, వాటిని ఉత్పత్తి చేస్తున్న ప్రధాన ప్రభుత్వ – ప్రైవేట్ రంగ సంస్థల పేర్లు, ఖనిజాల శుద్ధి మొదలైన అంశాలపై ఉంటాయి. ఖనిజ వనరులు తెలంగాణలో ఎక్కడ లభ్యమవుతున్నాయి లేదా ఉత్పత్తి అవుతున్నాయనే అంశాలపై కూడా ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది.

ఇంధన వనరులను ప్రధానంగా రెండు తరగతుల కింద విభజించవచ్చు.

అవి

1) శిలాజ ఇంధనాలు

2) అణు ఇంధనాలు

బొగ్గు, చమురు, సహజవాయువు శిలాజ ఇంధనాల తరగతికి చెందుతాయి. యురేనియం, థోరియం, ప్లుటోనియం, లిథియం, ఇల్మనైట్, ర్యుటైల్, జిర్కాన్ మొదలైనవి అణు ఇంధనాల తరగతికి చెందుతాయి.

శిలాజ ఇంధనాలు జీవ పదార్థం నుంచి తయారవుతాయి. ఇవి ప్రధానంగా కార్బోనిఫెరస్ భౌమ్య యుగంలో ఏర్పడ్డాయి. నిల్వల పరంగా చూస్తే భారతదేశంలో బొగ్గు నిల్వలు సంతృప్తికర స్థాయిలో ఉన్నట్లుగా చెప్పొచ్చు. కానీ చమురు–సహజ వాయువు నిల్వల స్థాయి, ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది.

చమురు – సహజ వాయువు ఉత్పత్తుల కోసం మన దేశం ప్రధానంగా దిగుమతులపై ఆధారపడుతుంది. భవిష్యత్తులో వీటి భారాన్ని తగ్గించడానికి ప్రభుత్వం ప్రస్తుతం చమురు– సహజ వాయువు నిక్షేపాల అన్వేషణపై దృష్టి కేంద్రీకరిస్తుంది. ఇందుకోసం దేశ, విదేశీ పెట్టుబడులను ఈ రంగంలోకి ఆహ్వానిస్తుంది.

అణు ఇంధన వనరులు విస్తారంగా లభిస్తున్నప్పటికీ, వీటిని వినియోగించే అణు రియాక్టర్ సాంకేతిక పరిజ్ఞానం మనకు లేకపోవడం ప్రధాన సమస్య. దేశంలో అమలవుతున్న మూడంచెల అణు ఇంధన పథకం మూడో దశకు చేరుకున్నప్పుడు దేశీయ అణు ఇంధన నిల్వలు వినియోగంలోకి వస్తాయి. ప్రస్తుతం ఈ పథకం రెండో దశలోనే ఉంది.



మాదిరి ప్రశ్నలు

1. బొగ్గు నిల్వలు భారతదేశంలోని కింది ఏ నదీ లోయలో లభించవు?
ఎ) దామోదర్ బి) నర్మద
సి) మహానది డి) సోన్

2. టైపామ్ శ్రేణి అవక్షేప శిలల్లో ఏ ఖనిజ వనరులు లభిస్తున్నాయి?
ఎ) బొగ్గు బి) యురేనియం
సి) చమురు డి) థోరియం

3. నైవేలిలో ఏ రకమైన బొగ్గు లభిస్తుంది?
ఎ) ఆంథ్రసైట్ బి) బిట్యూమినస్
సి) లిగ్నైట్ డి) పీట్

4. బూడిద శాతం ఏ రకమైన బొగ్గులో ఎక్కువగా ఉంటుంది?
ఎ) ఆంథ్రసైట్ బి) బిట్యూమినస్
సి) లిగ్నైట్ డి) పీట్

5. భారతదేశంలో మోనజైట్ నిల్వలు అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
ఎ) తమిళనాడు బి) మహారాష్ట్ర
సి) కేరళ డి) ఒడిశా

6. టెరిషరీ భౌమ్య యుగానికి చెందిన బొగ్గు నిల్వలు భారతదేశంలో ఏ ప్రాంతంలో ఉన్నాయి?
ఎ) చోటానాగపూర్ పీఠభూమి
బి) మహారాష్ట్ర
సి) పశ్చిమ భారతదేశం
డి) ఈశాన్య భారతదేశం

7. భారతదేశంలో బొగ్గు నిల్వలు సుమారుగా ఎన్ని టన్నులు?
ఎ) 250 మిలియన్
బి) 250 బిలియన్
సి) 100 మిలియన్
డి) 100 బిలియన్

8. తెలంగాణలోని కింది జిల్లాలో బొగ్గు నిల్వలు లేవు?
1) ఖమ్మం 2) వరంగల్
3) కరీంనగర్ 4) ఆదిలాబాద్
ఎ) 2 బి) 2, 3
సి) 1 డి) పైవేవీ కావు

9. తెలంగాణలో బొగ్గును ఉత్పత్తి చేసే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కంపెనీ ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) కొత్తగూడెం బి) రామగుండం
సి) సింగరేణి డి) హైదరాబాద్

10. పీట్ తరగతికి చెందిన బొగ్గు నిల్వలు ప్రధానంగా ఎక్కడ కేంద్రీకృతమై ఉన్నాయి?
ఎ) ఛత్తీస్‌గఢ్ బి) జమ్ము
సి) తమిళనాడు డి) కేరళ

11. భారతదేశంలో అత్యధిక నిల్వలు ఉన్న అతిపెద్ద బొగ్గు క్షేత్రం ఏది?
ఎ) ఝరియా బి) రాణిగంజ్
సి) గిర్డి డి) సింగరేణి

12. కింద సూచించిన వాటిలో బొగ్గు గని కేంద్రాలను గుర్తించండి.
1) భూపాలపల్లి 2) సత్తుపల్లి
3) మణుగూరు 4) మందమర్రి
ఎ) 1, 2 బి) 3, 4
సి) 1, 3, 4 డి) పైవన్నీ

13. కోకింగ్ బొగ్గు ప్రధానంగా దేశంలో ఎక్కడ లభిస్తుంది?
ఎ) ఝరియా బి) కోర్బా
సి) సింగ్రౌలి డి) తాల్చేర్

14. భారతదేశం ప్రధానంగా ఏ దేశాల నుంచి బొగ్గును దిగుమతి చేసుకుంటుంది?
1) ఆస్ట్రేలియా 2) యూఎస్ఏ
3) దక్షిణాఫ్రికా 4) చైనా
ఎ) 1, 2 బి) 1, 3
సి) 2, 3 డి) 1, 4

15. భారతదేశంలో నీటి ముంపు వల్ల అతి పెద్ద దుర్ఘటన జరిగిన బొగ్గుగని ?
ఎ) తాల్చేర్ బి) బొకారో
సి) చస్నాలా డి) గోదావరిఖని

16. భారతదేశంలో బొగ్గు ఉత్పత్తి చేసే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా లిమిటెడ్ (CIL) ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?
ఎ) ధన్‌బాద్ బి) ఢిల్లీ
సి) కలకత్తా డి) నాగపూర్

17. అంబానీ చమురు క్షేత్రం ఏ ప్రాంతంలో ఉంది?
ఎ) కావేరి బేసిన్
బి) కె.జి. బేసిన్
సి) కాంబత్ సింధుశాఖ
డి) బ్రహ్మపుత్ర లోయ

18. భారతదేశంలో అత్యధికంగా చమురును ఉత్పత్తి చేసే అతిపెద్ద చమురు క్షేత్రం ?
ఎ) గాంధార్ బి) రవ్వ
సి) దిగ్బాయ్ డి) ముంబై హై

19. భారత ప్రభుత్వం ఓఎన్‌జీసీ (ONGC) కింద సూచించిన ఏ విదేశీ చమురు క్షేత్రంలో పెట్టుబడి పెట్టింది?
ఎ) అంపారా బి) డహరాన్
సి) సఖాలిన్ డి) బాకు

20. భారతదేశంలో మొట్టమొదటిగా కనుగొన్న చమురు క్షేత్రం?
ఎ) లూనెజ్ బేసిన్ బి) దిగ్బాయ్
సి) నహకర్తియా డి) నారిమన్నం

21. వాయవ్య భారతదేశంలో కింది ప్రాంతంలో చమురు సహజవాయువు నిల్వలున్నట్లుగా నిర్ధారించారు?
ఎ) థార్ ఎడారి బి) చంబల్ లోయ
సి) కచ్ మైదానం
డి) సట్లెజ్–యమునా మైదానం

22. HBJ పైపు లైను మార్గం కింది రాష్ట్రాల గుండా వెళ్తుంది?
ఎ) మహారాష్ట్ర–గుజరాత్–రాజస్థాన్
బి) గుజరాత్–మధ్యప్రదేశ్–ఉత్తరప్రదేశ్
సి) గుజరాత్–మధ్యప్రదేశ్–రాజస్థాన్
డి) గుజరాత్–మహారాష్ట్ర–మధ్యప్రదేశ్

23. కింద సూచించిన ప్రదేశాల్లో చమురు శుద్ధి కర్మాగారం లేదు?
ఎ) బరౌని బి) పానిపట్
సి) బోన్‌గాయిగావ్
డి) రాంచీ

24. ప్రపంచంలో కెల్లా అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రంగా రూపొందిన భారతీయ నగరమేది?
ఎ) దిగ్బాయ్ బి) ట్రాంబే
సి) జామ్‌నగర్ డి) వడోదర

25. ఏ రెండు పట్టణాలు / నగరాలను కలుపుతూ చమురు – సహజవాయువు గొట్టపు మార్గాన్ని నిర్మిస్తున్నారు?
ఎ) విజయవాడ–విశాఖపట్నం
బి) కాకినాడ–విశాఖపట్నం
సి) హైదరాబాద్–కాకినాడ
డి) హైదరాబాద్–విశాఖపట్నం

26. జతపరచండి.

a) నహర్‌కతియా	1) గుజరాత్
b) గాంధార్	2) అసోం
c) కర్నాంగ్	3) మహారాష్ట్ర
d) బేసిన్	4) అరుణాచల్‌ప్రదేశ్

	a	b	c	d
ఎ)	1	2	4	3
బి)	1	2	3	4
సి)	2	1	4	3
డి)	2	1	3	4

27. తెలంగాణ,ఆంధ్రప్రదేశ్‌లోని ఏ జిల్లాల్లో యురేనియం నిక్షేపాలున్నట్లుగా నిర్ధారించారు?
ఎ) నల్లగొండ, కడప
బి) నల్లగొండ, అనంతపురం
సి) వరంగల్, కడప
డి) వరంగల్, కర్నూల్

28. జాదుగుడా ఏ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే గని కేంద్రం?
ఎ) బొగ్గు బి) చమురు
సి) యురేనియం డి) థోరియం

29. ఈశాన్య భారతదేశంలో యురేనియం ఖనిజం ఎక్కడ లభిస్తుంది?
ఎ) ఖాసీ కొండలు
బి) గారో కొండలు
సి) నాగా కొండలు
డి) మిష్మి కొండలు

30. ప్రపంచంలో అత్యధికంగా మోనజైట్ నిల్వలు కలిగి ఉన్న దేశం ?
ఎ) ఆస్ట్రేలియా బి) భారతదేశం
సి) కెనడా డి) దక్షిణాఫ్రికా

31. మోనజైట్ ముడి ఖనిజంలోని ప్రధాన ఖనిజం ఏది?
ఎ) యురేనియం బి) ప్లుటోనియం
సి) థోరియం డి) బెరీలియం

32. భారతదేశంలో జిర్కాన్ ఇల్మనైట్ వంటి అణు ఖనిజాలను ఉత్పత్తి చేసే సంస్థ ?
ఎ) యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
బి) ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్
సి) ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్
డి) మినరల్ ఎక్స్‌ప్లొరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్

33. ఆంధ్రప్రదేశ్‌లో మోనజైట్ నిక్షేపాలు ఏ తీరంలో లభిస్తున్నాయి?
ఎ) నెల్లూరు బి) మచిలీపట్నం
సి) కాకినాడ డి) భీమునిపట్నం

34. భారతదేశంలోని కింది ప్రాంతంలో చమురు–సహజవాయువు నిల్వలు బయటపడే అవకాశాలున్నాయి.
ఎ) దక్కన్ పీఠభూమి
బి) చోటానాగపూర్ పీఠభూమి
సి) ఒడిశా తీరం
డి) సట్లెజ్–యమునా మైదానం

35. చమురు–సహజవాయువు నిల్వలు సముద్ర భూతలంపై కింది ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంటాయి?
ఎ) ఖండ తీరపు అంచు
బి) ఖండ తీరపు వాలు
సి) అబిసల్ మైదానం
డి) అగాధ సముద్ర ప్రాంతాలు

36. కేంద్రీయ గనుల పరిశోధన కేంద్రం (CMRS) ఎక్కడ ఉంది?
ఎ) రాంచీ బి) కలకత్తా
సి) దుర్గాపూర్ డి) ధన్‌బాద్

సమాధానాలు

1) బి; 2) సి; 3) సి; 4) డి; 5) సి; 6) డి; 7) బి; 8) డి; 9) ఎ; 10) డి; 11) బి; 12) డి; 13) ఎ; 14) డి; 15) సి; 16) సి; 17) బి; 18) డి; 19) సి; 20) బి; 21) ఎ; 22) బి; 23) డి; 24) సి; 25) బి; 26) సి; 27) ఎ; 28) సి; 29) ఎ; 30) బి; 31) సి; 32) బి; 33) డి; 34) డి; 35) ఎ; 36 డి.

విద్యుత్ పరికరాలను ఏ పద్ధతిలో కలుపుతారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భౌతిక శాస్త్రం

విద్యుత్

ఘటం (Cell)

నిర్జల/అనార్ద్ర ఘటం: ఇందులో ఎలాంటి ద్రవ పదార్థాలు ఉండవు. కాబట్టి దీన్ని 'డ్రై సెల్' అంటారు. ఈ ఘటాన్ని సులభంగా ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తీసుకెళ్లవచ్చు. అందువల్ల వీటిని కెమెరా, రేడియో, టార్చ్‌లైట్, గడియారాలు, ఆట బొమ్మలు, రిమోట్ కార్లు మొదలైనవాటిలో ఉపయోగిస్తారు.

గౌణ ఘటాలు: వీటిని గ్లాస్టన్ ప్లాంటే (ఫ్రాన్స్) అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇందులో విద్యుత్ శక్తి రసాయన శక్తిగా, రసాయన శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది. ఇలాంటి ఘటాలను నిర్వహించడానికి లిథియం, కాడ్మియం, నికెల్, కోబాల్ట్ తదితర పదార్థాలను వినియోగిస్తారు. ఈ ఘటాలను మొబైల్ ఫోన్లు, హ్యాండీక్యామ్, కృత్రిమ ఉపగ్రహాలు, అంతరిక్ష నౌకల్లో ఉపయోగిస్తారు.

లెడ్ యాసిడ్ బ్యాటరీ: దీన్ని థామస్ ఆల్వా ఎడిసన్ కనుగొన్నాడు. ఈ ఘటాల్లో లెడ్‌ను ధన ధ్రువం (ఆనోడ్), లెడ్ పెరాక్సైడ్‌ను రుణ ధ్రువం (కేథోడ్)గా వాడతారు. ఈ ఘటంలో ఎక్కువగా ఉపయోగించే ఆమ్లం 'సజల సల్ఫ్యూరిక్ ఆమ్లం'. ఇలాంటి ఘటాలను వాహనాల్లో ఉపయోగిస్తారు.

- మానవాళికి ఎక్కువగా ఉపయోగపడుతున్న సజల సల్ఫ్యూరిక్ ఆమ్లాన్ని 'కింగ్ ఆఫ్ ది కెమికల్స్'గా పేర్కొంటారు.
- ప్రతి జీవిలో 'కార్బన్' మూలకం తప్పనిసరిగా ఉంటుంది. దీన్ని 'కింగ్ ఆఫ్ ది ఎలిమెంట్స్' అని పిలుస్తారు.
- బంగారం మెతకదనాన్ని అధికం చేసినప్పుడు దాన్ని సన్నటి తీగలా సాగదీయవచ్చు. అందువల్ల లోహాల్లో బంగారాన్ని 'కింగ్ ఆఫ్ ది మెటల్స్'గా పేర్కొంటారు.

విద్యుత్ బల్బు

విద్యుత్ బల్బును థామస్ ఆల్వా ఎడిసన్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. గాజుతో రూపొందించిన విద్యుత్ బల్బుల్లో టంగ్‌స్టన్ తీగను ఫిలమెంట్‌గా అమరుస్తారు. అందులో తక్కువ పీడనం వద్ద ఆర్గాన్ అనే జడవాయువును నింపుతారు.

టంగ్‌స్టన్ విద్యుత్ నిరోధం తక్కువగా, ద్రవీభవన స్థానం ఎక్కువగా (2400 °C - 2900 °C) ఉంటుంది. అందువల్ల దీని ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు అది ఎక్కువ ఉష్ణోగ్రతకు వేడెక్కినప్పటికీ కాలిపోకుండా ఉంటుంది. కానీ ఈ బల్బుల్లో విద్యుత్ వ్యర్థం ఎక్కువగా ఉంటుంది.



సీఎఫ్ఎల్ బల్బ్

దీని పూర్తిపేరు Compact Flourocent Lamp. దీన్ని ఎడ్వర్డ్ హామర్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇందులో తక్కువ మోతాదులో పాదరసాన్ని ఉపయోగిస్తారు. సీఎఫ్ఎల్ బల్బుల్లో ఎలాంటి ఫిలమెంట్లు లేకపోవడం వల్ల విద్యుత్ వ్యర్థం దాదాపుగా ఉండదు.

ట్యూబ్‌లైట్

గాజుతో రూపొందించిన ఒక గొట్టం రెండు చివరల వద్ద ఆనోడ్, కెథోడ్ అనే ఎలక్ట్రోడ్‌లను అమరుస్తారు. వాటి మధ్య తక్కువ పీడనం వద్ద కావాల్సిన వాయువులను నింపుతారు.

ట్యూబ్‌లైట్ లోపలి గోడలపై టంగ్‌స్టన్ లేదా సిలికేట్ రసాయనిక పదార్థంతో పూత పూయడం వల్ల తెలుపురంగులో ఉన్న కాంతి విడుదలవుతుంది. ఇందులో ఎలాంటి ఫిలమెంట్ లేకపోవడం వల్ల విద్యుత్ పొదుపు ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ ట్యూబ్‌లైట్ వెలగడానికి 220V వోల్టేజీ అవసరమవుతుంది.

ఫ్లోరోసెంట్ ల్యాంప్

ఇందులో తక్కువ మోతాదులో పాదరసాన్ని ఉపయోగిస్తారు.

చాపం దీపాలు (Arc Lamps)

వీటిని సర్ హంఫ్రీ డేవిస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఇలాంటి బల్బుల నుంచి అధిక తీవ్రత ఉన్న కాంతి వెలువడుతుంది. అందువల్ల వీటిని కింద పేర్కొన్న సాధనాల్లో ఉపయోగిస్తారు.

- సినిమా ప్రొజెక్టర్లలో ఇలాంటి ల్యాంప్‌లను అమర్చి, వాటి నుంచి వెలువడుతున్న కాంతిని ఇనుముపై పతనమయ్యేలా చేస్తారు. ఆ ఫిల్మ్‌పై ఉండే బొమ్మ తెరపై ఏర్పడుతుంది.
- నౌకాశ్రయంలో లైట్ హౌస్ పై భాగంలో ఇలాంటి ల్యాంప్‌లను అమరుస్తారు. వీటి నుంచి వెలువడుతున్న కాంతిని ఉపయోగించి రాత్రి సమయంలో తీరం వైపు వస్తున్న నౌకలకు మార్గ నిర్దేశనం చేస్తారు.

ఆవిరి దీపాలు

వీటిని పీటర్ కూపర్ హెవిట్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. సాధారణంగా ఇలాంటి బల్బ్‌లలో పాదరస ఆవిరిని లేదా సోడియం వేపర్‌ను ఉపయోగిస్తారు.

- అలంకరణ దీపాలను శ్రేణిలో సంధానం చేస్తారు.

ఫ్యూజ్ తీగ

దీన్ని లెడ్, టిన్‌ల మిశ్రమంతో తయారు చేస్తారు. ఇందులో పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువ మోతాదులో Cuను కూడా వినియోగిస్తారు. ఈ మిశ్రమ లోహాన్ని 'టైప్ మెటల్' అని కూడా అంటారు. ఈ ఫ్యూజ్ వైర్ విద్యుత్ నిరోధం ఎక్కువగా, ద్రవీభవన స్థానం తక్కువగా ఉంటుంది.

ఈ తీగను ఎలక్ట్రిక్ వలయంలో శ్రేణిలో కలుపుతారు. ఒకవేళ ఎలక్ట్రిక్ వోల్టేజీ 220V కంటే ఎక్కువగా ఉంటే ఈ ఫ్యూజ్ వైర్ వేడెక్కి కాలిపోతుంది. ఈ విధమైన అధిక వోల్టేజీల నుంచి ఎలక్ట్రిక్ ఫీల్డ్‌ను కాపాడటానికి ఫ్యూజ్ వైర్‌ను ఉపయోగిస్తారు.

- విద్యుత్ హీటర్‌లో నిక్రోమ్ తీగను ఫిలమెంట్‌గా వాడతారు. దీని విద్యుత్ నిరోధం, ద్రవీభవన స్థానాలు ఎక్కువగా ఉండటమే దీనికి కారణం. అందువల్ల దీని ద్వారా ప్రవహించే విద్యుత్ ప్రవాహం పూర్తిగా ఉష్ణశక్తిగా మారి ఆ ఫిలమెంట్ వేడెక్కుతుంది. ఈ ఉష్ణాన్ని ఉపయోగించి వంట చేసుకోవచ్చు. ఈ తీగ ద్రవీభవన స్థానం ఎక్కువగా ఉండటం వల్ల ఇది కరిగిపోకుండా ఉంటుంది.

విద్యుత్ ఫలితాలు (ఎలక్ట్రిక్ ఎఫెక్ట్)

సీబెక్ ఫలితం

రెండు వేర్వేరు లోహపు తీగలను తీసుకుని వాటి రెండు చివరలను రెండు సందులుగా అమరిస్తే ఏర్పడే వలయాన్ని 'ఉష్ణయుగ్మం' అంటారు. ఇందులో ఉన్న ఒక సంధిని మంచు ముక్కల్లో అమర్చినప్పుడు దాని ఉష్ణోగ్రత 0° సెంటీగ్రేడ్‌కు తగ్గుతుంది. దీన్ని చల్లని సంధి అంటారు. రెండో సంధిని ద్రవంలో అమర్చి వేడి చేసినప్పుడు దాని ఉష్ణోగ్రత పెరుగుతుంది. అందువల్ల దీన్ని వేడి సంధి అంటారు. ఈ వేడి సంధి వద్ద ఇచ్చిన ఉష్ణం విద్యుత్ వలయంలో విద్యుత్ శక్తిగా మారి ప్రవహిస్తుంది. ఈ విధంగా జనించిన విద్యుత్‌ను ఉష్ణ విద్యుత్ అంటారు. దీన్ని కనుగొన్న శాస్త్రవేత్త సీబెక్ కావడం వల్ల దీన్ని 'సీబెక్ ఫలితం' అంటారు.

సీబెక్ ఫలితంలో జనించిన ఉష్ణ విద్యుత్ రెండు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. ఉష్ణయుగ్మాన్ని తయారు చేయడానికి ఉపయోగించే 'పదార్థాల స్వభావం'పై ఆధారపడి ఉంటుంది. అందువల్ల గరిష్ఠ ఉష్ణ విద్యుత్ జనించడానికి ఈ ఉష్ణయుగ్మాన్ని యాంటిమోని (Sb), బిస్మత్ పదార్థాలను ఉపయోగించి నిర్మిస్తారు.
2. చల్లని సంధి, వేడి సంధి ఉష్ణోగ్రతలోని తేడాపై ఉష్ణ విద్యుత్ ఆధారపడి ఉంటుంది. ఈ ఉష్ణోగ్రతలోని తేడా పెరిగితే ఉష్ణ విద్యుత్ కూడా పెరుగుతుంది.

ఉష్ణ విద్యుత్ ఉష్ణోగ్రతా మాపకం: ఇది సీబెక్ ఫలితం ఆధారంగా పనిచేస్తుంది. ఈ ఉష్ణోగ్రత మాపకాన్ని యాంటిమోని, బిస్మత్ పదార్థాలను ఉపయోగించి నిర్మిస్తారు.

ఉపయోగాలు:

1. క్రిమి కీటకాల ఉష్ణోగ్రతలను 0.025 °C వరకు కచ్చితంగా కొలవవచ్చు.
2. వేగంగా మార్పు చెందే ఉష్ణోగ్రతలను కచ్చితంగా నమోదు చేయడానికి వాడతారు.

పెల్టియర్ (Peltier) ఫలితం

ఒక ఉష్ణయుగ్మం ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు అది ఒక సంధి వద్ద పరిసరాల్లోని ఉష్ణం మొత్తాన్ని గ్రహించి ఆ ఉష్ణరాశిని ఎలక్ట్రాన్ల సహాయంతో రెండో సంధి వైపు బదిలీ చేసి బయటకు విడుదల చేయడం ద్వారా వేడేక్కుతుంది. దీన్నే పెల్టియర్ ఫలితం అంటారు.

అనువర్తనం:

1. ఎయిర్ కూల్డ్ గదులు, రిఫ్రిజిరేటర్లు పెల్టియర్ ఫలితం ఆధారంగానే పనిచేస్తాయి.

- రిఫ్రిజిరేటర్‌ను జేమ్స్ హారిసన్ కనుగొన్నాడు.
- రిఫ్రిజిరేటర్‌లో ఆహార పదార్థాలు మన్నికగా, తాజాగా ఎక్కువ కాలం పాటు నిల్వ ఉండటానికి కావాల్సిన ఆదర్శ ఉష్ణోగ్రత 4 డిగ్రీల సెల్సియస్.
- రిఫ్రిజిరేటర్‌లో ఉన్న డోర్‌ను తెరచి అందులో కావాల్సిన ఆహార పదార్థాలను అమర్చి తిరిగి డోర్‌ను మూసివేయడానికి కావాల్సిన ఆదర్శ సమయం అయిదు సెకన్లు మాత్రమే.
- పనిచేస్తున్న ఒక రిఫ్రిజిరేటర్‌ను అమర్చిన గది ఉష్ణోగ్రత పెరుగుతుంది.

థామ్సన్ ఫలితం

ఒక తీగ ద్వారా విద్యుత్ ప్రవహిస్తున్నప్పుడు ఆ తీగ మొత్తం వేడెక్కుతుంది లేదా చల్లబడుతుంది. దీన్నే జౌల్ లేదా థామ్సన్ ఫలితం అంటారు.

మంచును తయారు చేసే ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లు చల్లబడేవాటికి ఉదాహరణలు. విద్యుత్ హీటర్, విద్యుత్ బాయిలర్, విద్యుత్ స్ట్రీమ్ బాయిలర్, విద్యుత్ కుంపటి, విద్యుత్ ఇస్త్రీ పెట్టె, విద్యుత్ కెటిల్ మొదలైనవి వేడెక్కేవాటికి ఉదాహరణలు.

- ఇస్త్రీ పెట్టె రెండు పలకల మధ్య అభ్రకం (మైకా) కాగితాన్ని అమరుస్తారు. అభ్రకం ఉత్తమ ఉష్ణ వాహకం, విద్యుత్ బంధక పదార్థం. కాబట్టి ఐరన్ బాక్స్‌లో పైన ఉన్న ఫలకలో ఉత్పత్తి చెందిన ఉష్ణాన్ని తన ద్వారా కింది ఫలకలోకి ప్రసారం చేస్తుంది.
  దీంతోపాటు ఇది విద్యుత్ బంధక ధర్మాన్ని కలిగి ఉండటం వల్ల రెండు పలకల మధ్య విద్యుత్ ప్రసారం జరగకుండా నిరోధిస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. విద్యుత్ శక్తిని యాంత్రిక శక్తిగా మార్చేది?
   ఎ) మోటారు బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్ డి) కెపాసిటర్
2. స్థావర విద్యుత్తును నిల్వ చేసేది?
   ఎ) మోటారు బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్ డి) కెపాసిటర్
3. ఇళ్లలో ఉపయోగించే విద్యుత్ పరికరాలను ఏ పద్ధతిలో కలుపుతారు?
   ఎ) శ్రేణి బి) సమాంతరం
   సి) విడివిడిగా డి) ఏదీకాదు
4. యాంత్రిక శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చేది?
   ఎ) మోటారు బి) జనరేటర్
   సి) ట్రాన్స్‌ఫార్మర్ డి) విద్యుద్దర్శిని
5. కిందివాటిలో ఓమ్ నియమాన్ని పాటించనిది?
   ఎ) రాగి బి) ఇనుము
   సి) చెక్క డి) సిలికాన్
6. విద్యుత్‌కు ప్రమాణాలు?
   ఎ) ఓమ్ బి) ఓమ్-మీటర్
   సి) ఆంపియర్ డి) వోల్ట్

సమాధానాలు

1) ఎ; 2) డి; 3) బి; 4) బి; 5) డి; 6) సి.

Memory that requires refreshing of data is..

BANK EXAMS

COMPUTER AWARENESS

1. The key which lets you to exit a program when pushed?
   a) Arrow key b) Space bar
   c) Escape key d) Return key
   e) Back space key
2. The ability of an OS to run more than one application at a time is called?
   a) Multitasking
   b) Object-oriented programming
   c) Multi-user computing
   d) Time-sharing
   e) Time computing
3. Which of the following statements best describes the batch method of input?
   a) Data is processed as soon as it is input.
   b) Data is input at the time it is collected.
   c) Data is collected in the form of source documents, placed into groups, and then input to the computer.
   d) Source documents are not used.
   e) All the above
4. The benefit of using computers is that:
   a) Computers are very fast and can store huge amounts of data.
   b) Computers provide accurate output even when input is incorrect.
   c) Computers are designed to be inflexible.
   d) All the above
   e) None of these
5. The function of CPU is:
   a) To provide external storage of text
   b) To communicate with the operator
   c) To read, interpret and process the information and instruction
   d) To provide a hard copy
   e) all the above
6. To find a saved document in the computer's memory and bring it up on the screen to view is called:
   a) Reversing b) Rerunning
   c) Retrieving d) Returning
   e) Removing
7. The Internet is a system of:
   a) Software bundles
   b) Web pages c) Website
   d) Interconnected networks
   e) Trusted networks
8. Code consisting of bars and lines of varying widths or lengths that is computer-readable is known as:
   a) An ASCII code
   b) A magnetic tape
   c) An OCR scanner
   d) A bar code
   e) An OMR Code
9. A ____ is a unique name that you give to a file of information.
   a) Device letter b) Folder
   c) File name
   d) File name extension
   e) None of these
10. What is an email attachment?
    a) A receipt sent by the recipient.
    b) A separate document from another program sent along with an email message.
    c) A malicious parasite that feeds off your messages and destroys the contents.
    d) A list of CC or BCC recipients.
    e) None of these
11. Which of the following are all considered advantages of e-mail?
    a) Convenience, speed of delivery, generality and reliability
    b) Printable, global and expensive
    c) Global, convenience and Microsoft owned
    d) Slow delivery, reliable, global and inexpensive
    e) None of these
12. Windows is?
    a) CUI b) GUI
    c) Voice User Interface
    d) Application
    e) AUG
13. In a client/ server model, a client program:
    a) Asks for information
    b) Provides information and files
    c) Serves software files to other computers
    d) Distributes data files to other computers
    e) None of these
14. Computers manipulate data in many ways, and this manipulation is called _____.
    a) Utilizing b) Batching
    c) Upgrading d) Processing
    e) None of these



15. A worksheet can have a maximum of ____ Number of rows:
    a) 256 b) 1024 c) 32,000
    d) 65,535 e) 10,000
16. A worksheet range is a:
    a) A command used for data modeling
    b) A range of values such as from 23 to 234
    c) A group of cells
    d) A group of worksheets
    e) All the above
17. The short cut key to quickly create a Bullet Point in MS WORD is:
    a) Ctrl + Shift + B
    b) Ctrl + B
    c) Ctrl + Shift + *
    d) Ctrl + Shift + L
    e) None of these
18. ______ hard drives are permanently located inside the system unit and are not designed to be removed, unless they need to be repaired or replaced.
    a) Static
    b) Internal
    c) External
    d) Dynamic
    e) None of these
19. DFD is:
    a) Data file distribution
    b) Data file definition
    c) Digital file distribution
    d) Data flow diagram
    e) Data file definition
20. The quickest and easiest way in MS-Word to locate a particular word or phrase in a document is to use the ______ command.
    a) Replace b) Find
    c) Lookup d) Search
    e) Rename
21. Word processing, spreadsheet, and photo-editing are example of ?
    a) Application software
    b) System software
    c) Operating system software
    d) Platform software
    e) Keyboard software
22. Which of the following is/ are used to identify a user who returns to a Website?
    a) ASPs b) Plug-ins
    c) Scripts d) Cookies
    e) History
23. RAM can be thought of as the ___ for the computer's processor.
    a) Planning room b) Waiting room
    c) Factory d) Operating room
    e) System room
24. Which of the following functions is not performed by CPU?
    a) Graphical Display of data
    b) Arithmetic calculations
    c) Managing Memory
    d) Managing Input and Output
    e) None of these
25. The Feature that keeps track of the right margins is:
    a) Find and Replace
    b) Word Wrap
    c) Right justified
    d) Left justified
    e) Ragged Right
26. Which of the following options is used to display information such as title, page number of the document?
    a) Insert Table b) Auto correct
    c) Thesaurus
    d) Spelling and grammar
    e) Header and Footer
27. The processor is a _____chip plugged onto the motherboard in a computer system.
    a) LSI b) VLSI c) ULSI
    d) XLSI e) WLSI
28. Which of the following will be used if a sender of e-mail wants to bold, italics etc the text message?
    a) Reach Signature
    b) Reach Text c) Reach Format
    d) Plain Format
    e) Plain Text
29. CPU is also called as?
    a) Microprocessor
    b) Execute c) Microchip
    d) Decoder e) Register
30. A menu contains a list of
    a) Commands b) Data
    c) Objects d) Reports
    e) Files
31. A command to get a file you worked on from the memory where it was stored
    a) Close b) Delete
    c) Open d) Get it
    e) Remove
32. A ______ is a collection of data that is stored electronically as a series of records in a table.
    a) Spreadsheet
    b) Presentation
    c) Database
    d) Web page
    e) File system
33. The software tools that enable a user to interact with a computer for specific purposes are known as?
    a) Hardware
    b) Networked softwares
    c) Sharewares d) Applications
    e) None of these
34. What is the term for unsolicited e-mail?
    a) Newsgroup
    b) Usenet
    c) Backbone
    d) Flaming
    e) Spam
35. Two or more Computers are Connected to each other for sharing Information form a?
    a) Network b) Router
    c) Server d) Tunnel
    e) Pipeline
36. Punched cards are associated with the name?
    a) Leibniz b) Jacquard
    c) Pascal d) Cobal
    e) Hollerith
37. A device or system not directly connected to the CPU is:
    a) On-line b) Keyboard
    c) Memory d) Off-line
    e) Mouse
38. Modern Computers are very reliable but they are not
    a) Fast b) Powerful
    c) Infallible d) Cheap
    e) None of above
39. Which is not a system tool?
    a) Folder b) Backup
    c) Scandisk d) Format
    e) None of these
40. ______ are specialized utility programs that make using the Internet and the Web easier and safer.
    a) Telecom b) Web utilities
    c) Norton Utilities
    d) Web firewalls e) None
41. A(n) _______ can be used to block access to specific sites.
    a) Filter b) Hardware block
    c) Censor d) Rubicon
    e) None of these
42. Operating System is an interface between?
    a) User and program
    b) User and hardware
    c) User and client
    d) a and c e) a and b
43. Memory that requires refreshing of data is:
    a) SRAM b) EPROM
    c) DRAM
    d) Bubble Memory
    e) SPAD

KEY

1) c; 2) a; 3) c; 4) a; 5) c; 6) c; 7) d; 8) d; 9) c; 10) b; 11) a; 12) b; 13) a; 14) d; 15) d; 16) c; 17) d; 18) b; 19) d; 20) b; 21) a; 22) d; 23) b; 24) a; 25) e; 26) e; 27) b; 28) b; 29) a; 30) a; 31) c; 32) c; 33) d; 34) b; 35) a; 36) e; 37) d; 38) c; 39) a; 40) b; 41) a; 42) b; 43) c.